వాడ్రేవు చినవీరభద్రుడు

# ఇంకొంచెం సూర్యకాంతి

బతుకును వెలిగించిన క్షణాలు



వాడ్రేవు చినవీరభద్రుడు

# ఇంకొంచెం సూర్యకాంతి

బతుకును వెలిగించిన క్షణాలు

IMKOMCHEM SURYAKAMTI
(A Little more Sunshine)
VADREVU CHINAVEERABHADRUDU

February, 2025

Coverpainting in watercolor,
Composing, layout and cover design
Chinaveerabhadrudu  Vadrevu

e-book released by

**Vadrevu Ch Veerabhadrudu**
First floor, House No.56,
Navodaya Colony, Mehidipatnam
Hyderabad 500 028

chinaveera@gmail.com
+91 94909 57129

**www.chinaveerabhadrudu.in**

బంగారుతల్లి అమృతకి

# వరసగా


| | |
|---|---|
| ఎటుచూసినా పువ్వులుండాలి | 7 |
| నిజమైన మహాత్ముడి సన్నిధిలో | 9 |
| జీవిస్తే అట్లా కదా జీవించాలి | 13 |
| వాళ్ళ ఋణం ఎప్పటికి తీర్చగలుగుతాను? | 17 |
| మనసులు ఒక్కటి కావాలి | 21 |
| గంగాలమ్మ నన్ను వెతుక్కుంటూ వచ్చింది | 24 |
| మామిడికొమ్మ మళ్ళీ మళ్ళీ పూయునులే | 31 |
| ఆ చిరునవ్వు ఒక మనిషిది | 34 |
| జీవితసాఫల్యసందర్శనం | 40 |
| ఫాల్గుణచంద్రుడు నిలువెల్లా తేనె | 45 |
| మరోసారి ఇల్లు మారాను | 50 |
| ఒక ఇల్లు కట్టుకోవాలి | 56 |
| ఆయన కృపాదృష్టికి అడ్డులేదు | 60 |
| మాధూకరభిక్ష | 64 |
| రెల్లు రెల్లు రెల్లు | 67 |
| మోహచంద్రరాత్రి | 69 |
| మళ్లీ హైదరాబాదుకి | 73 |
| ఒక తేనెటీగకి ఎంత గూడుకావాలి! | 76 |

| | |
|---|---|
| మరొక నూరేళ్ళు బతకాలనిపిస్తున్నది | 79 |
| ఆ మందహాసాన్ని ఒక్కసారి చూడటానికేనా | 82 |
| సంతోషంతో ఓపిక పట్టడం | 86 |
| ఆ సూర్యకాంతి మరికొంచెం | 93 |
| మునగని పడవ | 96 |
| మెరుగైన బేరం | 109 |
| తలపుల్ని తలపులతోటే శుభ్రం చెయ్యాలి | 113 |
| దిమ్మరి | 115 |
| కాలానికి ఊపిరిపొయ్యాలి | 119 |
| నడవడమే ఒక దైవానుగ్రహం | 121 |
| సాహిత్యపోషకులు | 125 |
| అప్రయోజక జీవితం | 128 |
| మరికొన్ని కలయికలు | 133 |
| ఆకాశాన్ని కానుక చేసే ఋతువు | 138 |
| నరకాగ్నికి సెలవు | 142 |
| ఒక్క పాఠకుడు చాలడా! | 148 |
| ఆబాలగోపాలతరంగం | 152 |

# ఎటుచూసినా పువ్వులుండాలి

**స్వామి** వివేకానంద ఒక మిత్రురాలికి రాసిన ఉత్తరంలో (27, డిసెంబర్, 1899) ఇలా రాస్తున్నారు:

> నేనిప్పుడు రోజుకి 25 డాలర్ల చొప్పున సంపాదిస్తున్నాను...కొన్నాళ్ళకి హిమాలయాల్లో ఇంతచోటు కొనుక్కోవాలని అనుకుంటున్నాను. ఇంకా చెప్పాలంటే, 6000 అడుగుల ఎత్తునుండే ఒక మొత్తం కొండ కొనుక్కుంటాను. అక్కణ్ణుంచి చూస్తే సతతహిమపాత సుందరదృశ్యం గోచరిస్తూంటుంది. అక్కడ ఊటబుగ్గలూ, చిన్ని సరస్సూ ఉంటాయి. హిమాలయ దేవదారువనాల మధ్య పువ్వులు, ఎటుచూసినా పువ్వులుండాలి. అక్కడొక చిన్న కుటీరం కట్టుకుంటాను. ఆ మధ్యలో నాదొక చిన్నకూరగాయలతోట ఉంటుంది. దాన్ని నేనే నా కాయకష్టంతో సాగుచేసుకుంటాను. ఇంకా-ఇంకా-ఇంకా- నా పుస్తకాలు. ఎప్పుడో దీర్ఘకాలమట్లా గడిచాకగాని మనిషన్నవాడి ముఖం కనిపించగూడదు. ప్రపంచం ధ్వంసమైపోతున్న శబ్దాలు నా చెవుల్లో మోత పెట్టవచ్చుగాక-నేను పట్టించుకోను. నా పనంతా-ఇహలోకానిదిగానీ, పర లోకానిదిగానీ పూర్తి చేసేసి ఈ ప్రపంచం నుంచి సెలవు తీసుకుంటాను. నా జీవితమంతా ఎట్లా గడిపాను. పుట్టు సంచారిని. ఇదీ ప్రస్తుతం నేను కంటున్న కల. భవిష్యత్తుసంగతి నాకు తెలియదు..

ప్రాచీన చీనాకవీంద్రుడు తావోచిన్ కవిత్వంలా, జెన్ సన్యాసులూ, స్వయంగా మహనీయులైన కవులూ అయిన హాన్ షాన్, సైగ్యో, బషోల మాటల్ని గుర్తు చేస్తున్న ఈ వాక్యాలు నాకెంతో దిగులు పుట్టిస్తున్నాయి. ఏమంటే ఇది నా కల కూడా. ప్రభుత్వోద్యోగమనే ఈ దాస్యవృత్తి నా జీవితాన్ని కబళించివేసింది.

ఇది నా ఆత్మను తినెయ్యకుండా ఉండటానికీ, నన్ను నేను కాపాడుకోడానికీ నాలో నేను, నాతోనేను ఎంత యుద్ధం చేస్తూ వచ్చానో ఆ దేవుడికే తెలుసు.

నాకు హిమాలయాల మీద మక్కువలేదు. తూర్పుగోదావరి అడవుల్లో, మా ఊరిదగ్గర, వణకరాయి అనే కొండరెడ్డి పల్లె ఉంది. ఆ పురాతన గిరిజనగ్రామంలో వాళ్ళతో కలిసి జీవించాలనీ, వాళ్ళకి వ్యవసాయం గురించీ, ఆరోగ్యం గురించీ చెప్తూ, అనుక్షణం మారే ఋతుపరిభ్రమణంలో సర్వేశ్వరవైభవాన్ని పాటలు కట్టి కీర్తించాలన్న కల.

ఎప్పటికి నెరవేరుతుంది!

11-8-2013

# నిజమైన మహాత్ముడి సన్నిధిలో

**గురువారం** పొద్దున్నే ఫూలాజీబాబాని చూడాలని పట్నాపూర్ వెళ్ళాం. ఉట్నూరునుంచి ఆసిఫాబాదువెళ్ళే దారిలో లోపలకీ ఉండే ఒక గిరిజన కుగ్రామం. పత్తిచేలమధ్య, సోయా పొలాలమధ్యనుంచి ప్రయాణం. ఇరవయ్యేళ్ళకిందట మొదటిసారి ఆ గ్రామానికి వెళ్ళినప్పుడు ఎవరో నాతో ఇక్కడొక సిద్ధపురుషుడున్నాడని చెప్తే ఆయన్ను చూడటానికి వెళ్ళాను. సద్గురు ఫూలాజీ బాబా ఆంథ్ తెగకు చెందిన గిరిజన రైతు. నేను వెళ్ళేటప్పటికి ఆయన తన జొన్నచేలో కంచె కట్టుకుంటున్నాడు. నాతో చాలా ఆదరంగా మాట్లాడేడు.

ఎప్పుడో ఏ సిద్ధపురుషుడినుంచో ఆయనకేదో ఉపదేశం దొరికింది. అది ఆయన్నొక తపస్విగా మార్చేసింది. ఈ ఇరవయ్యేళ్ళ కాలంలో ఆయన మహారాష్ట్రమొదలుకుని నిజామాబాద్, అదిలాబాద్ ప్రాంతమంతటా గొప్ప ఆధ్యాత్మిక శక్తిగా మారాడనీ, గిరిజనుల మీదా, గిరిజనేతరులమీదా కూడా సమానంగా గొప్ప ప్రభావాన్ని చూపిస్తూ ఉన్నాడనీ మట్టిమనుషుల్ని మాణిక్యాలుగా మారుస్తున్నాడనీ విన్నాను.

రెండుదశాబ్దాల తరువాత కూడా ఆ గ్రామంలో మార్పేమీ లేదు కాని, ఆయన ఆశ్రమం ఒక సద్గురు సంస్థానంగా మారికనిపించింది. అలాగని ఆడంబరంగా లేదు.

అక్కడొక విశాలమైన మందిరం. మేమక్కడకు పోగానే ఆయన తన ఇంట్లోనుంచి మా దగ్గరకు వచ్చాడు. తానొక కుర్చీలో కూచుని మమ్మల్ని కూడా పక్కన సోఫాలో కూచోమన్నాడు. మాతో వచ్చినవాళ్ళతో పాటు నెమ్మదిగా గ్రామీణులు, రైతులు, గృహిణులు కూడా అక్కడ పోగవడం మొదలుపెట్టారు.

అక్కడ ఆశ్రమపాఠశాలలో పనిచేస్తున్న తుకారాం అనే ఉపాధ్యాయుడు బాబాకి సన్నిహిత శిష్యుడు. అతడు నా తెలుగుని బాబాకి మరాఠీలోనూ, ఆయన మరాఠీని నాకు తెలుగులోనూ వివరించడం కోసం నిల్చున్నాడు. ఆయన నన్ను బాబాకి పరిచయం

చేస్తూ, ఇరవయ్యేళ్ళకిందట బాబా దగ్గర ఉండటానికి వీలుగా తనని అక్కడకు నేనే బదిలీ చేసానని గుర్తు చేసాడు. ఆ ఒక్క మాటతో బాబా కళ్ళు మెరిసాయి. చాలా సాధారణమైన పనికి ఆయన ఇప్పటికీ నా పట్ల కృతజ్ఞుడిగా ఉన్నట్టు తలూపాడు.

నేనన్నాను: 'ఇరవయ్యేళ్ళ తరువాత ఇక్కడికి వచ్చాను. జీవితంలో ఎవరినీ ఏమీ అడగని బాబా, సర్వసంగ పరిత్యాగి, నేను మొదటిసారి కలిసినప్పుడు, నన్నో కోరిక కోరారు. ఇక్కడొక ఆశ్రమపాఠశాల తెరవగలమా అనడిగారు. కొత్త పాఠశాల మంజూరు ప్రభుత్వం మాత్రమే చెయ్యగలదు. అయినా బాబా అడిగారు కాబట్టి మా స్థాయిలో మేమే ఏదో సర్దుబాటు చేసి పాఠశాల తెరిచాం. ఇదంతా నా 'కొన్ని కలలు–కొన్ని మెలకువలు' లో రాసాను'

తుకారాం అదంతా బాబాకి చెప్పాడు. ఆయన నేత్రాల్లో మెరుపు. 'తన కోసం కోరుకున్నది సంతోషంకాదు. ఎదటివాళ్ళకోసం కోరుకున్నదే సంతోషం' అన్నారాయన.

ఆ మాట వినగానే చిరకాలంగా నాలో రగుల్తున్న సమస్యకేదో సమాధానం దొరికినట్టనిపించింది. 'నేను బాబానొక ప్రశ్న అడుగుదామా వద్దా అనుకుంటున్నాను. కాని నేనడక్కుండానే ఆయనే జవాబిచ్చారు' అన్నాను. 'అయితే, ఒక సందేహం. బాబా ఈ మాట స్కూలు గురించి అని ఉండవచ్చు. ఎదటివాళ్ళ సంతోషం అంటున్నప్పుడు ఆయన సమాజం గురించి మాట్లాడుతున్నారు. ఈ మాట వ్యక్తుల గురించి కూడా అనుకోవచ్చునా' అనడిగాను.

ఆ మాటకి బాబా వెంటనే జవాబిచ్చారు:'వ్యక్తి వేరు, సమాజం వేరు కాదు, రెండూ ఒకటే. వ్యక్తికి సహాయం చేస్తే, సమాజానికి చేసినట్టే, సమాజానికి చేస్తే, వ్యక్తికి చేసినట్టే.'

అయినా నా సందేహాలకి అంతం లేదు, వెంటనే మరొక ప్రశ్న: 'అలాగని ఎవరు ఏమి కోరితే అది చేసేయ్యాలా?'

బాబాకి విసుగు లేదు. 'ఎవరు ఏమడిగినా ఇవ్వాలి, చెయ్యాలి. కాని అందుకోవడం వాళ్ళ యోగ్యతనిబట్టి, పాత్రతనిబట్టి.'

కొన్ని క్షణాల నిశ్శబ్దం. మేమక్కడ కూర్చున్నప్పుడే బాబా మా చేతిలో చక్కెరగుళికలు పెట్టారు. మేం తీసుకువెళ్ళిన అరటిపళ్ళల్లో ఒక పండు నా చేతిలో పెట్టారు. నాకా పండు తినాలనిపించింది. దాని రెండుముక్కలు చేసి పెద్దముక్క బాబా చేతిలో పెట్టాను.

ఆయన దాన్నందుకున్నారు. దాన్నిమళ్ళా కొద్దికొద్దిగా తుంచి అక్కడున్నవాళ్ళకు పంచారు. ఒక చిన్న తునక తననోట్లో వేసుకుని తినడం మొదలుపెట్టారు.

అలౌకికమైన నిశ్శబ్దం. మా ఊళ్ళో చిన్నప్పుడు కమ్మరికొలిమిదగ్గర, చాకలిబానదగ్గర, కంసాలి అరుగుమీద, మా ఇంట్లో మా నాన్నగారు పనిచేసుకుంటున్నప్పుడు కనవచ్చిన నిశ్శబ్దం లాంటిది. నేనన్నాను: 'ఇక్కడ బాబాని చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది, ఈ అడివిలో, పొలాలమధ్య, ఈ పల్లెలో, ఈ గ్రామీణులమధ్య, స్త్రీలమధ్య ఇట్లా ఆత్మానందం అనుభవిస్తున్న ఈ మనిషిని చూస్తుంటే మనసుకెంతో తృప్తిగా ఉంది. నాకూ ఇట్లాంటి కోరికే. నాకు నగరంలో ఉండాలని లేదు. మా ఊళ్ళో రైతులమధ్య, పిల్లలమధ్య జీవించాలని ఉంది, బాబాలాగా ఆధ్యాత్మికంగా కాదు, ఏదో, నాకు చాతనయింది చేస్తూ, వాళ్ళ కష్టసుఖాల్లో వాళ్ళకి తోడుగా ఉంటూ' అన్నాను.

నేను చెప్పిందంతా తుకారాం మరాఠీలో మళ్ళా చెప్పాడు. బాబా ముఖంలో గొప్ప ఉత్సాహం.

'ఇదే, ఇదే, నేను కోరుకునేది. నువ్వు చెప్పు ఆయనకి. ఈ మాట ఈశ్వరుడు విన్నాడు. మళ్ళా మైకు పెట్టి చెప్పవలసిన అవసరం లేదు. హృదయం నుంచి సూటిగా పిలిచే ఈ పిలుపు నేరుగా ఈశ్వరుడికి వినబడుతుంది. మనిషి కోరుకోవలసిన కోరిక ఇదే. ఇదే ఆనందం. నేను దీన్నే అనుభవిస్తున్నాను' అంటూ తుకారాం కవితనొకటి వినిపించారు. 'ఎవరు బీదసాదలతో జీవించడానికి ఇష్టపడతాడో, అతడితో కలిసి జీవించడానికి దేవుడు ఇష్టపడతాడు' లాంటి అర్థం వచ్చే కవిత.

ఒక్కసారిగా నా హృదయంలో ఆనందం వెల్లివిరిసింది. కాని వెంటనే నిరాశ ఆవరించింది. 'తుకారాం, బాబాకి చెప్పు, నాకు కోరికైతే ఉందిగాని, ఆ కోరికకి తగ్గట్టు జీవించలేకపోతున్నాను. అదెట్లా సాధ్యమో అడుగు' అన్నాను.

'అందుకు అన్నిటికన్నా ముందు తల్లిదండ్రుల ఆశీస్సులు ఉండాలి, పూర్వజన్మల్లో మంచిపనులు చేసిఉండాలి. గురువుల అనుగ్రహముండాలి. అన్నిటికన్నా ముఖ్యం, అటువంటి స్థితినిసాధించడంకోసం అనుక్షణం ప్రయత్నిస్తుండాలి' అన్నారు బాబా.

ఒక క్షణం ఆగి ఆయన తుకారాంతో ఇలా అన్నారు: 'ఆయన్ని రాయమను. తన అనుభవాలు రాస్తూండమను. నలుగురితో పంచుకోమను. అవి చదివి చాలామంది స్ఫూర్తి పొందుతారు. ఇదిగో, నా సంగతే చూడు' అంటూ జేబులోంచి చిన్న పుస్తకమొకటి

బయటకు తీసారు. బ్రహ్మానంద అనే సాధువు రాసిన సంకీర్తనలపుస్తకం. దాన్ని తెరిచిపట్టుకుని చూపిస్తూ 'బ్రహ్మానంద అన్నాడు కదా: ఒక దేవత నా హృదయాన్ని దొంగిలించింది. నేను భ్రమావరణం నుంచి బయటపడ్డాను' అని. ఆయన ఆ మాట రాస్తే నేనదిచదివి భ్రమనుంచి బయటపడ్డాను కదా. అలాగే ఈయన రాసింది చదివి కూడా నలుగురూ స్ఫూర్తి పొందుతారు' అన్నారాయన.

నా హృదయమొక్కసారి లయతప్పినట్టనిపించింది. ఆయన చెప్తున్నదానివెనక మాటల్లో పెట్టకుండా చెప్తున్నదేదో ఉందనిపించింది. అదేదో రహస్యం నాకు మాత్రమే అర్థమయ్యేలా బహిరంగంగా చెప్తున్నారనిపించింది.

ఇక నాకు అడగడానికేమీ మిగల్లేదు కాబట్టి ఆయనకు చెప్పవలసిందేమీ లేదని పించింది. మా ఎదట కూచున్న రైతుల్నీ, నిరక్షరాస్య గృహిణుల్నీ చూసాను. అంతదాకా మేమిద్దరమే అక్కడున్నట్టూ, మేమిద్దరమే మాటలాడుకుంటున్నట్టూ అనిపించింది. వెళ్ళొస్తానన్నాను. పాదాభివందనం చేసాను. ఆయన నా శిరసు తడిమారు. మరునిమిషంలో నేనెవరో తనకి తెలియదన్నట్టే తన దారిన తాను లేచివెళ్ళిపోయారు.

తిరిగి ఉట్నూరుకి. దారంతా శరత్కాలపు ఎండ. గాలి నిండా పచ్చగా పెరుగుతున్న పొలాలసంతోషం. నేను బాబాతో జరిగిన సంభాషణ గుర్తుచేసుకుంటూ ఉన్నాను. హఠాత్తుగా తట్టింది. ఆయన నాతో మాటాడుతున్నంతసేపూ, నేనానందపడటం సరే, నా కన్నా తానే ఎక్కువ ఆనందపడుతున్నట్టు కనిపించారని తోచింది. నిజమైన మహాత్ముడు, నాయకుడు, మానవుడు తోటిమనిషితో ప్రవర్తించే తీరు అదేకదా.

1-11-2013

# జీవిస్తే అట్లా కదా జీవించాలి

**ఎన్నాళ్లగానో** ఓ కోరిక, ఓ కల, తెల్లవారగానే ఇంటిముంగిట్లో ఒక తామరపూల కొలను కనబడాలని, కనీసం ఒక తొట్టెలోనైనా ఒకటిరెండు తామరపూలేనా వికసిస్తుంటే చూడాలని. అద్దె ఇల్లే కానీ, ఇన్నాళ్ళకు ఈ కల నిజమయ్యింది, ఆదివారం తెచ్చి ఒక తామరతీగ తొట్టెలో నాటానా, రాత్రి కురిసిన రహస్యపు వానకి, తెల్లవారగానే–

'చూసావా, పువ్వు పూసింది' అన్నాడు ప్రమోద్.

ఒక్క ఉదుటున పోయి చూద్దునుకదా, నా కళ్ళు నేనే నమ్మలేకపోయాను. ఆ రేకల్లో అంత కాంతి, అంత నిర్మలత్వం, ఆకాశమంతా అక్కడే కుదురుకుందా అన్నంత ఒద్దిగ్గా, నిండుగా, పరిపూర్ణంగా.

యుగాలుగా భారతీయ కవులు, వేదాంతులు, శిల్పులు, చిత్రకారులు కీర్తిస్తూ వచ్చిన పద్మమిదేనా?

అందరికన్నా ముందు టాగోర్ గుర్తొచ్చాడు. గీతాంజలిలో సుప్రసిద్ధ గీతం:

> పద్మం వికసించిన రోజున నాకు తెలీనే లేదు, నా మనసెక్కడో సంచరిస్తోంది, నా సజ్జ శూన్యంగా మిగిలిపోయింది, ఆ పువ్వు పిలుపు నా చెవిన పడనే లేదు. ఇప్పుడు నన్ను దిగులు చుట్టుముట్టింది, నా కలల్లోంచి ఉలికిపడి మేల్కొన్నాను, దక్షిణమారుతంలో ఏదో ఒక మధురపరిమళం అనవాలు తోచింది.
>
> ఆ అస్పష్టమాధుర్యం ఏదో వెతుకులాటతో నా హృదయాన్ని కలతపరిచింది. పరిపక్వం కావటానికి వేసవి మారుతం పడుతున్న ఆరాటం లాగా తోచిందది.

అప్పుడు తెలియనేలేదు నాకు, అది నాకింత సన్నిహితంగా ఉందనీ, అది
నాదేనని, ఆ పరిపూర్ణమాధుర్యం నా హృదయాంతరాళం లోనే
వికసించిందనీ.

భగవదనుగ్రహాన్ని గుర్తుపట్టకపోవడంలోని దిగులూ, గుర్తుపట్టినతరువాతి ప్రశాంతీ రెండూ ఈ కవితలో కనిపిస్తాయి. కాని నేను మరింత అదృష్టవంతుణ్ణనిపించింది.

భగవదనుగ్రహం నన్నింత త్వరగా చేరవస్తుందని ఊహించలేదు నేను.

ఎర్రని ఆ మట్టినీళ్ళల్లో ఆ తామరపువ్వు మరింత ప్రకాశభరితంగా ఉంది. ఎరుపు రంగు నేపథ్యంలో ఎరుపు ఇట్లా శోభించగలదని నేనెప్పుడూ ఊహించలేదు. వాన్ గో పొద్దుతిరుగుడు పూలు బొమ్మ గీసినప్పుడు బంగారురంగు పసుపు బాక్‌గ్రౌండ్ మీద మళ్ళా బంగారురంగు పొద్దుతిరుగుడుపూలని గీసినప్పుడు ఆ పూలకి అంత శోభ ఎట్లా సాధ్యమయ్యిందో ఇప్పటికీ అంతుపట్టనట్టే.

ఆ రేకల్ని, ఆ సుకుమారమైన ఆ రేకల్ని మరింత దగ్గరగా చూసాను. అందులో గులాబీల ఎరుపు ఉంది, కలువపూల తెలుపూ ఉంది.

గత మూడువందల ఏళ్ళుగా గులాబీలకీ, లిల్లీపూలకీ మధ్య యూరోప్‌లో పెద్ద స్పర్థ కొనసాగుతూనే ఉంది. గులాబీ ఆసియా ఖండంనుండి పారశీక ఉద్యానాల్లోంచి యూరోప్‌లో అడుగుపెట్టింది. లిల్లీ ఉత్తరభూగోళానికి చెందిన సమశీతోష్ణదేశాలకి చెందిన పువ్వు. ఆ రెండు పూలలో ఏది అందమైందో ఐరోపీయ కవులు ఒక పట్టాన తేల్చుకోలేక పోయారు. తూర్పు దేశాల వర్ణవైభవాన్ని విరజిమ్మే డెలాక్రా చిత్రాలా, లేక ఐరోపీయ రేఖావిన్యాసాన్ని ప్రతిబింబించే ఇంగ్రె చిత్రాలా ఏవి గొప్పవని అడిగితే ఏం చెప్పగలం?

గులాబీకీ, లిల్లీకి మధ్య తలెత్తిన ఈ స్పర్థని విలియం కౌపర్ (1731-1800) అనే ఒక ఇంగ్లీషు కవి సానునయంగా పరిష్కరించే ప్రయత్నం చేసాడు. ఆ రెండింటి సౌందర్యం సమానమేననీ, ఆ రెండింటినీ మించిన మూడవ పువ్వొకటి తలెత్తేదాకా, పుష్పసామ్రాజానికి ఆ రెండు పూలూ రాణులేననీ వనదేవత సర్దిచెప్పిందని ఆయన తన The Lily and The Rose (1782) లో ప్రకటించాడు.

కాని పారశీక దేశాల ఐహిక జీవితేచ్ఛని మనసారా అంగీకరించలేకపోయిన విలియం బ్లేక్ (1757-1827) మళ్ళా లిల్లీకే పట్టం కట్టాడు. తన The Lily (1794) కవితలో ఆయన లిల్లీది ముల్లు లేని సంతోషమనీ, సౌందర్యమనీ ప్రస్తుతించాడు.

బ్లేక్ క్రైస్తవమిస్టిసిజంలో పారశీక సూఫీతత్త్వానికి చోటులేకపోవడంలో ఆశ్చర్యం లేదు. అందుకని లిల్లీకి, గులాబీకీ మధ్య ఆ స్పర్థ కొనసాగూనే ఉంది, చివరికి కౌపర్ చెప్పినట్టు ఆ రెండింటికన్నా మహిమాన్వితమైన మూడవ పువ్వు తలెత్తేదాకా.

అపురూపమైన భారతీయాంగ్ల కవయిత్రి తోరూదత్ (1856-1877) ఒక సౌగంధికాన్ని తెచ్చి ప్రతిష్ఠించేదాకా. గులాబీనీ, లిల్లీని, రెండింటి అందాన్నీ పొదువుకున్న ఆ పువ్వు తామరపువ్వని తోరూదత్ ఇట్లా సుమనోహరంగా చిత్రించేదాకా:

పువ్వులన్నింటికీ రారాణిలాంటి పువ్వేదని
ప్రేమదేవి ఒకనాడు వనరాణిని ప్రశ్నించింది,
ఘనగౌరవంకోసం గులాబికీ, లిల్లీకి మధ్య
చిరకాలం రగులుతున్న స్పర్థ తెలిసిందే కద.

కవిగాయకులు రెండింటితరఫునా వంత పాడారు
గులాబీ లిల్లికెప్పుడు సాటిరాగలదని కొందరు,
లిల్లీ అంతప్రేమాస్పదమా అనిమరికొందరు.

పూలవీథుల్లోని కలకలం రతీనికుంజాన్ని తాకింది.
'నాకొక పువ్వు కావాలి' అడిగిందామె వనదేవిని.

'గులాబిలాగ సుకోమలం, కలువలాగ సుధీరం'
'సరే, మరి రంగు?' 'గులాబిలాగా ఎర్రగా' అని,
అంతలోనే మాట మార్చి, 'లిల్లీలా తెల్లగా' అంటూ
సరిదిద్దుకుని, 'కాదు రెండు రంగులూనూ' అంది.

అప్పుడనుగ్రహించింది వనలత, గులాబిరక్తిమ
దిద్దిన శ్వేతోత్పలాన్ని, పుష్పసామ్రాజ్ఞిని.

ఆ పూలరాణి, ప్రాక్పశ్చిమాల మేలుకలయికగా తోరూదత్‌కి సాక్షాత్కరించిన ఆ సౌందర్యసామ్రాజ్ఞి నా ముందు నా ఇంటిముంగిట్లో ప్రత్యక్షమైతే నా గుండె ఎట్లా కొట్టుకుని ఉంటుందో ఊహించండి.

ఆ కమలం (దానికీ రాజకీయాలకీ సంబంధం లేదు) నాలో ఒక కాంతిధారకి తలుపు తీసినట్టనిపించింది. ఆ పువ్వు నిజంగానే ఈ లోకానికి చెందిన పువ్వు కాదు. కాని ఈ లోకం తాలూకు పంకంలోనే అది వేళ్ళు తన్నుకుంది. కాని దాని చూపు, దాని

సంతోషం ఆకాశానివి, సూర్యుడివి, అందుకనే భూమ్యాకాశాలు మేళవించే చోటు ఎక్కడుందంటే వైదికఋషికి పద్మమే స్ఫురించింది.

ఆ రోజంతా ఆ పద్మాన్నే ధ్యానిస్తూ ఉన్నాను. అది ఒట్టి పువ్వా? అరవిందులు అన్నట్లుగా అది భగవంతుడి గులాబి.

రాత్రి పొద్దు పోయి ఇంటికి వచ్చేటప్పటికి, ఆ పువ్వు పూర్తిగా ముడుచుకుపోయి ఉంది. ప్రమోద్ ఇంటికి రాగానే 'అమ్మా, ఆ పువ్వు ఏమైపోయింది' అని కంగారుపడ్డాడని విజ్జి చెప్తోంది. అట్లా రేకలన్నీ తనలోకి ముడుచుకుని ఒద్దిగ్గా ఆకులమధ్య ఇమిడిపోయిన ఆ పువ్వుని చూస్తే నాకు ఆశ్చర్యమనిపించింది. అచ్చు కవులు వర్ణించినట్టే ముడుచుకు పోయి కనిపించింది. కాని ఆ ముడుచుకున్న రేకలకొనలమధ్య ఒకింత రాగరేఖ, కాళిదాసు శ్లోకమొకటి (కుమారసంభవం:8:39) గుర్తుచేస్తూ.

> బద్ధకోశమపి తిష్ఠతి క్షణం సావశేషవివరం కుశేశయమ్
> షట్పదాయ వసతిం గ్రహీష్యతే ప్రీతిపూర్వమివ దాతుమంతరమ్.

(పద్మం పూర్తిగా మొగ్గగా ముడుచుకుపోయాక కూడా, ఒకింత చోటు వదిలి పెట్టినట్టే ఉంది, ప్రేమతో తచ్చాడుతున్న తుమ్మెదకి నీడనివ్వడం కోసమా?).

తెల్లవారుతూనే మళ్ళా పోయి చూసాను. రాత్రి ముకుళితమైన ఆ పువ్వు మళ్ళా రేకలు చాపుతూ ఉంది. 14,96,00,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక కాంతికేంద్రంతో అది అప్పుడే సంభాషణ మొదలుపెట్టింది. ఇంతకన్నా గొప్ప సూర్యారాధకులు ఈ ప్రపంచంలో మరొకరు ఉండగలరా అనిపించింది. ఇన్నేళ్ళుగా సంధ్యావందనం ఆచరిస్తూనే ఉన్నానే, కాని సావిత్రీ ఉపాసనలో ఈ చిన్నారిపువ్వు ముందు నేను చాలనని తోచింది, సిగ్గనిపించింది.

అట్లా జీవించగలనా, కాంతికి మాత్రమే విప్పారి, చీకటికి ముడుచుకుపోయి, మళ్ళా కాంతికోసం తెరుచుకుని. జీవిస్తే అట్లా కదా జీవించాలి, జీవితమంతా ఒక 'సద్ధర్మ పుండరీక సూత్రం' లాగా.

2-9-2015

# వాళ్ళ ఋణం ఎప్పటికి తీర్చగలుగుతాను?

**ఇక్కడ** ఆకాశం మరీ పొద్దున్నే తెరుచుకుంటుంది. రాత్రంతా చినుకుతూనే ఉన్నా, ఆకాశమంతా కరిగిపోయి ఉన్నా కూడా, తడిసిపోయిన తెరవెనకనుంచి వెలుతురు ఆవరిస్తూనే ఉంది. పొలాలమీద, తాటిచెట్లమీదా వంగిన ముసురుమబ్బు.

జీవితంలో తెరుచుకుంటున్న కొత్త పుటల్లో పాతలిపిని, ఒకప్పుడు నేర్చుకున్న అక్షరాల్నీ గుర్తుపట్టే ప్రయత్నం చేస్తున్నాను.

మనందరి జీవితాల్లో కొత్తదశ సాధారణంగా వానాకాలమే మొదలవుతుంది. తొలకరి చినుకులు పడుతూండగానే మన ఊళ్ళల్లో బళ్ళు తెరుస్తారు. ఆ చిరుజల్లుల్లో తడుస్తూనే కొత్తలాగూ చొక్కా తొడుక్కుని, కొత్త పలకా బలపంతో మనల్ని మన నాన్ననో, అమ్మనో చేయిపట్టుకు తీసుకువెళ్ళి బళ్ళో వేస్తారు. ఒకప్పుడు పల్లెల్లో పుట్టినతేదీలు రాసుకోవడం తెలియని చాలా కుటుంబాల్లో పిల్లల పుట్టిన రోజు దాదాపుగా జూన్ 12 లేదా, 30 వతేదీలోగా ఎప్పుడు బళ్ళో వేస్తే ఆ రోజే.

నాకిప్పటికీ, ఎప్పటికీ గుర్తే. 1972 ఆగష్టులో నన్ను తాడికొండ స్కూల్లో జాయిన్ చేసారు. ఆ ఊరెక్కడుందో, ఎలా వెళ్ళాలో ఎవరికీ తెలీదు. మా నాన్నగారికి బహుశా గుంటూరు దాకా తెలుసు.అక్కణ్ణుంచి వెళ్ళడమెలానో తెలీదు.అంతదూరం పిల్లవాణ్ణి ఎందుకు పంపుతావు, పంపొద్దని మా నాన్నగారిని దూరపు బంధువులు, దగ్గరి బంధువులూ అందరూ మందలించారు, హితవు చెప్పారు.అసలు అంతదూరం వెళ్ళడానికి ఎంత ఖర్చవుతుందో తెలియదు. అంత డబ్బు ఎక్కణ్ణుంచి తేవాలో కూడా తెలియదు. ఆ రోజుల్లో పల్లెల్లో తినడానికి గింజలయితే ఉండేవిగాని, ఎవరి చేతుల్లోనూ చిల్లి గవ్వ కూడా ఉండేది కాదు. నాకా బాధలేవీ తెలియవు, అర్థమయ్యే వయసు కూడా కాదు. మా నాన్న నన్ను అక్కడికి వెళ్ళి చదువుకోవడం నీకిష్టమేనా అని అడిగినట్టు గుర్తు కూడా లేదు.

సమితి స్థాయిలోనూ, జిల్లా స్థాయిలోనూ రెండంచెల్లో జరిగిన పరీక్ష. తొమ్మిది జిల్లాల్లో 30 మందిని ఎంపిక చేస్తే అందులో నేనూ ఒకణ్ణి. ఎక్కడో స్కూల్లో చేరడానికి పరీక్ష పాసయ్యాను, అక్కడ చేరాలి, చదువుకోవాలి–ఇంతే నాకు తెలిసింది.

ఆ పరీక్ష జిల్లా స్థాయిలో రాయడానికి మా అన్నయ్య నన్ను కాకినాడ తీసుకువెళ్ళాడు. ఆ పరీక్ష ఎక్కడ రాసానో, ఏం రాసానో గుర్తు లేదు, కాని గుర్తున్నదల్లా, పరీక్ష అయిన సాయంకాలం నన్ను మా అన్నయ్య కల్పన థియేటర్లో (ఇప్పుడా థియేటర్ అదృశ్యమై పోయింది) పాతాళభైరవి సినిమాకి తీసుకువెళ్ళాడు. సన్నని జల్లుల మధ్య సినిమాహాల్లో అడుగుపెట్టేముందు వేడి వేడి మొక్కజొన్న పొత్తులు కొన్నాడు. ఆ సినిమా చూసి రాత్రి మేమిద్దరమే పి.ఆర్. గవర్నమెంటు కాలేజి ప్రాంగణం లోంచి మా బంధువుల ఇంటికి వెళ్తుంటే, ప్రతి చీకటి పొదలోంచీ 'జై పాతాళభైరవీ' అన్న పిలుపు వినిపించడం, నేను భయంతో వణికిపోతుంటే మా అన్నయ్య నన్ను ఎత్తుకోవడం కూడా నాకు గుర్తే.

నన్ను స్కూలో జాయిన్ చేయడానికి ముందు ఎంత చర్చ జరిగిందో, ఎంత మథన పడ్డారో నాకు గుర్తులేదు గానీ, ఒక దృశ్యం ఇప్పటికీ గుర్తుంది. మా ఊళ్ళో ఒక కంసాలి కుటుంబముండేది. ఎవరికైనా అప్పు కావాలంటే వాళ్ళే దిక్కు. ఆ కుటుంబపెద్ద వీర్రాజు అనే ఆమె. ఆమె మా ఇంటికొచ్చిందొక రోజు. ఆమె వీథరుగు మీద కూచుంది. మా బామ్మగారూ, మా నాన్నగారూ, మా అమ్మా ఇంకా ఎవరెవరో ఉన్నారు, మా బామ్మగారి వెండిచెంబు ఒకటి ఆమె ముందు పెట్టారు.

బహుశా అది మా బామ్మగారి తండ్రి ఆమెకి ఇచ్చి ఉంటాడు. ఆమె తన జీవితమంతా ఆ గుర్తుని భద్రంగా దాచుకోవాలనుకుని ఉంటారు. దాన్ని బయటికి తీయవలసిన అవసరం వస్తుందని కూడా ఆమె ఊహించి ఉండరు. కాని ఆ రోజు తన మనవడి చదువుకోసం ఆమె దాన్ని తాకట్టు పెట్టడానికి సిద్ధపడ్డారు. ఆ వడ్డీవ్యాపారి దాన్ని బెరుగ్గా చేతుల్లోకి తీసుకుని తడిమి చూడడం నాకు గుర్తుంది.

తాను కరణంగారికి అప్పివ్వడానికి వచ్చినా, తాను అప్పిస్తున్నది కరణంగారికన్న బెదురు ఆమెలో స్పష్టంగా కనబడింది. ఆ వెండి చెంబు ఆమె తీసుకువెళ్ళడం గుర్తుంది. కాని మళ్ళా ఆ చెంబు మా ఇంటికి తిరిగిరాలేదనే అనుకుంటాను.

ఏళ్ళ తరువాత, కలాం ఆత్మకథలో తాను ఇంజనీరింగులో చేరడానికి తన సోదరి జొహరా తన జవాహరీ అమ్మిపెట్టిందని కళ్ళనీళ్ళ పర్యంతం కృతజ్ఞతతో రాసింది చదివి నప్పుడు, దాన్ని తెలుగు చేస్తున్నప్పుడు నా చిన్నప్పటి ఆ సంఘటన కూడా నాకు గుర్తొచ్చింది.

నన్ను నేను కలాంతో పోల్చుకోలేనుగానీ, ఆ సోదరి త్యాగం ఎంత విలువైనదో మా బామ్మగారి త్యాగం కూడా అంతే మరవలేనిదనిపించింది.

తన జీవితమంతా ఆ సోదరికి తానేమి చెయ్యగలననే కలాం తపించాడు. ఆ సోదరి ఋణం ఎప్పటికీ తీర్చగలిగేది కాదు గానీ, ఆ సోదరి ఇంట్లో వివాహానికి కలాం వెళ్ళలేని పరిస్థితి ఎదురయినప్పుడు భగవంతుడు అద్భుతం చేసి మరీ కలాంని ఆ పెళ్ళికి తీసుకువెళ్ళిన సంగతి మనకి తెలుసు.

నేను మా బామ్మగారికి ఋణపడ్డాను. ఆ ఋణాన్ని తీర్చుకోవడానికి దేవుడు నాకే అవకాశమూ ఇవ్వలేదు. బహుశా ఆ ఋణగ్రస్తత కోసమైనా నేను మరో జన్మ ఎత్తవలసి ఉంటుందేమో. కాని మా బామ్మగారికి సంబంధించి మరొక విషయం గుర్తుంది.

ఆమె నాకు కవిత్వం పరిచయం చేసిన తొలిగురువు. నా పసితనంలో ఆమె ఆ కొండపల్లెలో పోతనగారి భాగవతంనుంచి 'గజేంద్ర మోక్షం', 'రుక్మిణీ కల్యాణం' నాతో వల్లెవేయించారు. 'కమలాక్షునర్చించు కరములు కరములు', 'ఏనీ గుణములు కర్ణేంద్రియములు సోక దేహతాపంబులు తీరిపోవు', 'కలుగడే నా పాలి కలిమి సందేహింప కలిమి లేములు లేక కలుగువాడు'– ఎంత పుణ్యం చేసుకుంటే ఈ ద్వారంగుండా సాహిత్య ప్రపంచంలోకి ప్రవేశించడం సాధ్యపడుతుంది!

నా మొదటి కవితాసంపుటి 'నిర్వికల్ప సంగీతం' (1986) వెలువరించినప్పుడు ఆ పుస్తకం ఆమె చేతులమీదుగానే ఆవిష్కారం కావాలని కోరుకున్నాను. ఒకవైపు మల్లంపల్లి శరభయ్యగారు, మరొకవైపు ఆర్.ఎస్.సుదర్శనంగారు కూర్చుని ఉండగా ఆమె నన్ను లోకానికి ఒక కవిగా పరిచయం చేసిన ఆ దృశ్యం నా మనసులో ఎప్పటికీ చెక్కు చెదరదు.

మబ్బు పట్టిన ఈ జూన్ ఆకాశాన్ని చూడగానే ఈ తలపులన్నీ తోసుకొస్తున్నాయి. కట్టుకోవడానికి రెండు జతలు కూడా లేని ఆ పేద పసి జీవితంలో ప్రయాణానికి ఉతికిన జతలు ఆరకపోతే, ఆ తడిగుడ్డల్ని అట్లానే నీళ్ళపొయ్యిదగ్గర వెచ్చబెడుతున్న మా అమ్మకూడా నా కళ్ళముందు కనబడుతున్నది.

ఏమి సాధించాను ఈ జీవితంలో? వాళ్ళ ఋణం ఎప్పటికి తీర్చగలుగుతాను? అసలు తీర్చుకోగలనా?

29-6-2016

# మనసులు ఒక్కటి కావాలి

**పుష్కలావర్తాలు** లేకపోయినా పుష్కరం పుష్కరమే కదా. నేనెప్పుడూ ఏ పుష్కరాలకీ ఏ నదీతీరంలోనూ ఉండలేదు. ఈ సారి అనుకోకుండా, కృష్ణవేణి ఒడ్డున నివసించడం మొదలుపెట్టగానే పుష్కరాలు రావడం చాలా సంతోషమనిపించింది.

పుష్కరాలు ఒట్టి స్నానక్రతువు కాదు. ఆ అపూర్వసందర్భాన్ని పాపపుణ్యాలతో ముడిపెట్టే ప్రవచనకారులు భారతీయసాహిత్యం, తత్త్వశాస్త్రం తెలియని అజ్ఞానులు. అటువంటి మూఢవిశ్వాసాల వల్లే గోదావరి పుష్కరాల్లో అమాయికులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. పుష్కరాల్లో ఫలానా చోట, ఫలానా ముహూర్తాన స్నానం చెయ్యాలని నాకు తెలిసి ఎక్కడా ఏ ప్రాచీనగ్రంథంలోనూ రాసి లేదు. పైగా, మహాభారతం, అనుశాసన పర్వంలో, తీర్థమహిమ గురించి చెప్తూ, మనం పోలేని తీర్థాల విషయంలో మానసిక తీర్థయాత్ర, మానసికస్నానం చేస్తే చాలంటుంది. పైగా, ఏ తీర్థంలో, ఎక్కడ స్నానం చేసినా ఫలితం సమానమేనంటుంది.

పుష్కరాల్ని ఇప్పుడు పర్యావరణవాదులు ఒక water resources conservation ఉద్యమంగా చూడటానికి చేస్తున్న ప్రయత్నం అభినందించదగ్గదేగాని, దానికి మాత్రమే పరిమితం కాదు.

ఈ దేశంలో, ఆ మాటకొస్తే, ప్రాచీన ఆసియాదేశాల సంస్కృతులన్నిటిలోనూ, రెండు రకాల భౌగోళిక దరర్శనాలున్నాయి. ఒకటి, political landscape, మరొకటి, cultural landscape. చైనా, భారతదేశం, ఇరాక్ వంటి దేశాల సాహిత్యం ఆదినుంచీ రాజకీయ భూగోళానికి సమాంతరంగా ఒక సాంస్కృతిక భూగోళాన్ని సందర్శించి, నిర్మించే ప్రయత్నం చేస్తూ వచ్చింది. ఆ సాంస్కృతిక భూగోళం, బహుశా, ఒక narrative నే కావచ్చు గాక, కాని ఆ నెరేటివ్‌కి ఒక సామాజిక ప్రయోజనం కూడా ఉంటూ వచ్చింది.

దేశం రాజకీయంగా ముక్కలై ఉన్నప్పుడు, దేశ భూగోళమంతా, సాంస్కృతికంగా ఒకటి అని చెప్పడం ఆ రాజకీయ ప్రయోజనం. అది ఒక centri fugal ప్రక్రియ. కొన్నిసార్లు, దేశమంతా, ఒక ఏకైక రాజకీయ పాలనలో ఉన్నప్పుడు, ఒకే రాజకీయ సంస్కృతిని రుద్దాలని చూస్తున్నప్పుడు, దేశం సాంస్కృతికంగా ఎంతో వైవిధ్యవంతమైందని చెప్పడం కూడా అవసరమే. అదొక centri petal ప్రక్రియ.

భారతదేశ చరిత్రని నిశితంగా అధ్యయనం చేసినవాళ్ళకి అది తొలినుంచీ ఒక centri-petal, centri-fugal పద్ధతిలో కొనసాగుతున్నదని తెలుస్తుంది. ఉదాహరణకి, పందొమ్మిదో శతాబ్దంలో, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా బలపడవలసి వచ్చినప్పుడు, మనమంతా సాంస్కృతికంగా ఒకటి అనే భావం ముందుకొచ్చింది. ఇరవయ్యవ శతాబ్ది ప్రారంభానికి అది జాతీయతావాదంగానూ, జాతీయోద్యమంగానూ రూపుదిద్దుకుంది. అప్పుడు ప్రాంతాలు ప్రధానం కాదు, భారతదేశం, భారతజాతి ప్రధానం. ఇప్పుడు, భారతదేశం రాజకీయ సుస్థిరత పొందాక, దేశమంటే, కేవలం ఒక మతం, ఒక జాతి, ఒక భాష, ఒక వర్గం కాదనే స్పృహతో వివిధ అస్తిత్వాల ప్రకటన నేటి సాంస్కృతిక అవసరంగా, రాజకీయ అవసరంగా మారుతున్నది.

ఇటువంటి సాంస్కృతిక ఏకీకరణ– రాజకీయ వికేంద్రీకరణ, రాజకీయ ఏకీకరణ– సాంస్కృతిక వికేంద్రీకరణ ప్రక్రియలో సాహిత్యం, కళలు, తీర్థయాత్రలు ఎటువంటి పాత్ర పోషిస్తూ వచ్చాయో, అటువంటి పాత్రనే పుష్కరాలు కూడా పోషిస్తూ వచ్చాయి.

ఒక దేశంలో కొన్ని ప్రాంతాలు రాజకీయ హద్దుల్ని ఏర్పరచుకుంటున్నప్పుడు, అ హద్దుల్ని దాటి చూడాలంటే, మరొక ప్రాతిపదిక అవసరమవుతుంది. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అనే రాజకీయ విభాగాలని దాటి 1300 కిలోమీటర్ల పొడుగునా విస్తరించిన ఒక నదీపరీవాహక ప్రాంతంగా ఆ నాలుగు రాష్ట్రాల్నీ చూడటం పుష్కరాలు ఇవ్వగల గొప్ప అవకాశం. మరాఠీ, కన్నడ, ఉర్దూ, తెలుగు అనే భాషాభేదాల్ని దాటి, ఆ ప్రజలందరినీ ఒకే నదినీళ్ళు తాగుతున్నవాళ్ళుగా చూడటం మరింత విశాలదర్శనం.

ఆ నదీ పరీవాహక ప్రాంతం పొడుగునా ఉన్న అడవులు, గ్రామాలు, మైదానాలు, పట్టణాలు, సస్యక్షేత్రాలు, పరిశ్రమలు, పథకాలు, అన్నీ ఉమ్మడివ్యక్తిత్వం సంతరించుకుని, నదికి సామూహికంగా కృతజ్ఞత సమర్పించడం పుష్కరం. ఆ నది పొడుగునా ఆ నీళ్ళ వల్ల ప్రయోజనం పొందిన గ్రామాలు, సమాజాలు తాము పొందిన దాంట్లోంచి తమకు తోచినంత నలుగురితోనూ పంచుకోవడం పుష్కరాల్లో చేసే, చెయ్యవలసిన దానం. ఇట్లాంటి

వితరణ ఏడాదికొకసారి కష్టం కావచ్చు, ఎందుకంటే, భారతదేశంలో ప్రతి అయిదు సంవత్సరాల్లో మూడేళ్ళు క్షామమే కాబట్టి. కాని, పన్నెండేళ్ళ కొకసారి, కష్టం కాదు, ఎందుకంటే, పన్నెండేళ్ళల్లో కనీసం ఆరుసంవత్సరాలు పుష్కలమైన పంట దొరుకుతుంది కాబట్టి.

కృష్ణాపుష్కరాలు ఎలా ఉన్నాయో చూద్దామని విజయవాడనుంచి హంసలదీవి దాకా ప్రయాణించిన నాకు, ఈ అర్థంలో చాలావరకు ప్రజలు పుష్కరసందేశాన్ని అవగతం చేసుకున్నారనే అనిపించింది. బహుశా, పుష్కరాల్ని ఇంకా స్నానక్రతువుగా మాత్రమే చూస్తున్నవాళ్ళు ప్రకాశం బారేజి పరిసరాలకే పరిమితమైపోయారనిపించింది. విజయవాడ దాటి యనమలకుదురు, పెదపులిపాక మీంచి పాలకాయ తిప్పదాకా, ప్రజలకి అదొక పండగ, సామూహికసంతోషం, నిత్యాన్న సంతర్పణ.

ఆ దారిపొడుగునా ఒక రోజంతా ప్రయాణించి రాగానే నా మనసుకి చాలా సంతోష మనిపించింది. శ్రీకాకుళం నుంచి హంసలదీవిదాకా, శ్రావణమాసంలోనే సంక్రాంతి పండగ వచ్చినట్టుంది. మధ్యలో మోపిదేవి సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో, దర్శన మయ్యాక, మంచినీళ్ళకోసం వెతుక్కుంటుంటే, అక్కడున్నవాళ్ళు భోజనం కూపన్లు ఇచ్చి అన్నం తిని వెళ్ళమని చెప్పారు. ఆ అన్నశాలలో నా కడుపు, మనసూ రెండూ నిండి పోయాయి.

మేం హంసలదీవికి చేరుకునేటప్పటికి ఎర్రటి ఎండ. 'అసలు శ్రావణమాస మధ్యమ్ము నందు కురిసి తీరాలు వర్షాలు కొంచేమేని'. కాని గ్రీష్మ ఋతువుని తలపిస్తున్న శ్రావణం. ఆ ఎర్రటి ఎండలో పోటెత్తుతున్న సముద్రాన్ని పోల్చుకోవడానికి మాటల కోసం వెతుక్కున్నాను. సముద్రం మీదనే కవిత్వం చెప్పిన స్పానిష్ కవులు, నెరూదా, జిమెనిజ్ వంటి వారు కూడా ఆ సముద్రాన్ని గుర్తుపట్టలేరు. బహుశా వాల్మీకి మాత్రమే ఆ సముద్రానికి తగిన రూపకాలంకారాలు పట్టుకోగలడేమో.

పాలకాయతిప్ప దగ్గర కృష్ణ సముద్రంలో కలుస్తున్న చోటు. నల్లని కన్నబెన్నా, గోధుమరంగు సముద్రమూ కలిసి కృష్ణ, గౌరదేహాల స్త్రీపురుష పరిష్వంగంలాగా ఉంది. ఆ దృశ్యాన్ని సాఫ్ట్ పేస్టల్స్‌లో చిత్రించాలని కూచున్నాను. దూరంగా ఇద్దరు పోలీసులు కుర్చీల మీద కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. నన్ను చూసి, నేనెవరో తెలియకపోయినా, రమ్మని నాకో కుర్చీ, నా రంగులపెట్టెకొక కుర్చీ ఇచ్చేసి పక్కన నిలబడ్డారు.

'నిండుగా పూసిన చెర్రీ తరువు కింద ఏ ఇద్దరూ అపరిచితులు కారు' అన్నాడొక హైకూ కవి. బహుశా, పుష్కరాల్లో కూడా ఏ ఇద్దరూ అపరిచితులు కారేమో.

తిరిగి మళ్ళా ఆ కృష్ణాతీరం వెంబడి ఇంటికొస్తుంటే, దారికటూ ఇటూ ఎదుగుతున్న పచ్చని పైర్లు. వరి, చెరకు, అరటి, పసుపు, అల్లం, కంద, కూరగాయల పాదులు, తమలపాకు తోటలు, ఆ దారిపొడుగునా సాయం సంధ్య బంగారం చల్లుతుంటే, మల్లాది రామకృష్ణశాస్త్రి 'కృష్ణాతీరం' మళ్ళీ చదువుతున్నట్టనపించింది.

ఆ మేరకు పుష్కరాలు సఫలమయ్యాయనే అనిపించింది. కాని, రాష్ట్రాల్నీ, ఆనకట్టల్నీ బచావత్ ట్రిబ్యునళ్ళనీ దాటి కృష్ణాపరీవాహకప్రాంతమంతా ఒక ఉమ్మడి కుటుంబంగా చేరువకావడానికి, ఈ పుష్కరాల్ని మనం వాడుకోగలిగామా? గోదావరి పుష్కరాలప్పుడు తాము ఎటువంటి కార్యక్రమాలు చేస్తే బాగుంటుందో చెప్పమని నన్నొక సంస్థ వారడిగారు. నేను వారికి కొన్ని కార్యక్రమాలు సూచించాను. అందులో, తెలుగు, మరాఠీ, హిందీ, గిరిజన భాషల సాహిత్యవేత్తల సమ్మేళనమొకటి ఏర్పాటు చెయ్యడం కూడా. కృష్ణాపుష్కరాల్లో కూడా అటువంటి అంతర్‌రాష్ట్ర సమావేశాలు, సమ్మేళనాలు, సాహిత్యపరిషత్తులు, ధార్మికచర్చలు జరిగి ఉంటే ఎంత బాగుండేది!

పుష్కరాలంటే స్నానక్రతువుకాదు.

సమానో మంత్రః సమితిః సమానీ
సమానం మనః సహ చిత్తమేషామ
సమానం మంత్రమభిమన్త్రయే వః
సమానేన వో హవిషా జుహోమి
సమానీవ ఆకూతిః సమానా హృదయానివః
సమానమస్తు వోమనో యథా వః సుసహాసతి

(మాటలు ఉమ్మడి కావాలి, కలయికలు ఉమ్మడి కావాలి, ఏకమనస్కులు కావాలి. చిత్తాలు ఒక్కటి కావాలి. సంకల్పాలు ఉమ్మడి కావాలి, హృదయాలు ఒక్కటి కావాలి. మనసులొక్కటికావాలి. సంపూర్ణంగా సంఘటితం కావాలి. (ఋగ్వేదం, 10.191)

అని ప్రభుత్వాలూ, ప్రవచనకారులూ ఎప్పుడు గ్రహిస్తారు!

18-8-2016

# గంగాలమ్మ నన్ను వెతుక్కుంటూ వచ్చింది

**చాలా** కాలం తర్వాత రెండువారాల పాటు మా ఊళ్ళల్లో తిరుగాడేను. నేను పుట్టిన ఊరితోనూ, ఆ ప్రాంతంతోనూ నేను మానసికంగా ఎంతగా అతుక్కుపోయేనంటే, నేను మరేదీ కోరుకోలేకపోయాను. విద్యలోనూ, ఉద్యోగంలోనూ బహుశా ఏదైనా సాధించిగలిగి ఉండేవాణ్ణేమోగాని, ఎప్పటికప్పుడు నా హెూమ్ సిక్ నెస్ నన్ను వెనక్కి లాగేస్తూనే వచ్చింది. నగరంలో ఉన్నా కూడా నా మనసెప్పుడూ ఈ కొండలచుట్టూ, ఈ అడవులచుట్టూతానే తిరుగుతూ ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, నా ఊరితో నాకేర్పడ్డ బాల్యానుబంధం నా జీవితంలోని అన్ని యాంబిషన్సునీ నిర్మూలించేసింది. మిగిలిన ఒకే ఒక్క యాంబిషను ఆ ఊళ్ళను తలుచుకుంటూ కవితలు రాయడం, ఆ ఊళ్ళ చుట్టూ తిరుగుతూ బొమ్మలు గియ్యడం.

## 2

**ప్రాచీన** చీనాచిత్రకారులు సాధనచేసిన చిత్రకళా రీతుల్లో, 'కొండలూ-నీళ్ళూ' (షాన్-షుయి) చిత్రించడం ఒక ప్రత్యేకమైన శాఖగా వృద్ధిచెందింది. ఒక చీనా చిత్రకారుడి సమాధి మీద 'కొండల్లో హృదయముంది-నీళ్ళల్లో జ్ఞానముంది' అని రాసిఉండేదట. వాళ్ళ దృష్టిలో, భూమికీ, ఆకాశానికీ మధ్య 'కీ' అనే ఒక దివ్యశక్తి ప్రవహిస్తూ ఉంటుంది. చిత్రకారుడు చెయ్యవలసిందల్లా తెల్లకాగితం ముందు కూచుని, ఇంకులో కుంచె నింపి, ఆ ప్రాణశక్తిని తనలోకి ఆవాహన చేసుకోవడం. అప్పుడు బొమ్మగీసినా, కవిత రాసినా ఒక చీనా కవి రాసిన ఈ కవితలా ఉంటుంది:

అస్పష్ట తరుసముదాయం వెనక
కెరటాల మధ్య నల్లటి చుక్కల్లాగా
దూరప్రవాహం.

అప్పుడే పూర్తి చేసిన బొమ్మలోలాగా
ఇంకా ఆరని
ఇంకుతడి.

## 3

**రోజూ** పొద్దున్నో, సాయంకాలమో వానపడుతూ ఉంటుంది. ఋతుసంధ్యవేళ. వసంతం ముగిసి గ్రీష్మం అడుగుపెడుతున్న సమయం. అడవి చిక్కటి ఆకుపచ్చకి రంగు తిరుగుతోంది. రోజూ మధ్యాహ్నం ఏదో ఒక గ్రామానికి వెళ్తూ వచ్చాం. ఒక రోజు ఋతుపవన మేఘం అడవుల్నీ, కొండల్నీ చుట్టబెడుతున్న దృశ్యం స్వయంగా చూడాలని ఆ వానలోనే ప్రయాణించాం. ఈ మార్చి-ఏప్రిల్‌లలో ఎండలకి మాడిపోయిన మనస్సు ఆ వానకి మళ్ళా పసరు పోసుకుంది. ఆ వానలో ముడుచుకుపోయిన ఆ గ్రామాలు నా చిన్నప్పుడెలా ఉన్నాయో ఇప్పుడూ అలానే ఉన్నాయి.

ఆ ప్రజలు ఏమి కోరుకుంటున్నారు? రోజువారీ అవసరాలు తీరడంకన్నా మించిన కలలేమన్నా ఉన్నాయా వాళ్ళకి? తాటాకు ఇళ్ళ కప్పుల మీంచి వాన ధారలు కారుతుంటే, వెచ్చని పొయ్యి దగ్గర ముడుచుకు కూచుని ముద్ద ముద్దగా పలకరించుకునే ఆ మనుషుల్లో నేనూ ఒకడిగా ఉండి పోవాలనే కదా నా జీవితమంతా కోరుకున్నాను! కాని, నిజంగా నేనట్లా ఉండిపోగలనా? మళ్ళా ఆ అనుభవాన్ని పంచుకోవడానికీ, చెప్పుకోవడానికీ ఒక సహృదయ భావుకప్రపంచం కావాలనిపించదా?

## 4

**ఇదే** ఆశ్చర్యం. పరివ్రాజకులూ, నిజంగా నిస్సంగులూ అయిన చీనా, జపాన్ కవుల్లో కూడా ఇట్లాంటి వైరుధ్యమే కనిపిస్తుంది. ప్రాచీన చీనాకవి హాన్-షాన్‌నే చూడండి. అంత నిస్సంగత్వాన్ని సాధించేక కూడా అంత కవిత్వం మనతో ఎందుకు పంచుకున్నాడు? మహనీయుడైన జపాన్ కవి బషో జీవితమంతా ఈ పోరాటంలోనే నలిగిపోయాడు. తన ముందు జీవించిన మరొక మహనీయ కవీంద్రుడు సైగ్యోలాగా తాను కూడా ఈ ప్రపంచానికి దూరంగా జరగాలని అతడి ఆరాటం. ప్రాచీన చీనా తాత్వికుడు సున్-జింగ్ లాగా తన తలుపు మూసేసుకోవాలనీ, మరొక తాత్వికుడు దు-ఉలాంగ్ లాగా తన గుమ్మానికి తాళం వేసేసుకోవాలనీ కోరుకున్నాడు. కానీ, మళ్ళా ఇట్లా రాయకుండానూ ఉండలేకపోయాడు:

ఈ ముసలాడు మరీ సోమరి. సాధారణంగా నన్ను చూడవచ్చే మనుషుల్ని భరించడం చాలా కష్టం. అందుకనే ఎప్పటికప్పుడు 'ఇకనుంచి వాళ్ళను నే కలవను', 'వాళ్ళని ఇంటికి ఆహ్వానించను' అని ఒట్టుపెట్టుకుంటుంటాను. కానీ రాత్రుళ్ళు చంద్రుడు ప్రవేశిస్తుంటాడు. పొద్దుటిపూట మంచు రాలుతుంటుంది. దాంతో మళ్ళా స్నేహితులకోసం ఆరాట పడుతుంటాను. అలా ఆరాటపడకుండా ఉండలేను..

## 5

**రాజమౌమ్మంగిలో** కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియదు. బ్రాడ్‌బాండ్ ఒక్కరోజు పనిచేసింది. ఇంతలో ఒక సాయంకాలం పిడుగు పడింది. ఇక బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కరెంటు ఒక రోజంతా వెలిగేక, ఎక్కడో అడవిలో చెట్లు పడిపోతాయి. కరెంటు వాళ్ళు నెమ్మదిగా లైను వెతుక్కుంటూ బయలుదేరతారు. రెండుమూడు రోజులకి లైను పునరుద్ధరించేక, మళ్ళా వాన పడుతుంది, మళ్ళా చెట్లు పడిపోతాయి. కాని అక్కడ చూడవలసిన అందాలు టెలివిజన్, కంప్యూటర్లలో చూసేవి కావు, అక్కడ మన హృదయాన్ని లోబరుచుకునేవి: వాన కురిసిన వెలిసిన సాయంకాలం ఆకాశమంతా అల్లుకునే నారింజరంగు కాంతీ, టాగూరు బొమ్మల్లో కనిపించే శుభ్రనీలఛాయా, యూకలిప్టస్ చెట్లమధ్యనుంచి ప్రవాహంలాగా అల్లుకునే రాత్రిచీకటీ, అంతా మాటుమణిగేక, ఆకాశంలో తేనెరంగుకి తిరిగి మసగ్గా కరిగిపొయ్యే చంద్రరేఖా, ఉండీ, ఉండీ ఆకాశానికి చక్కిలిగింతలు పెట్టే కోకిలకూతానూ.

## 6

**మధ్యలో** ఒకసారి మారేడుమిల్లి, చింతూరు మీదుగా మోతుగూడెం, డొంకరాయి, అప్పర్ సీలేరు వెళ్ళివచ్చాం. కొన్నాళ్ళు ట్రైబలు పవరు కంపెనీ ఎగ్జిక్యూటివు డైరక్టరుగా పనిచేసినందుకు, అక్కడ పవరు జనరేషను ప్రాజెక్టులు చూడమని మిత్రులు ఆహ్వానించేరు. జోలాపుట్టు, మాచ్‌ఖండు ఇంతకు ముందే చూసాను కాబట్టి, ఈ పర్యటనతో సీలేరు పరీవాహక ప్రాంతమంతా పూర్తిగా చూసినట్టయింది.

కాని మారేడుమిల్లి మీంచి మోతుగూడెం దాకానూ, సీలేరు మీంచి గూడెం కొత్తవీధి, రొంపుల, కె.డి.పేట దాకానూ 400 కిలోమీటర్ల పైగా ఆ అడవిలో చేసిన ప్రయాణం మాత్రం మరవలేనిది. ఆ ఆకుపచ్చదనాన్ని నా నేత్రాలు పరిపూర్ణంగా పీల్చుకున్నాయి.

వాల్మీకి మాటల్లో 'శైలాత్ శైలమ్, వనాత్ వనమ్' (కొండనుంచి కొండకి, అడవినుంచి అడవికి) మేం చేసిన ఆ ప్రయాణానుభవాన్ని వర్ణించడానికి నాకు భాష చాలదు.

## 7

**అసలు**, భారతీయ సాహిత్యంలోనూ, కవిత్వంలోనూ కూడా అటవీసౌందర్యాన్ని వాల్మీకి తప్ప మరెవరూ పట్టుకోలేకపోయారనిపిస్తుంది. మహాభారతంలో కూడా పాండవులు పన్నెండేళ్ళు వనవాసం చేసినా, ఒక సౌగంధిక పర్వంలో తప్ప గొప్ప వనవర్ణన కనిపించదు. కానీ, వాల్మీకిలో రాముడు అయోధ్య వదిలిపెట్టినక్షణం నుంచే అడవి మనల్ని ఆవహించడం మొదలుపెడుతుంది.

అసలు రాముడే ఒక గిరివన ప్రియుడు. అతడికీ, సీతకీ ఉన్న గొప్ప కోరిక అడవిలో బతకాలన్నదే. తన కోసం జీవితకాలం నిరీక్షిస్తున్న శబరిని కలుసుకున్నప్పుడు రాముడు నేరేడుపళ్ళు కాదు కోరుకున్నది, మేఘంలాగా ఉన్న మతంగవనమంతా చూపించమని అడిగాడట. చిత్రకూటం, ఋష్యమూకం, ప్రస్రవణగిరి, గంధమాదనం, మతంగవనం లాంటి కొండలగురించీ, అక్కడి అడవులగురించీ వర్ణిస్తున్నప్పుడు వాల్మీకి ప్రాచీన చీనా చీత్రకారులకన్నా నిశితమైన రేఖల తోనూ, బ్రిటిష్ లాండ్‌స్కేప్ చిత్రకారులకన్నా లలిత మైన రంగులతోనూ చిత్రిస్తాడు. రామాయణంలోని ఋతువర్ణనల్లో చైత్రం, గ్రీష్మం, వర్షం, హేమంతం– నాలుగు వర్ణనలూ అడివిలోనే కనిపిస్తాయి.

మేమా ప్రయాణం చేస్తున్నంతసేపూ ఆ అడవిని పోల్చుకోవడానికి వాల్మీకినే తలుచు కుంటూ ఉన్నాను.

ఆ కొండలు:

> కేచిత్రజత సంకాశాః కేచిత్ క్షతజ సన్నిభాః
> పీతమాంజిష్ట వర్ణాశ్చ కేచిన్మణివరప్రభాః
> పుష్యార్క కేతకాభాశ్చ కేచిజ్జ్యోతీరసప్రభాః
> విరాజంతే అచలేంద్రస్య దేశా ధాతువిభూషితాః

(కొన్ని రాళ్ళు వెండిలాగా ఉన్నాయి, కొన్ని రక్తంలాగా. కొన్ని పచ్చగా, కొన్ని మణుల్లగా, పుష్యాగాల్లాగా, కొన్ని స్ఫటికాల్లాగా, కొన్ని మొగలిపూవుల్లాగా, నక్షత్రాల్లాగా, కొన్ని పాదరసంలాగా మెరుస్తున్నాయి.)

అంత విస్తారమైన అడవిని చూసినప్పుడు కొన్ని చోట్ల ఎండ, కొన్ని చోట్ల నీడ, కొన్ని చోట్ల మంచు, కొన్ని చోట్ల చీకటి– ఆ అవస్థ కూడా వాల్మీకినే వర్ణించగలడు:

సర్వకాల ఫలా యత్ర పాదపా మధురస్రవాః
సర్వే చ ఋతవస్తత్ర వనే చైత్ర రథే యథా

(ఆ అడవుల్లో చెట్లు అన్ని కాలాల్లోనూ పండ్లనిస్తాయి. మధురమైన రసాలిస్తాయి. చైత్రరథంలోలాగా ఆ అడవిలో అన్ని ఋతువులూ ఒక్కవేళనే కనిపిస్తాయి.)

అక్కడి నీరు వాల్మీకి మాటల్లో 'పద్మగంధి శివమ్', 'సుఖశీతమనామయమ్', 'సతతాక్లిష్టమ్', 'రౌప్యస్ఫాటికసన్నిభం'.

ఇప్పుడిక్కడ, మెహిదిపట్నంలో ఈ సాయంకాలం ఈ మాటలు రాస్తున్నప్పుడు కూడా నాకింకా ఆ 'రమ్యనిర్ఝర కాననాల్లో', ఆ 'రమ్యపుష్పిత కాననాల్లో', 'ఆ శుభదర్శన కాననాల్లో' తిరుగుతున్నట్టే ఉంది.

నా చుట్టూ మిగలముగ్గిన పనసపళ్ళ వాసన.

## 8

**అడవిని** వర్ణించేటప్పుడంతా వాల్మీకి మేఘంలాగా ఉందంటాడు. ఆయన ఉపమానాలు చాలా భావగర్భితంగా ఉంటాయి. మొదటిసారి సముద్రాన్ని చూపిస్తూ లోకానికి ప్రతిబింబం లాగా ఉందంటాడు. కాని, నిజంగా మేఘాలతో పోల్చదగ్గవి జలాశయాలు. ఆ అడవుల్లో, కొండలమధ్య చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు ఎక్కడ చూసినా నేలమీద నీలితరగలు పరిచినట్టే ఉన్నాయి. మరీ ముఖ్యంగా డొంకరాయి జలాశయం. యేలేరు, మడేరు, తడికజలపాతం (దానికెవరో టైగ్రిస్ జలపాతం అని పేరుపెట్టారు), పింజరికొండ జలపాతం– వేసవి ముగుస్తున్న వేళ కూడా ఆ జలాశయాల్లో, జలపాతాల్లో నీళ్ళు ప్రవహిస్తూనే ఉన్నాయి. ఏడాది పొడుగునా కురిసినవానల్లోంచి ఏ జలధారల్ని ఆ కొండకోనలు తమని తాము దొన్నెలుగా చేసుకుని దాచుకున్నాయో.

చీనాకవులు నిజంగా ప్రకృతిని అర్థం చేసుకున్నారు. కొండలు ఎంత అందంగానైనా ఉండనీ, కానీ ఆ లోయలో ఒక చెరువో, జలపాతమో ఉంటేనే అక్కడ సంగీతం ప్రభవిస్తుంది. ఒకసారి ఆ దృశ్యాన్ని చూసిన మనిషిని ఆ సంగీతం జీవితమంతా వెన్నాడుతూనే ఉంటుంది.

# 9

**వసంతఋతువు** రాగానే మా పల్లెల్లో కొండరెడ్లు గంగాలమ్మ పండగ చేస్తారు. గిరిజన ప్రాంతాల్లో తొలివానలు చైత్రమాసానికే వచ్చేస్తాయి. ఆ వానల్ని స్వాగతించే పండగ అది. ఆ పండగ ముగుస్తూనే భూదేవి పండగ మొదలవుతుంది. విత్తనాలు చల్లే పండగ. గంగాదేవి పండగ పూర్తిగా చూసి ఎన్నో ఏళ్ళయ్యింది. ఏ వేసవిలో వచ్చినా ఆ పండగకి అటూ ఇటూగానే వస్తున్నాను. ఆ అడివిదేవతల కోసం, ఆ అడివిరాజుల వేటకోసం బెంగ పెట్టుకున్న నాకు, ఇప్పుడెక్కడ చూసినా చర్చిలే కనిపిస్తున్నాయి, ఉద్యమంలాగా విస్తరిస్తూ. ఒకప్పుడు రామకోవెలలు, ఆ తర్వాతా సీతారామరాజు విగ్రహాలు, నిన్నటిదాకా చర్చిలు, ఇప్పుడు సాయిబాబా కూడా ఈ దారుల్లో ప్రయాణం మొదలుపెట్టాడు.

కాని, ఒక సాయంకాలం, తొలివాన ఆకాశాన్నీ, భూమినీ చుట్టబెడుతున్న వేళ, మా ఊరినుంచి రాజవొమ్మంగి వస్తూండగా, కొండపల్లి దగ్గర అకస్మాత్తుగా ఎదురయ్యింది గంగాలమ్మ. ఆ వానలోనే మోగుతున్న బాజాలమధ్య కొందరు యువకులూ, పెద్దలూ, స్త్రీలూ ఆమెని ఊరేగింపుగా తీసుకువెళ్తున్నారు. వానలో ఒక ఐరేణి కడవ మీద దీపం వెలిగించుకుని అట్లా బాజాల మధ్య ఊరేగుతున్న గంగాలమ్మను చూడగానే నాకు చెప్పలేనంత పులకింత కలిగింది. అన్ని గ్రామాల్లోనూ పండగ అయిపోయిందనీ, రెండు ఊళ్ళల్లో మాత్రమే మిగిలిందనీ అక్కడొక యువకుడు నాతో చెప్పాడు. నా కోసమే ఆ పండగ ఆలస్యమయిందనీ, గంగాలమ్మ నన్ను వెతుక్కుంటూ వచ్చిందనిపించింది.

అడివిదేవతల కోసం ఎన్నాళ్ళుగానో వేచి ఉన్న నాకు ఆమె ఆ వానలో, ఆ సాయం సంధ్యలో నా తండ్రికి ఎంతో ఇష్టమైన ఆ కొండపల్లెలో ఎదురుకావడం, చెప్పొద్దూ, నాకూ, ఆ దేవీదేవతలకీ మధ్య సంభాషణ నడుస్తూనే ఉందనీ, నా భాగ్యానికి హద్దులేదనీ అనిపించింది.

కానీ, నా బాల్యానికీ, ఇప్పటికీ వచ్చిన తేడా అయితే ప్రస్ఫుటంగానే ఉంది. ఆ ఊరేగింపు ఫొటోలు తీసుకుంటుంటే, అందులో మొదట్లో బాజా వాయిస్తున్న ఒక యువకుడు చాలా ఇబ్బంది పడ్డాడు. తనకీ ఆ పండగకీ ఏమీ సంబంధం లేదనీ ఏదో అందరిలాగా తాను కూడా బాజా వాయిస్తున్నాననీ అన్నాడు. అతడు ఆ గ్రామ సర్పంచ్ అట. 19 పంచాయతీల్లో అతడొక్కడే ఏకగ్రీవంగా సర్పంచ్ అయ్యాడట. తానట్లా రోడ్డున పడి ఆ గ్రామదేవత పండగలో బాజాలు వాయిస్తుంటే, తన ముందున్న నాగరీక మానవుడు తన

గురించి ఎక్కడ తక్కువగా భావిస్తాడోనని అతడొకటే ఆదుర్దా పడిపోయాడు. కాని అతడి తండ్రి నాకు బాగా తెలుసు. కొండదొర. అతడు మా నియోజకవర్గంలోనే మొదటి గ్రాడ్యుయేటు. అతణ్ణంతా బి.యే తమ్మన్నదొర అనేవారు. నేను పెద్దాపురంలో డిగ్రీలో చేరినప్పుడు మాకు హిస్టరీ బోధించిన లెక్చెరర్ అతడి క్లాస్‌మేట్. తమ్మన్నదొర కావాలనుకుని ఉంటే ఐఏఎస్ అయిఉండేవాడు అన్నాడాయన. కనీసం ఎమ్మెల్యే కావడం మీద కూడా తమ్మన్నదొరకి ఆసక్తి లేదు. అతడట్లా ఆ గ్రామాల్లో ఉండిపోడాన్నే ఎక్కువ ఇష్టపడ్డాడు. నా ముందు గంగాలమ్మ పండగలో బాజా వాయిస్తున్నందుకు సిగ్గుపడుతున్న ఆ యువకుణ్ణి చూస్తూ అతడి తండ్రిని గుర్తుచేసుకుంటే, 'అమృతసంతానం' లో సరుబుసావొతా, దివుడు సావొతాలు గుర్తొచ్చారు. నా కళ్ళముందే ఒక తరం ముగిసి కొత్త తరం ప్రత్యక్షమైందని అర్థమైంది.

## 10

కంటిముందు కనిపిస్తున్న దృశ్యాన్ని బొమ్మగా గియ్యడంలో అద్వితీయమైన సంతోషమేదో ఉంది. అది మనిషికి తన బాహ్యప్రపంచం మీద ఒక సాధికారికతను ఇస్తున్నదంటామా లేక తాను జీవించిన క్షణాలకొక అమరత్వాన్ని సమకూరుస్తున్నదంటామా? కాని చూసిన దృశ్యాన్ని చూసినట్టుగా సవివరంగా ఎప్పటికీ చిత్రించలేం. 500 ఏళ్ళ ఐరోపా చిత్రకళ మొదట్లో ఫార్మ్ మీదా, తరువాత టోన్ మీదా, తరువాత రంగుమీదా, ఇప్పుడు షేప్ మీదా దృష్టిపెడుతున్నది. కానీ ఆ చిత్రకారుడికి ఎప్పటికీ మిగిలేది అసంతృప్తినే. చీనా చిత్రకారుడికి ఈ సంగతి తెలుసు. అందుకని అతడు తాను చూస్తున్న దృశ్యాన్ని బాహ్య వివరాలతో చిత్రించడం మీద కన్నా దాని ఆత్మను పట్టుకోవడం మీదనే ఎక్కువ దృష్టిపెట్టాడు. నేనూ నా కళ్ళ ముందు సముద్రంలాగా విప్పారుతున్న ఆ వనసౌందర్యాన్ని, జలసౌందర్యాన్ని, ఆ వెలుగుని, ఆ ఛాయల్ని బొమ్మలుగా గియ్యాలని ప్రయత్నించేను. అక్కడికక్కడే plein air లో చిత్రించాలని. ప్రతి ప్రయత్నమూ గొప్ప అసంతృప్తినే మిగిల్చి నప్పటికీ. ప్రతి ప్రయత్నమూ కొత్త ఆశని కూడ రేకెత్తిస్తూ వచ్చింది.

14-6-2016 & 15-6-2016

# మామిడికొమ్మ మళ్ళీ మళ్ళీ పూయునులే

**నిండుగా** పూసిన మామిడిచెట్టు ఎదట
ఏ ఒక్కరూ ఒంటరి కారు

ఎప్పుడో రాసుకున్న ఈ కవితావాక్యాల్ని వారందినాల కింద ఒక మిత్రురాలు మళ్ళా నా స్మృతికి తెచ్చారు. ఆమెకి నా వందనాలు.

అవును, ఈ వాక్యాలు రాస్తున్నప్పుడు, మహనీయ జపనీయ కవీశ్వరుడు ఇస్సా రాసుకున్న ఈ హైకూ నా మనసులో మెదుల్తూంది.

చెర్రీ తరువులకింద
ఎవరూ
అపరిచితులుకారు

కాని ఆ మూడుపాదాలు నా మనసుమీద శాశ్వతంగా ముద్రించిన మనోహర స్ఫురణ వెనక, నేనెన్నడో చదువుకున్న ఒక ప్రాకృత కవిత కూడా ఉంది. వజ్జాలగ్గంలో (66:2) కవిత.

పరిధూసరాపి సహకారమంజరీ వహతు మంజరీ నామ.

(దుమ్ముపడ్డా కూడా మామిడిపూల గుత్తి మామిడిపూల గుత్తినే)

ముందు మామిడిపువ్వు, మామిడి చిగుర్లు ఆ వెనక. ఇదొక వ్యత్యస్తాలంకారం. కాని పూర్వకవులు, ముఖ్యంగా సంస్కృతకవులు ఈ సున్నితమైన భేదాన్ని పట్టించుకున్నట్టు లేదు. వాళ్ళ దృష్టిలో మామిడిపూత వసంతకాల చిహ్నమే. కాని ఇంకా మంకెనలు కూడా పూయకముందే మామిడిపూస్తుంది. కొన్నిచోట్ల, కొన్నిసార్లు మార్గశిరం చివరిదినాలకే మామిడి మొగ్గలు తలెత్తడం కనిపిస్తుంది.

సూర్యుడి రథం ఉత్తరం వైపు తిరగ్గానే ఆ రథధూళి రేగినట్టుగా మామిడిచెట్లనిండా అలౌకిక కాంతి పరచుకుంటుంది. అది పుప్పొడినో, దుమ్మునో తేల్చుకోడం కష్టం. అందుకనే ప్రాకృతకవి, దుమ్ము పడ్డా కూడా మామిడిపూల గుత్తిని పూలగుత్తి అనే అంటారన్నాడు.

మామిడి చిగురించడం, కోకిల ప్రవేశించి గొంతెత్తడం సంస్కృత సాహిత్యంలో ఒక కవిసమయంగా స్థిరపడిపోయాక, ఆ సౌందర్యంలో మామిడిపూతకి చోటులేకుండా పోయింది. చెట్టంతా పువ్వుగా మారి, పూసిన పూతంతా ఒక పరాగంలాగా, పచ్చని పొగలాగా అల్లుకునే పూతమామిడి సౌందర్యానికి ఆ కవిత్వంలో చోటులేదు.

పూసినమామిడిచెట్టుకోసం కాళిదాసు ఒక అపురూపమైన శ్లోకాన్ని కేటాయించక పోలేదు. కాని ఈ అద్భుతమైన శ్లోకం 'ఋతుసంహారం' లో వసంతవర్ణన (6:26) లో కలిసిపోయింది.

నేత్రే నిమీలియతి రోదితి యాతి శోకమ్
ఘ్రాణం కరేణ విరుణద్ధి విరౌతి చోచ్చైః
కాంతావియోగపరిఖేదితచిత్తవృత్తి
దృష్ట్వాధ్వగః కుసుమిత సహకారవృక్షాన్

(ప్రవాసి అయిన బాటసారి ఒకడు దారిపక్క నిండుగా పూసిన మామిడిచెట్టుని చూడగానే తన కాంత దగ్గర లేదన్న చింత మనసుని ఆవహించి కళ్ళు మూసుకున్నాడు, బాధపడ్డాడు, ఏడ్చాడు, చేతులు నాసికకు అడ్డుపెట్టుకుని ఎలుగెత్తి విలపించాడు)

నిండుగా పూసిన మామిడిచెట్టు కలిగించగల వ్యథ మామూలు పరితాపం కాదు, కాని అది రేకెత్తించగల ఆత్మీయతకూడా సామాన్యమైనది కాదు.

మామిడిచెట్టు ఏడాదిలో ఆరునెలలు నిద్రపోతుంది. ఆరునెలలు పరిపూర్ణంగా జీవిస్తుంది. పూర్తి ఉత్సాహంతో, మహావైభవంతో జీవిస్తుంది. మాఘమాసంలో పూత, ఫాల్గుణంలో పిందె, వైశాఖంలో రసాలూరే ఫలాలు–ఇంత త్వరత్వరగా పుష్పించి, ఫలించే ఈ వైనం ఒక సంస్కృతకవికి ప్రేమవ్యవహారంలాగా అనిపించింది. 'సదుక్తికర్ణామృతం' అనే ఒక అరుదైన సంకలనంలోని ఈ అందమైన శ్లోకం ఒక బ్లాగులో నా కంటపడింది:

అంకురితే పల్లవితే కోరకితే వికసితే చ సహకారే
అంకురితః పల్లవితః కోరకితో వికసితశ్చ మదనాసౌ

(మామిడిపువ్వు తలెత్తి, చిగురు తొడిగి, మొగ్గతొడిగి, వికసించినట్టుగా ప్రేమ కూడా అంకురించింది, పల్లవించింది, మొగ్గతొడిగింది, వికసించింది.)

ఒకప్పుడు శ్రీ శ్రీ తనకి అత్యంత స్ఫూర్తిదాయకమైన వాక్యంగా Stalingrad at War అనే న్యూస్ హెడ్ లైను తలుచుకున్నాడు. నాజీసైన్యాల్ని సోవియెట్ సేనలు స్టాలిన్‌గ్రాడ్ దగ్గర నిలవరించిన యుద్ధం గురించిన వార్త అది. కాని, నాజీ సైన్యాలమీద విజయం సాధించిన సోవియెట్ సేనలు పోలండ్‌లో అడుగుపెట్టాక ఏమి చేసాయో తెలిసిన తర్వాత నాకా వాక్యం ఇంకెంతమాత్రం స్ఫూర్తిదాయకం కాలేకపోయింది.

కాని ఎప్పటికీ నాకు స్ఫూర్తిదాయకమైన వాక్యమేదో చెప్పమంటే నేనీ వాక్యాన్నే తలుచుకుంటాను.

మామిడికొమ్మ మళ్ళీ మళ్ళీ పూయునులే..

శ్రీశ్రీ ఈ మాట వింటే గింజుకుంటాడని నాకు తెలుసు. కాని శ్రీశ్రీ యుద్ధం గురించి రాసాడు తప్ప యుద్ధం చేయలేదు. దాశరథి యుద్ధం చేసాడు, అంగారాన్ని దోసిట పట్టుకున్నాడు కాబట్టే బంగారంలాంటి ఈ వాక్యం రాయగలిగాడు.

మామిడికొమ్మ మళ్ళీ మళ్ళీ పూయునులే
మాటలు రానికోయిలమ్మ పాడునులే
ఆనందంతో..అనురాగంతో
నా మది ఆడునులే.

29-1-2018

## ఆ చిరునవ్వు ఒక మనిషిది

**తెల్లవారు** జాము మూడున్నర. కృష్ణపక్షపు చివరిరాత్రులు. షిరిడీ క్షేత్రంలో ప్రాతకాల సంరంభం మొదలయ్యింది. ఎన్నో ఏళ్ళ తరువాత సూర్యోదయ పూర్వ హారతి చూడటం కోసం సమాధిమందిర ప్రాంగణంలో అడుగుపెట్టాను.

మరొక రెండురోజుల్లో ముగిసిపోతున్న మాఘమాసం. ప్రాంగణంలో అడుగు పెడుతూనే నా చిన్నప్పటి గ్రామాల నిర్మలత్వాన్ని తలపిస్తూ వేపపూల తీపిగాలి. ఫాల్గుణ మాసం రాబోతున్న సూచనగా విద్యుద్దీపాల వెలుతుర్లో మిలమిల్లాడుతున్న కొత్త చిగుర్లు. సమాధిమందిరం పక్కనే ఉండే గురుస్థానం దగ్గరికి చేరుకునేటప్పటికి తొలివేపపూల పరిమళం నన్ను తడిపేసింది.

అప్పటికే అక్కడకి కొందరు భక్తులు చేరుకున్నారు. వాళ్ళంతా ఆన్‌లైన్లో ముందే హారతిదర్శనం కోసం టికెట్లు తీసుకున్నవాళ్ళు. నేను మొదటిసారి 1993 లో షిరిడి దర్శించినప్పుడు, ఇంత రద్దీ లేదు. నేరుగానే సూర్యోదయహారతి దర్శనానికి పోగలిగాం.

నాలుగు కాగానే దేవస్థాన పౌరసంబంధాధికారి అక్కడకొచ్చి రిజిస్టరు తెరిచి ఒక్కొక్కరినీ పేరుపేరునా పిలవడం మొదలుపెట్టాడు. మా వంతు రాగానే మేం కూడా నెమ్మదిగా లోపలకి అడుగుపెట్టాం. సమాధిమందిరంలో మేం అడుగుపెట్టేటప్పటికే అక్కడ చాలామంది ముకుళితహస్తాలతో బాబాను చూస్తూ నిలబడి ఉన్నారు. ఆయనమీద ప్రకాశ వంతమైన లేతనీలం రంగు వస్త్రం. సమాధిపైన కూడా అదే రంగు చద్దరు పరిచి ఉన్నారు. గంగ ఒడ్డున సన్న్యాసులు సూర్యోదయం కోసం నిశ్శబ్దంగా వేచి ఉన్నట్టు అక్కడంతా ఒక పవిత్రప్రతీక్ష.

అప్పుడు గులాబితోటలోంచి కమ్మ తెమ్మెర వీచినట్టు భూపాల రాగంలో ఒక కీర్తన మొదలయ్యింది.

ఉఠా ఉఠా సకల జన..

నాలో ఏదో ప్రకంపన. ఏ పురాతన స్మృతిలోంచో, ఏ అడవుల్లోంచో, సాగరతీర సైకత భూమి మీంచో ఎవరో పిలుస్తున్నారు. నాది కాని ఏ దేశంలోనో, ఏ గ్రామసీమల్లోంచో నేను పోతున్నప్పుడు ఏ అపరిచిత గృహంలోంచో ఎవరో ఒక తల్లి, అక్క, చెల్లి, 'నాన్నా', 'అన్నయ్యా' అంటూ పిలుస్తున్నట్టు. మా ఊళ్ళో రామకోవెల దగ్గర రాత్రి దీపం పట్టుకుని నిలుచుని మా అమ్మ 'నాగమ్మా' అని పిలుస్తున్నట్టు.

ఉఠా ఉఠా సకల జన
వాచే స్మరావా గజానన
గౌరీహరాచా నందన
గజవదన గణపతి..

ఎవరు రాసారో తెలియని ఈ పారంపరిక గణేశస్తుతి నన్నెందుకు ఇంతలా చలింపచేస్తోంది?

ఆ కీర్తన ఎప్పుడు ముగిసిందో తెలియలేదు. అప్పుడు మరొక కీర్తన–

ఘనశ్యామ సుందరా శ్రీధరా అరుణోదయ ఝాలా
ఉఠిలవకారీ వనమాలీ ఉదయాచళీ మిత్ర ఆలా..

ఆ స్వరం, ఎవరో మరాఠీ భావుకుడు దేశ్ రాగంలో ఆలపించిన ఆ ప్రభాత వందనం నా సమస్త అసిత్వాన్నీ చూర్ణం చెయ్యడం మొదలుపెట్టింది.

ఇది భక్తికాదు, ప్రార్థనకాదు, జీవిత స్ఫురణ. పొద్దున్నే కొలనులో ఎర్ర తామర రేకులు విచ్చుకున్నంత మృదువుగా మనిషిలో ఆత్మ విప్పారడం. వేపచెట్టు లోపల్నుంచీ విరిగి పైకి తీపిగా పొంగి పూలుగా విచ్చుకోవడం.

నాలో కూడా ఏదో జరుగుతోందని తెలుస్తోంది. నా చేదు విరిగిపోవడం మొదలయ్యింది.

కాలం మలుపు తిరిగేవేళల్లో నేను పోగొట్టుకున్న ప్రేమల ఏ విహ్వాల స్ఫురణని ఈ తొలిజాము నాలో నిద్రలేపుతోంది? ఒక రోజు మేలుకోవాలని కోరుకునే ఈ కోరిక నా హృదయాన్ని, ఒక పిల్లగాలికి కూడా కుండపోతగా వర్షించే కారుమబ్బులాగా, ఎందుకు మార్చేస్తోంది?

ఆనందకందా ప్రభాత ఝాలీ ఉఠీ సరలీ రాతీ
కాఢీ ధార్ క్షీరపాత్ర ఘేవుని ధేను హంబరతి
లక్షితాతీ వాసురే హరీ ధేను స్తనపానాలా..

నా చిన్నప్పుడు సెలవులయిపోయాక మా ఇంటినుంచి బయటకి అడుగు పెడుతూ ఉన్నప్పుడు మా అమ్మ ఆ ఇంటిముంగట నిల్చున్నప్పుడు, లోపలనుంచీ పొరలివచ్చే బెంగలాగా, ఒక ఉత్తాపతరంగం నాలోపల్నుంచి కట్టలు తెంచుకోవడం మొదలయ్యింది.

ఉండబట్టలేకపోయాను, ఏడ్చేసాను.

అక్కడందరి దృష్టీ బాబా మంగళమూర్తిపైనే ఉంది. అసలక్కడ ఎవ్వరికీ మరొకరి ధ్యాస లేదు.

ఆ కీర్తన ముగుస్తూనే సుప్రసిద్ధ మంగళగీతం 'జయజగదీశ హరే' మొదలయి, పూర్తయిపోయింది కూడా.

నా కళ్ళట్లా వర్షిస్తూనే ఉన్నాయి. ఎవరో నా హృదయంలో చెయ్యిపెట్టి గుండెకి అడ్డుపడ్డ ఏ క్లేశాన్నో ఊడబెరికేసారు. ఎంత దయామయ చర్య!

అప్పుడు నేను ఆ ప్రభాతహారతి గీతాలు వినడానికి పూర్తిగా అర్హుణ్ణైనానిపించింది.

ఒక క్షణం నిశ్శబ్దం.

4.30.

కాకడ హారతి గీతాలాపన మొదలయ్యింది.

జోడునియా కర చరణి-ఠేవిలా మాథా
పరిసావీ వినంతీ మాఝీ-పండరీనాథా

తుకారాములు పాండురంగని ముందు పాడిన పాట. పదం ముగిస్తూ తుకా ఇలా అంటున్నాడు:

నేను ఎక్కణ్ణుంచి ఎంత విలువలేని మాటల్తో నిన్ను వేడుకున్నా కూడా ఒక్క సారి నిన్ను పేరుపెట్టి పిలవగానే నా బంధాల్ని నీ స్వహస్తాలో తుంచెయ్యి ప్రభూ!

ఎక్కడి పండరిపురం, ఎక్కడి షిరిడి బీద మరాట్వాడా ప్రాంతానికి షిరిడినే పండరిపురం చేసాడు సాయినాథుడు. ప్రతిరోజూ ఈ తుకారాం కీర్తనతో తన గ్రామాన్నీ, తనని నమ్ముకున్న బృందాన్నీ మేల్కొల్పడం ఎంత అద్భుతం!

ఆ కీర్తన ముగుస్తూనే జనాబాయి గీతం.

ఉఠా పాండురంగా ప్రభాత సమయో పాతలా
వైష్ణవ్యాంచా మేలా గరుడ పారీదాటలా

దేవుణ్ణి మేల్కొల్పడం ఎంత గొప్ప చారుచర్య! ఎవరు ఎవరిని మేల్కొల్పుతున్నారు? ఆండాళ్ నుంచి జనాబాయి దాకా ప్రభాత వేళ భగవంతుణ్ణి నిద్రలేపడంలో అనుభవించిన స్ఫూర్తి ఎట్లాంటిదో కదా!

ప్రజల్ని మేల్కొల్పిన వైతాళికులు, ఒక బంకిం, ఒక గురజాడ, ఒక భారతి, ఒక నజ్రుల్ ఇస్లాం , ఒక ఫైజ్, ఒక హిక్మత్, ఒక నెరుదా లు అనుభవించిన జీవితసాఫల్య స్ఫూర్తికీ, ఈ ప్రభాతకీర్తనలకీ ప్రాయికంగా తేడా ఏముంది?

షిరిడిలో వందేళ్ళ ముందు ఇంకా తెల్లవారకుండానే సాయిబాబాకి వెలిగించిన దివిటీల్తో హారతి ఇస్తూంటే పండితులు, పామరులు, నిరక్షరాస్యులైన గృహిణులు అంతా తన్మయులై ఆయన్నే చూస్తూ పరవశించిన దృశ్యం ఊహించుకోవడానికి ప్రయత్నించాను.

షిరిడిలో ఈ హారతి సంప్రదాయం ఎప్పుడు మొదలయ్యిందో ఇతమిత్థంగా చెప్పలేక పోయినా, ఒక అంచనా ప్రకారం ఇది 1910 తర్వాత మొదలై, బాబా మహాసమాధి చెందేటంతదాకా, అంటే, 1918 దాకా ఎనిమిదేళ్ళపాటు నిరాఘాటంగా కొనసాగింది.

కాని కాకడ హారతి, రాత్రి పడుకునే ముందే ఇచ్చే సేజ్ ఆరతిని ఆయన మసీదులో పడుకునే రోజు కాక, రోజు విడిచి రోజు చావడిలో పడుకునేటప్పుడు మాత్రమే అనుమతించే వారట. ఎందుకని? మేలుకొలుపు, పవళింపు హారతులు సేవలు కాబట్టి, అవి హిందూ సంప్రదాయాలు కాబట్టి, ఆయన వాటిని మసీదులో అనుమతించలేదు. చావడిలో మాత్రమే అనుమతించారు.

అద్భుతమైన ఈ స్పష్టతని సాయిబాబా తన జీవితమంతా చిన్న విషయం నుంచి పెద్ద విషయం దాకా ప్రతి ఒక్క అంశంలోనూ చూపిస్తూ వచ్చారు, జాగ్రత్త పడుతూ వచ్చారు.

సాయిబాబా హిందువా? ముస్లిమా? ఇందులో నిజమేదో తెలుసుకోవాలన్న తన సమకాలిక ప్రజల కుతూహలాన్ని ఆయన ఎప్పటికప్పుడు ఎంతో దయార్ద్రహృదయంతో ధ్వంసం చేస్తూనే వచ్చారు.

హిందూ-మహ్మదీయ మైత్రికోసమూ, వాళ్ళని కలిపి ఒక కుటుంబంగా నిలపడం కోసమూ సాయిబాబా జీవించారని చెప్పడం ఆయన్ని అర్థం చేసుకోవడంలో ఒక పద్ధతి. ఆయన హిందువులకు హిందువు, మహ్మదీయులకు ముస్లిం అని చెప్పుకోవడంలో ఒక ఊరట ఉంది. కాని సాయిబాబా తనను హిందువుగా భావించేవాళ్ళకు ముస్లింగానూ, ముస్లింగా భావించేవాళ్ళకు హిందువుగానూ కనిపిస్తూ, వినిపిస్తూ, వివరిస్తూ వచ్చారు.

మీ గురువెవరని ముస్లిములు అడిగినప్పుడు వెంకూసా అని, హిందువులు అడిగి నప్పుడు రోషన్ షా అని జవాబిచ్చారాయన. ఒకరోజు మసీదులో, ఒక రోజు చావడిలో. ఒకవైపు నైష్ఠిక శ్రోత్రియుడిలాగా మసీదులో నిత్యాగ్నిహోత్రం, మరొకవైపు ముస్లిం ఫకీరు లాగా చావడిలో చిలిం వెలిగిస్తూ వచ్చారు. చివరికి, తాను ప్రతిపాదించిన రెండు మాటలు- 'శ్రద్ధ', 'సబూరీ' లే చూడండి. 'శ్రద్ధ' సంస్కృత పదం, ఉపనిషత్తుల పదం. 'సబూరీ' ఆరబిక్ పదం. అది సబర్ అనే ధాతువునుంచి ఉత్పన్నమైంది. ఓపిక, నిగ్రహం, కట్టుబడి ఉండటం అని దానికి అర్థాలు.

నా ఇంటికి తూర్పు ఒక వాకిలి, పడమట మరొక వాకిలి అని కబీరు అన్నమాటలకి నిలువెత్తు ఉదాహరణ సాయిబాబా. అందుకనే, ఒక న్యాయవిచారణలో భాగంగా కోర్టు ప్రతినిధి ఆయన్ను మీ మతమేమిటి అని అడిగినప్పుడు తనది కబీరు మతం అని చెప్పాడాయన.

నా ఆలోచనల్లో నేనుండగానే ప్రభాతకీర్తనలు ఒకదానివెనక ఒకటి సాగిపోతున్నాయి. కృష్ణ జోగేశ్వర్ భీష్మ, నామదేవులు,తుకారామ మహరాజు, దాసగణు మొదలైన వారందరి ప్రేమతో, ఆర్తితో, హృదయాన్ని చీల్చుకుని వచ్చిన గీతాలతో ఆ మందిరమంతా మోగిపోతూ ఉంది. సంగీతవాద్యాల సుస్వరాలు ఉత్సవవాతావరణాన్ని సృష్టించాయి. ఆ వెలుతురులో ఒకటి రెండు సార్లు కన్నార్పకుండా బాబా మనోహరమూర్తిని చూసాను.

లోకమాన్య బాలగంగాధర తిలక్ మిత్రుడూ, సుప్రసిద్ధ న్యాయవాదీ అయిన జి.ఎస్.కపర్దే ఒకచోట రాసుకున్న వాక్యాలు గుర్తొచ్చాయి. ఒక ప్రభాతవేళ తాను కాకడ హారతికి హాజరైనప్పుడు సాయిబాబా ఎంతో ప్రసన్నంగా చిరునవ్వు నవ్వారనీ, అట్లాంటి

చిరునవ్వును ఒక్కసారి చూడటానికేనా ఏళ్ళతరబడి అక్కడ ఉండిపోవచ్చునని రాసుకున్నాడాయన (షిరిడీ డైరీ, 7.1.1912).

ఆ చిరునవ్వు ఒక మనిషిది. హిందువు, ముస్లిమూ కాని మనిషిది. దేశమిప్పుడు హిందూ సమాజంగానూ, ముస్లిం శిబిరంగానూ చీలిపోతున్న కాలంలో ఏడీ అట్లాంటి మనిషి? ఎక్కడ అట్లాంటి చిరునవ్వు?

12-3-2016

# జీవితసాఫల్యసందర్శనం

**మొన్న** నిర్మల తాను జయతిని చూడటానికి వెళ్తున్నానని నన్ను కూడా రమ్మంటే వెళ్ళాను. జయతి, లోహితాక్షన్‌లు ఇబ్రహీంపట్నంలో ఉంటున్నామనీ, ఎప్పుడేనా ఒకసారి వచ్చి వెళ్ళమని అడిగి ఏడాది పైనే అయిపోయింది. కాని, వెళ్ళలేకపోయాను. ఎందుకంటే ఏమి చెప్పను? ఆ సాధువులదగ్గరికి వెళ్ళినప్పుడు నా కూడా ప్రపంచపు దుమ్మునీ, గడబిడనీ తీసుకుపోతానేమోనన్న సంకోచం కావచ్చు.

ఒకప్పుడు జపనీయ హైకూ కవీశ్వరుడు, జెన్ బౌద్ధుడు మత్సువొ బషో రాసుకున్న కొన్ని డైరీల్నీ, యాత్రాకథనాల్ని నేను అనువదించాను. అందులో ఒక చోట ఆయనిలా రాసుకున్నాడు:

> ఎవరైనా నిన్ను చూడటానికి వచ్చారా, ఊసుపోకమాటలు సాగుతాయి. నేను ఎవరినైనా చూడటానికి వెళ్ళానా? వాళ్ళ పని పాడుచేస్తున్నానేమో అనిపిస్తుంది.

తన కారు అమ్మేసుకుని హిమాలయాల్లో సంచరించిన ఒక సాధువు గురించి ఒకాయన పుస్తకం రాస్తే ముప్ఫై లక్షల కాపీలు అమ్ముడుపోయింది. అది కథ. కాని జయతి నిజమైన మాంక్ అని ఎందరికి తెలుసు?

ఇబ్రహీంపట్నం దాటిన తరువాత ఊరు పొలిమేరలకి ఆవల ఒక ప్రశాంత గురుకుల ప్రాంగణంలో ఒక మునివాటికలాంటి కుటీరం. ఆ ఇంటిని చూస్తూనే నాకు బషో అరటిచెట్ల కుటీరం గుర్తొచ్చింది. ఆయనిట్లా రాసుకున్నాడు:

> నేను కూడా పట్టణ జీవితం పదేళ్ళ కిందటే వదిలిపెట్టేసాను. ఇప్పుడు నా వయసు దాదాపు ఏభై ఏళ్ళు. ఒక రకంగా నేను వేరువదిలిపెట్టిన వేరుపురుగు వంటివాణ్ణి. గుల్లవదలిపెట్టిన నత్తని. ఉత్తరదేశపు లోతట్టు భూముల్లో,

కిసకతలో మండే ఎండల్లో నా దేహాన్ని మాడ్చుకున్నవాణ్ణి. ఉత్తరసముద్ర తీరపు ఇసుకనేలల్లో పాదాలు అరిగిపోయేలా నడిచినవాణ్ణి. ఒకేఒక్క రెల్లుకొమ్మ నీడన ఊగిసలాడే, గూటికి చేరుకున్న తోకలేని పిట్టలాగ, నేనీ కుటీరం చూరు మళ్ళా సరిచేసి తిరిగి కంచె కట్టుకున్నాను.

బషోకి కూడా అతడి ముందు తావో యువాన్ మింగ్, సోగి, సైగ్యో వంటి కవులూ, సౌందర్యారాధకులూ నమూనాలుగా ఉన్నారు. తావో యువాన్ మింగ్ తన ఇంటికి తూర్పువేపున చామంతులు నాటుకున్నాడనీ, వాంగ్ షి యు ఇంటికి ఉత్తరం వేపున వెదురుపొదలున్నాయనీ, ఒక విల్లోకొమ్మను చూడటానికి సైగ్యో కాలినడకన ఉత్తర జపాన్ పర్యటించాడనీ బషోకి తెలుసు. కాని ఈమె ఏ కవుల్ని, ఏ పరివ్రాజకుల్ని నమూనాగా పెట్టుకుని ఈ దీక్షకు పూనుకున్నది?

అక్కడ అడుగుపెట్టిన క్షణమే అదొక ప్రగాఢమౌనప్రాంగణమని నాకు అర్థమయ్యింది. కొన్ని స్థలాల్లో అడుగుపెట్టగానే నీకు మరేమీ చెయ్యాలనిపించదు. ఒక అలౌకిక ప్రశాంతి నిన్ను ఆవరిస్తుంది. మరేమీ కావాలనిపించదు. మాట్లాడాలని కూడా అనిపించదు. అటువంటి నిశ్శబ్దమేదో అక్కడ పరుచుకుని ఉండి ఉంటుందని నాలోపల్లోపల ఏదో నమ్మకం ఉండి ఉండాలి. అది నిజమయ్యింది.

వెళ్ళాక కొంత సేపు కుశలప్రశ్నలు. ఆ తర్వాత, ఆమె రాసిన యాత్రానుభవాల్ని పుస్తకంగా తీసుకురావడం గురించి మాట్లాడుకున్నాం. ఆ పుస్తకానికి కవరుపేజి మీద ఏ ఫొటో పెడితే బాగుంటుందా అని ఆమె తీసిన ఫోటోలన్నీ చూసాం. అపారమైన వెలుతురు, దట్టమైన నీడలు, అపరాహ్ణాల్లో అడవులమీదా, కొండలమీదా పరుచుకునే ఎండపొడ, సీతాకోకచిలుకలు, సాలీళ్ళు, గొంగళిపురుగులు, భగవత్ సృష్టిలోని మహాసౌందర్యశకలాలైన ఎన్నో కీటకాలు–వాటినట్లా చూస్తూ ఉంటే నా హృదయం నా చిన్నప్పటి అడవిబాటల్లోకి పరుగులు పెట్టింది.

అన్నం తిన్నాక అడవిలో అడుగుపెట్టాం. ఆ ఇంటిని ఆనుకుని వెనకంతా రిజర్వు ఫారెస్టు. యూకలిప్టస్ తోటలూ, కూరగాయల మళ్ళూ దాటి అడవి వైపు అడుగు లేస్తూండగానే ఒక పక్షి అరుచుకుంటూ మమ్మల్ని దాటి వెళ్ళిపోయింది. అదేమిటి అనడిగాను.

'బేబ్లర్' అందామె. తెలుగు పదం కోసం వెతుక్కుంటూ ఉంది. కాని వాగుడుకాయ లాగా అరుచుకుంటూ పోతున్న ఆ పిట్టకి మరోపేరు అవసరంలేదనిపించింది.

'ఇక్కడొక చెట్టు చూపించాలి మీకు' అన్నదామె. ఆ దారిన అడవి అంచుల్లో అడుగు పెట్టామో లేదో ఆకాశంలో మరో రెండు పిట్టలు గట్టిగా అరవడం మొదలుపెట్టాయి. అవేమిటి అనడిగాను.

'తీతువులు' అందామె.

'మనం వాటి ప్రాంతంలో అడుగుపెట్టాం. ఊరిపొలిమేరల్లోనూ, చెరువులదగ్గరా, అడవి అంచుల్లోనూ ఉంటాయవి. వాటి పరిధిలోకి కొత్త మనిషి ప్రవేశిస్తే చాలు అరుస్తాయి. తక్కిన పశుపక్షి ప్రపంచాన్ని నిద్దరలేపేస్తాయి. తీతువు అరిస్తే అపశకునమని అనుకుంటారు పల్లెల్లో. కాని, ఆ అరుపులు నిజానికి హెచ్చరికలు. మనసమాజానికి కాదు, వాటి సమాజానికి. చూడండి, మనం ఉన్నంతసేపూ ఇవి మన నెత్తిపైనే గిరికీలు కొడుతుంటాయి' అన్నదామె.

ఆ అడవిలో ఒక చెట్టు దగ్గరకు తీసుకువెళ్ళిందామె. దాన్ని చిన్నప్పుడే ఎదగ నివ్వకుండా ఎవరో నరికేసారు. ఆ తర్వాత దానిగురించి మర్చిపోయారు. మామూలుగా ఎదిగి ఉంటే ఎలా పెరిగిఉండేదోగాని, చిన్నప్పుడే తగిలిన గాయం దానిలోని జీవశక్తిని నాలుగు వేపులా వికసింపచేసింది. చాచిన అరచేతిలాగా అయిదు వేపులా దాని కాండాలు. ఆ చెట్టుని స్పృశించాలనిపించింది. అక్కడే చాలాసేపు కూచునిపోయాం. మా పైన ఆకాశాన్నీ, అడవినీ కూడా ఆ తీతువులు నిద్రలేపేసాయేమో అడవిలో ఏవేవో పక్షులు, కీచురాళ్ళు, బహుశా చెట్లకొమ్మలు కూడా మాట్లాడటం మొదలుపెట్టాయి. ఆ చప్పుళ్ళవల్ల అడవి నిశ్శబ్దం మరింత చిక్కబడుతూ ఉంది.

నాకు పదే పదే బషో గుర్తువస్తూ ఉన్నాడు. ఆయన ఇట్లాంటిదే ఒక స్థలం గురించి ఇలా రాసుకున్నాడు:

> వసంతం సెలవు తీసుకుని మరీ ఆట్టే కాలం గడవలేదు. తెల్లసంపెంగ పూవులింకా వికసిస్తూనే ఉన్నాయి. కొండలమీద పూసే నీలిలతలు పైన్ చెట్లకి వేలాడుతున్నాయి. అప్పుడప్పుడూ ఒక కోకిల ఎగురుతూ కనవస్తున్నది. నీలిరెక్కల బూడిదరంగుపిట్టలేవేవో వార్తలు మోసుకొస్తున్నాయి. చివరికి అడవిలో వడ్రంగిపిట్ట చేసే చప్పుడు కూడా చిరాకు తెప్పించకపోగా ఆహ్లాద భరితంగానే ఉంది. ఇక్కడ దగ్గరలో ఉన్న గ్రామం చుట్టూ దట్టంగా అల్లుకున్న చెట్లనీడల్నీ, కాలువగట్టున చేపలు పట్టేవాళ్ళనీ చూస్తుంటే అదంతా ప్రాచీన కవితాసంకలనం 'మన్యోషూ'లో వర్ణించినట్టే కనబడుతున్నది. ..నేనింతాచేసి

కొండలంటే ఇష్టపడే ఓ సోమరిని మాత్రమే. ఎత్తైన కొండకొమ్ము మీద కాళ్ళు బారజాపుకుని పేలుకుక్కుకునేవాణ్ణి మాత్రమే.

అక్కడ ఆ అడవిలో, ఆ చిన్ని గుట్టమీద, నాలుగువేపులా కాండాలు చాపుకున్న ఆ చెట్టు ఏగిశమానో, బండారుచెట్టో దాని నీడన కూచున్నప్పుడు, నన్ను కూడా ఒక సోమరితనం పూర్తిగా ఆవహించింది.

నాకు ఫొటోలు ఎలా తియ్యాలో నేర్పమని అడగటానికి డి.ఎస్.ఎల్.ఆర్ పట్టుకెళ్ళాను. కెమేరా ఎలా పట్టుకోవాలో, వెలుగు ఎట్లా సరిచూసుకోవాలో, ఆమె నాకు కొంత పాఠం చెప్పకపోలేదుగానీ, జీవజాలాన్ని ఆమె చూసినట్టు నేను చూడాలంటే ఒక్కరోజు సరిపోతుందా? మాతో మాట్లాడుతూనే ఆమె మా ఎదట ఉన్న గడ్డిపువ్వుల్ని ఫొటో తీసింది. ఆ పూల ఫొటో చూసాను. 'తన సమస్త వైభవంతో కూడిన సొలోమోను చక్రవర్తి కూడా అంత అందంగా అలకంరించబడలేదని' ప్రభువు ఎందుకన్నాడో అర్థమయ్యింది.

ఆకాశమంతా మబ్బులు కమ్ముకున్నాయి. ఒకటి రెండు చినుకులు పడటం మొదలయ్యింది. మేం లేచి ఇంటిబాటపట్టాం. మేం అడవి సరిహద్దుదాటగానే అప్పటిదాకా పైలటు పోలీసుల సైరన్లలాగా మోగుతున్న తీతువుల అరుపులు ఒక్కసారిగా ఆగిపోయేయి. ఆ నిశ్శబ్దంలో మాకప్పటిదాకా వినబడని నెమళ్ళ క్రేంకారాలు వినబడటం మొదలయ్యింది. ఆ దారిన వస్తూ ఉండగా ఆమె చెముడుకాకుల్నీ, ఏట్రింతల్నీ, డేగల్నీ, మొత్తం పక్షిప్రపంచాన్ని మాకు చూపిస్తూ ఉంది.

ఆమె ఇంటిపక్కన పెద్ద జామతోట. ఆ యజమానులు దాన్ని ఈ ఏడాది వేలం వెయ్యకుండా వదిలిపెట్టేసారట. పళ్ళు చెట్లమీదనే ముగ్గి రాలిపోతున్నాయి. కిందంతా అడవిలాగా పెరిగిన గడ్డి. ఆ తోటలో తిరుగాడేం. ఆ పళ్ళు తినడం కన్నా, చెట్టుకొమ్మల మీద ముగ్గిపోయిన, చిలుకలు సగం తినేసి వదిలిపెట్టిన ఆ పండ్లని చూస్తుంటే చెప్పలేని ఏదో సంతోషం. జీవితసాఫల్యసందర్శనం.

సాయంకాలమైంది. వెచ్చని తేనీరు. మేమెలానూ వెనక్కి రాక తప్పదు. మేము వచ్చేసిన తర్వాత, ఆ కుటీరంలో ఆమె ఒక్కతే ఎలా ఉంటుందో కదా అనిపించింది. మళ్ళా బషో గుర్తొచ్చాడు. ఆయనిట్లా రాసుకున్నాడు:

దూరంగా పర్వతం మీంచి సూర్యుడు దిగిపోతూ ఉన్నప్పుడు నేనా సాయం సంధ్యవేళలో చంద్రోదయం కోసం ప్రశాంతంగా ఎదురుచూస్తుంటాను. నా

నీడ ఒక్కటే నాకు తోడుగా నిలిచి ఉంటుంది. దీపం వెలిగిస్తాను. దీపకాంతివల్ల ఏర్పడ్డ ఛాయా ప్రచ్ఛాయలను చూస్తూ సదసద్విచారం కొనసాగిస్తుంటాను..

ఆమె జీవితం నుంచి నువ్వే సందేశం గ్రహించావు? బషో కవిత్వం నుంచి ఏ సందేశం గ్రహించానో అదే. బషో రాసుకున్నాడు:

నా కవిత్వం వేసవిలో నెగడులాంటిది, చలికాలంలో విసనకర్రలాంటిది. వ్యావహారిక అభిరుచికి వ్యతిరేకదిశలో సాగుతుందది. లోకం దృష్టిలో చూస్తే దానికెట్లాంటి ప్రయోజనం లేదు..

కాని అట్లాంటి కవిత్వాలకీ, అటువంటి జీవితాలకీ ఉన్న ప్రయోజనం అదే. అవి మనల్ని లోకం దృష్టిలో కూరుకుపోకుండా బయటపడేస్తాయి. నువ్వు నీ సంతోషానికి నీ చుట్టూ ఉన్నవాళ్ళ ఆమోదం కోసం వెంపర్లాడకుండా కాపాడతాయి.

మేం సెలవుతీసుకున్నాం. 'ఈసారి రెండు రోజులుండేటట్టు రండి' అన్నదామె. సన్నగా పడుతున్న చినుకులమధ్య ఆ ప్రాంగణం వదిలిపెట్టాం. అక్కణ్ణుంచి కాలినడకన, షేర్ ఆటోల్లో, సిటీబస్సులమీద, మళ్ళా ఆటోల్లో ఇంటికి వచ్చేటప్పటికి బాగా పొద్దు పోయింది.

'బాగా స్ట్రెయిన్ అయ్యారా' అని వాట్సప్ మెసేజి, మర్నాడు పొద్దున్న నిర్మల నుంచి.

'లేదు, బాగా నిద్రపోయాను' అని జవాబిచ్చాను. అంత ప్రగాఢనిశ్శబ్దం నా వెంటతెచ్చుకున్నాను మరి.

24-7-2018

# ఫాల్గుణచంద్రుడు నిలువెల్లా తేనె

**నిన్న** ఫాల్గుణపూర్ణిమ. సంవత్సరం మొత్తంలో ఇంత మోహవిస్మయకారకమైన వెన్నెలరాత్రి మరొకటుండదు. వసంతఋతువంటే చైత్రంతో మొదలవుతుందనుకుంటారు. కాదు, వసంతాగమన సంతోషంతో ఫాల్గుణం ప్రతి దినం, ప్రతి రాత్రీ పరవశిస్తూ ఉంటుంది. ఆ రహస్యం తెలిసినవాడు కాబట్టే రవీంద్రుడు చైత్రమాసంలో కన్నా ఫాల్గుణంలోనే ఎక్కువ పాటలు కట్టాడు.

ఫాల్గుణచంద్రుడు నా చిన్ననాట మా ఊళ్ళో కొండ మీద అతిథి. కొండ మీది అడవిలోంచి ఊరంతా గుప్పున సాంబ్రాణిధూపం జల్లేవాడు. నిన్నంతా నా మనసు ఒకటే కొట్టుకుపోతూ ఉంది, ఆ అతిథిని ఎక్కడ చూడటమా, ఎక్కడ కలుసుకోటమా అని. చివరికి, ఈ పట్టణానికి దూరంగా నది ఒడ్డున సంకేతస్థలం నిర్ణయించుకున్నాను. మా గురవయ్యని అడిగితే అతడెవరితోటో మాట్లాడి తాళాయపాలెం లంక దగ్గర నేను చంద్రుణ్ణి కలుసుకోడానికి ఏర్పాట్లు చేసాడు.

ఆఫీసైపోగానే నా రూముకి కూడా పోబుద్ధి కాలేదు. చంద్రసందర్శనమంటే, చంద్రోదయవేళనుంచే కదా మొదలయ్యేది. వడివడిగా ఆ పల్లెటూరి మట్టిబాట పట్టాం. మేమక్కడ అడుగుపెట్టేటప్పటికే దూరంగా ఉండవల్లి గుహల మీంచి కొండమీద అతిథి ఆకాశంలో అడుగుపెట్టాడు. పగటిపూట హడావిడిగా కనిపించే కొత్త రాజధాని ప్రాంతమంతా, ఆ వెన్నెల్లో, ఒక అస్పష్టమైన ఊహగా మారిపోయింది. కరకట్ట మీంచి మందడం దాటి తాళాయపాలెం ఊరు దాటి శివాలయం దగ్గరకు చేరుకునేటప్పటికి చంద్రుడి రాకతో నింగీ నేలా కూడా పొంగిపోతూ ఉన్నాయి.

అక్కడొక రేవు. పుష్కరాలకి కట్టిన పొడవైన స్నానఘట్టం. కాని నిర్జనం. నిశ్శబ్దదేవతలు మాత్రమే విహరించే ఆ తావులో మా కోసమొక నావ ఎదురుచూస్తూ ఉంది.

నీ కోసమొక పడవ ఎదురుచూస్తున్నదని తెలియడంలో మాటల్లో పెట్టలేని స్ఫూర్తి ఏదో ఉన్నది. మరుక్షణంలో నువ్వు ఈ తీరాన్ని వదిలిపెట్టగలవని తెలియడంలో గొప్ప విమోచన ఉన్నది. నెమ్మదిగా గట్టు దిగి మా కోసం ఆ పడవని నీళ్ళలోకి వదులుతున్న ఆ పడవమనిషి నాకొక తీర్థంకరుడిలాగా కనిపించాడు.

పడవ ఎక్కాను. 'మీరు సాయంకాలం వచ్చి ఉండవలసింది. ఇప్పుడంతా వలలు వేసేసారు. మరీ లోపలకి పోవడం కష్టమవుతుంది' అన్నాడు అతడు. కాని నేను చూడాలనుకున్నది నదిని కాదు, నది ఒడ్డున నా ప్రియమిత్రుణ్ణి. 'సంకేత సమయమిదే, ఒక గంట కూడా ముందుకు జరపలేనే' అనుకున్నాను. 'పర్వాలేదు. ఎంత దూరం పోగలిగితే అంత దూరమే తీసుకువెళ్ళండి' అన్నాను.

అతడు ఇంజను తిప్పాడు. పడవ సత్రున ముందుకు సాగింది. దూరంగా కొండపల్లి థర్మల్ విద్యుత్ కేంద్రం వెలుగులు. ఇస్మాయిల్‌గారు నాతో వచ్చి ఉంటే దాన్నో వింత కీటకమని ఉండేవారు. నీళ్ళల్లో కొంత ముందుకు వెళ్ళాక, ఆ ఇంజను ఆపేస్తే ఏమైనా ఇబ్బంది ఉంటుందా అనడిగాను. ఏమీ ఉండదన్నాడు. నా మిత్రుడితో చేసే రహస్య సంభాషణకి ఆ చప్పుడు అడ్డంగా ఉంది. ఆపేసాడు. ఇప్పుడు కొండపల్లి కర్మాగారం కూడా కనిపించకుండా ఒక లంక అడ్డుగా నిలబడింది. చూసినంతమేరా సుగంధంలాంటి వెన్నెల తప్ప మరేమీ ప్రవహించడం లేదు. సన్నని చిరుతరగలమీద ఆ నావ ఊయెలలాగా ఊగడం మొదలుపెట్టింది. చిన్ని చిన్ని నీటి అలలు ఆ నావ చర్మం మీద ఘటవాద్యకారుడి అంగుళుల్లాగా సంగీతం వినిపించడం మొదలుపెట్టాయి. నిజమైన నౌకాయానం మొదలయ్యింది.

అప్పుడు చంద్రుడు నా చుబుకం పట్టుకుని నా ముఖాన్ని తనవైపు తిప్పుకున్నాడు. కొందరికి కళ్ళల్లో తేనె కురుస్తుంది. కొందరికి పెదాల్లో. కొందరికి మాటల్లో. కాని, ఫాల్గుణచంద్రుడు నిలువెల్లా తేనె.

ఆ క్షణాన ఒక్కసారిగా నాకు చెప్పలేనంత నిస్సత్తువ ఆవహించింది. ఒళ్ళంతా అలసటగా తోచింది. ఇదేమిటిది అనుకున్నాను. మరుక్షణంలో అర్థమయింది. అలసట పెట్టే ఒక రోజు గడిచాక, సాయంకాలం గోరువెచ్చని స్నానం చేసినప్పుడు కలుగుతుందే అట్లాంటి అలసట అన్నమాట! అలసట మొత్తం ఒక్కసారిగా వంట్లోంచి కరిగిపోయినప్పుడు కలిగే అపారమైన అలసట అన్నమాట. నాకు ఎప్పుడో మా మాష్టారు చెప్పిన మాట గుర్తొచ్చింది.

సుందరకాండలో లంకా నగరం మీద చంద్రోదయాన్ని వర్ణిస్తూ కవి 'లోకస్య పాపాని వినాశయన్తమ్' అన్నాడట. 'లోకంలోని పాపాన్నంతటినీ కడిగేస్తున్నట్టుగా చంద్రుడు ఉదయిస్తున్నాడని చెబుతూ 'పాపమంటే ఏమిటయ్యా! అలసట కాదూ!' అన్నాడాయన. అందుకనే 'జ్యోత్స్నా వితానమ్ మహదుద్వమన్తమ్'– వెన్నెల వింజామరతో ఆకసంలో అడుగుపెట్టాడు చంద్రుడంటాడు కవి.

వాల్మీకి తర్వాత ఎందరు కవులు ప్రభవించారు, ఎన్ని కావ్యాలు ప్రభవించాయి. కాని మరే కవీ అటువంటి చంద్రదర్శన భాగ్యానికి నోచుకోలేదు. ఆయన వర్ణించింది శరత్కాలచంద్రుడే కావచ్చుగాక, కాని, ప్రతి చంద్రోదయంలోనూ ఆ చంద్రుడే తలపుకొస్తాడు నాకు. కొండగుహలో సేదదీరుతున్న సింహంలాగా, బలించిన ఏనుగు మీద ఎక్కి మదిస్తున్న వీరుడిలాగా, పొదరింటిలో పరవశిస్తున్న హంసలాగా ఉన్నాడు చంద్రుడంటాడు. రాజ్యం దొరికిన రాజులాగా, రణం దొరికిన గజేంద్రుడిలాగా, కొట్టంలో మదించి తిరుగుతున్న ఆంబోతులాగా ఉన్నాడు చంద్రుడంటాడు.

కవి వర్ణించిన వెన్నెల నగరం మీది వెన్నెల. నిద్రపోతున్న నగరం మీది వెన్నెల. ఇంకా చెప్పాలంటే నిద్రపోతున్న రాక్షసనగరం మీది వెన్నెల. గొప్ప కవిత్వాలు, సంగీతాలు కూడా రాక్షసనగరాల మీద రాలుతున్న వెన్నెలలే కదా. 'నడిరాతిరి మేలుకున్నవారికి' తప్ప మరెవరికీ పట్టని వెన్నెలలు, మరెవరికీ గోచరించని వెన్నెలలు కూడా.

అట్లా ఎంత సేపు ఆ చంద్రుణ్ణే చూస్తూ కూచున్నానో. 'మీరు వెనక్కి ఎప్పుడు వెళ్ళిపోదామంటే అప్పుడు వెళ్ళిపోదాం' అన్నాను ఆ పడవమనిషితో. 'పర్వాలేదు. మీకు నచ్చినంతసేపు కూచోండి' అన్నాడతడు. అతడొక రైతు. ఆ లంకలో అతడికి పొలముంది. కూరగాయలు పండిస్తాడట. తన పొలానికి పోయిరావడం కోసం ఆ పడవ కొనుక్కున్నాడట.

చంద్రుడికోసం, వెన్నెలకోసం బెంగపెట్టుకునే కవులూ, రచయితలూ, గాయకులూ మనకి అట్టే కనిపించరు. కానీ ప్రాచీన చీనాకవులు, జపాన్ కవులు చంద్రుడికోసం ఒకటే తపించిపోయారు. వెన్నెలరాత్రి మీద కనీసం ఒక్క కవితేనా చెప్పని చీనాకవి ఒకరు కూడా కనిపించరు. ప్రాచీనచీనాలో స్వగృహానికీ, స్వజనానికీ దూరంగా జీవించ వలసి వచ్చిన ప్రతి ఒక్కరూ చంద్రుణ్ణి చూస్తూ, ఆ వేళప్పుడు, తమ ఊళ్ళో తమవాళ్ళు కూడా ఆ చంద్రుణ్ణే చూస్తూంటారని తలుచుకుని, ఆ చంద్రుడిలోనే తమ స్వజనాన్ని కూడా చూసుకునేవారట. ఇప్పుడు వాట్సపు, స్కైపుల కాలం. నువ్వెవరిని చూడాలనుకున్నా ఒక్క బటను పుష్ చేస్తే చాలు. కాని, ఆ చిన్నితెరమీద నువ్వు మనిషి ముఖమైతే చూడగలవు గాని, ఆ భావోద్వేగం ఎక్కడ అనుభవించగలవు?

ఆ పడవ మీద అట్లానే మరికొంతసేపు కూచున్నాక, అప్పుడు చూసాను, ఆ నీళ్ళమీద వరసగా పరిచిన జిలుగు తెప్పలు. ఆ తెప్పలు ఆకాశదేశందాకా వంతెన కట్టిన తాటి దూలాల్లాగా ఉన్నాయి. పడవ దిగి ఆ జిలుగుతెప్పలమీద అడుగుపెట్టాలన్న కోరికనెట్లానో నిగ్రహించుకోగలిగాను. కాని, ఒకప్పుడు, ప్రాచీన చీనా కవీంద్రుడు లి-బాయి ఆ కోరికని ఆపుకోలేకపోయాడు. ఇట్లానే ఒక వెన్నెలరాత్రి పడవమీద చంద్రుడితో సంభాషిస్తో, నీళ్ళల్లో కనబడుతున్న చంద్రుణ్ణి కావిలించుకోవాలని ఆ నీళ్ళల్లోకి జారిపోయాడు.

చంద్రుడితో అతడు చేసిన ప్రతి ఒక్క సంభాషణా మహామధుర సంభాషణ. మరీ ముఖ్యంగా, ఈ కవిత:

**విరబూసిన పూల నడుమ**

విరబూసిన పూల నడుమ, ఒక మధుకలశం.
మరొకరు తోడు లేక, నేనొక్కణ్ణే పానపాత్ర నింపుకున్నాను

ఆ పాత్ర చూపిస్తూ చంద్రుణ్ణి ఆహ్వానించాను.
నా వెనక నా నీడ. ముగ్గురమయ్యాం.

నేనింతలా తాగుతానని చంద్రుడికి తెలీదు
నా నీడంటారా, నేనెటు నడిస్తే అదీ అటే.

ఆట్టే సమయంలేదు, వాసంతసంతోషం పొదివిపట్టుకోడానికి
సత్వరం నా నీడతో, చంద్రుడితో చెలిమి మొదలెట్టాను.

ఇంత సుకుమారగీతి ఎలుగెత్తగానే తలూపుతూ చంద్రుడు
నేను నాట్యం మొదలెట్టానో లేదో తూగాడుతూ నా నీడ.

మధువు సాక్షిగా మేము మహానందం పంచుకున్నాం
మత్తెక్కగానే ఎవరిదారిన వారు విడిపోయాం.

మా స్నేహం ఈ ప్రపంచానిది కాదని తెలిసిపోయింది
కాబట్టి మేమీసారి పాలపుంతలో కలుసుకుంటాం.

చంద్రుడితో స్నేహం చేసినవాళ్ళకి మాత్రమే తెలుస్తుంది ఆ మాట. పాలపుంతలో కలిసే రోజు మరో జన్మలోనే కానక్కర్లేదు. కనీసం కొన్ని గంటలేనా నువ్వీ లోకానికి

దూరంగా జరగ్గలిగితే చాలు, పాలపుంతలో ఒక తెప్ప వేసుకుని నీ మిత్రుడు నీ కోసం ఎదురుచూస్తూ ఉంటాడు.

మరికొంతసేపు గడిచింది. దూరంగా పల్లెలో క్రైస్తవగీతాలు పూర్వకాలపు రామాయణం పాటల్లాగా వినబడుతున్నాయి. ఆ కూనిరాగాలతో నిశ్శబ్దం మరీ చిక్కబడు తున్నది. అప్పుడు చూసాన్నేను. ఆ పడవ మీద ఒక నిచ్చెన వేసారనీ. నేనప్పటికే నిచ్చెన సగం దాకా ఎక్కేసాననీ. అక్కణ్ణుంచి మరి నాలుగు మెట్లు కిందకి దిగడమా లేక మరి నాలుగు మెట్లు పైకెక్కడమా?

కింద నీళ్ళల్లో పన్నిన వలల్లో ఒకటొకటీ చేపలు వచ్చి పడుతుండొచ్చు. కాని పైన నదిమీద పన్నిన వలలో నేను పూర్తిగా ఇరుక్కున్నాను.

ప్రతి కలా ముగిసినట్టే మా కలయికా ముగిసింది. రాత్రి ఇంటికొచ్చాక, నిద్రలో ఒక కల. నా ముందు మట్టిలో ఆల్చిప్పలాగా చంద్రుడు. ఆ మట్టి ఒకటే తవ్వుతున్నానట, ఆ ఆల్చిప్పను పైకి లాగాలని.

ఆల్చిప్ప చేతికి చిక్కలేదుగాని, ఒక కవిత చిక్కింది.

**అలౌకికం**

నీటిమీంచి వీచే వెచ్చని తెమ్మెర
నింగిన చిందిన కస్తురికాంతి
నిశ్శబ్దాన్ని చిక్కబరిచే నీటిగలగల.

అలౌకికం అంటే ఏమిటి?
మరింతగా లోకాన్ని హత్తుకోడమే.

22-3-2019

# మరోసారి ఇల్లు మారాను

**మరోసారి** ఇల్లు మారాను. ఇంతకు ముందు ఇట్లానే ఇల్లు మారినప్పుడు భారతీయ రచయితల్లో ప్రేమ్‌చంద్ తర్వాత ఎక్కువ సార్లు ఇల్లు మారింది నేనే అన్నాడు కవితాప్రసాద్. ఆయన ఆ మాట అన్న తరువాత కూడా నేను మరో నాలుగు ఇళ్ళు మారాను.

ఇన్నాళ్ళూ విజయవాడ నగరమధ్యంలో ఉన్నవాణ్ణి ఇప్పుడు ఇబ్రహీంపట్నంలో దాదాపుగా ఊరి చివరకు చేరుకున్నాను. ఇంటి వెనక పొలాలు, దూరంగా కొండలు. నా చిన్నప్పటి తాడికొండలాగా. ఈ ఇల్లు కృష్ణశాస్త్రికి బాగా నచ్చుతుందనుకుంటాను. ఎందుకంటే, ఇక్కడ వీచే ప్రతిగాలి పైరగాలినే.

ఎన్ని ఇళ్ళు, ఎన్ని స్థలాలు, ఎన్ని పట్టణాలు! 'నావి కాని ఇళ్ళల్లో నాకు స్థానం కల్పించావు' అన్నాడు కవి సర్వేశ్వరుడితో. ఆయన ఆ మాట విశాలార్థంలో అన్నాడు కానీ వాచ్యార్థంలో కూడా ఆ మాట నాకు వర్తిస్తుంది. 'నువ్వు పని చేసి వెళ్ళిన ప్రతి చోటా నీ ఆత్మని కొంత వదిలిపెట్టివెళ్తావు' అన్నాడు జిబ్రాన్. నేను నివసించిన ప్రతి చోటా నా హృదయం కొంత వదిలిపెట్టే వస్తున్నాను. కొన్నిసార్లు పూర్తిగా వదిలిపెట్టినచోట్లు కూడా ఉన్నాయి. నిజానికి నేను పుట్టిన ఊరు ఎప్పుడు వదిలిపెట్టానో అప్పుడే అక్కడే నా హృదయం పూర్తిగా వదిలిపెట్టేసాను. కాని, ఆశ్చర్యం, నాది కాదనుకుంటూనే అడుగుపెట్టిన ప్రతి తావులోనూ కూడా నా హృదయం మళ్ళీ మళ్ళీ చివురు తొడుగుతూనే ఉంది. 'నూరు సార్లు కొల్లగొట్టినా దిల్లీలాగా నా దిల్ కూడా మళ్ళీ మళ్ళీ ప్రేమించడం మానదు' అన్నాడు కవిగాంధర్వుడు మీర్.

'ప్రతి సాయంకాలం గోధూళివేళ ఇంటి బాట పట్టే నీలోనే సొంత ఇల్లూ, సొంత ఊరూ లేని దేశదిమ్మరి కూడా ఉన్నాడు' అన్నాడు జిబ్రాన్. దిమ్మరిలాగా ఊరినుంచి ఊరికి తిరుగుతున్న నాలో జీవితకాలం పాటు ఏదో ఒక ఇంటిపట్టుకి అంకితమై

పోవాలనుకునే పూర్వకాలపు గ్రామీణుడు కూడా బలంగా ఉన్నాడు. బహుశా ఏదో ఒకనాటికి అట్లాంటి ఒక చెట్టునీడ మట్టియింటి అరుగులమీదకు చేరుకుంటానన్న నమ్మకమే నాకీ ఇళ్ళూ, ఊళ్ళూ తిరిగే ఓపికనిస్తున్నట్టుంది.

ఒకప్పుడు ప్రాచీనచీనాలో తావో-చిన్ అనే ఒక కవి ఉండేవాడు. అచ్చు మన పోతన లాంటి కవి. ఋషిశ్రేష్ఠుడు. ఆయన కూడా తక్కిన కవుల్లాగా మొదట్లో ప్రభుత్వోద్యోగం చెయ్యాలనుకున్నాడు. కొన్నాళ్ళు చేసాడు కూడా. కాని ఒకరోజు స్థానిక ప్రభువు ఒకాయన వచ్చినప్పుడు రాజోద్యోగానికి సంబంధించిన దుస్తులు వేసుకోలేదని ఆగ్రహించాడట. ఆ క్షణమే తావో-చిన్ ఆ ఉద్యోగం వదిలిపెట్టేసి పొలం దున్నుకోడానికి వెళ్ళిపోయాడు. ఆ పొలాల దగ్గర తన ఇల్లు ఎలా ఉండేదో ఒక కవిత రాసుకున్నాడు:

జనావాసాలకు దూరంగా కుటీరం కట్టుకున్నాను
బళ్ళు తిరగని చోటది, గుర్రాలు సకిలించని తావు,

అదెట్లా సాధ్యపడిందో తెలుసా నీకు? చూడు,
బెంగటిల్లే ప్రతి గుండె చుట్టూ ఒక సూక్ష్మలోకం.

అక్కడ తూర్పువేపు చామంతితోట పెంచుకుంటాను
దూరంగా వేసవి కొండల్ని తదేకంగా పరికిస్తుంటాను.

పొద్దున్నా, సాయంకాలం కొత్తగా వీచే కొండగాలి
జంటలు జంటలుగా గూటిదారి పట్టిన పక్షులు.

ఈ దృశ్యాల్లోనే ఏదో లోతైన అర్థం స్ఫురిస్తుంటుంది
తీరా చెప్పాలని చూస్తే మాటలు మూగబోతాయి.

నా ఇరవయ్యేళ్ళప్పుడు రాజమండ్రిలో ఉండగా తొలిసారి ఈ కవిత చదివాను. దాన్ని అనువదించి నా తొలికవితాసంపుటంలో చేర్చుకున్నాను. మా ఊళ్ళో నా తండ్రి నివసించిన ఇల్లు అచ్చం అట్లాంటిదే. ఆయన ఆ ఊరికి గ్రామాధికారిగా పనిచేసాడు. ఇన్నాళ్ళ తరువాత వెనక్కి తిరిగి చూసుకుంటే ఆయన తావో-చిన్ లానే జీవించారని అర్థమవుతోంది, ఒక్క పొలం దున్నలేదు తప్ప, తక్కినదంతా ఒక రైతు జీవితమే, ఇంకా చెప్పాలంటే ఒక ఆదివాసిలాగా జీవించాడాయన. మా ఇంటి ముంగిట్లో ఒక పందిరి, దాని మీద రాధామనోహరం తీగ. ఇంటిచుట్టూ వెదురు కంచె. ఆ కంచె మీంచి చూస్తే చేతికందే దూరంలో కొండలు. ప్రతి వసంతకాలంలోనూ ఆ కొండలమీద కోకిల.

తన ఉద్యోగం వదిలిపెట్టి ఒక రైతుగా బతకడం మొదలుపెట్టాక తన స్వతంత్రం ఎంత మధురంగా ఉండేదో తావో-చిన్ మరొక కవితలో చెప్పుకున్నాడు:

నా చిన్నప్పుడు మందలో కలవలేకపోయేవాణ్ణి
మనసెంతసేపూ కొండలచుట్టూ తిరుగుతుండేది.

ఏదో అయిష్టంగానే నేనీ దుమ్ములోకి వచ్చిపడ్డాను
ముప్పై ఏళ్ళదాకా బయటపడలేకపోయాను.

వలసపోయిన పిట్ట తన అడవికోసమే తపిస్తూంటుంది
చెరువులో చేప తన చిన్నగుంటనే తలుచుకుంటుంది.

నా దిమ్మరి బతుకు వదిలి ఓ మడిచెక్క పట్టుకున్నాను.
పల్లెటూరిబైతులాగా చేనూ, తోటా పెంచుకున్నాను.

నాకున్న పొలం మొత్తం పదెకరాలు మించదు, గడ్డి
కుటీరం నా ఇల్లు, అందులో ఉన్నవల్లా నాలుగైదు గదులు.

కంచెమీద కాశీరత్నం, చూరుమీంచి పాకుతూ గుమ్మడితీగె.
ఇంటిముంగిట నిమ్మచెట్లు, మామిడిచెట్లు, కొబ్బరిచెట్లు.

దూరంగా మినుకుమినుకుమనే జనావాసాలు.
సగం నిర్జనమైన ఆ పల్లెమీద అల్లుకున్న వంటపొగ.

ఎక్కడో ఏ వీథిలోనో ఒంటరిగా మొరుగుతున్న కుక్క.
మల్బరీ చెట్టు కొమ్మల మీద కావుకావుమంటుంది కాకి.

వీథి గుమ్మందగ్గర, ముంగిట్లో వినిపించని లోకం చప్పుడు.
లోపల ఖాళీ గదుల్లో అపారమైన తీరిక, నిశ్చలనిశ్శబ్దం.

బతుకు పంజరం ఊచలు లెక్కపెట్టినంతకాలం లెక్కపెట్టి
ఇప్పటికి నేను ప్రకృతి ఒడి చేరాను, స్వతంత్రుణ్ణయ్యాను.

మా చిన్నప్పటి ఇల్లు కూడా ఇట్లాంటిదే గాని, మా నాన్నగారు మమ్మల్ని ఆ ఊరు వదిలిపెట్టి ప్రపంచంలోకి తరిమేసేదాకా విశ్రమించలేదు. ఆ ఊళ్ళో మా భవిష్యత్తు లేదనీ, మేము విశాలప్రపంచంలోకి అడుగుపెట్టి మా కాళ్ళమీద మేము నిలబడాలనీ

ఆయన అహోరాత్రాలు పరిశ్రమిస్తూనే ఉండేవారు. పరితపిస్తూనే ఉండేవారు. ఇన్నాళ్ళ తరువాత, ఇప్పుడు ఆలోచిస్తూంటే అనిపిస్తూంది, ఒకవేళ నా జీవితం ఇన్నేళ్ళుగానూ అక్కడే గడిచిఉంటే ఎలా ఉండిఉండేది? నేను చూసిన తావులు, చదువుకున్న చదువులు, కలుసుకున్న మనుషులు, చేపట్టిన ప్రయత్నాలు ఏవీ లేకుండా, అక్కడే ఉండిపోయుంటే ఎలా ఉండి ఉండేవాణ్ణి?

చిన్న ప్రభుత్వోద్యోగంలో చిన్నపాటి బాధ్యతను కూడా నిర్బంధంగా భావించి ఆ ఉద్యోగానికే స్వస్తి చెప్పి రైతుగా మారిపోయిన తావో-చిన్ పుట్టిన దేశంలోనే దు-ఫు అనే మరొక కవి పుట్టాడు. తన కాలం నాటి రాజుల కోసం, వాళ్లుచేపట్టిన యుద్ధాలకోసం, ఆ యుద్ధాలు నిష్ఫలం, నిరర్థకం అని తెలిసి కూడా, జీవితమంతా యుద్ధక్షేత్రాల్లోనే గడిపిన వాడు దు-ఫు. తన మీద వచ్చిపడ్డ బాధ్యత నిర్వహించడం కోసం తన చల్లని ఇంటినీ, వెచ్చని నెగడునీ వదులుకుని తనవి కాని సరిహద్దుల్లోనే జీవితమంతా గడిపాడతడు. చివరికి, తన చివరిరోజుల్లో, తన స్వగ్రామంలో గడపాలనుకుని బయలుదేరి తన ఊరికి చేరుకోకుండానే సగందారిలోనే ఈ లోకం వదిలిపెట్టాడు.

అతడు తావో-చిన్ గురించి ఏమనుకుని ఉంటాడు? ఆశ్చర్యంగా, అతడు తావో-చిన్ మీద రాసిన కవిత ఒకటి నా కంటపడింది. అతడిట్లా రాస్తున్నాడు:

> సాటిమనుషులకు దూరంగా బతికాడు తావో-చిన్
> అతడెందుకో దారితప్పాడనే అనిపిస్తుంది నాకు
>
> అతడు రాసిన కవిత్వమంతా చదివాక నాకనిపించింది
> సారహీన జీవితాన్ని అతడు ప్రేమించలేకపోయాడనే.
>
> చాలినంత సమకూరినంతమాత్రాన ఆ జీవితం
> పరిపూర్ణమని ఎట్లా అనగలవు నువ్వు?..

దు-ఫు తావో-చిన్‌ని విమర్శించడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే వాళ్ళిద్దరూ ప్రాచీన చీనాలో రెండు తాత్త్వికదృక్పథాలకు ప్రతినిధులు. తావో-చిన్ తావోయిస్టు. దు-ఫు కన్ఫ్యూషియను. తావో-చిన్ దారి తప్పాడని దు-ఫు అనడంలో శ్లేష అదే. తావో అంటే దారి. తావోయిస్టుగా ఒక దారి వెతుక్కుంటూ, ఆ క్రమంలో మనుషులకి దూరంగా జరగడంతో, తావో-చిన్ దారి తప్పాడు అంటున్నాడు దు-ఫు.

జీవితమంతా ఒక ఇంటికీ, ఆ ఇంటిముందు చింతచెట్టునీడకీ, నిశ్చింతగా అంటిపెట్టుకోవడమనే ఊహలో గొప్ప పారవశ్యం లేకపోలేదుగానీ, అది మటుకే మన జీవితాన్ని పరిపూర్ణం చేస్తుందనుకోలేం. నీవి కాని తావుల్లో, నీవి కాని దారుల్లో సంచరించక తప్పని సవాళ్ళు జీవితంలో అడుగడుగునా ఎదురుకాకపోతే, నీవాళ్ళు కానివాళ్ళతో రోజులకి రోజులు గడుస్తూ, నెమ్మదిగా, వాళ్ళల్లోనే నీ వాళ్ళని చూసుకునే విద్య ఒకటి నువ్వునేర్వడం మొదలుపెట్టకపోతే జీవితానికి ప్రయోజనమేముంది?

అందుకనే ఆ చిన్నప్పుడు తావో–చిన్ కవిత నన్నెంతగా ఆకట్టుకుందో, ఇలియట్ రాసిన ఈ కవిత కూడా అంతే ఆకట్టుకుంది.

### ఆఫ్రికాలో అసువులు బాసిన భారతీయుల కోసం

ఏ మనిషికైనా చేరవలసిన చోటు అతడి స్వగ్రామమే
ఆ ఇంటి ముంగట వెచ్చటి నెగడు, భార్యవండిపెట్టే వంట
సంజెవేళ తన ఇంటిగుమ్మం దగ్గర కూచుని
తన మనవడూ, పక్కింటివాళ్ళ మనవడూ
కలిసి దుమ్ములో ఆడుకుంటూ ఉంటే చూడటం.

ఒకింత భయం కలిగించేవేగాని, భద్రప్రదాలు,
ఏవో పూర్వజ్ఞాపకాలు మాటల్లో మెదులుతాయి
(అవి వెచ్చనివా చల్లనివా ఆ వాతావరణాన్ని బట్టి)
తమవి కాని దేశాల్లో, తమవారు కానివారితో
ఒకరితో ఒకరు పోరాడుకున్న అపరిచితుల గురించి.

ఒక మనిషి చేరుకున్నచోటే అతడి గమ్యమని చెప్పలేం
ప్రతి ఒక్క దేశం ఒకరికి స్వదేశం, మరొకరికి
ప్రవాసం. ఎక్కడ మనిషి ధైర్యంగా పోరాడుతూ మరణిస్తాడో
అదే అతడి గమ్యస్థానం, ఆ నేల అతనిదే.
ఇక అతణ్ణి తలుచుకోవడం అతడి స్వగ్రామం పని.

ఈ నేల నీదీ కాదు, మాదీ కాదు, ఇక్కడ గానీ
లేదా పంచనదుల మధ్యగానీ, స్మశానమెక్కడేనా ఒకటే

ఇక్కణ్ణుంచి తిరిగి నీ ఊరికి పోగలిగినవారు
అక్కడ నీ కథచెప్పుకుంటారు.
ఏదో ఒక ఉమ్మడి ధ్యేయం కోసం
మీరు కలిసి పోరాడేరని చెప్పుకుంటారు.
ఆ పోరాటం మంచికా చెడ్డకా అన్నది
అంతిమ తీర్పుదినందాకా
నీకూ, మాకూ కూడా తెలియకపోయినప్పటికీ.

2-9-2020

# ఒక ఇల్లు కట్టుకోవాలి

**మళ్ళీ** ఇల్లు మారాం. 2016లో హైదరాబాదు నుంచి విజయవాడ వచ్చేసానని రాసాను గాని, అది ఇప్పటికి పూర్తిగా నిజమయ్యింది. కుటుంబమంతా విజయవాడ తరలివచ్చేసాం. ఈసారి ఇబ్రహీంపట్నం నుంచి గొల్లపూడికి. ఈ ఉద్యోగ జీవితానికి ఇదే చివరి మజిలీ కావాలని అనుకుంటున్నాను.

ఇలా ఇళ్ళు మారినప్పుడూ, ఉద్యోగాలూ మారినప్పుడూ ఇస్మాయిలుగారి కవిత గుర్తొస్తూంటుంది. ఆయన చిరకాలంగా పనిచేసిన పి.ఆర్. కాలేజినుంచి అనంతపురం బదిలీ అయినప్పుడు, ఇలా రాసుకున్నారు:

బదిలీ అయితే
బరబర ఈడ్చిన ట్రంకుపెట్టెలా
క్షోభించింది మనస్సు.
ఇది జరిపేందుకు చేసింది కాదు.

నా జీవితం కూడా జరిపేందుకు చేసింది కాదు. కాని, జీవితమంతా ఊరునించి ఊరికి, ఉద్యోగం నుంచి ఉద్యోగానికి, ఇంటినుంచి ఇంటికి మారుతూనే ఉన్నాను. ఈసారి హైదరాబాదు నుంచి పూర్తిగా తరలి వచ్చెయ్యడానికి నాకున్న అతి పెద్ద బరువూ, బాధ్యతా నా పుస్తకాలే.

ఆ పుస్తకాల్ని ఏం చెయ్యాలన్నది పెద్ద ప్రశ్న. ఇరవయ్యేళ్ళ నగరజీవితంలో ఎన్ని పుస్తకాలు పోగు చేసుకున్నాను! గడచిన ఇరవయ్యేళ్ళకు పైగా నాలో నేనొక గూడు కట్టుకుని, ఆ గూడంతా పుస్తకాలతో నింపేసాను. ఇప్పుడు ఆ పుస్తకాలు ఎక్కడకు తీసుకు వెళ్ళాలి? ఇన్నాళ్ళూ ఆ పుస్తకాలకోసమే హైదరాబాదులో ఇంటి అద్దె చెల్లిస్తూ ఉన్నాను.

ఆ పుస్తకాలు చూడగానే నాకో కథ గుర్తొచ్చింది. ప్రసిద్ధ సూఫీ వేదాంతి అల్-ఘజలీ గొప్ప పండితుడూ, బహుగ్రంథకర్తా కూడా. ఆయన తన అన్వేషణలో భాగంగా ఎన్నో నగరాలు సంచరిస్తూ గడిపాడు. అట్లాంటి ప్రయాణాల్లో ఆయన కూడా రెండు గాడిదల బరువు పుస్తకాలు కూడా ఉండేవిట. ఒక రోజు ఆయన తన ప్రయాణంలో ఆ గాడిదలతో పాటు ఒక ఎడారి ప్రాంతంలో సంచరిస్తూ ఉండగా, దొంగలు ఆయన మీద పడి, ఆ గాడిదల్నీ, ఆ పుస్తకాల్నీ కూడా దోచుకుపోయేరట. చాలా ఏళ్ళ తరువాత మరొక సూఫీ సాధువు అల్-ఖిదాయి అనే ఆయన, అల్-ఘజలీని కలిసినప్పుడు, ఆ సంఘటనని గుర్తు చేస్తూ 'ఘజలీ, ఎంత అదృష్టవంతుడివి! ఆ రోజు ఆ దొంగలే కనుక ఆ పుస్తకాలు కొల్లగొట్టుకోకపోయి ఉంటే నువ్వెప్పటికీ సూఫీ సాధువుగా మారి ఉండేవాడివే కావు. ఆ పుస్తకాలకి దాస్యం చేస్తూనే ఉండేవాడివి' అన్నాడట.

అట్లాంటి కొన్ని సందర్భాలుంటాయి. నీకు నిజంగా ఏది అవసరమో ఏది కాదో తేల్చుకోక తప్పని సందర్భాలు. చిన్నప్పుడు మా ఊళ్ళో అగ్నిప్రమాదాలు జరుగుతుండేవి. అర్థరాత్రి ఏదో ఒక తాటాకు ఇంటికి నిప్పంటుకునేది. అందరూ హడావిడిగా ఆ ఇంటి దగ్గరకి పరుగెత్తేవారు. ఈ లోపే తమ ఇళ్ళల్లో విలువైనవేవో బయటికి తెచ్చేసుకునేవారు. అట్లాంటప్పుడు మా నాన్నగారు తాను ప్రాణప్రదంగా చూసుకునే ప్రభుత్వ రికార్డు, భూమి లెక్కలు, తన కరణీకం దస్త్రాలు బయటకి తెచ్చేసుకునేవారు. మా అమ్మ ఆవుల్ని బయటకు తెచ్చుకుందామనుకునేదిగాని, అంత సమయం చిక్కదనే భయంతో లేగదూడల్ని మాత్రం ముందు బయటికి తెచ్చేసుకునేది. మా బామ్మగారు తాను జీవితకాలం పారాయణం చేసుకుంటూ ఉండే భగవద్గీత బయటకి తెచ్చుకునేవారు. ఇప్పుడు నేను కూడా ఈ నా పుస్తకాల్లో ఏవి వెంట తెచ్చుకోవాలి ఏవి వదిలిపెట్టేయాలన్న ఆలోచనలో పడ్డాను.

ఆ పుస్తకాలన్నీ మరో మారు చూసాను. అటూ ఇటూ రెండుసంచుల బరువు నింపితే ఇరవై గాడిదలు మోసేటంత పుస్తక సంచయం. అందులో విద్య, తత్త్వశాస్త్రం, సాహిత్య అలంకార శాస్త్రాలు, మనస్తత్వ శాస్త్రాలు, రాజనీతి రచనలు, ఆర్థిక, సామాజిక శాస్త్రాలు, మార్క్స్, ఎంగెల్స్ సంకలిత రచనలు, లెనిన్, మావో సే టుంగ్ పూర్తి సంపుటాలు, ప్లేటో, అరిస్టాటిల్, హిడెగ్గర్, నీషే, పోస్ట్ మాడర్నిజం- వాటన్నిటినీ నిర్మోహంతో వదిలి పెట్టేయగలననిపించింది. కథలు, కథాసంకలనాల్ని కూడా వదిలిపెట్టేయగలిగాను. ఆధునిక తెలుగుసాహిత్యం, కొత్త పుస్తకాలు కూడా వదిలిపెట్టేయడంలో ఏమీ ఇబ్బంది లేదని పించింది.

కాని వదిలిపెట్టలేనివి ఏవి? వేదాలు, ఉపనిషత్తులు, బుద్ధుడి దీర్ఘసంభాషణలు, రీడర్స్ డైజెస్ట్ బైబిలు, అల్లా 99 నామాలు. ఇవన్నీ కలిపి ఒక సంచీలో పట్టేస్తాయి. కానీ నా మోహాన్ని తెంచుకోలేనిది కవిత్వం విషయంలోనే. 'మీ దగ్గర లేని కవిత్వం లేదే. ప్రపంచమంతా ఇక్కడే ఉంది' అన్నాడు ఆదిత్య, నేనేరుకుంటున్న పుస్తకాలు చూసి. చీనా జపాన్, కొరియా కవిత్వం, భారతీయ భక్తి కవులు, పారశీక సూఫీ కవులు, మహత్తరమైన యూరపియన్ కవిత్వం, అమెరికన్ కవులూ, వారు ప్రపంచమంతా శోధించి ఏరి తెచ్చిన అనువాదాలూ, ఆఫ్రికన్ కవిత్వం, ఆదిమజాతుల గీతసముచ్చయం The Technicians of the Sacred– ఆ కవిత్వం వదులుకోడం మాత్రం నాకు చాతకాలేదు. అవన్నీ మూటలు కడితే అప్పటికే పన్నెండు పెట్టెలు తయారయ్యాయి. బహుశా, ఎవరో ఒకరు నా నుంచి కొల్లగొట్టుకుపోతే తప్ప ఈ కవిత్వాన్ని వదులుకోలేననిపించింది.

నాకు చీనా మహాకవి దు–ఫు గుర్తొచ్చాడు. ఆయన జీవితమంతా యుద్ధక్షేత్రాల్లోనే గడిపాడు. తన కుటుంబానికి దూరంగా ఒక ప్రవాసిగా, ప్రాచీన చీనాలో ఒక సరిహద్దు నుంచి ఒక సైనికుడిగా మరొక సరిహద్దుకి సాగుతూనే ఉన్నాడు. ఆయనపుట్టింది లొయాంగ్ ప్రాంతంలో. తన కాలం నాటి యువకుల్లానే ప్రభుత్వోద్యోగం కోసం పరితపించాడు. ప్రభుత్వ పరీక్షల్లో ఉత్తీర్ణుడు కాలేదుగానీ, చాలాకాలం రాజధాని చాన్–గాన్‌లో జీవించాడు. లొయాంగ్ నుంచి చాంగాన్ దాదాపు పదిహేనువందల కిలోమీటర్ల దూరం. ప్రాచీన చీనాలో ఆ దూరమంటే ఒక దేశం నుంచి మరొక దేశానికి ప్రయాణించినట్టే. ఆ తర్వాత ఆన్–షూ తిరుగుబాటు తలెత్తినప్పుడు చాంగాన్ వదిలిపెట్టి చెంగ్–డూ వైపు వెళ్ళిపోయాడు. చాంగాన్ నుంచి చెంగ్–డూకి ఆరువందల కిలోమీటర్ల దూరం. అక్కడ కొన్నాళ్ళు ప్రశాంతంగానే గడిపాడు. కాని మనసు స్వగ్రామం వైపు లాగుతూనే ఉండింది. చివరికి తన యాభయ్యేళ్ళ వయసులో యాంగ్సే నదిమీదుగా లొయాంగ్ ప్రాంతానికి ప్రయాణం మొదలుపెట్టాడు. మధ్యలో మళ్ళా ఎవరో ఒకరు అతణ్ణి ఆపేస్తూ వచ్చారు.ఏదో ఒక పదవీబాధ్యత అప్పగిస్తో అతడి పునర్యానాన్ని వాయిదా వేస్తూ వచ్చారు. చెంగ్–డూ నుంచి లొయాంగ్ కావటానికి వెయ్యి కిలోమీటర్ల దూరంలోనే ఉన్నా, అతడు తన స్వగ్రామానికి ఎన్నటికీ తిరిగి చేరుకోలేకపోయాడు. తన యాభై ఎనిమిదవ ఏట మార్గ మధ్యంలో ఈ లోకం నుంచే నిష్క్రమించాడు.

ఇదంతా ఎందుకు రాస్తున్నానంటే, దు ఫూ కవిత్వం చదివినప్పుడు మనకి ఈ దూరాలు తెలియవు. అతడొక నిర్ధనుడిగా, దిమ్మరిగా, చిరిగిపేలికలైన దుస్తులు ధరించి అగమ్యంగా సంచరించే ప్రవాసిగా కనిపిస్తాడు. కాని అతడి కవిత్వం మొత్తం ఇంగ్లీషులోకి

అనువదించిన స్టీఫెన్ ఓవెన్ ఏం చెప్తాడంటే, దుఫు అట్లా ఒక యుద్ధభూమినుంచి మరొక యుద్ధభూమికి, ఒక భూగోళం నుంచి మరొక భూగోళానికి ప్రయాణిస్తున్నప్పుడు కూడా అతడి కవిత్వం అతడి వెంటనే ఉండేదనీ, అదంతా కలిపి అరవై చాపచుట్టల నిడివికి గ్రంథస్తమై ఉండేదనీ, అతడు తాను భయంలో, ఆందోళనలో, ఊపిరి బిగబట్టుకుని, అడుగులో అడుగు వేసుకుంటూ ప్రయాణించానని రాసుకున్నప్పుడు కూడా, అతడి వెనక ఎవరో ఒకరు ఆ అరవై చాపచుట్టల నిడివి కవిత్వాన్నీ మోసుకుంటూ వెంటవస్తూనే ఉన్నారనీ.

నేను ఆల్-ఘుజలీని కాదు. అలాగని దు-ఫూని కూడా కాదు. నేనిప్పటిదాకా రాసిందంతా ఒక పెన్‌డ్రైవ్‌లో సరిపోతుంది. కాని ఇరవై మూటల ఈ పుస్తకసంచయం మాట? ఇందులో ఆరుమూటలు మళ్ళా చిత్రకళకి సంబంధించిన పుస్తకాలే. చీనా జపాన్ చిత్రకళ, డావిన్సి, మైకెలాంజిలో, చిత్రకారుల జీవితాల మీద వసారి రాసిన పుస్తకాలు, ఇంప్రెషనిస్టులు, షెజానె, వాన్ గో ఉత్తరాలు, జాన్ బెర్జర్, సంజీవదేవ్ - వాటిని ఏదన్నా పాఠశాలకో, కళాశాలకో ఇచ్చేద్దామనుకున్నానుగానీ, నా కూతురు తనకి కావాలని అడిగింది. నా కూతురుకి ఇళ్ళూ, పొలాలూ ఎలానూ ఇవ్వలేను, కనీసం ఈ చిత్రకళా భాండారమన్నా ఇవ్వలేకపోతే ఎలా?

చిత్రకళా సంచయాన్ని పక్కన పెట్టినా కూడా పన్నెండు మూటల కవిత్వ సంచయం మిగిలే ఉంటుంది. ఏమి చెయ్యాలి దాన్ని? ఈ అవస్థలో నాకు రాహుల్ సాంకృత్యాయన్ తలపుకి వచ్చాడు. ఆయన టిబెట్ నుంచి కంచరగాడిదల మీద మోసుకొచ్చిన ఏడెనిమిది వందల బౌద్ధతాళపత్రగ్రంథాలు ఇప్పటికీ బీహార్‌మూజియంలో మూలుగుతూనే ఉన్నాయి.

ఇన్నాళ్ళూ తలపు లేదుగానీ, ఇప్పుడొక ఇల్లు కావాలనిపిస్తున్నది. బహుశా మా ఊళ్ళోనో లేదా మా ఊరికి పక్కనున్న వణకరాయి గ్రామంలోనో ఒక ఇల్లు కట్టుకోవాలి. అక్కడ ఒక మిద్దె ఇల్లు కట్టుకున్నాక, చెంచువాడు తన మేకల్ని పక్కా ఇంట్లో పెట్టి తాను నిట్రాతి గుడిసెలో కాపురమున్నట్టుగా, నేను నా పుస్తకాల్ని ఆ మిద్దె ఇంట్లో పెట్టి పక్కనొక పాక వేసుకుని బతుకుతాను.

21-2-2021

# ఆయన కృపాదృష్టికి అడ్డులేదు

**రెండువారాల** కిందట నెల్లూరు జిల్లాలో కలువాయి మండలంలో కొన్ని పాఠశాలలు సందర్శిస్తూ ఉండగా, నాతో పాటు ఉన్న ఉపాధ్యాయులు 'నాగుల వెల్లటూరు ఇక్కడికి దగ్గర్లోనే' అన్నారు. నాకు చాలా సంతోషమనిపించింది. భగవాన్ గొలగమూడి వెంకయ్య స్వామి పుట్టిన ఊరుకి అంత దగ్గరగా ప్రయాణించానని అనుకోగానే ఎలాగేనా ఆ ఊరు కూడా వెళ్ళాలనీ, అక్కడ వెంకయ్యస్వామి పుట్టి పెరిగిన ఇల్లు కూడా వెంటనే చూడాలనీ బలంగా అనిపించింది.

వెంకయ్యస్వామి గురించి చాలా ఏళ్ళ కిందటే నేను మొదటిసారి విన్నప్పటికీ, ఆయన జీవితం గురించీ, సందేశం గురించీ సాకల్యంగా విన్నది మాత్రం అల్లు భాస్కర రెడ్డి గారి ద్వారానే. భాస్కరరెడ్డిగారు, కోడూరి ఇందిరమ్మగారు భగవాన్ వెంకయ్యస్వామి జీవితచరిత్రను ఒక పుస్తకంగా వెలువరించారు. పదేళ్ళ కిందట వెలువడిన ఆ పుస్తకానికి ముందుమాట రాసే అదృష్టం నాకు లభించింది. అంతేకాదు, నెల్లూరులో ఎంతో వైభవంగా జరిగిన ఆ పుస్తకావిష్కరణ సభలో మాట్లాడే అవకాశం కూడా పొందగలిగాను.

మామూలుగా యోగులగురించీ, భక్తుల గురించీ రాసే జీవితచరిత్రలు చాలా మహిమలతోనూ, అతిశయోక్తులతోనూ నిండి ఉంటాయి. కాని భాస్కరరెడ్డిగారు రాసిన పుస్తకం అటువంటి జీవితచరిత్ర కాదు. ఆయన వెంకయ్యస్వామి జీవితం గురించి రాయాలని అనుకోగానే కొంతమంది యువతీ యువకుల్ని వెంకయ్యస్వామి ఏ గ్రామాల్లో సంచరించారో ఆ గ్రామాలకు పంపించారు. ఆ యువతీయువకులు పెద్ద చదువులు చదువుకుంటున్న తరం. వారు ఆ గ్రామాలకు వెళ్ళి వెంకయ్యస్వామిగురించి ఎవరు ఏమి చెప్పినా ఆ వాఙ్మూలాలన్నిటినీ ఎంతో శ్రద్ధగా సేకరించి తీసుకువచ్చారు. వాటిని భాస్కరరెడ్డిగారు జల్లెడపట్టారు. ఆ వాఙ్మూలాల్నీ, సాక్ష్యాల్నీ ఒకదానితో ఒకటి పోల్చి చూసుకున్నారు. న్యాయస్థానంలో ఒక న్యాయవాది తాను సమర్పించాలనుకున్న వాదనను

ఎంత సాక్ష్యాధారాలతో ప్రవేశపెడతాడో అంత హేతుబద్ధంగా, విశ్వసనీయంగా ఆయన వెంకయ్యస్వామి జీవితచరిత్రను పునర్నిర్మించారు. సాయిబాబా జీవితసచ్చరిత్ర రాసే అవకాశం హేమాద్‌పంతుకి ఇచ్చినట్టుగా, తన జీవితచరిత్ర రాసే అవకాశం వెంకయ్య స్వామి భాస్కరరెడ్డిగారికి అప్పగించారని ఆ పుస్తకం చదివితే మనకి బోధపడుతుంది.

ముందుమాట రాయడం కోసం ఆ పుస్తకం చదివినప్పుడు నా మొదటి ప్రతిస్పందన కన్నీళ్ళు, ఎడతెరిపిలేని కన్నీళ్ళు. కంప్యూటరు మీద టైపు చేస్తూ ఉండగా, ఆగకుండా ప్రవహిస్తున్న అశ్రువుల మధ్య నేనిట్లా రాసాను:

'ప్రతి సిద్ధపురుషుడూ తానుండే తావును ఎంచుకోవడంలోనూ, తన శ్రోతల్నీ, శిష్యుల్నీ ఎంచుకోవడంలోనూ, తన భాషనీ, బోధనల్నీ ఎంచుకోవడంలోనూ కూడా ఒక దేశకాలబద్ధత ఉంటుంది. ఏసు గలిలి సముద్రం ఒడ్డున జాలరుల్నీ, సుంకరుల్నీ తన శ్రోతలుగా ఎంచుకున్నట్టు, బుద్ధుడు వైశాలిలో, శ్రావస్తిలో తన శ్రోతల్ని ఎంచుకున్నట్టు, రామకృష్ణ పరమహంస ఆధునికబెంగాల్లో ఇంగ్లీషువిద్య చదువుతున్న నవయువకుల్ని ఎంచుకున్నట్టు, షిరిడిలో సాయినాథుడు నిరక్షరాస్యులైన హిందూ-ముస్లిం రైతుల్నీ, గృహిణుల్నీ చేరదీసినట్టు వెంకయ్యస్వామి కూడా పెన్నానదికి అటూ ఇటూ ఉండే గ్రామాల్లో రైతుల్నీ, శ్రామికుల్నీ గృహిణుల్నీ అక్కున చేర్చుకున్నారు. అలా నిర్దిష్ట దేశకాలాలకు చెందిన శ్రోతల్ని ఉద్దేశించి ఆయా మహాపురుషులు మాట్లాడినప్పటికీ వారి కృషీ, వారి సందేశం దేశకాలాల ఎల్లలు దాటి నలుగురికీ అంది తీరతాయి. కొందరి విషయంలో అది వారి జీవితకాలంలోనే జరగవచ్చు. కొందరి విషయంలో కొంత ఆలస్యంగా జరగవచ్చు. కాని సుదూరగగనంలో ఉండే నక్షత్రాలనుంచి కాంతికిరణాలు కొన్ని వేల కాంతిసంవత్సరాల పాటు రోదసిలో ప్రయాణించి భూమికి చేరుతున్నట్టే ఆయా సిద్ధపురుషుల బోధలు కూడా కొన్ని ముందువెనకల తేడాలో అందరికీ అందక తప్పదు. శ్రీ వెంకయ్యస్వామి జీవితం గురించీ, బోధల గురించీ, ఆలస్యంగానే అయినప్పటికీ, అల్లుభాస్కరరెడ్డి ద్వారా ఇప్పుడు ఆంధ్ర దేశం, రేపు మొత్తం ప్రపంచం, తెలుసుకునే అవకాశం నేటికి ఈ పుస్తకం ద్వారా లభించింది.'

'ఈ పుస్తకంలో ఎక్కడ ఏ అధ్యాయం తెరిచినా తనను తాను విస్మరించి తన చుట్టూ ఉండే నలుగురి క్షేమం కోసం మాత్రమే బతికిన ఒక మహనీయుడు కనిపిస్తాడు. చుట్టూ ఉండే ప్రపంచం తనను హింసించినా, అపహాస్యం చేసినా, నిర్లక్ష్యం చేసినా తాను మాత్రం తన చుట్టూ ఉండే ప్రపంచాన్ని ప్రేమించాడు, గౌరవించాడు, లాలించాడు, బుజ్జగించాడు, సేవించాడు.'

'ఈ జీవితచరిత్రను నేను కన్నీళ్ళతో చదివాను. చదివినంతసేపూ నా హృదయం మెత్తబడుతూ, నాలోని మాలిన్యాలు అడుగంటుతూ, నా మనస్సు తేటపడుతున్నట్టుగా అనుభూతి చెందాను. ఈ పుస్తకాన్ని పారాయణం చేసే ప్రతి ఒక్కరికీ ఇటువంటి అనుభూతినే శ్రీ వెంకయ్యస్వామి వాగ్దానం చేసారని నమ్ముతున్నాను.'

ఆ ముందుమాట రాసినందుకు ప్రతిఫలం పదేళ్ళ తరువాత, అనుకోకుండా ఆయన పుట్టిన ఊరు వెళ్ళగలగడం, ఆయన పుట్టి పెరిగిన ఇంట్లో అడుగుపెట్టడం, అక్కడ కొంతసేపు కూర్చోగలగడం, ఆయన తమ్ముడి పిల్లలతోనూ, ఆ పిల్లల పిల్లలతోనూ సంభాషించగలగడం.

వెంకయ్యస్వామి రైతుబిడ్డ. తాను ఆ ఊళ్ళో ఉన్నంతకాలం ఆయన అరకపట్టాడు. పొలం దున్నితే పదిమంది పని ఒక్కడే చేసేవాడు. కాని ఎప్పుడో ఏ క్షణంలోనో ఆయనకు సాక్షాత్కారం లభించింది. ఆ జ్ఞానోదయం అన్నిటికన్నా ముందు మనుషుల మధ్య కులాలు లేవనే ఒక ఎరుకగా ఆయన్ని నిలవనివ్వలేదు.

ఆయనకి ఆ ఎరుక కలిగినందుకు, వందేళ్ళ కిందటి ఆ గ్రామం, ఆయన్ని ఎంతలా హింసించాలో అంతగానూ హింసించింది. మాదిగ, మంగలి, చాకలి, దక్కలి కులాలన్నీ ఒకటే అంటో వారు తింటున్న అన్నం తాను కూడా వారి చేతుల్లోంచో, పళ్ళాల్లోంచో లాక్కుని తిన్నందుకు ఆయన నాలికకి వాతపెట్టారు, చెట్టుకి కట్టి కొట్టారు. ఆ యువకుడు ఆ అమానుషత్వానికి వణికిపోయాడు. భయపడిపోయాడు. ఊరినుంచి పారిపోయాడు. తిరిగి చాలా ఏళ్ళ తరువాత తన జ్ఞానం తనకి కలిగించిన ఆత్మస్థైర్యంతో సంచరించడం మొదలుపెట్టాక కూడా, ఆ ఊరుమీంచి వెళ్ళవలసి వస్తే చూపులు పక్కకి తిప్పుకుని వెళ్ళిపోయేవాడట. కాని ఆ ఊరు పట్ల ఆయన కృపాదృష్టికి మాత్రం అడ్డులేదు.

'మేము ఒక పొలం కొనుక్కోవాలనుకుంటున్నాం, మంచిదేనా అని అడిగాం ఆయన్ని' అని చెప్తున్నాడు ఆయన తమ్ముడి కొడుకు నాతో.

'మంచిదే కదయ్యా, ఉత్తరాన కాలువ పోతున్నది కదా' అన్నాడు స్వామి. ఆ పొలానికి ఉత్తరాన ఏ కాలువ లేదే. దక్షిణంగా మాత్రం దూరంగా ఒక చిన్న ఏరు ఉంది. స్వామి పొరపడుతున్నాడనుకుని ఆ మాటే అన్నాం. 'లేదయ్యా, ఉత్తరాన కాలువ పోతున్నది కదా, పంటకాలువ' అన్నాడు మళ్ళా. ఏదోలే పిచ్చి మాటలు అనుకున్నాం. కాని, ఇప్పుడు ఆ పొలానికి ఉత్తరాన సోమశిల పంటకాలువ పోతున్నది' అన్నాడు ఆ పెద్దమనిషి ఆ రోజు నాతో.

ఇటువంటి మాటలు కొన్ని వందలు భాస్కరరెడ్డిగారు సేకరించారు. వెంకయ్యస్వామి సమాధి చెంది నలభయ్యేళ్ళు కావొస్తున్నది. ఈ నాలుగు దశాబ్దాలుగా ఒకప్పుడు ఆయన పిచ్చిమాటలుగా జనం పరిగణించని మాటలు ఎప్పుడు ఎక్కడ ఎలా నిజమయ్యాయో, నిజమవుతున్నాయో చెప్పుకోవడమే ఆ గ్రామాల్లో నేడు ఆయన స్మరణగా కొనసాగుతున్నది.

ఆ రోజు వెంకయ్యస్వామి ఇంటిముంగిట ఆయన తమ్ముడిపిల్లలతోనూ, గ్రామస్థుల తోనూ చాలాసేపే మాట్లాడాను. వాళ్ళు నాకు టీ ఇచ్చారు. ఎందుకు శ్రమ అంటే, ఇది ఆయన ప్రసాదం అన్నారు. కాని ఆ రోజు వాళ్ళు చెప్పిన మాటలు విన్నప్పుడు నాకు కలిగిన మొదటి భావన ఏమంటే, ఈ దేశం ఎంత ఆధ్యాత్మిక భూమి అని మనం చెప్పుకుంటున్నప్పటికీ, ఒక మనిషికి నిజంగా ఆధ్యాత్మికసిద్ధి కలిగితే ఆయన్ని ఎలా గుర్తించాలో, ఎలా గౌరవించాలో మనకి ఇప్పటికీ తెలియదు అనే. ఆ మనిషి ఈ లోకాన్ని వీడిపోయేదాకా మనం ఆయన్ని అనుమానిస్తూనే ఉంటాం, వేధిస్తూనే ఉంటాం, హింసిస్తూనే ఉంటాం.

ఇప్పుడు ఆ ఊళ్ళో వెంకయ్యస్వామి మందిరం ఉంది. అక్కడ ఒక ధుని నిత్యాగ్ని హోత్రంగా వెలుగుతూ ఉంది. ఆ మందిరప్రాంగణంలో అడుగుపెట్టగానే చల్లగానూ, సేదతీర్చేదిగానూ అనిపించింది. ఆ మందిరంలో ఆయన మూర్తి ఒక పల్లెటూరి పెద్దమనిషి లాగా మన కళ్ళల్లోకి సూటిగా చూస్తూ మనం చెప్పబోయేది వినటానికి ఆసక్తి చూపిస్తు న్నట్టుగా కనిపిస్తూ ఉంది. అక్కడ ఆయన అనుగ్రహసూచకంగా నా చేతికి దారం కట్టారు. అది బయటి ప్రభావాలనుంచి కాదు, ముఖ్యంగా నా నుంచి నన్ను రక్షిస్తుందనే అనిపించింది.

8-6-2021

# మాధూకరభిక్ష

**మొన్న** శ్రీశైలం వెళ్ళినప్పుడు మురళి 'మనమొకసారి సుండిపెంట బయ్యన్న దగ్గరకి కూడా వెళ్దాం సార్' అన్నాడు. మురళి చెంచు గిరిజనాభివృద్ధి సంస్థలో సహాయప్రాజెక్టు అధికారి. నేనక్కడ పనిచేసినప్పుడు నా సహెూద్యోగి. అప్పణ్ణుంచీ మా అనుబంధం ఉద్యోగజీవితాన్ని దాటి కూడా కొనసాగుతూనే ఉంది.

సుండిపెంటలో ఊరి బయట, అడవి అంచులో ప్రభుత్వం కొందరు చెంచు వారికి అటవీహక్కుల చట్టం కింద కొంత భూమి పంపిణీ చేసింది. దాదాపుగా అడవిలాంటి ఆ భూమిని కుడుముల చిన్న మూగెన్న అనే ఒక చెంచు రైతు సాగులోకి ఎలా తెచ్చాడో అదంతా నేను ఇంతకు ముందు నా అనుభవంలో వివరంగా రాసేను. అతడి కుటుంబం లోనూ, ఆ సమాజంలోనూ వచ్చిన ఆ పరివర్తనలో అతడికి బయ్యన్న ఎలా తోడుగా ఉన్నాడో కూడా రాసాను.

ఇప్పుడు మురళి ప్రస్తావిస్తున్నది ఆ బయ్యన్న గురించే. బయ్యన్న అంటే భైరవుడు. చెంచువాళ్ళ ఇలవేల్పు, కులదైవం. ఆయన వాళ్ళ జీవితాల్లో అంతర్భాగం. ఆయన్ని తలచకుండా, ఆయనకి మొక్కకుండా వారే పనీ చేయరు. తనకి ప్రభుత్వం ఇచ్చిన భూమిలో బయ్యన్నకి ఒక విగ్రహం పెట్టి, తాను వేసిన మొక్కజొన్న మొదటి పంట కోసినప్పుడు పూజచేస్తూ, ఆ పూజకి నన్ను కూడా పిలిచినప్పుడు మొదటిసారి ఆ పొలానికి వెళ్ళాను. ఆ రోజు పూజ చేసాడేగాని, బయ్యన్నకి ఊరేగింపు చెయ్యలేదని బయ్యన్న ఎట్లా అలిగాడో అదంతా ఆ రోజు నేను కళ్ళారా చూసిన అనుభవంలో రాసేను.

అందుకని ఈసారి మురళి పిలిచినప్పుడు మూగెన్నను చూడటం కన్నా బయ్యన్నను చూడటం మీదనే నాకు ఎక్కువ ఆసక్తి ఉండింది. దేవుడూ, మనిషీ కలిసి అంతదగ్గరగా గడపడం ఒక్క ఆదిమసమాజాల్లోనే సాధ్యమనిపిస్తుంది.

ఈసారి కూడా మాతో పాటు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కూడా ఉన్నాడు. మేము ఆ పొలంలో అడుగుపెడుతూండగానే అది పొలం కాదు తోట అని ఇట్టే తెలిసిపోతూ ఉంది. బయ్యన్న జీవితంలో కూడా మార్పు వచ్చింది. ఇంతకు ముందు వట్టి విగ్రహం, కాని ఇప్పుడు చుట్టూ ఒక మందిరం, పైన ఒక కప్పు, బయన్నకి ఎండనుంచీ, వాననుంచీ ఒక నీడ దొరికింది. ఆ విగ్రహానికి నిలువెల్లా పూలు అలంకరించి ఉన్నాయి. మాకోసమే ఎదురుచూస్తున్న మూగెన్న మాతో పూజ చేయించాడు. కొబ్బరికాయ కొట్టించాడు.

పూజ పూర్తికాగానే నేనా పొలంలో నాలుగడుగులు వేసాను. ఒకప్పుడు అడవి. ఇప్పుడు అక్కడ పదెకరాల మామిడితోట. దాదాపు అయిదువందల మామిడిచెట్లు ఏపుగా పెరిగాయి. ఈసారి పంట బాగానే దిగిందనిచెప్పాడు. మచ్చలేని బంగనపల్లి. నేనా తోటలో అడుగుపెట్టాను. ఒక చెట్టుని ఆప్యాయంగా స్పృశించాను. పక్కనొక గ్రీనుహౌసు కూడా ఉంది. దేవాలయం కోసం పూలు పెంచాలనుకుంటున్నాను అని చెప్పాడు. కనుచూపు మేరదాకా మామిడితోట. ఆ పైన చుట్టూ రాతికంచె. కంచె చుట్టూ కూడా ఏదైనా కూరగాయలు పెంచి ఉండవచ్చు కదా అన్నాను. 'ఎక్కడ సామీ, అడవి పందులూ, ఎలుగు బంట్లూ నన్ను వదిలిపెడితేనా? మొన్న ఒక చిరుత కూడా కంచె దూకింది' అన్నాడు మూగెన్న. అవును, అవి అతణ్ణి ఎలా వదిలి పెడతాయి? నిన్నటిదాకా తమ మిత్రుడు. తమతోటే కలిసి మసిలాడు. ఇప్పుడు తమనుంచి వేరుగా కంచెకట్టుకుంటే ఎలా భరిస్తాయి?

తిరిగి మళ్ళా బయ్యన్న వైపు అడుగులు వేసాం. అక్కడొక ట్రాక్టరు. 'అది మీరే ఇచ్చారు సామీ. ఇరవయ్యేళ్ళ కిందట' అన్నాడు మూగెన్న. నేను నమ్మలేకపోయాను. 'అవాళ నేను మిమ్మల్ని కమాండరు అడిగాను. కాని బండి ఇస్తే నేను తాగి నడుపుతానని మీరు నాకు ట్రాక్టరు ఇచ్చారు. ఆ ట్రాక్టరే నాకు అన్నం పెట్టింది, ఈ పొలాన్నిచ్చింది, ఈ తోటనిచ్చింది' అన్నాడు.

ఆదిమసమాజాలు వ్యావసాయిక సమాజాలుగా పరివర్తన చెందడంలో ఎంత సంఘర్షణ ఉంటుందో ఆ ఇతిహాసమంతా మూగెన్న ఒక్కడి జీవితంలో చూడవచ్చు. ఒకప్పుడు అతడు విల్లంబులు పట్టుకుని వేటకు వెళ్ళడం చూసాను. ఏదీ దొరకని రోజున తాగి నామీదకు గొడవకు రావడం కూడా నాకు గుర్తుంది. ధనుర్బాణాలనుంచి పొలం, బోరు, మోటారు, ట్రాక్టరు, మామిడి, మోనోక్రోటోఫాసు దాకా చేసిన ప్రయాణం అది.

'సంతోషంగా ఉంది మూగెన్నా, ఇంక వస్తాను' అని సెలవు తీసుకోబోతుండగా, 'ఒక్క నిమిషం ఆగండి సామీ, తేనె తిందురుగాని' అన్నాడు. అక్కడ బయ్యన్న గుడి

ముంగిట కుర్చీలు వేసాడు. తోటలోంచి పెద్ద ఆకులు కోసుకొచ్చాడు. తాను నిన్ననో మొన్ననో పట్టి తెచ్చిన పుట్టతేనెపట్టు ప్లాస్టిక్ డబ్బాలో దాచినట్టున్నాడు, ఆ డబ్బా తీసుకొచ్చాడు. ఆ డబ్బాలోంచి తేనెపెర తీసి ఆ ఆకులో పెట్టి నాకు అందించాడు.

నేనా తేనె తింటూ ఉండగా తన భార్యా పిల్లల్నీ పరిచయం చేసాడు. నేను కిందటి సారి వచ్చినప్పుడు అతడి తల్లి ఉండింది. ఆ రోజు తమమీద అలిగిన బయ్యన్నను ఆమెనే శాంతింపచేస్తూ ఉండింది. ఈసారి ఆమె బదులు మూగెన్న కూతురు నన్ను ఆశ్చర్యపరిచింది. ఇప్పుడామె నంద్యాలలో బి.టెక్ చదువుతున్నదట. సివిల్ ఇంజనీరింగ్. గత మూడు దశాబ్దాల్లో మొదటిసారిగా ఇంజనీరింగ్ చదువుతున్న ఒక చెంచుబాలికను చూసాను. ఆ రోజు ఆ తేనె ఎక్కువ తీపిగా ఉన్నదో, ఆ వార్త ఎక్కువ తీపిగా ఉన్నదో చెప్పలేను.

ఆ తేనె తింటూ ఉండగా నాకు ఎన్నడో ముప్పై ఏళ్ళకిందట మహానంది అడవుల్లో బసవాపురం చెంచుగూడేనికి వెళ్ళిన రోజు గుర్తొచ్చింది. ఆ రోజు నాకు బుగ్గిలో మగ్గబెట్టిన కందమూలాలు, పుట్టతేనెతో కలిపి పెట్టారు. ఇన్నాళ్ళకు మళ్ళా అటువంటి ఆతిథ్యం.

నా చేతుల్లో ఉన్నది తేనెపెర కాదు, నిండుగా పూచిన ఒక అడవి, కోటి భ్రమర పరిభ్రమణాలు. ఎన్ని వేల తేనెటీగలో ఎన్ని ఋతువులో ఒక అడవిమొత్తం గాలించి తెచ్చుకున్న మకరందమది. ఆ అడవి ఒక ఆదిమానవుడి ద్వారా తిరిగి నన్ను చేరి నాలో ఒక భాగమైపోయిందనిపించింది. ఒక సాంఘిక శాస్త్రజ్ఞుడు ఆ రైతునీ, ఆ తోటనీ చూస్తే ఆ పరివర్తన వెనక ఉన్న సామాజికచలనాల్నీ, ఉత్పత్తిసంబంధాల్నీ వివరించడానికి పూనుకుంటాడు. ఆహారసేకరణ దశనుంచి ఆహార ఉత్పత్తి దశదాకా సాగిన ప్రస్థానాన్ని విశ్లేషిస్తాడు. కాని నాలాంటి వాడు అక్కడ బయ్యన్నని చూడాలనీ, ఆయన నాతో కూడా మాట్లాడితే బాగుంటుందనీ కోరుకుంటాడు.

భగద్విభూతి ఏ రూపంలో తాకుతుందో తెలియక, ప్రతి క్షణం ఒళ్ళంతా, మనసంతా మెలకువగా, ఏ క్షణాన్నీ తప్పిపోనివ్వకుండా, వాన చినుకుని ఒడిసిపట్టుకోవడం కోసం చకోరం వేచి ఉన్నట్టుగా, వేచి ఉంటాడు.

అప్పుడు వినిపిస్తుంది, కనిపిస్తుంది, అనిపిస్తుంది, ఏదో ఒక రూపంలో దైవసన్నిధి. ఒక epiphany. ఆ రోజు నాకు లభించిన ఆ మాధూకరభిక్షలాగా.

25-6-2021

# రెల్లు రెల్లు రెల్లు

**వసంతకాలంలో** అడవి పూస్తుంది, కొండలు పూస్తాయి, కోనలు పూస్తాయి. శరత్కాలంలో నదీతీరాలు పూస్తాయి, చెరువులు, దొరువులు, వాగులు, వంకలు పూస్తాయి. నేలా నింగీ కూడా ఒక్కటై పూస్తాయి.

ఎప్పుడో చిన్నప్పుడు నాకు ఊహతెలియని వయసులో మా ఊళ్ళో అడివి పుయ్యడం చూసాను. చాలా ఏళ్ళు గడిచాక నెమ్మదిగా తెలుసుకున్నదేమంటే, వసంతకాలపు అందమంతా, ఫాల్గుణమాసపు కృష్ణపక్షంలో ఉంటుందని. వసంతాగమన సంతోషం ఎలా ఉంటుందో చూడాలంటే, చైత్రంలో కాదు, ఫాల్గుణపున్నమినుంచి ఉగాది దాకా ఆ రెండువారాల్లోనూ చూడాలి. ఆ రహస్యం తెలిసినవాడు కాబట్టే టాగోర్ వసంత ఋతుగీతికలు అధికభాగం ఫాల్గుణమాసంలోనే అల్లుకున్నాడు.

ఇన్నాళ్ళకు మళ్ళా నదీతీరంలో నివసిస్తున్నందువల్ల శరదాగమన సంతోషం భాద్రపద కృష్ణపక్షంలో ఉంటుందని తెలుసుకోగలిగాను. గడచిన రెండువారాల్లోనో, ఓహ్, ఏం పూసాయి, నేలా, నింగీనూ!

ఎక్కడ చూడు, నదీ తీరం పొడుగునా, ఏమి పూసింది రెల్లు! పుయ్యడమంటే అది, తనువెల్లా విచ్చి పుయ్యడం, పిచ్చిగా పుయ్యడం. కింద కూలంకషంగా రెల్లు పూస్తే పైన అభ్రంకషంగా మేఘాలు పూసాయి. నిన్నటిదాకా బరువుగా పయనించిన పుష్కలావర్తాలు ఇప్పుడు నీళ్ళు ఖాళీ చేసిన కడవల్లాగా తేలిగ్గా, దూదిపింజల్లాగా ఆకాశంలో తేలియాడు తుండే దృశ్యాల్ని చూడటానికి నా రెండు కళ్ళే కాదు, నాకున్న ఒక్క మనసూ కూడా చాల్లేదు.

పయనించాను ఒక రోజంతా కృష్ణ ఒడ్డున, అవనిగడ్డదాకా, అక్కణ్ణుంచి రేపల్లెదాకా, వట్టి రెల్లు చూడటానికే. తిరుగాడేను వెర్రిగా ఆ కాశవనాలమధ్య, నడిమధ్యాహ్నం, పగలు

వెన్నెలయిందన్నట్టుగా. మరొక రోజు రాజమండ్రిదాకా పయనించాను, గోదావరి పొడవునా లంకల్లో, ఇసుక బయళ్ళలో, ఎక్కడ చూడు రెల్లు, రెల్లు, రెల్లు.

కృష్ణప్రేమికులు ఆ రెల్లు గడ్డిని తలుచుకుని ఎందుకంత వివశులైపోతారో అర్థమయింది. చూడగా చూడగా ఆకాశం రెల్లుని పూసిందనీ, నదులూ, వాగులూ, వంకలూ, నెర్రెలూ, దొరువులూ మేఘాల్ని పూసాయనీ గ్రహించాను.

ఒక సాయంకాలం ఆ రెల్లు నన్ను పిలవడం మొదలుపెట్టింది. నేనూ నా కూతురూ ఆ నదీతీరానికి బయల్దేరాం. ఊరి చివర, నది ఒడ్డున వరద మేటు వేసి తరలిపోయిన చోటల్లా రెల్లు. ఆ రెల్లుపూలని అట్లా చూస్తూనే ఉండిపోయాను. శిశిరవసంతాల మధ్య వచ్చే విచిత్రమధురమైన మార్పు మనకి ఎలానూ తెలుసు, కాని వర్షాకాలానికీ, శరత్కాలానికీ మధ్యవచ్చే కుసుమపేశలమైన మార్పుని ఇన్నాళ్ళకు గుర్తుపట్టాన్నేను. ఆ రెల్లు పొదల మధ్య, అదృశ్య, అనాహత మురళీగానం వినబడుతోందని కూడా అర్థమయింది నాకు. అట్లాంటి కాశమయసాంధ్యవేళల్లో ఎన్నిసార్లో సంచరించి ఉంటారు కాబట్టే శుకుడు, లీలాశుకుడు, జయదేవుడు అట్లాంటి కృష్ణగానం చెయ్యగలిగారు.

ఒక మనిషి జీవితం సార్థకంగా జీవించాడనడానికి ప్రమాణాలేమిటి అనడిగాడు ఎరిక్ ఫ్రామ్ ఒక పుస్తకంలో. ఈ రెండు వారాలూ పగలంతా ఏ పని వ్యగ్రతలోనైనా గడిపి ఉండవచ్చు నేను, కాని సాయంకాలాలు ఆకాశమంతా ఆవరించిన మేఘమండలాల్నే చూస్తో, ఎక్కడ ఏ నెర్రెలో ఇంత మట్టిచేరినా అక్కడ తెల్లనెమళ్ళ గుంపు వాలినట్టు పూసిన రెల్లుపొదల్నే చూస్తూ గడిపాను. నా జీవితం సఫలమయింది, సార్థకమయింది.

'ఆ ఊరి చివర అడవిలో పిల్లంగోవి ఊదుకునే ఒక పిల్లవాణ్ణి చూడు, నువ్వు మళ్ళా తిరిగిరానక్కర్లేని దారి చూపిస్తాడు' అన్నాడు కృష్ణకర్ణామృతకారుడు. అట్లాంటి దారి ఏదో చూడగలిగాను. ఇప్పుడు ఈ క్షణాన ఈ లోకం నుంచి సెలవు తీసుకోమన్నా తృప్తిగా వెళ్ళిపోతాను.

7-10-2021

# మోహచంద్రరాత్రి

**పున్నములన్నింటిలోనూ** ఏ పున్నమి అందమైంది అని ఈ మధ్య ఎవరో నాకు మెసెంజరులో ఓ ప్రశ్న పంపించారు. ఏదని చెప్పను? ఏడాది పొడుగునా పన్నెండు పున్నములూ నాకు ప్రీతిపాత్రమైనవే. ఆకాశమంతా మబ్బులు కమ్మి చంద్రుడి జాడ కూడా కనిపించని శ్రావణ పౌర్ణమిరాత్రి కూడా నాకొక తీపివెలుతురు గోచరిస్తూనే ఉంటుంది. ఇక నిర్మలమైన గగనసీమలో చంద్రుడొక హంసలాగా తేలియాడే పున్నములంటే, ఫాల్గుణం, చైత్రం, వైశాఖం, శరత్పూర్ణిమ, కార్తికపూర్ణిమల గురించే చెప్పాలి. అందులోనూ వైశాఖపూర్ణిమ ఒక నడివేసవి రాత్రి కలలాంటిది. పండినపొలాల్లో కనకవర్ణశోభతో కదలాడే వరికంకులమీంచి మంచు మధ్య తడిసిపోయే మార్గశిరపౌర్ణమి నాటి harvest moon అందం చూసినవారికే అనుభవం.

కాని పున్నములన్నిటిలోనూ ఏ పున్నమి నిన్ను వివశుణ్ణి చేస్తుందని అడిగితే మాత్రం ఫాల్గుణపూర్ణిమ అనే చెప్తాను.

ప్రతి ఫాల్గుణపున్నమికీ నాకు ప్రకృతి నుంచి ఒక ఆహ్వానం వస్తూనే ఉంటుంది. విజయవాడ వచ్చిన తొలిరోజుల్లో ఒక ఫాల్గుణపౌర్ణమి తాళాయపాలెం కృష్ణానదిలో ఒక తెప్పమీద తేలియాడేను. ఈసారి ఆ ఆహ్వానం 'చేతన' ఆశ్రమం నుంచి వచ్చింది.

స్వర్గమంటూ ఉంటే అది ఈ భూమ్మీద ఇక్కడే ఉంది అని అమీర్ ఖుస్రో భారత దేశంలో ఏ తావుని చూసి అన్నాడో గాని, నాకు డా.మంగాదేవిగారు నడుపుతున్న చేతన ఆశ్రమం చూసినప్పుడల్లా ఆ తావు ఇక్కడే అనిపిస్తుంది. ఆమె పరిచయమైన ఈ పదిహేను ఇరవై ఏళ్ళ కాలంలోనూ ఈ ప్రాంగణానికి ఎన్నో సార్లు వచ్చాను.

ఇక్కడ ఈ నందననికుంజంలో పూలసువాసనలు ఆఘ్రాణిస్తో ఈ పిల్లలతో ఎన్నోసార్లు ముచ్చటించేను. కాని ప్రతి సారీ ఈ ముంగిలి ఒక బంగారువాకిలి గానే తోస్తుంది.

మనం మరీ ఇంత నిష్ఠురంగా ఉందేమిటీ అనుకునే ఈ ప్రపంచం మధ్యనే ఆమె ఒక కొత్త బంగారులోకాన్ని సృష్టించడమే కాదు, దాన్ని పడిపోకుండా నిలబెట్టారు కూడా.

నిన్న సాయంకాలం త్వరత్వరగా చేతన ప్రాంగణానికి చేరుకున్నాను. 'మీ ప్రాంగణంలో చెట్ల మధ్యనుంచి చంద్రోదయం చూడాలి కదా' అన్నాను ఆమెతో. నేనూ, విజ్జీ ఆ ఆవరణలో అడుగుపెట్టేటప్పటికి సున్నితంగా గాల్లోంచి వేపపూల పరిమళం చేతులు చాపింది. పిల్లలు ఒక పక్క చెట్ల కింద కోలాటం ప్రాక్టీసు చేస్తున్నారు. మరొక పక్క ప్రభావతిగారి స్మారకమందిరం దగ్గర బాలబాలికలు సంగీతసమారోహానికి సిద్ధమవుతున్నారు.

పాఠశాల ప్రాంగణంలో ఒకపక్క మంకెనలు, బూరుగలు చివరి పూలతో, రాలిన ఆకుల మధ్య శిశిరానికి సెలవు పలుకుతున్నాయి. మరొకపక్క నిండారా విరబూసిన వేపచెట్లు, మామిడి చెట్లు, పచ్చ బూరుగలు, రాధా మనోహరాలు ఆగామి వసంతానికి ఎలుగెత్తి బూరాలు ఊదుతున్నాయి. మేము ఆ ప్రాంగణమంతా ఒక చుట్టు చుట్టి వచ్చి తాటిచెట్టు కుటీరం దగ్గర నిలబడేటప్పటికి దూరంగా చెట్లమీంచి తేనెలోమునిగి తేలిన పూర్ణచంద్రుడు ఆకాశవేదికమీద అడుగుపెడుతున్నాడు. ఈ చంద్రుడు శరశ్చంద్రుడు కాడు. ఇతణ్ణి మోహనచంద్రుడు అనాలి, ఇంకా చెప్పాలంటే మోహచంద్రుడనాలి. లేకపోతే నిలువెల్లా ఆ జీర ఏమిటి?

నెమ్మదిగా పిల్లలంతా వచ్చి కూచున్నారు. ఆ ప్రాంగణంలో అంతా కూచున్నాక, కొందరు బాలబాలికలు పాటలు పాడటం మొదలుపెట్టారు. వాళ్ళ సంగీతం మాష్టారు కోటి. ఆయన అప్పటికే కోటి గొంతులు శ్రుతి చేసి ఉన్నాడేమో, పిల్లలు మహామధురంగా వసంతాన్ని ఆహ్వానిస్తో గీతాలాపన మొదలుపెట్టారు:

ఓహో ఓహో వసంతమా, నవ జీవన మోహన వికాసమా
భావుక పులకిత హృదంతమా, సుమబాల పరీమళ విలాసమా.

ఒకప్పుడు శాంతినికేతనంలో టాగోర్ ఇట్లానే చేసేవాడని విన్నాను. ఋతువులు మారుతున్న ప్రతివేళా ఒక కొత్త గీతం రాసి తానే స్వరకల్పన చేసి పిల్లలకు నేర్పేవాడట. కొన్నిసార్లు ఒక్క పాట కాదు, ఒక నృత్యనాటికనే రాసేవాడట. 'చిత్రాంగద', 'ముక్తధార', 'రక్తకరబి' లాంటి సంగీత రూపకాలన్నీ అలా రూపొందినవే. ఇది మరొక శాంతినికేతనం. బీద పిల్లల శాంతినికేతనం. ఇక్కడ ఒక టాగోర్ లేదు. కాని తల్లిలాంటి మంగాదేవి

ఉన్నారు. పిల్లలు ఎక్కణ్ణుంచో ముక్కున కరిచి తెచ్చుకున్న పాటలున్నాయి. స్వరాలున్నాయి, చలిస్తున్న హృదయాలున్నాయి. చుట్టూ నోరు తెరుచుకుని వింటున్న పూలచెట్లున్నాయి.

అలా ఎంత సేపు గడిచిందో తెలీదు. పిల్లలు పాటలు పాడుతూనే ఉన్నారు. కోలాటం ఆడేరు. నాట్యం చేసారు. నెమ్మదిగా చంద్రుడు మా అందరినీ చూసేటంత పైకి వచ్చాడు. అప్పటిదాకా మాకూ చంద్రుడికీ అడ్డంగా ఉన్న వీథిదీపాలు ఆర్పేయడంతో ఆయన అందరినీ, ప్రతి ఒక్క బాలుణ్ణీ, బాలికనీ మృదువుగా తాకేడు. ఎంత మెత్తగా తాకేడంటే, 'అబ్బ, వెన్నెల ఎంత బావుందీ' అన్నారు పిల్లలు.

ఎన్నాళ్ళయింది ఇట్లాంటి వెన్నెల రాత్రి ఒకటి గడిపి. అందులోనూ పిల్లల మధ్య. నువ్వు వెన్నెలని ఎక్కడైనా, ఏ ప్రియసన్నిధిలోనైనా, ఏ నది ఒడ్డున, ఏ తోటలోనైనా గడిపి ఉండవచ్చుగాక, కాని ఒక బళ్ళో, చెట్ల మధ్య, పాటలు పాడే పిల్లమధ్య గడపడంలో ఉండే సంతోషమే వేరు. బహుశా అప్పుడు ఆ వెన్నెల్లో భగవంతుడు కూడా స్వయంగా వచ్చి మన మధ్య కూచుంటాడనుకుంటాను.

మంగాదేవి గారి హృదయం సంతోషంతో నిండిపోయిందని తెలుస్తూ ఉంది. ఆమె తన మిత్రురాలు ఒకామెకి ఫోను చేసి ఆమె పాడిన పాట ఒకటి పంపమని అడిగారు. డెబ్బై ఏళ్ళుంటాయట ఆ పాట పాడినామెకు. ఆమె పాడినదొక అపురూపమైన రామ ప్రేమ గీతం.

రామ రామ రామ యన్న రామచిలుక ధన్యము
రామ ప్రేమ చూరగొన్న చిట్టి ఉడుత ధన్యము.

చిలుకలకీ, ఉడతలకీ, పక్షులకీ, కోతిమూకకీ ప్రేమ పంచిన రాముడు కూడా అక్కడకి రావడంతో ఆ సంగీతసమారోహం సుసంపన్నమైంది. నెమ్మదిగా పిల్లలూ, పెద్దలూ కూడా సెలవు తీసుకున్నారు. ఆ ప్రాంగణంలో నేనూ, విజ్జీ మిగిలాం. మా చుట్టూ చెట్లూ, పైన నిండు చంద్రుడూ. ఆ వెన్నెల మధ్య పూలబాసలు తీరిగ్గా వినడానికి ఒళ్ళంతా వీనుగా మార్చుకుని మరికొంతసేపు తిరిగాము. కాని వెన్నెల రాత్రుల అందం, చంద్రోదయవేళ, చంద్రుడు నడి ఆకాశానికి వచ్చిన వేళా మాత్రమే కాదు, ఇంకా తెల్లవారని వేళ పడమటి ఆకాశానికి ఆ చంద్రనావ పయనమయ్యే చివరి వేళల్లో కూడా చూడాలి.

అందుకని మళ్ళా నాలుగింటికి లేచాం. మరొకసారి ఆ ప్రాంగణమంతా కలయ దిరిగాం. రాత్రి ఎవరో జలాశయానికి గేటు తెరిచినట్టు ప్రాంగణమంతా వేపపూలగాలితో

నిండిపోయింది. రాత్రంతా వెన్నెల వాన కురిపించి చంద్రుడు తన పడవని పడమటి వైపు తీసుకుపోతూ ఉన్నాడు. మేమిక్కడ ఉండిపోయామా లేక ఆ పడవలో వెళ్ళిపోయామా? ఉన్నామని చెప్పవచ్చుగాని, ఉండిపోయిన మేమిద్దరం నిన్నటి మనుషులం మాత్రం కాదు.

19-3-2022

# మళ్లీ హైదరాబాదుకి

**ఏడాది** కింద హైదరాబాదునుంచి విజయవాడ వచ్చేసాననీ, ఇక ఇక్కణ్ణుంచి నేరుగా అడవికే వెళ్ళిపోతాననీ అనుకున్నాను. వెళ్ళిపోవాలనే ఇప్పటికీ అనుకుంటున్నాను. కాని మధ్యలో మళ్ళా కొన్నాళ్ళు నగరవాసం రాసిపెట్టి ఉంది. ప్రాచీన చీనాకవిత్వం చదివి చదివి నా జీవితం కూడా చీనాకవుల జీవితంలాగా మారిపోయినట్టుంది. అప్పట్లో చీనా ఏకంగా ఉండేటప్పుడు వాళ్ళ రాజధాని చాంగాన్‌లో ఉండేది. కాని అది పడమటి చీనాగానూ, తూర్పుచీనా గానూ విడిపోయినప్పుడల్లా, రాజధాని లొయాంగ్‌కి మారి పొయ్యేది. ఆ కవులు కొందరు చాంగాన్‌లోనే జీవితకాలం జీవించినవాళ్ళున్నారు, కొందరు లొయాంగ్‌లోనే పుట్టి పెరిగినవాళ్ళున్నారు. కాని కొందరు మాత్రం. దు-ఫూ లాంటి వాళ్ళు చాంగాన్‌కీ, లొయాంగ్‌కీ మధ్య వస్తూ పోతూనే జీవితమంతా గడిపేసారు. చూడబోతే నా కథ కూడా అలానే ఉంది.

విజయవాడ మొదటిసారి 1972 లో చూసాను. నా తండ్రి నన్ను తాడికొండ తీసుకువెళ్తూ ఉన్నప్పుడు. ఆ తర్వాత స్కూలుకీ, కాలేజీకి సెలవులిచ్చినప్పుడల్లా ఇంటికి వెళ్ళేటప్పుడూ, వచ్చేటప్పుడూ విజయవాడని చూస్తూనే ఉన్నాను. కాని ఇక్కడ ఎప్పుడూ ఉంటాననుకోలేదు.

2016 దాకా.

అప్పుడు మొదటిసారి ఆర్నెల్ల పాటు ఈ ఊళ్ళో ఉన్నాను. ఇంకా చెప్పాలంటే ఊరవతల, కృష్ణానదికి దగ్గరలో. కాని మళ్ళా వెళ్ళిపోయాను. తిరిగి మళ్ళా 2019 లో అడుగుపెట్టాను. ఈ మూడేళ్ళూ ఈ ఊరిని పూర్తిగా చూసాను. కొన్నాళ్ళు గవర్నరుపేటలో, మరికొన్నాళ్ళు ఇబ్రహీంపట్నంలో, ఇప్పటిదాకా గొల్లపూడిలో. అన్ని వేళల్లోనూ, అన్ని అవస్థల్లోనూ ఈ ఊరిని చూసాను. వరద పోటెత్తినప్పుడు, ప్రోషితభర్తృకలాగా కృశించి

నప్పుడూ కూడా కృష్ణమ్మని చూసాను. మండే ఎండలు చూసాను. ఎండల్లో కూడా నేనెక్కడుంటే అక్కడికి వెంటబడే కోయిలని విన్నాను. వానలు ముగిసాక తెల్లనెమళ్ళు వాలినట్టుగా నదీ తీరం పొడుగునా వికసించిన రెల్లుపొదల్ని చూసాను. భయంకరమైన లాక్‌డౌన్ కూడా చూసాను. ఊరంతా కరోనాకి భయపడి లోపల్లోపలే దాక్కుని గడిపిన దుర్భరకాలాన్ని కూడా చూసాను.

కాని ఈ ఊరు నిజంగా విజయపురి. నాకు సంతోషాన్నిచ్చింది. ధైర్యాన్నిచ్చింది. ఒకప్పుడు ఒక రాజు ఇక్కడ ధర్మానికీ, న్యాయానికీ కట్టుబడి జీవించినప్పుడు కనకవర్షం కురిపించిందట. నామీద బంగారాన్నిమించిన ఆశీస్సుల్ని కురిపించింది. దాచుకుంటాను, ఇక్కడ గడిపిన రోజుల్ని, నది ఒడ్డున తెల్లవారిన ప్రభాతాల్ని, నిశ్చింతగా నిద్రపోయిన రాత్రుల్ని.

ఒకప్పుడు రాజమండ్రికి సెలవు చెప్తూ జీవనవైరుధ్యాలు రెండింటినీ ఆమె నాకు రుచి చూపిందని చెప్పుకున్నాను. ఈ ఊళ్ళో కూడా మంచి చెడులు రెండూ నాకు అనుభవానికొచ్చి ఉండవచ్చు. కాని విజయవాడ నాకు మంచిని మాత్రమే గుర్తుండిపోయేలా చేసింది. ఆ పరిణతిని నాకు నేర్పినందుకు ఆ తల్లికి నా సాష్టాంగప్రణామాలు.

1982 లో మొదటిసారి ఉద్యోగంలో చేరాను. రాజమండ్రిలో టెలిఫోన్ రెవెన్యూ ఆఫీసులో. నలభయ్యేళ్ళ ఉద్యోగజీవితం గడిచింది. పని ఎక్కడ ఉందంటే అక్కడికి పెట్టే బేడా సర్దుకుపోయాను. ఇప్పుడు ఉద్యోగం నుంచి పక్కకు తప్పుకున్నాక ఎక్కడికి వెళ్ళడం?

నేను కమ్యూనిస్టుని కాను. కాని నాకంటూ సొంత ఆస్తి సరికదా సొంత ఇల్లు కూడా లేదు. కాండక్టు నియమావళి ప్రకారం ప్రతి ప్రభుత్వోద్యోగీ ప్రతి ఏడాదీ తాను కూడబెట్టుకున్న స్థిరాస్తి, చరాస్తి వివరాలు ప్రభుత్వానికి నివేదించాలి. ఆ రూల్సు ప్రకారం, యాభై వేలకు పైబడి ఏ వస్తువు కొనుక్కోవాలనుకున్నా ప్రభుత్వం అనుమతి తీసుకోవాలి. దాదాపు ముప్పైఅయిదేళ్ళు ప్రభుత్వసేవలో గడిపాను. అందులో ముప్పైనాలుగేళ్ల యాన్యువల్ ప్రోపర్టీ రిటర్నులు నిల్ రిపోర్టులే. ఒక్క ఏడాది మాత్రం ప్రభుత్వం అనుమతితో, ప్రభుత్వం ఇచ్చిన అప్పుతో చిన్న కారు కొనుక్కున్నాను. అది తప్ప నాకు మరే స్థిరాస్తి లేదు, చరాస్తి లేదు.

నేను కాపిటలిస్టుని కూడా కాను. నా జీవితంలో ఒక రూపాయి ఏ ఒక్క వ్యక్తికీ వడ్డీ కట్టలేదు, ఒక రూపాయి ఎవరికీ వడ్డీకి ఇవ్వలేదు. 'నీ జాతకంలో షష్టాధిపతి నీచపడ్డాడు. నీకు శత్రు, రోగ, ఋణ బాధ ఉండదు' అన్నాడు టెలిఫోన్సు ఆఫీసులో నా

కొలీగ్ ఒకాయన, నలభయ్యేళ్ళ కిందట. రోగాలు లేకుండానే గడిచింది జీవితం. ఋణరహితం కూడా, ధనరూపేణా చూసుకుంటే. కాని నా మీద అయాచితంగా అభిమానం కురిపించినవారికి ఋణగ్రస్తుణ్ణి కానని ఎట్లా చెప్పుకోగలను? ఇక శత్రువులు. బయటి జీవితంలో నన్ను తిట్టినవాళ్ళూ, తగాదా పడ్డవాళ్ళూ, ఆరోపణలు చేసినవారూ, దుమ్మెత్తి పోసినవాళ్ళూ లేకపోలేదు గానీ, వాళ్ళని శత్రువులని ఎట్లా అనగలను? కబీరు చెప్పినట్టు 'నన్ను నిందించేవాడెంత త్యాగి! వాడు మునుగుతూ నన్ను తేలుస్తున్నాడు!' కాని నిజమైన శత్రువులు, అంతశ్శత్రువులు, నా లోపలే ఉన్నారు. వారి బాధ నేనెంత పడ్డానో నా మిత్రుడికేమి తెలుసు? కాని అతడి మాటలే నిజమై, ఆ అంతశ్శత్రువేధ కూడా లేకపోతే, అది కదా జీవితం!

నిన్న ఒక మిత్రురాలింటికి వెళ్ళాను. తన బిడ్డల్ని చూసి ఆశీర్వదించమని అడిగితే. చిన్నారి బిడ్డలు. కవల పిల్లలు. మూడేళ్ళ వయసు బొమ్మలు. ఉన్నంతసేపూ వాళ్ళ మాటల్తో నా హృదయం నెమలిలాగా పురివిప్పి ఆడుతూనే ఉంది. నాతో వచ్చెయ్యండి, తీసుకు వెళ్ళిపోతాను అన్నాను ఆ పిల్లల్తో. ఒక పిల్ల, చిన్నది, రానంది. పెద్ద పిల్ల, 'నాతో పాటు మా అమ్మ, మా చెల్లి, మా అమ్మమ్మ, మా తాత అందరూ వస్తే వస్తాన'ంది. 'వాళ్ళందర్నీ తీసుకువెళ్ళలేను, నువ్వొక్కర్తివే రా' అన్నాను. రానంది. తీరా నేను వాళ్ళనుంచి సెలవు తీసుకుని ఇంటి బయట అడుగుపెట్టేటప్పటికి, ఆ పసిగుడ్డు, గబగబా చెప్పులు తొడుక్కుని 'రా అమ్మా వెళ్ళిపోదాం' అని అడగడం మొదలుపెట్టింది. తనని తీసుకువెళ్ళకుండానే నేను వెళ్ళిపోతానని ఆ బిడ్డకు ఎట్లా తట్టిందో, ఆ మెలకువకి, ఆ చిన్నారి నేత్రాల చుట్టూ తడి ఊరడం మొదలుపెట్టింది.

చినవీరభద్రుడూ, చూసావా! ఒక ఆగంతకుడు ఇంటికి వచ్చి నాలుగు మాటలు నవ్వుతూ మాట్లాడితే సర్వం మరిచి అతడి వెంట వెళ్ళడానికి సిద్ధపడ్డ ఆ పసికూన నీకేమి చెప్తున్నదో విన్నావా!

ఇంకా ఆలస్యం ఎందుకు? బయల్దేరు మరి.

11-4-2022

# ఒక తేనెటీగకి ఎంత గూడుకావాలి!

**నత్త** ఎక్కడికి వెళ్ళినా తన గుల్లని వెంటబెట్టుకు తిరిగినట్టు నేను నా గ్రంథాలయాన్ని మోసుకుంటూ తిరుగుతున్నానని అర్థమయింది. ఒక ఊరినుంచో ఒక ఇంటినుంచో మరో ఊరికో మరో ఇంటికో మారుతున్నప్పుడల్లా ఎన్ని పుస్తకాలో ఏరి ఏ గ్రంథాలయానికో ఇచ్చేస్తూ వచ్చిన తరువాత కూడా ఇంకా వందలాది పుస్తకాలు నాతోనే మిగిలిపోయాయి. తత్త్వశాస్త్రం, అలంకార శాస్త్రాల్లాంటివి ఎప్పుడో వదిలిపెట్టేసాను. కానీ కవిత్వం, కొన్ని నాటకాలు, కొన్ని నవలలు, చిత్రకళకీ, సినిమాకళకీ సంబంధించిన పుస్తకాలు ఎవరికీ ఇవ్వలేనని అర్థమయింది.

ఇన్ని పుస్తకాలు నా ఇంటిని ఆక్రమిస్తే ప్రతి ఒక్క పుస్తకం వెనక అది కొన్నప్పటి ఊరు, వేళ, ఎవరితో కలిసి వెళ్ళి ఏ షాపులో కొన్నానో ఆ జ్ఞాపకాలు కూడా నా మనసంతా ఆక్రమించి ఉన్నాయి. నేనూ నా భార్యా పిల్లలూ, నలుగురం జీవించడానికి దొరికిన ఈ చిన్న చోటులో కూడా మమ్మల్ని పక్కకు నెట్టేసి ఎటు చూడు పుస్తకాలూ, వాటిని రాసినవాళ్ళూ.

చిన్నప్పుడు మా ఇంట్లో ఒక పుస్తకాల రాకు ఉండేది. ఆ తర్వాత మొదటిసారి రాజమండ్రిలో మిత్రుడు మహేశ్ ఇంట్లో ఒక పర్సనల్ లైబ్రరీ చూసాను. ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు చదువుకోవడానికి వీలుగా ఇష్టమైన పుస్తకాలతో ఒక లైబ్రరీ కలిగిఉండటమనేది గొప్ప భాగ్యం అనిపించింది. ఇంట్లో చిన్న గ్రంథాలయం, ఇంటిచుట్టూ తోట– ఒక మనిషి జీవితంలో ఇంతకన్నా కోరుకోవలసింది ఏముంటుంది?

నేను రిటైరయినా కూడా నాకు సొంత ఇల్లు లేదని రాసుకుంటే దానిమీద ఎవరి వాల్ మీదనో పెద్ద చర్చ జరిగిందని ఒక మిత్రురాలు నాకు చెప్పింది. అక్కడితో ఆగకుండా ఆ లింకు కూడా నాకు పంపించింది. ఆ చర్చ కొంత చదివాను. అందులో ప్రధానమైన

ఆర్గుమెంటు ఏమిటంటే, ఈరోజుల్లో ఎంత చిన్న ఉద్యోగికైనా ఇల్లంటూ ఉంటుందనీ, చివరికి ఎస్.ఆర్. శంకరన్ గారికి కూడా ఒక ఇల్లు లేకపోలేదనీ, కాబట్టి ఒకడు తనకి ఇల్లు లేదు కాబట్టి తాను నీతిమంతుణ్ణని గొప్పలు చెప్పుకోనక్కర్లేదనీ.

నాకు అది చదివి నవ్వొచ్చింది. ఇల్లు కట్టుకోవడం ఒక ఛాయిస్. ప్రభుత్వోద్యోగిగా నాకు వచ్చే జీతంతోనే నేను ఇల్లు కట్టుకోగలిగే ఉందును. ఇప్పుడు నాకు రాబోయే పెన్షనరీ బెనెఫిట్సుతో చిన్న పాటి ఇల్లు కట్టుకోవడం ఏమంత కష్టం కాదు. కాని నా కలలు వేరే ఉండవచ్చు కదా. ఎస్.ఆర్.శంకరన్ గారు ఋషి. ఆయనకి చిన్నపాటి ఇల్లు సరిపోయి ఉండవచ్చు. నేను ఋషిని కాను, కవిని. సౌందర్యారాధకుణ్ణి. నాకు ఇల్లు ముఖ్యంకాదు. ఇంటిచుట్టూ తోట ముఖ్యం. ఆ ఇంటినుంచి బయట అడుగుపెట్టగానే బషోకి ఫూజియామా కనబడినట్టు నాకో కొండ కనిపించాలి. సాయంకాలం నడిచివెళ్ళేంత దూరంలో ఒక అడవినో, నదినో లేదా మహాసముద్రమో ఉండాలి. ఎన్ని గదుల ఇల్లు కట్టుకుందామని నేనెప్పుడూ ఆలోచించలేదు. ఎంత ఇల్లు కట్టుకుంటే నా పుస్తకాలన్నీ జాగ్రత్తగా పెట్టుకోగలననన్నదే నా చింత.

ఆ చర్చలోనే మరొకాయన రాసాడు కదా: 'ఆయనకి ఇల్లు మాత్రమే లేదు' అని. నాకు సొంతఇల్లు మాత్రమే లేదని రాసానుగాని, ఇల్లు లేదని ఎక్కడన్నాను? నా పదవీ విరమణ రోజున మా శాఖకు చెందిన మిత్రులు జరిపిన వీడ్కోలు సభలో ప్రకాశం జిల్లా తుమ్మలబయలు చెంచుగూడెం నుంచి వచ్చిన మూగెన్న అందరూ వినేట్టుగా చెప్పాడు: 'సార్, మా గూడెంలో మీకోసం ఒక ఇల్లు ఉంది. మీరు ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు వచ్చి ఉండండి' అని. దాదాపుగా ఇటువంటి ఆఫర్ ఇవ్వగలిగిన మిత్రులు ప్రతి జిల్లాలోనూ ఒకరేనా ఉంటారని నా నమ్మిక.

మా కుటుంబాన్ని మా బంధుమిత్రులు ఒక చెంచు కుటుంబంతో పోలుస్తూ ఉంటారు. ఎందుకంటే మేము ఎక్కడికి వెళ్ళినా నలుగురం కలిసే వెళ్తుంటాం. ఎవరింటికి వెళ్ళినా చిన్నగదిలో సర్దుకుపోతాం. మా అవసరాలకు చిన్న గది సరిపోతుంది. కాని పుస్తకాలకి? ఆ పుస్తకాలు చదువుకోడానికి ఇంటిముందు అరుగు ఉండాలి కదా. చుట్టూ కంచె మీద కాశీరత్నం తీగె పూలుపూస్తుండాలి కదా. ఆ ఇంటి ముంగిట పందిరిమీద వేసవిలో రాధామనోహరాలు, వానాకాలం విరజాజులూ, శరత్కాలం పారిజాతాలూ, హేమంతంలో చామంతులూ విరబూస్తూండాలని కదా నా కోరిక.

ఒక తేనెటీగకి ఎంత గూడు కావాలి? కాని ఒక మహారణ్యం కూడా దాన్ని తృప్తి పరచదు. ఎంత విస్తారమైన పూలవనం ఉంటే దానికంత ప్రీతి. తీరా అది ఇల్లు కట్టుకోవడం

మొదలుపెడితే దాని ప్రతి గదిలోనూ తేనెతోనే నింపిపెట్టుకుంటుంది కదా. నేను కూడా అంతే. నాకు ఇల్లొక్కటే చాలదు, పుస్తకాలు కావాలి, ప్రతి సాయంకాలం, ఇంటి అరుగుమీద, ఆ పుస్తకాల గురించి మాట్లాడుకోడానికి ఒక మిత్రబృందం కావాలి. మేము మాట్లాడు కుంటూ ఉంటే వినడానికి వచ్చిన నక్షత్రాలతో ఆకాశం కిక్కిరిసిపోవాలి.

ఇల్లు అంటే ఒక కప్పు కాదు. నామటుకు నాకు అది నా మనసు ఆగే చోటు. ఎన్ని పట్టణాల్లో ఎన్ని ఇళ్ళల్లో నివాసమున్నాను! కాని ఇక్కడే ఆగిపోదాం అని ఇప్పటిదాకా ఎక్కడా అనిపించలేదు. నేను పుట్టిన ఊళ్ళో తప్ప. అది కూడా, మా ఊరుకి దక్షిణం వేపు కాదు. ఉత్తరం వైపు ఏరుదాటి జాగరాలమ్మ గుడి వైపుగాని లేదా ఈశాన్యం వైపు వణకరాయి గ్రామంలోగాని లేదా తూర్పువైపు మా ఊరిని ఆనుకుని ఉన్న కొండకింద లోయలోగాని– అక్కడ మా అమ్మ ముగ్గు పెట్టి చిమ్నీ తుడిచి ప్రతి సాయంకాలం హరికేన్ లాంతరు వెలిగిస్తూ ఉంటుందని నా నమ్మిక. అక్కడి నుంచి చూస్తే నల్లటి గొడుగు వేసుకుని మధ్యాహ్నపుటెండలో మా నాన్నగారు కాకరపాడు సంతకి వెళ్తూ కనబడతారు. ఆ చోటుదగ్గర తప్ప నా మనసు మరెక్కడా ఆగలేదు.

1972 లో వదిలిపెట్టాను మా ఊరిని. యాభై ఏళ్ళయింది. ఇప్పుడేనా అక్కడ ఇల్లు కట్టుకోగలనేమో అనుకున్నాను. కాని వీలయ్యింది కాదు. ఆ ఆలోచన మరి కొన్నాళ్ళు వాయిదా వెయ్యక తప్పింది కాదు. బహుశా ఆ కోరిక నెరవేరకనే పోవచ్చు. కనీసం నేను ఈ లోకాన్ని వదిలిపెట్టినప్పుడైనా, మా ఊరి ఏటి ఒడ్డున తెల్లమద్ది చెట్టు నీడలోనైనా నాకు ఆరడుగుల నేల దొరికితే చాలనుకుంటున్నాను. ఆ ఏటి ఒడ్డున ప్రతి వసంత కాలంలోనూ, పూర్వమహాకవులంతా, తమ పద్యాలు నాకు వినిపించడానికి, కోకిలలై తప్పక వస్తారనుకుంటాను.

23-4-2022

# మరొక నూరేళ్ళు బతకాలనిపిస్తున్నది

**ఇంకా** తెల్లవారని ఈ ఆషాఢమాస ప్రత్యూషాన కోయిల ఒక్కటీ మేల్కొని తన వంతు కూజితం తను ఎలుగెత్తి కూస్తూనే ఉన్నది. గీతాంజలిలో టాగోర్ మొదటి పుటలోనే ఒక వాక్యం రాసిపెట్టుకున్నాడు: Faith is the bird, that feels the light, when the dawn is still dark అని. లోకం ఇంకా నిద్రపోతుండగానే సుప్రభాతాన్ని ఎవరు కలగనరో, ఎవరు తమ గానంతో, కవిత్వంతో, కార్యాచరణతో మేల్కొల్పగలరో, వారిదే నిజమైన జీవితం, వారు జీవించినందువల్లనే ఈ పృథ్వి మరింత పులకిస్తుంది.

నాకు టాగోర్‌ని చూస్తే అదే అనిపిస్తుంది. దేశం ఇంకా బానిసత్వంలో ఉండగా అతడు స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నాడు. దేశం స్వతంత్రమయ్యాక మళ్లా అటువంటి మహా మానవుడు ఎవరూ నా కళ్ళకి కనిపించడం లేదు. తన పాటల్తో, బొమ్మల్తో, సంగీతంతో, తన పాఠశాలతో, తన ప్రసంగాలతో ఈ లోకమ్మీద వెలుగు వాన కురిపించగల ఆ ఆషాఢమేఘమేదీ మళ్ళా ఈ భారతీయ ఆకాశం మీద నాకు గోచరించడం లేదు.

చాలా ఆలస్యంగా చూసాను, టాగోర్ 70 వ ఏట, ఆయనకి ప్రపంచం సమర్పించిన పుట్టినరోజు కానుకని. The Golden Book of Tagore (1931) పేరిట వెలువరించిన నీరాజనాన్ని. నాకు తెలిసి ఇటువంటి పుష్పాంజలి ప్రపంచంలో ఏ కవికీ, ఏ కళాకారుడికీ కూడా లభించి ఉండదు.

నాలుగువందల పేజీల ఈ సప్తతిపూర్తి సంచికకి ప్రధాన సంపాదకులు ఎవరో తెలుసా? అయిదుగురు మహనీయులు. మహాత్మాగాంధి, ఐన్‌స్టీన్, రోమేరోలా, గ్రీకు జాతీయ కవి కోస్టెస్ పలమాస్, జగదీశ్ చంద్రబోస్. ఇక ఇందులో టాగోర్‌కి తమ నుతులు, స్తుతులు, శుభాకాంక్షలు అందించినవారిలో బిపిన్‌చంద్ర పాల్, అరవిందులు, రాధాకృష్ణన్, నెహ్రూలతో పాటు యేట్సు, స్టెఫాన్ జ్వెయిగ్, పాల్ వేలరీ, బెట్రండ్ రస్సెల్,

జూలియన్ హక్సలి, థామస్ మన్, నట్ హామ్సన్, మారిస్ మాటర్లింక్, విల్ డురాంట్, బెనెడిట్టొ క్రోసే, నికొలస్ రోరిక్ వంటివారున్నారు. దేశాధినేతలు, ధార్మికనాయకులు, శాంతిదూతలు ఉన్నారు. వారంతా ఒక కవికి, ఒక సంగీతకారుడికి కాదు, ఒక విశ్వ మానవుడికి తమ సంస్తుతి సమర్పించుకున్నారు.

ఆ పుస్తకాన్ని రోజూ తెరుస్తూనే ఉన్నాను. ఒకటో రెండో వ్యాసాలు చదువుతూనే ఉన్నాను. కాని అన్నిటికన్నా ముందు, ఆ పుస్తకం పుటలు తెరవగానే నా వంట్లో ఎంత విద్యుత్తు ప్రవహిస్తోందని? ఎంత జీవితేచ్ఛ నాలో పొంగిపొర్లుతోందని. నాకు మరొక నూరేళ్లు బతకాలనిపిస్తున్నది. చదవాలనిపిస్తున్నది, రాయాలనిపిస్తున్నది, బొమ్మలు గియ్యాలనిపిస్తున్నది, పాటలు కట్టాలనిపిస్తున్నది, సంగీత ప్రపంచంలోకి ప్రవేశించాలని పిస్తున్నది.

ఒక మనిషి ఈ భూమ్మీద పుడితే, నడయాడితే, ఇదిగో, వందేళ్ళ తరువాత కూడా, నూటయాభై ఏళ్ళ తరువాత కూడా ఇంత భావోద్వేగాన్ని రేకెత్తించగలగాలి. ద్వేషం కాదు, దూషణ కాదు, ఇదుగో, ఇంత ప్రేమ పంచగలగాలి, ఇందరు మనుషులు, ఇన్ని జాతులు, ఇన్ని దేశాలు నిన్ను తమవాడనుకోగలగాలి.

ఆ మనిషిని చూస్తే ఎవరికి వారికి తమ భాషలో, తమ ప్రాంతంలో, తమ సంస్కృతిలో ఉత్తమోత్తమమైనవి గుర్తురావాలి. ఈ పుస్తకంలో కనీసం ఇద్దరు మరాఠీ పండితులు టాగోర్ని తలుచుకోగానే తుకారాం గుర్తొస్తాడని రాసారు. వట్టినే గుర్తురావడం కాదు, ఇద్దరూ కూడా రెండు అభంగాల్ని గుర్తుచేసుకోకుండా ఉండలేకపోయారు. 'ఆయనకి కాళిదాసు, వాల్మీకిల తపోవనాలనుంచీ, షేక్ స్పియర్, షెల్లీల పూలతోటలనుంచీ ఎంత అందమైన పూలు ఏరితెచ్చుకోవాలో తెలుసు' అని రాసాడో గ్రీకు కవి. 'మిమ్మల్ని కలుసుకోవడం వల్ల మేము పరిశుభ్రపడ్డాం, మరింత ధీరత్వాన్ని సంతరించుకున్నాం' అని రాసాడు విల్ డురాంట్. 'టాగోర్ని ఆరాధించినంతగా నేను నా సమకాలికుల్లో మరే మనిషినీ ఆరాధించలేకపోతున్నాను ఎందుకంటే నాకు తెలిసిన అత్యంత పరిపూర్ణ మానవుడు ఆయన. విశ్వమానవుడు. సమస్తాన్నీ తన బాహువుల్లో బంధించుకోగలిగినవాడు' అని రాసాడు కౌంట్ హెర్మన్ కీసర్లింగ్. అన్నిటికన్నా ఆశ్చర్యకరమైన వాక్యాలు యేట్సు రాసాడు. డబ్లిన్ నుంచి ఉత్తరం రాస్తూ అతడిట్లా రాస్తున్నాడు:

> నేను మీ విద్యార్థుల్లో అత్యంత విధేయుణ్ణయిన విద్యార్థిననీ, మీ ఆరాధకుడిననీ చెప్పనివ్వండి. మీకు తెలుసు, మీ కవితలు నన్ను గొప్ప భావోద్వేగంతో

ముంచెత్తాయని. ఈ మధ్యకాలంలో నేను మీ వచనంలో కూడా గొప్ప జ్ఞానాన్నీ, సౌందర్యాన్నీ చూస్తున్నాను.. ఆ మధ్య నేను పెళ్ళి చేసుకున్నాను. ఇప్పుడు నాకు ఇద్దరు పిల్లలు. బాబు, పాప. ఇప్పుడు నాకు జీవితంతో మరింత గాఢంగా అల్లుకుపోయినట్టుగా ఉంది. జీవితం, అంటే జీవితం కానిదేదో దాన్నుంచి భిన్నమైంది, యాంత్రికం కానిది, సంక్లిష్టం కానిది, అటువంటి జీవితాన్ని తలుచుకోగానే నాకు పురాతన ఆసియాఖండపు జీవన విధానమే మదిలో మెదుల్తుంది. ఆ జీవనస్వరూపాన్ని నేను మొదట్లో మీ పుస్తకాల్లో కనుగొన్నాను, ఆ తర్వాత చీనా కవిత్వంలోనూ, జపనీయ వచన రచనల్లోనూ దర్శించాను. మీ కవితలు మొదటసారి చదివినప్పటి ఆ ఉద్వేగాన్ని నేను ఏమని వర్ణించేది! మార్పులేని కాలాతీత క్షేత్రాల్లోంచీ, నదీ తీరాలమీంచి ఆ కవితలు నేరుగా నా దగ్గరకి చేరాయా అనిపిస్తుంది!

నెమ్మదిగా తూర్పు రాగరంజితమవుతున్నది. వాగ్దానపరిమళాలతో ప్రత్యూష పవనాలు కిటికీలోంచి నన్ను తాకుతున్నవి. జీవితం చాలా విలువైంది. ప్రతి క్షణం ఎంతో విలువైంది. మరొకసారి ఈ భాగ్యం మనకు దక్కుతుందో లేదో తెలియదు. ఎన్ని కష్టాలు, ఎన్ని క్లేశాలు, ఎంత దుఃఖం, ఎంత వేదన ఉండనీ, ఈ ప్రపంచంలో పుట్టడమే గొప్ప భాగ్యం. మనం పుట్టకపోయి ఉంటే, ఈ రాగాలు, ఈ రంగులు, ఈ భావాలు, ఈ కవులు, వారి మధ్య ఈ కరస్పాండెన్సు మనకెట్లా తెలిసి ఉండేది?

ఇంతదాకా ఈ భూమి మీద జీవించినవాళ్ళందరికన్నా మనం మరింత భాగ్య వంతులం. టెక్నాలజి వల్ల ఎక్కడెక్కడి సౌందర్యమూ నేరుగా మన ఇంటికి చేరుతున్నది. దేశదేశాల కవిత్వాలు చదువుకోవచ్చు, దేశదేశాల సంగీతాలు వినవచ్చు, సినిమాలు చూడవచ్చు. కాని వీటన్నిటినుంచీ అంతిమంగా మన జీవితేచ్ఛ, మన జీవితానందం నలుగురికీ ప్రసరించాలి. నదీ జలాల్లా మనం నడిచిన తావులన్నీ పచ్చగా కలకల్లాడాలి, సుభిక్షం కావాలి. విసుగులోనో, వేసటలోనో మనుషులు క్షణం పాటు ధైర్యం కోల్పోయి నప్పుడు, మనల్ని తలుచుకుంటే, వాళ్ళకి మళ్ళా జీవనోత్సాహం ఊటలూరాలి. అది కదా, మన తల్లిదండ్రులు మనకీ జీవితాన్నిచ్చినందుకు, మన సమాజం మనకి విద్యా బుద్ధులు నేర్పినందుకు, మనల్ని ఇన్నాళ్ళు పోషించినందుకు మనమీ లోకానికి తీర్చగల ఋణం!

19-7-2022

## ఆ మందహాసాన్ని ఒక్కసారి చూడటానికేనా

**కొంతమంది** ఇక్కడికి వచ్చేముందే నాలుగు హారతులూ చూడటానికి ప్లాను చేసుకుని వస్తారు అంది విజ్జి. కాని మేము ఒక్క హారతి దర్శనానికే ఏర్పాట్లు చేసుకుని వచ్చినా నాలుగు హారతులు చూసాం ఈసారి షిరిడీలో. ఒకసారి ముందువరసలో, మరొకసారి రెండవవరసలో, మూడవసారి అందరికన్నా వెనగ్గా, నాలుగవసారి సమాధిమందిరం ప్రాంగణంలో, ముఖదర్శనం చేసుకుంటూ.

ముప్పై ఏళ్ళయింది, షిర్డీ మొదటిసారి వచ్చి. అప్పుడు నేను ఉట్నూరులో పనిచేస్తున్నాను. ఢిల్లీలో ఒక ట్రయినింగుకి వెళ్ళినప్పుడు నాతో పాటు విజ్జి, మా చెల్లెలు అనసూయ కూడా ఉన్నారు. ఇద్దరు ప్రధానోపాధ్యాయులు జార్జి, పురుషోత్తమరావు కూడా ఉన్నారు. అప్పుడు ఈ రద్దీ, విస్తారమైన ఈ ఏర్పాట్లు లేవు. ఆ తర్వాత ముప్పైఏళ్ళుగా చాలాసార్లే వస్తూ వున్నాను. ఎప్పుడు వచ్చినా తల్లిలాంటి ఆయన ప్రేమలో, తండ్రిలాంటి ఆ సంరక్షణలో మాత్రం ఎట్లాంటి మార్పూ లేదు.

చాలా ఏళ్ళ కిందట, నేను శ్రీశైలంలో పనిచేస్తున్నప్పుడు ఐటిడిఎలో పనిచేసే ఉద్యోగులు, ఇద్దరు అమ్మాయిలు మా ఇంటికి వచ్చారు. మేము వరండాలో కూచుని మాట్లాడుకుంటూ ఉండగా వారి దృష్టి అక్కడ గోడమీద మేము అలంకరించుకున్న సాయిబాబా పటం మీద పడింది. 'మీకు ఈయనంటే ఇష్టమా?' అనడిగారు. అవునన్నాను. ఎందుకన్నారు. 'ఎందుకంటే ఆయన casteless, classless human being కాబట్టి' అన్నాను.

వర్గరహిత సమాజం బృహత్ వ్యవస్థల్లో ఏమేరకు సాధ్యమవుతుందో, ఏ మేరకు నిలబడుతుందో నాకు తెలియదు, కాని చిన్న చిన్న బృందాల్లో, కమ్యూనుల్లో అది సుసాధ్యమే. భారతీయ భక్తికవులు, కబీరు, రైదాసువంటివారి సన్నిధిలో, అల్లమప్రభు

స్థాపించిన అనుభవమంటపంలో, దక్షిణేశ్వరంలో, తిరువణ్ణామలై mountain path లో అది సాధ్యమైందని ఆ భక్తుల అనుభవాలు చదివితే మనకి అర్థమవుతుంది. అది classless, casteless మాత్రమే కాదు, cultless కూడా.

సహ్యాద్రి అంతటా వ్యాపించిన దత్త సంప్రదాయం, పండరిపురం కేంద్రంగా విలసిల్లిన విట్ఠల సంప్రదాయం, సంత్ భక్తి వాగ్గేయకారుల కీర్తన సంప్రదాయం, వార్కరి, మహానుభావ సంప్రదాయం, నాథ సంప్రదాయం, మరొకవైపు దక్కన్‌ని వెలిగించిన సూఫీ సంప్రదాయం ఇవ్వన్నీ సాయిబాబాలో సంగమించించాయి. అంతేకాదు, ఆ సంప్రదాయాలన్నింటిలోనూ కూడా ఒక ఎరుక ఉంటుంది, అదేమంటే తాము కలుసుకోబోతున్న ప్రతి ఒక్క మనిషీ, తమకి సంభవించబోతున్న ప్రతి ఒక్క అనుభవం ఒక భగవత్సందేశాన్ని వెంటతెస్తున్నవే అన్న ఒక నిత్యజాగృతి వాళ్ళల్లో సదా మెలకువగా ఉంటుంది.

ఇంతకీ ఒక మానవసమూహం classless, casteless అయిన తర్వాత ఏమి చేస్తుంది? మార్క్సు ఊహించిన దాని ప్రకారం, దోపిడీ లేకపోయిన తర్వాత మనిషికి కాయికశ్రమ నుంచి కొంత విశ్రాంతి లభిస్తుంది. ఆ తీరికలో అతడు ప్రకృతికి మరింత సన్నిహితంగా జరుగుతాడు. కాని కాయికశ్రమ నుంచి లభించిన తీరికని మనుషులు ఎలా ఉపయోగించుకుంటున్నారో మనం చూస్తూనే ఉన్నాం. మన తీరిక మనల్ని మనుషులకి దూరం చేసే తీరిక. మన apetites ని మరింత రెచ్చగొట్టే తీరిక. దీన్నుంచి బయటపడి, మన తీరికను మరింత సార్థకం చేసుకోవాలంటే మనజీవితం purpose driven life కావాలంటే మనకొక ధ్యేయమో, గురువునో, సత్సాంగత్యమో అవసరం.

సాయిబాబాని నమ్ముకున్నవాళ్ళ జీవితాలు చూస్తున్నాను, చాలా ఏళ్ళుగా. వాళ్ళ జీవితాల్లో ఆ తీరిక భగవత్ప్రార్థనల్తో, కవిత్వంతో, కీర్తనల్తో లేదా లోకానికి ఉపకరించే ఏదో ఒక సేవలో గడవడం చూస్తూ ఉన్నాను. ఇది ఇప్పుడే కాదు, సాయిబాబా భౌతిక దేహంతో ఉన్నప్పణ్ణుంచీ కనిపిస్తున్న విషయమే.

ఒకప్పుడు మహారాష్ట్రలో గణేష్ శ్రీకృష్ణ కపర్దే (1854-1938) అనే ఒక న్యాయవాది ఉండేవాడు. ఆయన సంస్కృతంలోనూ, ఇంగ్లిషులోనూ కూడా మహాపండితుడు. లోకమాన్య బాలగంగాధర తిలక్‌కి సన్నిహితుడు. ఆయన భారతజాతీయ కాంగ్రెసులో క్రియాశీల బాధ్యతలు నిర్వహించాడు. వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్లో మెంబరుగా కూడా ఉన్నాడు. తిలక్‌ను రాజద్రోహ నేరం కింద మాండలేజైలులో నిర్బంధించినప్పుడు ఆయన విడుదలకోసం రెండేళ్ళ పాటు ఇంగ్లాండులో ఉండి విశ్వప్రయత్నం చేసాడు. 1911 లో

తిరిగి వచ్చాక, షిరిడి వెళ్ళాడు. అక్కడ సాయిబాబా అతణ్ణి దాదాపు మూడునెలలపాటు కదలనివ్వకుండా అట్టేపెట్టేసాడు. తిరిగి వెళ్ళడానికి ఎన్నిసార్లు అనుమతి అడిగినా ఇవ్వలేదు. కాని ఆ తర్వాత రోజుల్లో కపర్దేకి అర్థమయిందేమంటే, ఆ రోజులన్నిటా బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకోసం వలపన్ని ఉన్నదనీ, ఆయన ఆ కాలంలో షిరిడీలో కాక మరెక్కడ ఉన్నా అరెస్టయి ఉండేవాడనీ. చివరికి, షిరిడీలో కూడా ఆయనకి తెలియకుండా, ఆయన ఎంతో గౌరవించే ఒక పండితుడి రూపంలో ఒక గూఢచారిని కూడా బ్రిటిష్ ప్రభుత్వం ఆయన మీద నియమించడానికి కూడా వెనుదీయలేదని!

కపర్దేకి డైరీలు రాసే అలవాటు ఉంది. ఆయన 1910 లో మొదటిసారి షిరిడీ వెళ్ళినప్పుడు వారంరోజులు ఉండిపోయారు. ఆ వారం రోజులూ తన దినచర్య రాసుకున్నాడు. ఆ తర్వాత షిరిడీలో ఉండిపోయిన మూడునెలల దినచర్య 6-12-1911 నుంచి 13-3-2012 దాకా కూడా తన దినచర్య రాసిపెట్టుకున్నాడు. షిరిడిలో సాయిబాబా జీవితం, బోధనల గురించి సాయిసచ్చరిత్ర తర్వాత చెప్పుకోదగ్గ ప్రత్యక్ష కథనాల్లో కపర్దే డైరీ కూడా ఉంటుంది. ఆధునిక విద్యని అభ్యసించి, ఆధునిక వృత్తిజీవితం జీవిస్తూ, ఆధునిక రాజకీయాల్లో తలమునకలుగా ఉన్న ఒక ప్రత్యసాక్షి సాయిబాబా గురించి తనకై తాను రాసుకున్న డైరీకన్నా ఎక్కువ విశ్వసనీయమైన, ప్రామాణిక కథనం మరేముంటుంది కనుక!

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, కపర్దే దినచర్య చూసినప్పుడు, అందులో రెండు అంశాలు కనిపిస్తాయి. ఒకటి హారతి సమయాల్లోనో, హారతి తర్వాతనో సాయిబాబాని చూడటం. ఆయన అవకాశమిస్తే, కొద్ది సేపు అక్కడ కూచోడం, ఆయన చెప్పే మాటలు వినడం. తక్కినసమయాల్లో పూర్తిగా సద్గోష్ఠి, సద్గ్రంథపఠనం. రామాయణం, భావార్థ రామాయణం, భాగవతం, దాసబోధ, జ్ఞానేశ్వరి, అమృతానుభవం, పంచదశి వంటి గ్రంథాలు కలిసి చదువుకోవడం, కీర్తనలు పాడుకోవడం, భజనలు-బహుశా అప్పటి షిర్డీకీ, ఇప్పటి షిర్డీకి తేడా ఎక్కడైనా ఉందంటే, ఈ అంశంలోనే అనుకోవాలి. ఇప్పుడు షిర్డీ వెళ్ళే చాలమంది భక్తులు, యాత్రీకులు, నాతో సహా, హారతి దర్శనం మీదా, దర్శనమ్మీదా పెడుతున్న శ్రద్ధ, మిగిలిన సమయాన్ని ఎలా గడపాలన్నదాని మీద మాత్రం పెడుతున్నట్టు కనిపించడం లేదు. కాని కపర్దే డైరీ చదువుతున్నప్పుడు, ఆ భక్తులు సాయిబాబాని కలుసుకోడానికీ, కలుసుకోడానికీ మధ్య వ్యవధిలో తమని తాము సద్గ్రంథ పఠనంలో, సంకీర్తనంలో గడిపినందువల్ల కాబోలు, వారికి సాయిబాబాని చూడగానే ఆ కొన్ని క్షణాల దర్శనం ఒక జీవితకాల అనుభవానికి సాటిగా అనిపించేది.

కపర్దే డైరీలో ఈ వాక్యాలు చూడండి:

మేమంతా పొద్దున్నే లేచి కాకడ హారతికి హాజరయ్యాము. అది ఎంతో నిష్ఠని కలగచేసే పుణ్యదర్శనంగా తోచింది. (8-12-1911)

పొద్దున్నే లేచి చావడిలో జరిగే కాకడహారతికి హాజరయ్యాను. అన్నిటికన్నా ముందు సాయిమహరాజ్ వదనాన్నే దర్శించాను. ఆ వదనంలో అనుగ్రహం మధురాతి మధురంగా ప్రస్ఫుటమవుతూ ఉండగా నేను చెప్పలేనంత సంతోషం అనుభవించాను. (1-1-1912)

పొద్దున్నే లేచాను. బాపూసాహెబ్ జోగ్ స్నానానికి వెళ్ళడం చూసాను. ఈ లోపు నా ప్రార్థన పూర్తి చేసుకున్నాను. అప్పుడు మేము చావడిలో జరిగే కాకడహారతికి వెళ్ళాం. ఆ రోజు మేఘా అస్వస్థుడిగా ఉండటంతో బాపూ సాహెబ్ జోగ్‌నే హారతి ఇచ్చాడు. అప్పుడు సాయిబాబా తన వదనదర్శనం మాకు అనుగ్రహిస్తూ దయార్ద్రభరితమందహాసం చేసారు. ఆ మందహాసాన్ని ఒక్కసారి చూడటానికేనా ఏళ్ళకి ఏళ్ళు గడిపెయ్యవచ్చని పించింది. నా ఆనందానికి హద్దులు లేవు. నేను పిచ్చివాడిలా అలానే నిలబడి పోయాను. (17-1-12)

1-10-2022

# సంతోషంతో ఓపిక పట్టడం

**విమోచన** రెండు రకాలు. ఒకతరహా విమోచన కారులు మనల్ని మరిన్ని ఆర్థిక అవకాశాల వైపూ, సౌకర్యవంతమైన జీవితంవైపూ, సామాజిక అభ్యుదయం వైపూ నడిపిస్తారు. మన హక్కుల కోసం పోరాడతారు. వారిద్వారా మనకి సిద్ధించేది ఆర్థిక స్వాతంత్ర్యం, రాజకీయ స్వాతంత్ర్యం.

మరొక తరహా విమోచనకారులు మనల్ని సరళతరం చేస్తారు, నిరాడంబరత వైపు నడిపిస్తారు, అవసరమైతే మనల్ని పూర్తిగా నిర్ధనుల్ని చేస్తారు. వాళ్ళు పోరాడేది మన బాధ్యతల గురించి. వాళ్ళ ద్వారా మనకి సిద్ధించేది మానసిక స్వాతంత్ర్యం. కబీరూ, సాయిబాబా, గాంధీ ఈ రెండవతరహా విమోచనకారులు. కపర్దే తన డైరీలో ఒకచోట ఇలా రాసుకున్నాడు:

> ఈ సాయంకాలం మేము మసీదుకి చేరుకున్నాక, సాయిబాబా వాహ్యాళికి బయల్దేరబోయేముందు దీక్షిత్‌తో నా భార్యకు రెండువందలు ఇమ్మని చెప్పారు. అప్పుడు నా భార్య ఆయన పాదాలకు మర్దనా చేస్తూ ఉంది. సాయిబాబా అలా ఎందుకు ఆదేశించారో నాకు ఎంత మాత్రం అర్థం కాలేదు. చివరికి నేను ఇతరుల దయాభిక్ష మీద బతకవలసిన స్థితికి చేరుకున్నానన్నమాట! ఇంతకన్నా చావడం నయం. బహుశా సాయిబాబా నా అహంకారాన్ని అణచిపెట్టడానికీ, అంతిమంగా నా గర్వాన్ని ధ్వంసం చెయ్యడానికీ పూనుకున్నారనుకుంటాను. అందుకోసమే ఆయన నన్ను పేదరికానికీ, దానధర్మాలకీ అలవాటు చేస్తున్నారనుకుంటాను.

ఏళ్ళ తరువాత కపర్దే తన పాత డైరీలు తిరగేస్తూ, ఇక్కడకు వచ్చేటప్పటికి మళ్ళా ఒక ఫుట్‌నోటు రాసుకున్నాడు. అందులో ఇలా అంటున్నాడు:

> 1912 ఫిబ్రవరి 1 వతేదీ డైరీ తీసి నువ్వు చూపించిన పేరాగ్రాఫు మళ్ళా చదివాను. ఆ వాక్యాలు నా భావాల్ని సరిగానే వెల్లడిస్తున్నాయి. మన సద్గురు సాయిమహరాజ్ ఇచ్చిన ఆదేశాలవి. సర్వజ్ఞుడు కాబట్టి ఆయనకు అంతా తెలుసు. కాబట్టి నా అంతరంగంలోపల ఉన్నది కూడా ఆయనకి తెలుసు. కాని తన ఆదేశాలు పాటించితీరమని ఆయన ఎప్పుడూ ఒత్తిడి చెయ్యలేదు. ఇప్పుడు మళ్ళా ఈ పేరాగ్రాఫుమీద నా దృష్టిమళ్ళించావు కాబట్టి నాకు ఒకటి అనిపిస్తూ ఉంది. ఆ రోజుల్లో నా భార్య పేదరికాన్నీ, కాయకష్టమ్మీద ఆధారపడి జీవించడాన్నీ ఇష్టపడేది కాదు. కాకా సాహెబ్ దీక్షిత్ పేదరికాన్నీ, కాయకష్టాన్నీ ఇష్టపడ్డాడుకాబట్టి సంతోషంగా ఉన్నాడు. అందుకనే సాయి మహరాజ్ నాకు రెండువందలు ఇమ్మన్నాడు. అంటే నా జీవితానికీ పేదరికమూ, సహనమూ అన్నమాట.

ఈ మాటలు చదవగానే నాకు 'బహురూపి గాంధి' పుస్తకంలో అను బంధోపాధ్యాయ రాసిన ఈ వాక్యాలు గుర్తొచ్చాయి. ఆయన గాంధీని ఒక బందిపోటు అని అభివర్ణిస్తూ ఇలా రాసాడు:

> ఒకసారి వీధులూడ్చేపనివాళ్ళ సమావేశంలో ఒక మహిళ తన చేతికి ఉన్న రెండు బంగారుగాజులూ గాంధీకి ఇచ్చి, 'ఈ రోజుల్లో భర్తలు భార్యలకోసం చాలా తక్కువ సొమ్ము కేటాయిస్తున్నారు. అందుకే నేను తమకు ఇంతకంటే ఇంకేమీ ఇచ్చుకోలేకపోతున్నాను. ఇవే నా వద్ద మిగిలిన ఆఖరి ఆభరణాలు. వీటిని హరిజనుల సేవకు వినియోగించండి' అంది. 'నేను అనేకమంది వైద్యులనూ, న్యాయవాదులనూ, వర్తకులనూ బిచ్చగాళ్ళుగా చేశాను. ఇందుకు నేనేమీ పశ్చాత్తాపపడటం లేదు. ఒక పైసా సంపాదన కోసం మనుషులు మైళ్ళకొద్దీ వెళ్ళాల్సి వస్తున్న భారతదేశంలో ఖరీదైన ఆభరణాలు ధరించడం ఎవరికైనా శోభనివ్వదు' అన్నాడు గాంధీ.

ఇది స్పష్టంగా కబీరు మార్గం. వి.బి.ఖేర్ ఈ పేరాగ్రాఫు గురించి రాస్తూ కపర్దేల జీవనశైలి ఉండేదో వివరంగా చెప్పుకొచ్చాడు. ఒకప్పుడు కపర్దే వార్షికాదాయం దాదాపు లక్ష రూపాయల దాకా ఉండేదట. దాదాపు యాభై మంది ఆ ఇంటిని ఆశ్రయించుకుని ఉండేవారట. పదిపన్నెండు మంది విద్యార్థులు చదువుకుంటూ ఉండేవారు. ఎవరికి వారికి నేతిగిన్నె లేకుండా వడ్డన జరిగేది కాదు. ఆ నేపథ్యంలో చూసినప్పుడు సాయిబాబా దీక్షిత్‌ని కపర్దే దంపతులకి రెండువందలు ఇమ్మనడంలోని స్ఫూర్తి ఏమిటో అర్థమవుతుంది.

కాని ఆ నిర్మలభక్తి ఊరకనే పోలేదు. సాయిబాబా కపర్దే శ్రీమతిని తన తల్లిలాగా, తనయలాగా దగ్గరకు తీసుకున్నాడు. ఆమెకి రాజారాం అనే మంత్రోపదేశం చేసాడు. ఆ కృపాబలం వల్ల ఆమె ఈ లోకం నుంచి నిష్క్రమించేటప్పుడు అపరిమితమైన ప్రశాంత చిత్తంతో సెలవుతీసుకొన్నదని వి.బి.ఖేర్ కళ్ళకి కట్టినట్టు వివరిస్తాడు.

## 2

**ఇన్నాళ్ళుగా** వస్తున్నా దీక్షిత్ వాడాలో ఒక మ్యూజియం ఉందని నాకు తెలీదు. ఈ సారి మా అమృత చూపిస్తే చూసాను. అందులో సాయిబాబా ధరించిన దుస్తులు, వాడిన పాత్రలు, ఉపకరణాలతో పాటు అరుదైన ఫొటోలు కూడా ఉన్నాయి. ఆ ఫొటోల్లో సాయిబాబా నేత్రాలు ఏకకాలంలో చాలా పలచగానూ, చాలా లోతుగానూ కూడా కనిపించాయి. ఆయన ఎవరు? పఠానా, ఆఫ్ఘనా, దక్కనీనా అని ఆలోచిస్తూ ఉంటే, ఎవరో నా మదిలో 'జాతి నా పూఛో సాధుకీ పూఛ్ లీజియే గ్యాన్' అంటున్నారు!

ఆ పక్కనే ఒక పారాయణమందిరం కూడా ఏర్పాటు చేసారు. అది కూడా ఈసారే కొత్తగా చూడటం. అక్కడ కూచుని అందరం కొంతసేపు సచ్చరిత్ర పారాయణం చేసాం. నా వరకూ పదిహేనో అధ్యాయం చదవాలనిపించి తెరిచాను. అందులో నాకెంతో ఇష్టమైన చోల్కర్ కథ ఉంది. సచ్చరిత్రలోని ఎందరో సాయి భక్తుల కథల్లో చోల్కర్ కథలో చెప్పలేని తీయదనముంది.

చోల్కర్ థానాలో సివిల్ కోర్టులో చిన్న ఉద్యోగి. తన ఉద్యోగం పర్మనెంటు అయితే షిరిడి వచ్చి అందరికీ కలకండ పంచుతానని మొక్కుకున్నాడు. పండగ, సెలవు, తీర్థయాత్ర అప్పుచేసి గడపకూడదనేది సాయిబాబా పెట్టిన నియమం కాబట్టి, తన షిర్డీ యాత్రకి నెమ్మదిగా సొమ్ము ఆదాచెయ్యడం మొదలుపెట్టాడు. చిన్న ఉద్యోగి, బండెడు సంసారం కాబట్టి సొమ్ము ఆదాచెయ్యడం కష్టమైపోయేది. అందుకని తన ఆహారంలో చక్కెర వదిలిపెట్టేసాడు. చక్కెరలేకుండానే టీ తాగేవాడు. ఇట్లా చాలినంత పొదుపు చేసుకున్నాక షిరిడీ వెళ్ళాడు. అందరికీ కలకండ పంచాడు. సాయిబాబా ఎదట నిలబడి 'నా సంకల్పం నెరవేరింది. నాకు సంతోషంగా ఉంది' అన్నాడు.

అతడు బాపూసాహెబ్ జోగ్‌కి అతిథిగా ఉన్నందువల్ల, అతడితో కలిసి సాయిబాబా దగ్గరికి వెళ్ళినందువల్ల, బాబా నుంచి సెలవు తీసుకోవడానికి జోగ్ లేవగానే తను కూడా లేవకతప్పింది కాదు. అప్పుడు సాయిబాబా జోగ్‌తో 'ఇంటికి వెళ్ళాక అతడికి బాగా

చక్కెర వేసి తేనీరు కాచి ఇవ్వు' అన్నాడు. ఎప్పుడూ లేనిది సాయిబాబా టీ ప్రసక్తి ఎందుకు తెచ్చాడో జోగ్ కి అర్థం కాలేదు. కాని చోల్కర్‌కి అర్థమయింది. అతడి కళ్ళు వర్షించడం మొదలుపెట్టాయి.

సాధారణంగా నియమం, లేదా వ్రతం చాలా చేదుగా ఉంటుంది. కాని వ్రతఫలితం, ఎంత మధురంగా ఉంటుందో ఈ చిన్న కథ చెప్తున్నది. అందుకనే ఈ కథ అంటే ఎంతో ఇష్టం నాకు. అయితే ఆ మాధుర్యం వ్రతసమాప్తివేళమాత్రమే కాదు, వ్రతం పట్టినంతకాలం కూడా ఉండాలి, సబూరి అంటే అదే. సంతోషంతో ఓపిక పట్టడం.

## 3

**సాయిబాబా** జీవితమంతా వర్తకుల అయిష్టాన్ని చూస్తూ వచ్చాడు. ఒంటె సూది బెజ్జం లోంచి పయనించగలదుగాని తేలీ (నూనె వ్యాపారి), వణి (చిల్లర వ్యాపారి) సాయిబాబా దగ్గరకు పోలేకపోయారు. సాయిబాబా తెరిచిపెట్టుకున్న లోకంలో బేరసారాలుండవు. కబీరు చెప్పుకున్న దేశంలాగా అక్కడ అమ్మకాలూ, కొనుగోళ్ళూ ఉండవు. యెరుషలేం దేవాలయంలో మొదటిసారి అడుగుపెట్టినప్పుడు ఆ దేవాలయ ప్రాంగణాన్ని దుకాణంగా మార్చేసారనే కదా క్రీస్తు ఆగ్రహోద్రిక్తుడయింది!

అలాగని సాయిబాబా తెరిచిపెట్టుకున్న అంగడిలో ప్రతి ఒక్కటీ ప్రతి ఒక్కరికీ ఉచితంగా దొరుకుతుందని కాదు. నువ్వు ప్రాపంచిక జీవితం నుంచి ఒక అడుగు దూరంగా వెయ్యగలిగిగే ఆయన రెండు అడుగులు నీకు దగ్గరగా వస్తాడు. ఈ సారి అటువంటి ఒక ధన్యుణ్ణి షిరిడీలో చూసాను.

మామూలుగా యువకులు ప్రభుత్వోద్యోగాల కోసం వెతుక్కునే వయసులో అతడు సాయిబాబా మీద ప్రేమతో షిరిడీ వచ్చేసాడు. ఏమీ చెయ్యాలని గాని, ఏదో ఒకటి చెయ్యాలని గానీ అనుకోలేదు. కాని దేవస్థానం దగ్గర పిల్లలు వదిలిపెట్టేసి వెళ్ళిపోయిన వృద్ధుల్ని చూసాడొకసారి. వాళ్ళకి ఎక్కడా ఆశ్రయం లేదు. ఎవరూ అన్నం పెట్టేవాళ్ళు కూడా లేరు. వాళ్ళని తన దగ్గరకు తెచ్చుకున్నాడు. తనే అన్నం పెట్టి చూసుకోవడం మొదలు పెట్టాడు. అలా నిరాశ్రయులుగా ఉన్న వృద్ధులకోసం ఒక వృద్ధాశ్రమం ప్రారంభిస్తే బాగుంటుందనుకున్నాడు. 1997 లో ఒక సంస్థ రిజిష్టరు చేయించాడు. 2002 నుంచి కార్యక్రమం మొదలుపెట్టాడు. ముగ్గురితో ప్రారంభమైన ఆ వృద్ధాశ్రమంలో ఇప్పుడు 135 మంది వృద్ధులు ఉన్నారు.

అతడి సేవానిరతి చూసి ఒక కాశ్మీరీ పండితుడు మూడుకోట్ల విలువైన భవన సముదాయం కట్టించి ఇచ్చాడు. దేవస్థానంవారు ఆ వృద్ధులకి రాత్రి పూట భోజనవసతి, వైద్య సదుపాయం ఉచితంగా ఏర్పాటు చేసారు. పొద్దున్న అల్పాహారం, మధ్యాహ్నభోజనం దాతలు సమకూరుస్తున్నారు.

ఆ కేంద్రానికి వెళ్ళి చూసాను. ఆ భవనసముదాయం, అక్కడి పరిశుభ్రత, ఆ నిబద్ధత నన్నెంతో ఆకట్టుకున్నాయి. 'నాకు తెలిసి కొంత మంది ఎంతో పెద్ద మనసుతో వృద్ధాశ్రమాలు మొదలుపెట్టి నడపలేక చేతులెత్తేసారు. మీరు నడపగలుగుతున్నారు ఏమిటి కారణం?' అనడిగాను అతణ్ణి.

'బాబా అనుగ్రహం' అన్నాడు అతడు.

మరోమాట కూడా చెప్పాడు.

'ఇటువంటి వృద్ధాశ్రమాలు నడపాలంటే మనం మన ఇంట్లో ఉండి సిబ్బందిని పెట్టుకుని వాళ్ళ ద్వారా నడపాలంటే సాధ్యమయ్యే పని కాదు.మనం కూడా ఇక్కడే ఉండాలి. వీళ్ళతోటే జీవించాలి. అప్పుడే నిర్వహణ పూర్తిగా మన ఆధీనంలో ఉంటుంది. నేను మొదట్లో షిర్డీలో ఇల్లు కట్టుకోవాలనుకున్నాను. కొంత స్థలం కూడా కొనుక్కున్నాను. కాని ఇప్పుడు ఆ ఆలోచన విరమించాను. బాబాకి వాగ్దానం చేసుకున్నాను. ఎప్పటికీ ఇల్లు కట్టుకోననీ, ఈ వృద్ధులతో పాటే ఇక్కడే కలిసి ఉంటాననీ.'

ఇరవయ్యేళ్ళుగా నిర్వహిస్తున్న ఈ సద్వ్రతం అతణ్ణి ఆధ్యాత్మికంగా మరింత బలోపేతుణ్ణి చేసిందనే అనిపిస్తున్నది. ఇవ్వడం అనేది అతడి స్వభావంగా మారిపోయింది. నేను దేవుడికి ఒక నూతన వస్త్రం కొనడం కోసం ఒక వస్త్ర దుకాణంలో అడుగుపెట్టాను. ఆ దుకాణం అతడు చూపించిందే. అతడు కూడా నా వెనక వచ్చాడు. ఏ వస్త్రం కొంటే బాగుంటుందో ఎంపిక చేసాడు. మేము బిల్లు చెల్లిస్తూ ఉండగా దుకాణదారుకి నన్ను పరిచయం చేసాడు. ఆ దుకాణదారు చేతిలో పాలకోవా పాకెట్టు ఉంది. అతడు ఒక కోవాబిళ్ళ నా చేతిలో పెట్టాడు. 'బాబా ప్రసాదం' అన్నాడు. నేను వెంటనే తినడం మొదలుపెట్టాను. ఆ దుకాణదారు ఆ ప్రసాదం అతడి చేతిలో కూడా పెట్టాడు. కాని అతడు దాన్ని తినలేదు. వాళ్ళని చిన్న ప్లాస్టిక్ కవరు అడిగి అందులో భద్రంగా పెట్టాడు. బయటకి రాగానే అక్కడ మా కోసం వేచి ఉన్న అమృత చేతుల్లో పెడుతూ 'నీ కోసమే ఇది' అన్నాడు. నాకు చెప్పలేనంత ఆశ్చర్యం కలిగింది. వళ్ళంతా పుండుగా మారిపోయిన ఒక వృద్ధురాలికి ఆశ్రమం సిబ్బంది కూడా అన్నం వడ్డించడానికి సందేహిస్తున్న

సమయంలో, అతడు గిన్నెలో అన్నం కలుపుకుని ముద్దలు చేసి ఆమెకి తినిపించాడంటే ఆశ్చర్యం లేదనిపించింది.

## 4

**షిర్డీ** ఎప్పుడు వెళ్ళినా చుట్టుపక్కల పుణ్యక్షేత్రాలో, చారిత్రిక ప్రదేశాలో కూడా చూస్తూ ఉండటంతో, ఇక దగ్గరలో చూడవలసినవేవీ మిగల్లేదు. వని వెళ్ళి సప్తశృంగి చూడాలి అనుకుంది విజ్జి . కాని దసరా మొదలవడంతో అక్కడ బాగా రద్దీ ఉంటుందని చెప్పడంతో ఆ ఆలోచన విరమించుకున్నాం. కాని షిర్డీకి దగ్గర్లోనే ఒక దత్తక్షేత్రం ఉంది చూడవచ్చని చెప్పడంతో ఒకరోజు అక్కడికి బయల్దేరాం.

కానీ ఆ క్షేత్రం అహ్మద్‌నగర్ జిల్లాలో నెవాసాకు దగ్గరలో ఉన్న దేవగఢ్ శ్రీ క్షేత్రం. షిర్డీనుంచి దాదాపు వందకిలోమీటర్ల దూరంలో ఉంది. వర్షాలకు మహారాష్ట్ర రోడ్లన్నీ ఎంత పాడయిపోయాయో ఆ రోజు ప్రత్యక్షంగా చూసాం. ప్రయాణానికి రెండున్నర గంటల పైనే పట్టింది. కాని చెరకు, పత్తి, సోయాబీన్ పొలాల మధ్య, మహారాష్ట్ర పల్లెల మధ్య ఆ ప్రయాణం చేస్తూన్నంతసేపూ ఒకప్పటి అదిలాబాదు జిల్లాలో ప్రయాణిస్తున్నట్టే ఉంది.

కాని మా అలసట అంతా ఆ శ్రీక్షేత్రంలో అడుగుపెట్టగానే దూదిపింజలాగా తేలిపోయింది. ప్రవర అనే ఒక నది ఒడ్డున ఒక తపోశాలి సూచన మేరకు నిర్మించిన క్షేత్రం అది. దాన్ని ఎవరో ఒక స్వర్గఖండంగా అభివర్ణించడంలో అతిశయోక్తి లేదు. ఆ మందిరప్రాంగణం చూడగానే నాకు కొలనుపాకలో శ్వేతాంబర జైన మందిరం గుర్తొచ్చింది. వైశాల్యాన్నీ, ఔదార్యాన్నీ స్ఫురింపచేసే వాస్తు అది.

అందులో ప్రధానమైన మందిరం దత్తాత్రేయుల మందిరం. చిన్న మందిరం. ఆ మందిరమధ్యంలో పాలరాతిలో చెక్కిన దత్తాత్రేయుడు పట్టపగలే వెన్నెల కురిపిస్తూ ఉన్నాడు. బయట ఆయనకు అటూ ఇటూ జ్ఞానేశ్వర మహరాజ్, తుకారాం విగ్రహా లున్నాయి. దత్తాత్రేయులకు పాలకోవా నైవేద్యంగా సమర్పించి తిరిగి ఆయన ప్రసాదంగా స్వీకరించాం. అక్కణ్ణుండి ఆ నది ఒడ్డుకు వెళ్ళాం. ప్రవర నది గోదావరి ఉపనది. ఆ నదికి అక్కడ చాలా చక్కని స్నానఘట్టం నిర్మించారు. బోటింగుకి కూడా ఏర్పాటు ఉంది. ఆ క్షేత్రం ఒక పూట వెళ్ళి వచ్చేదికాదనీ, కనీసం ఒక వెన్నెల రాత్రి, ఒక శుభప్రభాతం అక్కడ ఉండవలసిందనీ అనిపించింది.

అక్కడ భోజనహెూటలు కూడా ఉంది. ఆకలి నకనకలాడటంతో భోజనానికి కూచున్నాం. మహారాష్ట్ర గ్రామసీమల తరహా భోజనం. రొట్టె, పప్పు, కూర, ఊరగాయ.

సద్గురు కిసన్‌గిరి మహరాజ్ (1907-1983) అక్కడికి దగ్గరలో ఉన్న గోధెగావ్‌లో జన్మించాడు. జీవితాన్ని తపస్సుకీ, సంఘసేవకీ అంకితం చేసాడు. ఆయన శిష్యుడు భాస్కరగిరి మహారాజ్ తన గురువు తపసు చేసుకున్న ఆ ప్రాంతాన్ని ఒక పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాడు. ఆ ప్రాంగణమంతా మూర్తీభవించిన పరిశుభ్రత అని చెప్పవచ్చు. ఒకప్పుడు జ్ఞానేశ్వర మహారాజ్ నెవాసాలోనే జ్ఞానేశ్వరి రాసాడని చెప్తారు. కాబట్టి ఆ ప్రాంతాన్ని ఒక తీర్థస్థలంగా మార్చడంకోసం ఆ శ్రీక్షేత్రాన్ని రూపొందించారు. ఆ ప్రాంగణంలో కిసన్‌గిరి మహరాజ్ సమాధి కూడా ఉంది. దానితో పాటు ఒక కీర్తనమంటపం, సిద్ధేశ్వరుడి పేరిట ఒక శివాలయం కూడా ఉన్నాయి.

కాని నెవాసాలో జ్ఞానేశ్వర మహరాజ్ తపసు చేసి జ్ఞానేశ్వరి రాసిన చోటు చూడలేక పోయాననే అన్న వెలితి మాత్రం మిగిలిపోయింది. మహారాష్ట్ర సంత్ కవులు పుట్టి పెరిగి పాటలు పాడిన తావులు చూడాలన్న ఒక ఆలోచన ఎలానూ ఉంది కాబట్టి, నెవాసా సందర్శనం ఆ యాత్రకోసమే మిగిలిపోయిందని నాకు నేను చెప్పుకున్నాను.

2-10-2022 & 3-10-2022

# ఆ సూర్యకాంతి మరికొంచెం

**పాతికేళ్ళ** కిందటి మాట. నేను హైదరాబాదు వచ్చిన కొత్తలో. అప్పట్లో ఒకసారి హరిహర కళాభవన్‌లో బిమల్‌రాయి రెట్రాస్పెక్టివ్ వేసారు. అవి వానాకాలం రోజులని గుర్తు. 'బందిని', 'సుజాత' లాంటి సినిమాలు చూసి, నగరవీథుల్లో పడెలు కట్టిన రోడ్లమీద విద్యుద్దీపాల కాంతులు మెరుస్తూ ఉంటే, సిటీబస్సు పట్టుకుని ఇంటికి వచ్చిన జ్ఞాపకాలు, వాటిని అల్లుకుని ఏదో అస్పష్టమైన దిగుల్లాంటి సంతోషం. 'ఆ రోజుల్ని తలచుకుంటే ఆనందం లాంటి విచారం కలుగుతుంద'ని కవి అన్నట్టే.

అటువంటి ఒక సాయంకాలం ఆ థియేటరు పోర్టికోలో ఇద్దరు మిత్రులు పరిచయమయ్యారు. జయసూర్య, లలిత. జయసూర్య మంచి ఫిల్మ్ క్రిటిక్. ఒక సినిమాను ఎలా సమీపించాలో, దాన్లో ఎలా సంలగ్నం కావాలో తెలిసినవాడు. ఆ రోజు వాళ్ళే నా దగ్గరి కొచ్చి నన్ను పరిచయం చేసుకున్నారు. మాట్లాడటం మొదలుపెడుతూనే అతడు చెప్పిన మాట: 'నేనూ, ఆమే ప్రేమించుకుంటున్న కొత్తలో, ఒకరి ఇష్టాలు మరొకరం తెలుసుకుంటున్నప్పుడు, అన్నిటికన్నా ముందు అడిగిన ప్రశ్న. నీకు చినవీరభద్రుడు రాసిన కథలు ఇష్టమా? అని' అన్నాడు.

ఉలిక్కిపడ్డాను. అప్పటికి నా కథల సంపుటి 'ప్రశ్నభూమి' వచ్చిన మాట నిజమే కాని, ఆ పుస్తకాలు కాకినాడ దాటి ఎక్కడికీ వెళ్ళి ఉండవని నాకు నమ్మకం. బహుశా పత్రికల్లో పడ్డ కథలు, అవి కూడా పట్టుమని పది పదిహేను మించి ఉండవు. కాని ఇద్దరు యువతీయువకులు తమ తొలియవ్వనపు ప్రేమభరితదినాల్లో, సంజె వేళల్లో నా కథల గురించి మాట్లాడుకున్నారన్న ఊహనే నాకెంతో నమ్మశక్యం కాకుండానూ, కానీ, నన్నెంతో పైకితేల్చేదిగానూ, నాకు కొత్త రెక్కలిచ్చేదిగానూ అనిపించింది. ఇప్పుడు ఎప్పుడన్నా బిమల్‌రాయ్ అనగానే, వెడల్పైన నుదురుతో, కాటుకపిట్టల్లాంటి కళ్ళతో నూతన్ గుర్తొస్తుంది, ఆ వానాకాలపు సాయంకాలాలు గుర్తొస్తాయి.

ఆ రెట్రాస్పెక్టివ్, ఆ పాట–

ఓ జానెవాలే, హెూ సకే తో లౌట్ కే ఆనా

యే ఘాట్, తు యే బాత్ కహీన్ భూల్ న జానా

ఆ పోర్టికోలో ఆ సంభాషణ, అపురూపమైన ఆ ప్రేమికులు, అప్పుడు, చివరగా నా మనసు నాకోసం దాచిపెట్టుకున్న మిఠాయిలాగా, ఆ మాట, 'నీకు చినవీరభద్రుడు రాసిన కథలు ఇష్టమేనా?'

రచయితలకీ, కళాకారులకీ కరతాళధ్వనులు గొప్ప బలాన్నిస్తాయి, సందేహం లేదు, ఎవరో ఎక్కడో కనబడి 'మీ ఫలానా పుస్తకం చదివాను' అన్నప్పుడో, 'ఇండియా టుడేలో అరకుమీద రాసిన ట్రావెలాగు నేను కత్తిరించి పెట్టుకున్నాను, ఇప్పటికీ నా దగ్గర భద్రంగా ఉంది' అని అంటున్నప్పుడో పైకి నిశ్శబ్దంగా, గంభీరంగా, లేదా చిన్న మందహాసంతో తలపంకిస్తున్నప్పటికీ, లోపల మనసు మాత్రం తుళ్ళిపడుతూనే ఉంటుంది. కాని ఆ ప్రశంసలన్నిటికన్నా విలువైన ప్రశంస, ఇద్దరు మిత్రులో, సహచరులో, నీ పరోక్షంలో, నీ రచనల గురించి మాట్లాడుకున్నారని తెలియడం, మాట్లాడుకుంటూ ఉంటారని తెలియడం.

ఇన్నేళ్ళ తరువాత మళ్ళా అటువంటి పులకింత మొన్న లభించింది. వారిద్దరూ మిత్రులు. రిజర్వు బాంకు ఆఫ్ ఇండియాలో ఉన్నతోద్యోగులు. ఒకరు ఢిల్లీలో ఉంటారు. మరొకరు హైదరాబాదులో. ఆ మిత్రుల్లో ఒకరు నాకు మెసేజి పెట్టారు. 'మేమిద్దరం మిమ్మల్ని కలవాలనుకుంటున్నాం. మరేమీ లేదు, ఊరికినే, మిమ్మల్ని చూడాలనీ, మీకు థాంక్స్ చెప్పాలనీ' అంటో.

అన్నట్టుగానే ఆదివారం పొద్దున్నే వచ్చారు. ఒకరు రాజేంద్రకుమార్, మరొకరు జయకుమార్. ఆ మిత్రులిద్దరూ నాకు కొత్తవాళ్ళుగా అనిపించలేదు. ఎప్పటినుంచో నాకు తెలిసినవాళ్లలాగే అనిపించారు. ఏవేవో మాట్లాడుకున్నాం. వారిద్దరూ నా రచనలు, ఫేస్ బుక్ పోస్టులు, ముఖ్యంగా నా బ్లాగు గురించి మాట్లాడుకుంటూ ఉంటామని చెప్పారు. రాజేంద్రకుమార్ తాను ఏది చదివినా వెంటనే తన మిత్రుడితో పంచుకుంటూ ఉంటానని చెప్పారు. తెలియకుండానే గంటసేపు గడిచిపోయింది.

ఒక మనిషి జీవితం, ఒక జాతి జీవితం సంస్కృతిగా రూపొందే క్షణాలు ఇవి. మన రోజువారీ జీవితంలో ఎందరినో కలుస్తూ ఉంటాం. ఏదో మాట్లాడుకుంటాం. చర్చలు, వాదోపవాదాలు, గాసిప్ చాలానే నడుస్తాయి. కాని అవేవీ గుర్తుండవు. కానీ, ఇట్లాంటి సమయాలుంటాయి. మనం మాట్లాడుకుంటూ ఉండగా మనకే తెలియకుండా

మన సాధారణ ప్రాపంచిక జీవితం ఒక మేఘానికో, ఒక సెలయేటికో, ఒక పూలపందిరికో తగిలి అక్కడే చిక్కుకుంటుంది. మనం అక్కణ్ణుంచి వచ్చేస్తాంకాని, ఎప్పుడో, ఏ మధ్యాహ్నవేళ నిశ్శబ్దంలోనో, ఏ అర్థరాత్రినో దూరంగా కొండమీద ఒంటరి నెలవంకను చూసినప్పుడో, దీర్ఘప్రయాణం తర్వాత నగరానికి వస్తున్నప్పుడు ఒకటొకటిగా విద్యుద్దీపాలు వెలగడం మొదలవుతున్నప్పుడో, మనకి ఆ క్షణాలు, మన మిత్రులతో మాట్లాడుకున్న ఆ మాటలు, అప్పుడు తలుచుకున్న ఏదో కవిత, మాటల మధ్యలో పరస్పరం మన విలోకనాల్లో తటిల్లున మెరిసే ఒక మిలమిల– ఇవి గుర్తొస్తాయి. చాలా సంతోషమనిపిస్తుంది. చాలా దిగులుగా కూడా ఉంటుంది.

రాజేంద్రకుమార్ గారూ, జయకుమార్ గారూ, మనం మళ్ళా మరెప్పటికీ కలుసుకో లేకపోయినా కూడా, మీరు నాకు చాలా దగ్గరగా గుర్తుంటారు. దూషించడమూ, ద్వేషించడమూ తీరికసమయపు వ్యాపకాలుగా మారిపోతున్న కాలంలో మీలాంటి ఇద్దరు మిత్రులు నా రచనల గురించి మాట్లాడుకుంటూ ఉంటారన్న మాట నాకెంత బలాన్నిచ్చిందో చెప్పలేను. అది నాకు చెప్పలేనంత బాధ్యతని కూడా అప్పగించింది.

నా జీవితవృక్షాన్ని బతికించుకోడానికి ఆకాశం నుంచి జీవజలాలు పీల్చుకుంటూ ఉంటాను. మనసుని చెప్పలేని నిరాశ ఆవహించినప్పుడు రకరకాల వెలుగుల్ని గుర్తు తెచ్చుకుంటాను. మరీ ముఖ్యంగా ఈ శరత్కాల ప్రభాతాలు చూడండి. శరత్కాల మనగానే అందరూ వెన్నెల్ని తలుచుకుంటారు. కాని ఈ ప్రభాతాలు ఎంత దివ్యంగా ఉంటాయో నాకు తెలుసు. బూజు దులిపి శుభ్రం చేసిన కిటికీల్లోంచి సూర్యకాంతి మరింత ప్రకాశ వంతంగా పడ్డట్టుగా, వర్షాలు శుభ్రం చేసి వెళ్ళిపోయిన దిగంతాల్లోంచి పొద్దున్నే మనమీద పరుచుకునే ప్రభాతసూర్యరశ్మి ఎంత ప్రాణప్రదాయకంగా ఉంటుందో. ఈ రోజునుంచీ ఆ సూర్యకాంతిని మరికొంచెం మూటగట్టుకుంటాను, తోటల్లో యాపిలు చెట్లూ, నారింజ చెట్లూ ఈ సూర్యకాంతిని పండ్లుగా మూటగట్టుకున్నట్టు నేను ఈ ప్రభాత కాంతిని నా పోస్టుల్లో మూటగట్టి మీతో పంచుకుంటాను.

11-10-2022

# మునగని పడవ

**జయతిని** నేనిప్పటి దాకా కలుసుకున్నది నాలుగు సార్లే. మొదటిసారి జయతి, లోహి ఇద్దరూ హైదరాబాదులో మా ఇంటికి వచ్చారు. రెండోసారి వాళ్లు హైదరాబాద్ శివార్లలో, ఇబ్రహీంపట్నంలో ఉంటున్నప్పుడు, నేనూ, నిర్మలా వాళ్ళ దగ్గరికి వెళ్లాం. మూడోసారి ఆమె మొదటి పుస్తకం 'అడవి నుండి అడవికి' రవీంద్రభారతిలో ఆవిష్కరణ సభ జరిగినప్పుడు. నిన్న నాలుగోసారి బూరుగుపూడి దగ్గర, లోపల, పోలవరం కాలువ దాటిన తర్వాత, చిన్న గుట్ట మీద వాళ్లు కట్టుకున్న కుటీరంలో.

కానీ ఈ నాలుగు సార్లూ జయతి అనే నెపం మీద నేను కలుసుకున్నది మిమ్మల్నే. ఈ నాలుగు సమయాలూ మనం కలుసుకున్న సమయాలే. డా.రాధాకృష్ణన్ రాసిన వాక్యం ఒకటి గుర్తొస్తోంది. ఆయన అన్నాడు కదా : 'ప్లేటోని ప్రేమించే ప్రతి జిజ్ఞాసి లోను ప్లేటో ఉన్నాడు, క్రీస్తును ఆరాధించే ప్రతి అనుయాయిలోనూ క్రీస్తు ఉన్నాడు' అని. నిన్న మధ్యాహ్నం కాకినాడ నుంచి, ఇంకా చుట్టుపక్కల ప్రాంతాల నుండి, ఎన్నో దూరాలనుండి ఆ డొంకదారిన, ఆ గుట్ట దారిన, ఆ మెట్ట దారిన, ఆ పూల ఋతువులోకి జయతిని వెతుక్కుంటూ అడుగు పెట్టిన ప్రతి ఒక్కరిలోనూ జయతి ఉంది.

మానవుడు చంద్రుడి మీద అడుగు పెట్టాడు అని మనం గర్విస్తాం కానీ చంద్రుడి మీద అడుగు పెట్టింది నీల్ ఆర్మ్ స్ట్రాంగ్, మనం కాదు. కాని ఆర్మ్ స్ట్రాంగ్ అడుగుపెట్టగానే చంద్రుడి మీద మనిషి అడుగు పెట్టాడు అని చెప్పుకున్నాం. అది చాలు మనకి. ఒక్క మనిషి చంద్రుడి మీద అడుగుపెట్టినా, అది ప్రపంచ జనాభా 800 కోట్ల మందీ చంద్రుడి మీద అడుగు పెట్టినట్టే.

జయతి జీవిస్తున్న జీవితం లాంటి జీవితం జీవించాలని మనలో చాలామందిమి అనుకోకపోవచ్చు. జీవించడానికి మనకి ఆ సాహసం కూడా ఉండకపోవచ్చు. కాని

మనుషులు ఎవరూ సంచరించని ఆ తావులో, ఆ గుట్టమీద, చుట్టూ పూల మొక్కలు పెంచుకొని వాటి మధ్య ఆ సహచరులు ఇద్దరే జీవించగలడం చూసిన తర్వాత మనకందరికీ మనం కూడా ఆ జీవితంలో పాలుపంచుకుంటున్నావని అనిపించింది కదా! బహుశా మనం ఇప్పటిదాకా కలుసుకుంటూ వస్తున్న సమయాల్లో నిన్నటి సాయంకాలం లాంటి సమయం మరొకటి ఉండదని చెప్పగలను.

మనుషులు తోటి మనుషుల్నీ, తోటి మనుషుల పట్ల తమ రాగద్వేషాల్నీ, జీవితం ఇస్తున్న సౌకర్యాల్నీ వదులుకోలేకపోవచ్చు. అదేమీ దోషం కాదు. మనుషులు కలిసి ఉండటం కోసమే ఈ ప్రపంచం ఇంకా ఇలా కూలిపోకుండా ఉందని నేను నమ్ముతాను. నిజానికి జయతి, లోహి ఆ కొండమీద కుటీరంలో, అనుక్షణం వాళ్ళు ఒక్కరే లేరనీ, మనమంతా వాళ్ళతో పాటే ఉంటున్నామనీ కూడా నిన్న నాకు బాగా అర్థమైంది.

మనుషుల్ని వదులుకోకపోతే మరి అంత దూరం పోవటం ఎందుకు అని అడగవచ్చు ఎవరైనా. నిన్న మనతోపాటు రానివాళ్లు లేదా రావాలని అనుకోని వాళ్ళు. ఒకప్పుడు జపాన్‌లో సైగ్యొ అని ఒక జెన్ సాధువు ఉండేవాడు. ఆయన తొలి రోజుల్లో సమురాయిగా రాజాస్థానాల్లో ఉద్యోగం చేశాడు. ఎక్కడో ఆ జీవితం పట్ల విరక్తి పుట్టింది. జెన్ సాధువుగా జీవిత మొదలుపెట్టాడు. రాజధాని నుంచి దూరంగా వెళ్లిపోయాడు కానీ ఆ తర్వాత ఆయన రాసిన కవిత్వం చదువుతూ ఉంటే ఆయన మనుషుల నుంచి దూరంగా ఎక్కడ వెళ్ళాడు? సౌందర్యం నుంచి దూరంగా ఎక్కడికి వెళ్లాడు? చంద్రుడి నుంచి, కోకిల నుంచి దూరంగా ఎప్పుడు వెళ్ళాడు? అని అనిపిస్తుంది. సైగ్యొ తర్వాత, జపాన్ కవులందరికీ సైగ్యొ ఒక ఆదర్శంగా మారాక, బషో లాంటి కవి సైగ్యొ తిరిగిన దారుల్లో తాను కూడా జపాన్ అంతా తిరిగేక, వాళ్ళ జీవితంలోనూ, వాళ్ళ కవిత్వంలో కూడా మళ్లా మనకి అదే లక్షణం కనిపిస్తుంది. అంటే ఏమిటి? వాళ్లు ప్రాపంచికవాసనల నుంచి దూరంగా జరిగారు కానీ, ప్రపంచం నుంచి కాదని. ప్రపంచబంధాలనుంచి దూరంగా జరిగారు గాని ప్రపంచంతో అనుబంధం నుంచి కాదని.

సైగ్యొ అడవికి వెళ్లి ఒక కొండ లోయలో కట్టెలు కొట్టుకుని ఏటి నీళ్లు తెచ్చుకుని అన్నం వండుకుందామని కూర్చున్నప్పుడు , అతనికి ఒక కోయిల కూత వినిపించింది. అతడు ఆ కోయిలని ఉద్దేశిస్తూ అన్నాడు కదా: 'నేనిక్కడికి వచ్చిందే అన్నింటి నుంచి దూరంగా ఉందామని, కాని, ఇదేమిటి నువ్వు నన్ను వదలట్లేదు?' అని. ఎవరు ఎవరిని వదల్లేదు? కోకిల సైగ్యొని వదల్లేదు, సైగ్యొ కోకిలని వదలలేదు, వాళ్ళిద్దర్నీ జపాన్ వదల్లేదు, మనం వాళ్లని వదల్లేదు.

టాగోర్ అన్నాడు వైరాగ్యంలో తనకు ఊపిరాడదని. జయతి లోహిల జీవితంలో ఉన్నది వైరాగ్యం కాదు. మనుషుల పట్ల అప్రమేయమైన ప్రేమ. జమా ఖర్చులకి, ఇచ్చి పుచ్చుకోడాలకి, లాభనష్టాలకీ అతీతమైన ప్రేమ. బహుశా మనమందరం మన కుటుంబంలో, మన కార్యాలయంలో, మన తోటి మనుషులతో కనీసం ఒక్కరితోనైనా, కనీసం ఒక్కరోజైనా, కనీసం ఒక్క గంట పాటు అయినా ఇట్లాంటి అనుబంధం కోరుకుంటున్నాం కాబట్టే నిన్న ఆ కుటీరాన్ని వెతుక్కుంటూ వెళ్ళాం.

వదులుకోవడం ద్వారా పొందమని చెప్పాయి ఉపనిషత్తులు. వదులుకోవడం ద్వారా పొందడం అంటే ఏమిటో నాకు చాలా కాలం పాటు అర్థం కాలేదు. అదొక విరుద్ధ వాక్యంగానూ, ఒక పేరడాక్స్‌గానూ అనిపించేది. కానీ వదులుకోవడం ద్వారా పొందడం అంటే ఏమిటో నిన్న నాకు బాగా అర్థమైంది. జయతి, లోహి ప్రపంచాన్ని వదులుకున్నారు కాబట్టి ప్రపంచాన్ని పొందగలిగారు. కనీసం ఆ కొద్దిసేపైనా తక్కినవన్నీ పక్కన పెట్టగలిగాం కాబట్టి నిన్న మనం వాళ్ల  సన్నిధి పొందగలిగాం.

జీవితంలో ఇదొకటి బాగా గుర్తుపట్టగలిగాను. ఎవరు తమ కుటుంబాలకు దూరమయ్యారో, తమ వాళ్లని వదులుకోవలసి వచ్చిందో వాళ్లకి ఎన్నో కుటుంబాలు దగ్గరగా జరగడం చూసాను. మాకెంతో ఇష్టమైన మా ఊరిని 1985 లో మేము పెట్టవలసి వచ్చింది. కానీ రెండేళ్లు తిరగకుండానే నాకు గిరిజన సంక్షేమశాఖలో ఉద్యోగం దొరికి, అన్ని గిరిజనగ్రామాలూ నావే అయిపోయాయి. మరొక చిత్రం కూడా చూశాను– ఎవరు దేన్ని వదులుకోలేక, ఏ ఇంటిని, బంధాన్ని, ఉద్యోగాన్ని, వ్యాపకాన్ని, చివరకు ఐడియాలజీని వదులుకోలేక పట్టుకు వేలాడుతుంటారో, వారి నుంచి తక్కిన వారు నెమ్మదిగా దూరంగా జరిగిపోతుండడం కూడా చూసాను.

బహుశా మనందరిలోనూ స్వేచ్ఛ గురించిన అపరిమితమైన కాంక్ష ఒకటి మనకే తెలియకుండా చాలా బలంగా ఉంటుందనుకుంటాను. అందుకే జిబ్రాన్ అన్నాడు: ప్రతిరోజు నీ ఇంటికి మరలి వచ్చే నీలోనే ఎల్లలేని సంచారి కూడా ఒకడున్నాడు అని. మన ఇంటిని, మన cosy homes ని, మన నెట్ ఫ్లిక్స్‌ని, ఆమెజాన్ ప్రైమ్‌ని, మన డ్రాయింగ్ రూమ్‌గోష్ఠిని మనం ఇష్టపడుతున్నట్టు అనుకుంటున్నాము కానీ, మనకు కూడా రెక్కలు ఉన్నాయనీ, ఆ రెక్కలతో ఒకసారి అయినా ఎక్కడికో ఎగిరిపోవాలనీ లేదా కనీసం ఎగిరి రావాలనీ మనలో మనని ఏదో తెలియకుండానే వేధిస్తోనో, ప్రోత్సహిస్తూనో ఉంటుంది అనుకుంటాను. నిన్న ఆ కుటీరంలో సమావేశమైన ప్రతి ఒక్కరికి ఆ రెక్కలు పూర్తిగా విప్పారి ఉండడం నేను కళ్లారా చూశాను.

జయతి, లోహిలకు మనం అవసరం. ఎందుకంటే వాళ్లు పూల తోటీ, పిట్టల తోటీ, పురుగుల తోటీ మాట్లాడుకుంటున్న మాటలు చెప్పుకోవటానికి, వినటానికి మనం కావాలి. కానీ అంతకన్నా కూడా ఎక్కువగా మనకి జయతి, లోహి కావాలి. ఎందుకంటే మనం ఎప్పుడైనా కలుసుకుందాం అనుకుంటే, ఒక సమయం చిక్కాలి అంటే, అట్లాంటి వాళ్ళు మనకి ఉండాలి. ఎంత దూరంలో కానీ ఏ కొండకొమ్ము మీద కానీ ఏ సముద్రపు ఒడ్డున కానీ ఎక్కడో ఒక చోట, వాళ్లు జీవించే ఒక తావు ఉండాలి. అందుకని వాళ్లు చల్లగా ఉండాలి.  మనకీ, వాళ్ళకీ మధ్య ఒక uninterrupted network సదా కొనసాగుతుండాలి.

మనం కలుసుకున్న సమయాలు ఇప్పటిదాకా జయతి వెలువరించిన పుస్తకాల్లో మూడవది. 'అడవి నుండి అడవికి', 'అడవి పుస్తకం' తరువాత వచ్చిన పుస్తకం. ఇందులో నాలుగు ప్రదేశాలూ, ఇరవై వ్యాసాలూ ఉన్నాయి. చిట్టచివరి భాగం, ప్రస్తుతం ఆమె నివసిస్తూ, తానున్నచోట అల్లుకున్న కుటీరం చుట్టూ పోగుచేసుకున్న అనుభవాలు.

ఈ పుస్తకం ఆవిష్కరణ కుటీరంలో చెయ్యాలని అనుకుంటున్నామని చెప్తూ నన్ను పుస్తకం మీద మాట్లాడమని అడుగుతూ జయతి సాఫ్ట్‌కాపీ పంపించారు. 116 పేజీల పుస్తకం. అది చదువుతున్నంతసేపూ నా గుండె ఊడి కళ్ళల్లోంచి కిందపడి పోతుందేమో అనిపిస్తూ ఉంది.  కుమ్మరి ఆవంలో కుండలు కాల్చినట్టుగా, పైకి పొగ వస్తున్నది తప్ప, అంతసేపూ ఆ జ్వాల అంతా లోపల్లోపలే వెలుగుతూ ఉండింది. తీరా అక్కడ లేచి నిలబడి ఆ పుస్తకం గురించి మాట్లాడటం మొదలుపెట్టేవేళకి గుండె కరిగి కన్నీరుగా జలజలచెంపల మీంచి రాలింది.

చాలా చాలా ఏళ్ళ కిందట నా మిత్రుడొకడు తాను మార్క్సిజం చదువుకుంటున్న ఉద్వేగంలో గాంధీ గురించి అన్నాడు కదా, 'ఆయన నిరాడంబరంగా ఉండటంలో విశేషమేముంది? ఈ దేశంలో అత్యధిక సంఖ్యాకులు రోజూ జీవిస్తున్నది ఆ చాలీచాలని జీవితమే కదా' అన్నాడు. 'కాబట్టే వాళ్ళతో ఐడెంటిఫై అవ్వాలనుకున్నాడు' అన్నాను.

'ఏముంది అందులో? బీదవాళ్ళకి అందులో ఏమీ గొప్పదనం కనిపించదు. మధ్య తరగతి, ఉన్నతతరగతి ఆయనలాగా ఎలానూ జీవించరు. ఎలా చూసినా ఆయన తనను తాను భ్రమపెట్టుకోవడం తప్ప మరేమీ కాదు' అన్నాడు. నా మిత్రుడు మాట్లాడుతున్న మాటల్లో ఏదో లోపం ఉందనిపించింది. కాని అదేమిటో గుర్తుపట్టి చెప్పగల జ్ఞానం, అనుభవం ఆ రోజు నాకు లేకపోయాయి.

కాని ఇప్పుడు చెప్పగలను. టాల్‌స్టాయినీ, రస్కిన్‌నీ, థోరోనీ, ఋషీశ్వరులని చెప్పదగ్గ చీనాకవుల్నీ, జెన్ సాధువుల్నీ, సూఫీ యోగుల్నీ, క్రైస్తవ మిస్టిక్కుల్నీ, ఇప్పటి పర్యావరణ ఉద్యమకారుల్నీ చదివిన పరిజ్ఞానంతో చెప్పగలను, ఇన్నేళ్ళుగా ఈ సమాజాన్నీ, ప్రపంచాన్నీ దగ్గరగా చూసిన అనుభవంతో చెప్పగలను:

'నువ్వు నిజంగా మనుషుల్ని ప్రేమిస్తే, ఇప్పటికే ఈ సమాజం నుంచీ, నలుగురి శ్రమ నుంచీ నువ్వెంతో తీసుకున్నావనీ, కాని నువ్వు తిరిగి తీర్చవలసిన ఋణంలో సహస్రాంశం కూడా తిరిగి చెల్లించనేలేదనీ తెలుస్తున్నకొద్దీ, నువ్వు వీలైనంత నిరాడంబరంగా తప్ప మరోలా జీవించలేవనీ. నీ అవసరాల్ని, వస్తు సంచయాన్నీ ఎంత తగ్గించుకోగలవో అంతగా తగ్గించుకున్నాక కూడా, ఇంకా వదిలి పెట్టవలసింది ఏదో ఉండనే ఉందనీ.'

నిజానికి ఆదిమానవుడు ఇట్లానే జీవించేవాడు. తనకి ప్రకృతినుంచి అవసరమైన దానికన్నా, ఒక్క పండుగాని, ఒక్క కాయగాని, ఒక్క కుందేలుపిల్లగాని, దేన్ని అదనంగా తీసుకున్నా పాపం చేసినట్టే వణికిపొయ్యేవాడు. ఆ ఒక్క పండు కూడా ఎంతో వినమ్రంగా, అడవిముందు మోకరిల్లి, దాన్ని చేతుల్లోకి తీసుకున్నాక కూడా, ముందు దాన్ని అడవి ముందు పెట్టి 'నువ్వూ తిను, మేమూ తింటాం' అనేవాడు. ఏ మనిషైనా, అప్పుడు గాని, ఇప్పుడు గాని, జీవించడానికి ఇంతకనా గౌరవప్రదమైన మరో మార్గం లేదు. చిన్నప్రాణి మీద పెద్ద ప్రాణి, పెద్ద ప్రాణిమీద అంతకన్నా పెద్ద ప్రాణి ఆధారపడి బతికే ఈ జీవచక్రం నిజానికి హింసాచక్రం. ఈ చక్రాన్ని మనం తుంచలేం, అలాగని కళ్ళు మూసుకుని కొనసాగిస్తూనూ ఉండలేం.

కాని ఎవరో ఒకరు, ఒక తావో యువాన్ మింగ్ లాంటి వాడు, ఒక టాల్‌స్టాయి లాంటి వాడు, ఒక గాంధీలాంటివాడు తాను తింటున్న ప్రతి ఒక్క ముద్దకు తాను ప్రకృతికీ, ప్రపంచానికీ కూడా జీవితకాలం ఋణపడి ఉన్నామని గుర్తు చేసుకుంటూ ఉంటాడు. అట్లాంటి వాళ్ళు జీవించిన స్థలాలు నిజమైన దేవాలయాలు. ఎందుకంటే అక్కడ మాత్రమే మనిషి వీలైనంత అహింసాత్మకంగా జీవిస్తాడు కాబట్టి. ఈ ప్రపంచంలో బతకడానికి తనకన్నా పిట్టలకీ, పురుగులకీ ఎక్కువ హక్కు ఉందని నమ్ముతాడు కాబట్టి.

నేనొకప్పుడొక కొండరెడ్ల గ్రామానికి వెళ్ళాను. హేమంత ఋతువు. వాళ్ళ పొలాల్లో అలసందలు విరగకాసాయి. కాని వాటికి బాగా పురుగుపట్టింది. ఆ బొబ్బర కాయల్లో ప్రతి ఒక్కదానిమీదా పురుగు గాట్లు కనిపిస్తున్నాయి. 'అయ్యో, ఈ పంటకి పురుగు పట్టింది, మందు కొట్టించలేదా?' అనడిగాను.కాని వాళ్ళల్లో ఎట్లాంటి ఆదుర్దా కనిపించలేదు.

నేలతల్లి అందిస్తున్న ఆహారంలో ఎవరి వాటా వారిది అన్న ప్రశాంతనిర్లిప్తతనే వాళ్ళ వదనాల్లో కనిపించింది.

మనిషి రైతుగా మారడానికి ముందు ఎన్నో వేలఏళ్ళు వేటగాడిగా బతికాడని మనకు తెలుసు. వేట–ఆహారసేకరణ అనే మాటని మనం కొన్నిసార్లు ఒకే పదబంధంగానూ, కొన్నిసార్లు పర్యాయపదాలుగానూ వాడుతుంటాం. కాని మనిషి వేటకాడు కావడానికి ముందు ఎన్నో లక్షల ఏళ్ళు ఆహారసేకరణ మీదనే బతికాడు. దాన్ని foraging అంటారు. తెల్లవారి లేచి తనకి అడవిలో ఏది దొరికితే అది మాత్రమే తిని జీవించిన కాలం. ఆ రోజుల్లో మనిషికి రోజంతటికీ కావలసిన పౌష్టికాహారం కొన్ని గంటల్లోనే దొరికిపొయ్యేదని ఇప్పుడు పరిశోధకులు చెప్తున్నారు. ఏ రోజు దొరికింది ఆ రోజే తినెయ్యాలికాబట్టి కూడగట్టడం, పోగెయ్యడం అనే క్రియాపదాలకి అక్కడ తావులేదు. ఆస్తిలేదు కాబట్టి, రాజ్యం లేదు, జైళ్ళు లేవు, విప్లవాలు లేవు, విద్రోహాలు లేవు. అంతేనా? ఆ రోజుల్లో స్త్రీపురుషుల మధ్య ఎట్లాంటి జెండరు కూడా లేదనే ఇప్పుడు గ్రహిస్తున్నారు. ఆహారం ఎవరేనా సేకరించుకోవచ్చు. పురుషుడు మాత్రమే ఆహారం సేకరించాలి, స్త్రీ ఇంట్లో కూచుని వంట చెయ్యాలి అనే పనివిభజన కూడా లేని కాలం అది. బహుశా మానవ చరిత్రలోనే అత్యంత అహింసాత్మక కాలం అది అని చెప్పుకోవచ్చు.

ఆ తర్వాత వేట, పశుపోషణ, వ్యవసాయం తలెత్తాక కూడా, ఆ జ్ఞాపకాలు మనుషుల అంతరంగాన్ని వదల్లేదు. ఆ జ్ఞాపకాలింకా ఎవరి ఆత్మల్లో బలంగా ఉన్నాయో వారు తమ తమ జీవితాల్ని అత్యంత అహింసాత్మకంగా జీవించడమెలా అని ఆవేదన చెందడం మానలేదు. అలా జీవించడాన్ని వేదకాల మానవుడు ఉంఛవృత్తి అన్నాడు. అంటే రైతులు పొలాల్లో పంట కోసుకుని కళ్ళాలకు ఎత్తాక, కోతలు పూర్తయిన పొలాల్లో రాలిపడ్డ పరిగె ఏరుకుని దాని మీద బతకడం. అత్యంత స్వతంత్ర మానవులు అత్యంత గౌరవప్రదంగా పొట్టపోసుకోవడంగా దాన్ని వైదికయుగం భావించింది.

ఒకప్పుడు అట్లా పరిగె ఏరుకుని ఇంటికి తెచ్చుకుని ఆ యవధాన్యాన్ని పిండిచేసుకుని ఒక కుటుంబంలో నలుగురూ నాలుగు ముద్దలు చేసుకుని తినబోతూ ఉండగా ఒక అతిథి వాళ్ళ తలుపు తట్టాడు. అతడి ఆకలి తీర్చడం కోసం ఆ నలుగురూ తమ వంతు ముద్దలు తాము ఆ అతిథికోసం త్యాగం చేసారు. అతడు అది తిని చేతులు కడుక్కున్నప్పుడు, ఆ నీళ్ళల్లో ఒక ముంగిస పొర్లాడింది. ఆ పొర్లాడినంతమేరా దాని వీపుకి ఒకపక్క బంగారంగా మారిపోయింది. అప్పణ్ణుంచీ అది మిగిలిన వీపు కూడా బంగారంగా మారే సమయంకోసం ఎదురు చూస్తూ ఉంది. ధర్మరాజు కురుక్షేత్రంలో గెలిచాక అశ్వమేధ

యాగం చేసినప్పుడు అది మళ్ళా అక్కడికొచ్చి ఆ యాగశాలలో పొర్లాడింది. కాని తన వీపు బంగారంగా మారలేదని ఆ ముంగిస నిండుసభలో ధర్మరాజుని ఎద్దేవా చేసింది.

'నాకు forager ని కావాలని ఉంది' అన్నారు జయతి ఒకసారి నాతో. ఆ మాటలు వింటూనే ఉలిక్కిపడ్డాను. నా సమకాలికుల్లో ఒక్క రచయితగాని, ఒక్క కవిగాని, ఒక్క ఉద్యమకారుడు గాని ఇట్లాంటి మాటలు అనగా వినలేదు నేను. ఒక మనిషి forager కావాలని అనుకోవడమంటే ఏమిటి? All property is theft అని ప్రౌధాన్ అన్నాడని మనకు తెలుసు. అంటే ఎవరన్నా తనదగ్గర తన అవసరానికి మించి ఒక్క జత గుడ్డలు కూర్చుకున్నా కూడా అది దోపిడీనే. ఆస్తి కలిగి ఉండటం దోపిడీమాత్రమే కాదు, అది నువ్వు నిరంతర హింసకి పాల్పడుతూండటం కూడా. నిజమే, ఎంతో కొంత హింసలేకుండా ఈ జీవచక్రం కొనసాగదు. అందుకనే, సున్నితహృదయుడైన ప్రతి ఒక్కడూ అన్నిటికన్నా ముందు ఈ భవచక్రం నుంచి బయటపడాలనీ, ఏ రూపంలోగాని, మరోసారి మరో జన్మ ఎత్తకూడదనే కోరుకుంటూ ఉన్నాడు.

మార్క్స్, ప్రౌధాన్, రూసో– ఆస్తి హక్కు అమానుషమైన హక్కు అని భావించడం వెనక, వారికి తెలిసో, తెలియకో క్రైస్తవ మిస్టిక్కుల ప్రభావం ఉంది. తొలిక్రైస్తవులు క్రీస్తు చెప్పిన ప్రతి ఒక్కమాటనీ తుచతప్పకుండా నమ్మడానికి ప్రయత్నించారు. 'మీకు దుస్తుల గురించి చింత ఎందుకు? పొలంలో వికసిస్తున్న పూలని చూడండి. అవి వడకవు, నేతనెయ్యవు' అని క్రీస్తు అన్నాడని (మత్తయి, 6:28) మనకు తెలుసు. అక్కడితో ఆగకుండా 'తన సమస్త వైభవంతో కూడిన సొలోమోను కూడా వాటిలాగా విరాజిల్లడం లేదని చెప్పగలను' అని కూడా (లూకా, 12:27) అన్నాడు.

ఆ వైభవం ఆస్తిని త్యజించడంలోని వైభవం, అహింసలోని వైభవం. మొన్న ఆ గుట్టమీద జయతి కుటీరాన్ని చూసినప్పుడు, అది నేనిప్పటిదాకా చూసిన రాజమందిరాలు అన్నింటినీ మించిన వైభవంతో విరాజిల్లుతుండటం చూసాను.

ఈ ప్రపంచంలో మనిషి పాల్పడగల అత్యంత హింసాత్మక చర్య అంటూ ఉంటే అది ఆస్తి కూడగట్టుకోవడమే. ఆస్తి ఏమి చేస్తుంది? అది మరొక మనిషిని నీకు బానిసగా మార్చుకోవడానికి తాపత్రయపడటం మొదలుపెడుతుంది. అంటే మీరు అడగవచ్చు. ఆస్తికి హద్దు ఏమిటని? రెండు జతల దుస్తులు కలిగి ఉండటం కూడా అపరాధమేనా? రూసో ఒక మాటన్నాడు: 'ఏ మనిషీ తన తోటిమనిషిని కొనుగోలు చేసేటంత ధనికుడు కాకూడదు, ఏ మనిషీ తన తోటిమనిషికి బానిసగా మారేటంత దరిద్రుడు కాకూడదు'

అని. ఆస్తికి హద్దులేమిటనేది ఎవరికి వారు ఎప్పటికప్పుడు వేసుకుంటూ ఉండవలసిన ప్రశ్న. ఈ సౌకర్యం, ఈ డివైజు, ఈ అభిప్రాయం నాకు ఆస్తిగా మారుతున్నదా అనే కాదు, అసలు అన్నిటికన్నా ముందు, ఇది ప్రపంచంలో ఆస్తిహక్కుని నిలబెట్టడానికి పూనుకుంటున్నదా అని చూసుకోవాలి. ఆస్తి బానిసత్వానికి దారితీస్తుంది. ఇది భౌతికమైన ఆస్తికే కాదు, జ్ఞానం రూపేణా కూడగట్టుకునే ఆస్తికి కూడా వర్తిస్తుంది. ఒక మనిషిని బానిసగా మార్చడమంటే, ప్రౌధాన్ చెప్పినట్టు, అతణ్ణి హత్యచెయ్యడమే.

ఆస్తినీ, సంచయాన్నీ, వ్యామోహాన్నీ ఎవరు ధిక్కరించినా, అది మిస్టిక్కులుగానీ, సోషలిస్టులుగానీ, కమ్యూనిస్టులుగాని, అనార్కిస్టులుగానీ, చలంగారు, గాంధీగారు–ఎవరైనా గానీ వారు నాకు ఆరాధనీయులు. ఈ జీవితంలో నేను చేరుకోవలసిన తీరానికి వాళ్ళు కొండగుర్తు. ఇప్పుడు ఆ కొండగుర్తుల్లో జయతి కూడా చేరింది.

తనకి forager గా బతకాలని ఉంది అని ఆమె నాతో చెప్పిన మాట మూడు నాలుగేళ్ల కిందటి మాట. కాని ఆమె తన కలని నిజం చేసుకున్నదని ఈ పుస్తకంలో 'కడుపునిండిన తియ్యని మామిడిపండ్లు' (పే. 51-52) చదివితే తెలిసింది. ఈ పుస్తకం నుంచి మీరు చదవకముందే ఏ వాక్యాలూ ముందే ఎత్తి రాయకూడదనుకున్నాను గాని, ఈ వాక్యాలు మాత్రం రాయకుండా ఉండలేకపోతున్నాను. చూడండి:

> పండ్లొక్కటే కాదు, ఇదని చెప్పలేనివెన్నో చెట్టు ఇచ్చింది. నలుగురూ చెట్టుని చూడాలనుకుంటారు. ఫొటోలు తీస్తాను. చెట్టుకింద కూర్చునే పనెవరిస్తారు? దానికి జీతం ఎవరు చెల్లించరు. ఎవరికి జీతం కావాలి? చెట్టుకిందకు చేరుకోవాలంటే ఉద్యోగం ఒక్కటే కాదు, ఒక్కొక్కటి ఎన్నో వదులుకోవలసి ఉంటుంది. నా నాలుగ్గోడలనుండి ధైర్యం, సాహసం అనే మాటలకర్థం తెలియకుండానే ప్రపంచపు అంచులపైకి, చెట్టుకిందకి నడిచి పోయాను.

ఒకప్పుడు గాలిబుకి ఎవరో అతడి సమకాలికుడు మోమిను రాసిన ఒక షేరు వినిపించారు. ఆ రెండు పంక్తులూ వినగానే గాలిబు చలించిపోయాడు. 'ఈ షేర్ కనుక మోమిను నాకిచ్చేస్తానంటే, నా దివాను మొత్తం మోమినుకి ఇచ్చేస్తాను' అన్నాడట గాలిబు. జయతి గాని ఈ రెండుపేజీలు నాకు ఇచ్చేస్తానంటే, నేనింతదాకా రాసిన నా రచనలు మొత్తం వదులుకోడానికి నాకెట్లాంటి సంకోచం లేదు.

మరొక రెండు మాటలు కూడా చెప్పాలని ఉంది. మొదటిది, అడవిలో ఉంటున్నందుకో, ప్రకృతిని ఆరాధిస్తున్నందుకో జయతి పట్ల నాకు అభిమానం కలగలేదు.

అన్నిటినీ వదిలిపెట్టి ప్రకృతి మధ్యకు వెళ్ళి బతికేవాళ్ళూ, కొన్నాళ్ళు అక్కడ ఉండి, తిరిగి వచ్చేవాళ్ళూ, తిరిగి వచ్చాక పుస్తకాలు రాసేవాళ్ళూ ఈ ప్రపంచంలో చాలామందే ఉన్నారు. ఆ మధ్య Sylvain Tesson అనే అతను సైబీరియాలో బైకాల్ సరస్సు దగ్గర ఒక కేబిన్లో ఒక్కడూ ఆరునెలలు గడిపి వచ్చి, The Consolations of the Forest: Alone in a Cabin on the Siberian Taiga (2013) పుస్తకం రాసాడు. అది ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కాని అతడు సైబీరియాలో గడిపింది ఆరు నెలలే. జయతి దారపల్లిలోనూ, ఇక్కడ కుటీరంలోనూ అంతకన్నా ఎక్కువ కాలమే గడిపింది.

ప్రకృతి ఆరాధకులకు కూడా ఈ ప్రపంచంలో కొదవలేదు. తాము చూసింది బొమ్మలుగా గీసేవాళ్ళూ, చిత్రాలుగా మలిచేవాళ్ళూ కూడా తక్కువేమీ కాదు. ప్రకృతి ఆరాధన నా దృష్టిలో దానికదే ఒక విలువ కాదు. కాని జయతి విశిష్టత ఈ పరిమితమైన అంశాలని దాటిన విశిష్టత.

అలాగే వాళ్ళు ఏకాంతవాసం చెయ్యడం లేదనీ, ఏకాంతంగా ఎక్కడున్నారు, వాళ్ళ అనుభూతి, అనుభవాలూ ప్రతి రోజూ మిత్రులతో పంచుకుంటూనే ఉంటున్నారుకదా అని కూడా ఎవరన్నా అనవచ్చును. సరిగ్గా, ఈ కారణం వల్లనే జయతి అంటే నాకు ఎక్కువ ఆరాధన. తాను చూసిన సత్యాన్నో, సౌందర్యాన్నో తోటిమనిషితో పంచుకోవాలని కోరుకోకపోతే, తహతహలాడకపోతే ఆ మానవానుభవానికి అర్థమే లేదు. సిద్ధార్థ గౌతముడికి జ్ఞానోదయం అయిన తర్వాత ఆయన గయనుండి సారనాథ్ దాకా అంటే దాదాపు 250 కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వచ్చేసాడు. ఎందుకు? తాను చూసిందేదో గయదగ్గర కూడా ప్రబోధించవచ్చు కదా! కాదు, తాను అన్వేషణ మొదలుపెట్టినప్పుడు తనతో కలిసి నాలుగడుగులు నడిచి అక్కడే ఆగిపోయిన మిత్రులున్నారు, తాను చూసిందేదో అందరికన్నా ముందు వారితో పంచుకోవాలనుకున్నాడు ఆయన.

జయతి జీవితంలో నన్ను అమితంగా ఆకర్షించినవి రెండు అంశాలు. ఒకటి ఆమె సరళజీవనం, రెండవది ఆమె విరళచింతనం. విరళమంటే ఇక్కడ అర్థం అరుదైన అని. కాని ఆమె చింతించే విషయం మాత్రం అవిరళం.

నేను ఇంతకుముందు foraging గురించి మాట్లాడేను. అది నిజంగా అంత అత్యున్నత జీవితాదర్శమే అయి ఉంటే, మానవుడు తన పరిణామక్రమంలో ఆ దశని ఎప్పటికీ వదిలిపెట్టి ఉండేవాడు కాదు. ఇంత దూరం ప్రయాణించి ఉండేవాడు కాదు. అయినా ఎందుకని ఇంత దూరం, ఇన్ని మహాయుగాల పాటు ప్రయాణిస్తో వచ్చేడు?

ఎందుకంటే, ఏ జంతువునీ వేటాడకుండా, తోటిమనిషిని బానిసగా మార్చకుండా కేవలం ఆకులూ, అలములూ ఏరుకుంటూ గడపడం ఎంతో ఆరాధనీయమైన విషయమే అయినప్పటికీ, అది మనిషి తన చైతన్యంతో ఇష్టపూర్వకంగా ఎంచుకున్న జీవనవిధానం కాదు. అప్పటి ప్రకృతి పరిమితుల వల్ల, ఇంకా ఎదగని అతడి మెదడు వల్ల, వికసించని చైతన్యంవల్ల సాధ్యమైన ఒక పరిణామ దశ మాత్రమే.

మానవపరిణామంలో ఏడు దశలుంటాయని వివరిస్తో Duane Elgin రాసిన Awakening Earth: Exploring the Evolution of Human Culture and Consciousness (1993) లో దాన్ని surface consciousness అంటాడు. అంటే అది పై పై చైతన్యం మాత్రమే. ఆ చైతన్యం పూర్తిగా వికసించి లోపలకీ ఇంకిన చైతన్యం కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఆ foraging ఏ మాత్రం కూడా voluntary foraging కాదు. కాబట్టి ఆ మానవుణ్ణి మనం ఆదర్శమానవుడిగా భావించలేం.

Duane Elgin మరో పుస్తకం కూడా రాసేడు. Voluntary Simplicity: Toward a Way of Life That Is Outwardly Simple, Inwardly Rich (1981) అని. అంటే ఐచ్ఛిక నిరాడంబరత్వం గురించి. అసిసీకి చెందిన సెయింటు ఫ్రాన్సిసు, వారణాసికి చెందిన కబీరు, మన కాలంలో గాంధీ మాట్లాడింది ఆ ఐచ్ఛిక దారిద్ర్యం గురించే. నాకు తెలిసి, నేను చూసిన వాళ్ళల్లో అంత ఐచ్ఛికంగా వస్తుసంచయాన్ని నిరాకరించిన ఉదాహరణలు జయతి, లోహి తప్ప మరొకరు లేరు.

అటువంటి నిరాడంబర జీవితం నగరంలో కూడా సాధ్యపడవచ్చు కదా అంటే సాధ్యమనే అంటాను. అలా జీవించాలనే నా సాధన కూడా. కాని నగర జీవితంతో ఉన్న సమస్య ఏమిటంటే అది ఎప్పటికీ 'అది తే', 'ఇది తే' అంటో పోరుపెడుతూనే ఉంటుంది. రవీంద్రకుమారశర్మ దీన్ని భలే వివరించేవారు.

పూర్వకాలపు పల్లెటూళ్ళల్లో వీథరుగుల గురించి చెప్తూ ఆయన అవే మన డ్రాయింగు రూములనీ, మన అతిథుల్నీ, చుట్టపక్కాల్నీ అక్కడే కలుసుకునే వాళ్ళమనీ, ఆ అరుగులమీద చాపలు పరిచినా పరచకపోయినా, తివాసీలు పరిచినా, పరచకపోయినా, అలికి ముగ్గు పెట్టినా పెట్టకపోయినా వాటిమీద కూచుని కబుర్లు చెప్పుకోడానికి మనకి ఏమీ అభ్యంతరం ఉండేది కాదంటాడు ఆయన. అదే పట్టణాల్లో మన డ్రాయింగు రూములు చూడండి. అక్కడ, ఆ హాల్లో వట్టి చాపలు వేసి అతిథుల్ని ఆహ్వానించగలమా? అలాగని సోపాలు వేస్తే సరిపోతుందా? ఆ సోఫాల్లోకి మెత్తలు కావాలి, వెనక ఆనుకోడానికి దిళ్ళు కావాలి,

కింద తివాసీ ఉండాలి, సోపా మీద యాష్ ట్రే ఉండాలి, ఎదురుగా టెలివిజన్ సెట్టు ఉండాలి, వెనక గోడ మీద ఆకర్షణీయమైన అలంకరణలేవో ఉండాలి. అన్నిటినీ మించి, మనం మాట్లాడుకుంటూ ఉండగా ఎదురింటి ఫ్లాటులో ఉన్నవాళ్ళకి ఇబ్బంది కలక్కుండా గుమ్మానికి పరదా వేలాడాలి.

నగరజీవితంలోనే కాదు, ఇప్పుడు గ్రామజీవితానికి కూడా ఇదే నమూనా. ఒక కుటుంబం ఆర్థికంగా ఒకమెట్టు పైకి ఎక్కిందనడానికి గ్రామాల్లో కొలమానం ఏమిటో తెలుసా? ఇంట్లోకి డైనింగు టేబులు రావడం. కాని ఇటువంటివేవీ లేకుండానే మనుషులు బతగ్గలరని మనని ఒప్పించేవారంటూ ఎవరో ఒకరు ఉండాలి కదా. జయతి, లోహితు చేస్తున్నది అదే. వాళ్ళు సైకిలు యాత్ర కోసం విజయనగరం నుంచి బయలుదేరినప్పుడు చేసిన మొదటి పని, ఇదుగో, ఇంట్లో పేరుకున్న ఈ వస్తుసంచయాన్ని వీథిలోకి గిరవాటు పెట్టడమే.

ఇప్పుడు మనం వస్తువులు పోగేసుకుంటూ ఉండే ఈ దశ కూడా దాటిపోయాం. వస్తువులు సమకూర్చుకోవడం colonial modernity. ఇప్పుడు మనం post-colonial modernity లో ఉన్నాం. ఆ సమకూర్చుకున్న వస్తువుల్ని ఎప్పటికప్పుడు కొత్తవాటితో రిప్లేసు చేసుకుంటే తప్ప స్థిమితం చిక్కని దశకు చేరుకున్నాం. దుస్తులు, ఫోన్లు, టెలివిజన్లు, కార్లు, గృహోపకరణాలు- ప్రతి ఒక్కటీ మూడునెలల నుంచి మూడేళ్ళవ్యవధిలో మార్చెయ్యకపోతే, కొత్త నమూనాలు కొనుక్కోకపోతే మనకి నిశ్చింత లేదు. ఇప్పుడు ఈ జాబితాలోకి ఇళ్ళు కూడా వచ్చి చేరాయి.

రెండేళ్ల కిందట, నేను విజయవాడలో అద్దెకి ఉండటానికి ఇళ్ళు వెతుక్కుంటున్నప్పుడు ఒక విషయం గమనించాను. అక్కడ చాలా అపార్ట్ మెంటుల్లో ఫ్లాట్లు ఖాళీగా ఉంటాయి, కాని వాటికి అద్దెకి ఇవ్వరు. ఎందుకంటే వాటి యజమానులు అమెరికాలోనో మరో చోటనో ఉంటూంటారు, వారెప్పుడన్నా ఇక్కడకి వస్తే వాళ్ళకోసం అని ఆ ఫ్లాట్లు ఖాళీగా పెట్టుకుంటారు అని విన్నాను. కానీ ఆ ఇళ్ళు చూస్తే గత అయిదారేళ్ళల్లో ఎవరూ అక్కడ అడుగుపెట్టిన సూచనలేవీ కనిపించేవి కావు. ఏదైనాగానీ, ఇప్పుడు భారతదేశనగరాలకీ, గ్రామాలకీ కూడా affluenza అనే జబ్బు పట్టుకుంది. ఇది కోవిడు కన్నా ప్రాణాంతకమైన మహమ్మారి.

అప్లుయెంజా అంటే ఏమిటి? ఒక రచయిత ఈ జబ్బుని ఇలా నిర్వచించాడు: Affluenza is a social condition that arises from the desire to be more

wealthy or successful. It can also be defined as the inability of an individual to understand the consequences of their actions because of their social status or economic privilege.

John De Graaf అనే ఒక రచయిత Affluenza: How Overconsumption Is Killing Us—and How to Fight Back (2013) అని దీనిమీద ఇటీవల ఏకంగా ఒక పుస్తకమే రాసాడు.

ఈ జబ్బు వూహాన్‌లో కాదు, అమెరికాలో పుట్టింది. ప్రపంచమంతా ఈ తరహా జీవనవిధానాన్ని అనుసరిస్తే, ఒక్క భూగోళం కాదు, వంద భూగోళాలు కూడా ఈ ఆకలి తీర్చలేవని రాసాడు ఆ రచయిత. అలాగని అమెరికాని నేను తక్కువ చెయ్యడం లేదు. అమెరికన్ల క్రమశిక్షణ, సమయపాలన, వైజ్ఞానిక స్పృహ, చేస్తున్న పనిపట్ల శ్రద్ధలు– ఇవి ఆదర్శం కావడం మానేసి, వాళ్ళ నిక్కర్లూ, వాళ్ళ మల్టిప్లెక్సులూ, వాళ్ళ పాప్‌కార్నూ మనకి నమూనాలుగా మారాయి.

తెలిసో తెలియక ఈ వ్యాధి మనకి బాగానే సోకింది. ఇందుకు విరుగుడుమందు దుకాణాల్లో దొరకదు. అసలు దుకాణాల్లోంచే వ్యాపించిన రోగం ఇది. ఇందుకు ప్రకృతి చికిత్స ఒక్కటే మార్గం. ఒకప్పుడు అదిలాబాదులో రవీంద్రకుమార శర్మ, ఇప్పుడు జయతి మాత్రమే దీన్నుంచి మనల్ని బయటపడేయగల వైద్యులు.

ఇదంతా సరళజీవనం గురించి. విరళచింతనం గురించి కూడా ఒక మాట చెప్పాలి. మొన్న జయతి, లోహి ఉంటున్న ఇల్లు చూసినప్పుడు నాకేమీ కొత్తగా అనిపించలేదు. అట్లాంటి ఇళ్ళు నా జీవితకాలం పొడుగునా గిరిజనప్రాంతాల్లో నేను చూస్తూనే ఉన్నాను. ఇంకా వాళ్ళకి తలదాచుకోడానికి ఒక కప్పు ఉంది. ఎందరో యానాదులకి, చెంచువారికి అది కూడా లేకపోవడం చూసాను. నల్లమల అడవిలో ఒక కుటుంబం రెండు చెట్లకు అడ్డంగా ఒక చీర కట్టుకుని దాని నీడలో తలదాచుకుంటున్న దృశ్యం చూపించి, మా డిపార్టుమెంటులో ఒక సీనియరు అధికారి, యాంత్రొపాలజిస్టు నాతో 'వాటినే wind breakers అంటారు' అన్నాడు. ఆదిమానవుడు చెట్టుతొర్రలనుంచి, కొండగుహల నుంచి బయట అడుగుపెట్టాక చాలాకాలం పాటు అటువంటివే అతడికి నీడనిచ్చాయి. కాని ఆ పేదజీవితాల్ని చూస్తే జాలి కలుగుతుంది, సమాజసంపద వారిదాకా చేరకపోవడం పట్ల ఆగ్రహం కలుగుతుంది. కాని అదే జీవితం జీవిస్తున్న జయతి పట్ల ఆరాధన కలుగుతుంది. ఎందుకని?

మొదటిది నిర్బంధదారిద్ర్యం కావడం వల్ల, రెండవది ఐచ్ఛికదారిద్ర్యం కావడం వల్ల అని ఇంతకు ముందే చెప్పాను. కాని ఇది సగం మాత్రమే నిజం. నిరాడంబరత కేవలం దానికదే ఆరాధనీయం కాదు. ఆ నిరాడంబర జీవితంలో, తక్కిన వ్యాపకాల్నీ, వ్యామోహాల్నీ వదులుకున్న ఆ ఖాళీ జాగాలో, ఆ తీరికదనంలో కళ, సాహిత్యం, సంస్కృతి చేరాలి. విరళచింతనం అంటే అది. మనుషులు జీవిక కోసం పాటుపడవలసిన పనిగంటలు తగ్గి, కాయకష్టం నుంచి ఏ మాత్రం తీరిక దొరికినా అది నక్షత్రాల వెలుగును చూడటానికో, లేదా కవిత్వం గురించో, కళల గురించో చర్చించుకోడానికో వినియోగించకపోతే, ఆ తీరిక దక్కీ ఏమి ప్రయోజనం? అందుకనే ప్రాచీన చీనాలో ఋషిలాంటి కవి తావో-యువాన్-మింగ్ రైతులాగా జీవించడం మొదలుపెట్టాక, ప్రతి సాయంత్రం తన ఇరుగుపొరుగుతో కూచుని ప్రాచీనకవుల పద్యాలు చదువుకోవాలని పరితపించేడు. ఇదుగో, సరిగ్గా, ఇందుకే, జయతి జీవితం నాకు అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తున్నది.

మేము మా చిన్నప్పుడు జీవించింది ఇట్లాంటి జీవితాన్నే. తమ చివరి క్షణాల దాకా మా తల్లిదండ్రులు జీవించింది ఇలాంటి జీవితాన్నే. తాటాకు ఇల్లు, మట్టి అరుగులు, ఉప్పూ, బొగ్గూ నూరిన పళ్ళపొడీ తప్ప సబ్బు, టాల్కం పౌడరు, వాసననూనెలు, సెంట్లు తెలియవు. రేడియో లేనేలేదు. టేపు రికార్డరు, టివి ఊహకి అందవు. కంప్యూటరూ, నెట్టూ, మొబైలూ ఊహల్లో కూడా లేవు. కాని ఆ జీవితంలో మా అక్క తెచ్చి పరిచయం చేసిన రచయితలు, ఆ కవిత్వాలు లేకపోయుంటే, అది నిజంగానే నిరుపేదబతుకుగా మిగిపోయుండేది. ఇక సాహిత్యమూ, సంగీతమూ, తత్త్వశాస్త్రమూ జీవితంలోకి ప్రవేశించాక వాటికి ఎక్కడ దూరమైపోతానో అన్న భయం చేత నా బతుకుని వస్తువులు తినెయ్యకుండా కాపాడుకోడమెట్లాగు అని ఇన్నేళ్ళూ ఆందోళన చెందుతూనే ఉన్నాను. అందుకనే ఎంత బాగా అన్నాడు కబీరు, పడవలోకి నీళ్ళూ, ఇంట్లోకి వస్తువులూ చేరకండా చూసుకోమని.

తక్కినవాళ్ళ సంగతి నాకు తెలియదు గాని, జయతి, లోహిలు ప్రయాణిస్తున్నది మాత్రం మునగని పడవ.

21-11-2022-23-12-2022

# మెరుగైన బేరం

**ఫాల్గుణమాసపు** గాలి సాయంకాలాల్లో నాకు ప్రాణంపోస్తున్నట్టుగా ఉంది. వీథిలో వేపచెట్లమీద తొలిపూత మొగ్గతొడుగుతోంది. వేపపూల సూక్ష్మసుగంధం ఎప్పటిదో పూర్వ జన్మ జ్ఞాపకంలాగా నన్ను రెండుచేతుల్తో దగ్గరికి తీసుకుంటోంది.

నేను ఆలోచిస్తూంటాను, వేపపూల గాలి నన్నెందుకింతగా మైమరపిస్తూ ఉంటుంది అని. నిజానికి నేను నివసించిన తావుల్ని వేపపూలగాలితోటే గుర్తు పెట్టుకుంటాను. కాని అసలు అన్నిటికన్నా ముందు ఆ సుగంధం నా హృదయంలోకి ఎలా చొరబడింది? జీవితాన్ని సురభిళసుసంపన్నం చెయ్యగల మరెన్నో పూలతావులు ఉండగా, ఏడాది పొడుగునా విరిసే పూలజాతులు ఉండగా, ఏడాదికి ఒక్కమారు, అది కూడా ఫాల్గుణ-చైత్రాల మధ్య, మాత్రమే పూసి తిరిగి మళ్ళా ఏడాది పొడుగునా కనరాని ఆ పూలగాలి ఎప్పుడు, ఏ జన్మలో, ఏ మలుపులో నన్ను వశపర్చుకుంది అని?

మా ఊళ్ళో, అంటే శరభవరంలో, మా ఇంటిపక్క ముర్ల గంగమ్మ అనే కొండరెడ్డి మహిళ ఇల్లు ఉండేది. ఆమె ఇంటి వాకిట పెద్ద వేపచెట్టు ఉండేది. ఆలోచించగా, ఆలోచించగా నాకు అనిపించిందేమంటే, మా అమ్మ నన్ను కనడానికి ముందు, అంటే నేను చైత్రశుద్ధచతుర్థి నాడు పుట్టానుకాబట్టి, ఆ చివరి వారాల్లో ఆమె ఆ వేపపూల గాలిని గుండెనిండుగా ఆఘ్రాణించి ఉంటుంది. పొద్దున్నే ఆ వేపచెట్టుమీంచి వీచే గాలిలో ఆమె నిలువెల్లా కరిగిపోయి ఉంటుంది. ఆమె ఆ వేపపూల సుగంధాన్ని తన రక్తంలో, తన శ్వాసలో, తాను తిన్న ఆహారంలో జీర్ణించిఉంటుకుని ఉంటుంది, ఆ మాతృప్రసాదాన్ని ఆ గర్భస్థ శిశువుగా నేను కూడా సంగ్రహించుకుని ఉంటాను, అందుకనే ఆ పూలతావి నాకు నా శైశవాన్ని, 'శిశువు చిత్రనిద్రలో ప్రాచీన స్మృతులూచే చప్పుడు'ని గుర్తుకు తెస్తూంటుంది అనుకుంటాను. అందుకనే కోకిల ప్రవేశించే కాలంలో ఒక కవిత ఇలా రాసుకున్నాను:

## నన్ను కడుపులో దాచుకుని మా అమ్మ

నన్ను కడుపులో దాచుకుని మా అమ్మ
వేపపూల మీద నడిచి ఉంటుంది.
ఆ మట్టి ఇంట్లో పురిటిమంచం మీద
వేపపూల గాలినే ఊపిరి పీల్చి ఉంటాను.

నాన్న ఇంకా నాకు పేరుపెట్టకముందు
చెల్లెళ్లతో ఆటలు నేర్వడానికి ముందు
అమ్మతో కలిసి పంచుకున్న తొలినిశ్శబ్దంలో
వేపపూల పరాగం మిళితమై ఉండాలి.

ఏ లోకాలనుండి ఈ అపరిచిత
లోకానికి పిలుచుకుని వచ్చిందో
గుక్కపట్టి ఏడుస్తున్న నన్ను మా అమ్మ
వేపపూల గాలితో ఊరడించింది.

నన్ను ఒదిలి ఏ అపరిచిత లోకాలకు
పయనమైపోయిందో మా అమ్మ
చేష్టలుడిగి చూస్తున్న నా చుట్టూ
వేపచెట్లు, వేపపూలు, వేపగాలి.

జీవితానికి అర్థమేమిటి అనే ప్రశ్ననీ లేదా ఈ జీవితంలో సాధించవలసిన పరమార్థం ఏమిటి అనే అన్వేషణగానీ ఒక వేపచెట్టు కింద నిల్చున్నప్పుడు అదృశ్యమైపోతాయి.

నిండుగా విరబూసిన
చెర్రీ తరువుకింద
ఏ ఇద్దరూ అపరిచితులు కారు

అన్నాడు ఒక హైకూ కవి. నేను ఆ కవితను ఇలా రాసుకుంటాను

నిండుగా పూసిన
వేపచెట్టుకింద
నాకు నేనే పరిచయమవుతాను.

అది నా స్వస్వరూపాన్ని నాకు గుర్తు చేస్తుంది. వెయ్యిన్నొక్క ప్రలోభాల్ని పక్కకు నెట్టగల మానసిక బలాన్నిస్తుంది. అందుకనే మీరా కీర్తనలో ఒక వాక్యం చదవగానే నాకు వేపచెట్లే గుర్తొచ్చాయి. ఆ కవిత ఇంగ్లిషులో చదవండి, రాబర్ట్ బ్లై అనువాదంలో:

**Its True I Went to the Market**

My friend, I went to the market and bought the Dark One.
You claim by night, I claim by day.

Actually I was beating a drum all the time I was buying him.
You say I gave too much; I say too little.

Actually, I put him on a scale before I bought him.
What I paid was my social body, my town body, my family body, and all my inherited jewels.

Mirabai says: The Dark One is my husband now.
Be with me when I lie down; you promised me this in an earlier life.

మామూలుగా మనం ఏమనుకుంటామంటే ప్రేమ లెక్కల్నీ, లాభనష్టాల్నీ చూసుకోదని. కాని ప్రేమకి తనదే అయిన ఒక అంకగణితం ఉంది. ప్రేమికులు తమ ప్రేమనీ, ప్రపంచాన్నీ తక్కెడలో వేసి చూసుకున్నాకనే, ప్రేమ ప్రపంచం కన్నా ఎన్నో రెట్లు విలువైందని గ్రహించాకనే, ప్రపంచాన్ని పక్కకు నెట్టేస్తారు. మీరా చెప్పిన మాటలు నిజమే. ఆమె గిరిధరగోపాలుణ్ణి తూకం వేసి తూచుకుని మరీ కొనుక్కుంది. దానికి ఆమె చెల్లించిన వెల కూడా ఆమెకి తెలుసు. తన సంఘదేహం, నగరదేహం, కుటుంబదేహం, తన సమస్తసంపదా చెల్లించీ మరీ ఆమె ఆయన్ని కొనుక్కుంది.

సూఫీకవులకి కూడా ఈ అంకగణితం తెలుసు. వాళ్ళింకా సూటిగా చెప్తారు: 'తమ శిరసుని వెలగా చెల్లించి తమ ప్రియతముణ్ణి కొనుక్కున్నార'ని.

నా జీవితం పొడుగునా నాకు ఎదురైన ప్రలోభాలు సామాన్యమైనవి కావు. కాని సుందరమూర్తి నాయనారుని తిరువెణ్ణైనల్లూరు దేవుడు ముందే కొనుక్కుని క్రయపత్రం రాయించుకున్నట్టుగా వేపచెట్లు నేను పుట్టినప్పుడే నన్ను కొనేసుకున్నాయి. నేను ఎప్పుడు

ఎవరికి అమ్ముడుపోదామని చూసినా, ఆ చెట్లు నాకు అడ్డంగా నిలబడి ఆ పురాతన క్రయపత్రాన్ని చూపిస్తూనే ఉన్నాయి. అందుకనే ఈ కవిత రాసుకున్నాను:

## మెరుగైన బేరం

Actually, I put him on a scale before I bought him

Mirabai

నన్ను కొనాలని ఎందరో చూసారు, కొన్నిసార్లు
నేనే ఎవరో ఒకరికి అమ్ముడుపోవాలనుకున్నాను
నవనవలాడే కూరగాయలు చూడగానే సంత
గుర్తొచ్చినట్టు నేనెక్కడుంటే అక్కడొక విపణి ప్రత్యక్షం.

క్రయవిక్రయాల మధ్య కూరుకుపోయినప్పుడల్లా
ఒక పచ్చదనం నా పక్కన నిలబడి 'నువ్వు
పుట్టకముందే నిన్ను కొనేసుకున్నాను తెలుసా'
అంటుంది. పువ్వు పూసే లోపే తుమ్మెద చేరినట్టు.

మా అమ్మ కడుపులో ఉండగానే వేపపూల గాలికి
అమ్ముడుపోవడం ఎంతమంచిదైంది! దీర్ఘకాలం
లెక్కలు వేసి చూసాను. ఈ జన్మకి ఇంతకన్నా
మెరుగైన బేరం మరొకటి ఉండదనుకుంటాను.

ఈ కవిత రాయడం నా జీవితంలో జీవన్ముక్తి పొందిన క్షణం లాంటిది. ఇక ఆ తర్వాత నుంచీ ఈ లోకానికి అంటిపెట్టుకుని ఉన్నానేగాని, అంటుకుపోయి లేను. నేను కోరుకునేదంటూ ఏమన్నా ఉంటే ఇదొక్కటే– నా చివరిక్షణాల్లో ఒక పూసిన వేపచెట్టు నా దగ్గరలో ఉండాలన్నదే.

2-3-2023

# తలపుల్ని తలపులతోటే శుభ్రం చెయ్యాలి

**ఈ** వేసవి చాలా తీవ్రంగా ఉంది. పొద్దున్న మొక్కలకి నీళ్ళుపొయ్యకపొయ్యేటప్పటికి సాయంకాలానికి పూర్తిగా తలలు వాల్చేసాయి. కుండీల్లో మట్టి నెర్రెలువిచ్చేటంతగా ఎండిపోయింది. ఒక్కరోజులో. ఊహించలేదు ఎండ ఇంత తీవ్రంగా ఉందనీ, ఉంటుందనీ. మొక్కలకి నీళ్ళు పొయ్యడం మొదలుపెట్టాను. దాహార్తుడు గటగటా నీళ్ళు తాగినట్టుగా ఆ మట్టినీళ్ళన్నిటినీ పీల్చేసుకుంటూ ఉంది. కాని ఆశ్చర్యం, ఆ సాంత్వన మరుక్షణంలో ఆకు ఆకుకీ, ఈనె ఈనెకీ ప్రసరించడం మొదలుపెట్టింది. అది మరింత ఆశ్చర్యంగా ఉంది. వేర్లకి అందిన ఊరట అంత తొందరగా ఆకుకొసలకీ, మొగ్గలకీ, పూలరేకలకీ సరసరా ఎట్లా ప్రసరించిందని!

ఆ దృశ్యం నన్ను ఆలోచనలోకి నెట్టింది. కవులూ, రచయితలూ, భావుకులూ ఈ సమాజవృక్షానికి మూలాల్లాంటివాళ్ళే అయితే, వాళ్ళకి ఏ కొసనుంచి, ఏ లోతుల్లోంచి, ఏ దిక్కునుంచి, ఇంత ఊరట దొరికినా, అది సమాజంలో ప్రతి మనిషికీ, ప్రతి గుండెకీ, ప్రతి మనసుకీ ఎంత సత్వరంగా ప్రవహించాలి! కాని ప్రవహిస్తున్నదా? మనకి ఈ ప్రపంచం నుంచి ధైర్యం లభించడం లేదనీ, మనకి కొంచెం కూడా నమ్మకం చిక్కడం లేదనీ అనకండి. ఆనందం, ధైర్యం, విశ్వాసం కొరియర్లో ఇంటికి వచ్చేవి కావు. తెల్లవారిలేచి చూస్తే అడుగడుగునా, అనుక్షణం అవి మనమీద ధారాళంగా వర్షిస్తూనే ఉన్నాయి. ఉన్నాయి కాబట్టే మనమింకా నిశ్చింతగా మన హృదయావేదనని అక్షరాల్లో పెట్టగలుగుతున్నాం.

వాస్తవాలూ, కఠోరసత్యాలూ ఇప్పుడు రచయితలే చెప్పనక్కర్లేదు. ప్రపంచంలో ఎంత హింస ఉందో అదంతా వెయ్యి పార్శ్వాల్లో తక్షణమే దృశ్యశ్రవణమాధ్యమాలు నీ అరచేతుల్లో ప్రత్యక్షం చేస్తున్నాయి. కాని ఇప్పుడు ప్రపంచంలో దొరకనిదంటూ ఉంటే అది ఇంత ఆశ, ఇంత ఓదార్పు, ఒకింత మంచిమాట, ఒక చల్లని మాట.

ప్రపంచంలో దుఃఖం ఉంది, నిజమే, కాని నువ్వు దాన్ని మళ్ళా పంచిపెట్టనక్కర్లేదు. మనం నిజంగా పంచిపెట్టవలసింది ఏదన్నా ఉందంటే అది ఇంత మంచితనం, మనుషుల పట్ల నమ్మకాన్ని బలపరిచే ఒక చిన్న మాట, ధైర్యాన్నిచ్చే చిన్న సంఘటన– అది ఎంత చిన్నమాటైనా గానీ, ఒకసారి దాన్ని మీరు సమాజవృక్షపు పాదులో ధారపొయ్యగానే, ఆ సహానుభూతి ప్రతి మనిషికీ ఎంత సత్వరం వ్యాపిస్తుందో కళ్లారా చూస్తారు.

నా చేతలు శుభ్రం కావాలంటే ముందు నా మాటలు శుభ్రం కావాలి. నా మాటలు శుభ్రం కావాలంటే ముందు నా తలపులు శుభ్రం కావాలి. తలపుల్నెట్లా శుభ్రపరచడం? మాటమీద మనం ఎంతో కొంత అదుపు సాధించుకోవచ్చు. చేతల విషయంలో కూడా, ప్రయత్నిస్తే, క్రమశిక్షణ సాధ్యంకాకపోదు. కాని తలపులు మన ఆధీనంలో ఉండవే. అందులోనూ మన వ్యక్తచైతన్యం అడుగున అవ్యక్తచైతన్యం ఉంటుందనీ, అందులో మన సమస్తవాసనలూ ఘూర్ణిల్లుతూ ఉంటాయనీ విన్నామే! మనం తలపుల్ని బలవంతంగా పెరకడం మొదలుపెడితే అవి మరిన్ని పుట్టుకు రావటం మనకి అనుభవమే. కొందరు తలపుల్ని ఒక్క తలపుతో నిరోధించమన్నారు. కొందరు తలపులు పుట్టే చోటుని తలచమన్నారు. ఎన్నో దారులు. ఎన్నో పరిష్కారాలు.

చాలా కాలంగా, ఈ సమస్యతో తలపడుతూ వస్తున్ననాకు, ఇవాళ ఆ మొక్కలముందు నిలబడ్డప్పుడు స్ఫురించింది, తలపుల్ని తలపులతోటే శుభ్రం చెయ్యాలని. బలహీనమైనవీ, బాధించేవీ, సిగ్గుపడేట్టుచేసేవీ, మనుషులనుంచీ, ప్రకృతినుంచీ దూరంగా నెట్టేసేవీ– అలాంటి తలపులు నీలో పుడుతున్న ప్రతిసారీ, ఇన్ని నీళ్ళతో నీ మనసు కడుక్కోవాలి. మొక్కల్లో నీళ్ళుపోసినట్టుగా, ప్రయత్నపూర్వకంగా, శుభ్రమైన తలపులతో నీ మనసును శుభ్రం చేసుకోవాలి. ఇప్పటికే ఈ లోకంలో ఎంతో దుమ్మురేగుతూ ఉంది. మళ్ళా నీ తలపులధూళిని లోకం మీద చిమ్మే బదులు, నిర్మలమైన తలపుల్ని ఈ లోకానికి పంచిపెట్టగలిగితే, బహుశా, నువ్వున్న మేరకి ఈ లోకం ప్రక్షాళితమవుతుంది.

'మంచి అన్నది పెంచుమన్నా' అని మహాకవి ఎందుకన్నాడో ఇప్పుడు బాగా అర్థమైంది.

13-5-2023

# దిమ్మరి

**దిమ్మరి** చదవడం పూర్తి చేసాను. నూటయాభై పేజీల పుస్తకం. మామూలుగా అయితే గంటాగంటన్నరలో చదివెయ్యగలను. కాని రెండు రోజులు పట్టింది. ఆగీ ఆగీ చదువుతూ వచ్చాను.

కొన్ని పుస్తకాలు కూడా యోగుల్లాంటివే. వాటి సమక్షంలో మన లోపలి నాయిసు అణగిపోతూండటం మనకే తెలుస్తూ ఉంటుంది. మనం ఎంత ప్రయత్నించినా, మనని మనం ఎప్పటికప్పుడు ఎంత పరిశుభ్రం చేసుకుంటున్నామని మనకి చెప్పుకుంటూ ఉన్నా, ఇంకా, లోపలి తావుల్లో గూడుకట్టుకున్న మాలిన్యాలూ, చింతలూ ఇలాంటి పుస్తకాలు చదివినప్పుడు చెదిరిపోకుండా ఉండవు.

మొన్న పాండురంగాపురంలో 'మట్టిమనిషి' కడుతున్న మూజియం ఆవరణలో ఈ పుస్తకం గురించి మాట్లాడుకోడానికి జయతిమిత్రులంతా కలిసారు. ఈ పుస్తకం గురించి మాట్లాడమని యింద్రవెల్లి రమేష్ అడిగాడు. పుస్తకమింకా పూర్తిగా చదవలేదనన్నాను. అయినా కూడా 'ఏదో ఒకటి చెప్పండి, ఆమె గురించి, తర్వాత ఆమెనీ, లోహినీ అడుగుతాను, వాళ్ళ గురించి వాళ్లనే చెప్పమని' అని అన్నాడతను.

పుస్తకం గురించి మాట్లాడటానికి నేను చొరవ తీసుకోకపోడానికి మరో కారణం కూడా ఉంది. పోయినసారి 'మనం కలుసుకున్న సమయాలు' ఆవిష్కరణ రోజున ఇట్లానే మాట్లాడదామని లేచి నిల్చున్నాను. రెండు మాటలైనా మాట్లాడేనో లేదో కన్నీళ్లు ఉబికి రావడం మొదలయ్యింది. ఆపుకోడం కష్టమయ్యింది. ఇప్పుడు కూడా అలాంటిదేదో జరుగుతుందన్న సంకోచం కావచ్చు.

కాని  పాండురంగారావు గోడ మీద 'దిమ్మరి' అనే మాట చూసి యింద్రవెల్లి రమేష్ హైదరాబాదు నుంచి వచ్చేసాడు. అతడికి జయతి గురించి ఏమీ తెలీదు. ఆ

రోజు అతణ్ణి హైదరాబాదులో ఒక పుస్తకసభలో మాట్లాడమని పిలిచారు. కాని దిమ్మరి అనే పదం అతణ్ణి అక్కడ ఉండనివ్వలేదు. అటువంటి మనిషి అడిగాక మాట్లాడకుండా ఎలా ఉండటం?

లేచి నిల్చున్నాను. 'నేనేమీ మాట్లాడను గాని, ఇందులోంచి రెండు ఖండికలు చదివి వినిపిస్తాను' అన్నాను. మొదటిది 'కంటిలో నలక'. ఆ తర్వాతది 'వసంతంలో ఒక మరణం'. జయతి తన తమ్ముడు మధుకర్ మీద రాసిన ఖండిక. ఈ పుస్తకం ఆమె అతడి స్మృతికే అంకితం చేసింది.

ఆ రచన చదువుతూ ఉండగానే నా గుండె ఊడి చేతుల్లో పడిపోతుందేమో అనిపించింది. నా గొంతు గద్గదమవుతోందని అందరికీ తెలుస్తోనే ఉంది. కన్నీళ్ళు రాకుండా నిగ్రహించుకుంటూనే చదువుతూ ఉన్నానుగాని, ఆ వ్యాసం ముగించేటప్పటికి, నా చెంపల మీద జారిన కన్నీటిని నలుగురిదృష్టినుంచీ దాచలేకపోయాను.

కన్నీళ్ళు నాకే వస్తున్నాయా? ఆ గోష్ఠి ముగిసేక నేను హైదరాబాదు బయల్దేరడానికి సిద్ధమవుతూఉండగా, ఆ మధ్యాహ్నం మాకు అన్నం వండిపెట్టి, వడ్డించిన గిరిజన మహిళల్లో ఒకామె, ఆమె పేరు చిన్ని అనుకుంటాను, ఆమె నా దగ్గరకు వచ్చి 'నువ్వు చదువుతున్నంతసేపూ నాక్కూడా ఏడుపొచ్చింది' అంది. నేను కూడా ఆమెతో చేయి కలిపాను. నా చేయి ఆమె వదల్లేదు. 'ఎందుకని నీకు ఏడుపొచ్చింది?' అనడిగాను. 'తెలీదు. నువ్వు చదువుతోంది వింటోంటే నాకు ఏడుపొస్తూనే ఉంది' అంది.

ఒకప్పుడు చలంగారికి ఏదన్నా కవిత్వమో, కథలో ఎవరన్నా చదువుతో ఉంటో వింటోంటే అట్లా ఏడుపొచ్చేదట. భమిడిపాటి జగన్నాథరావుగారికి కళ్ళు అట్లా అశ్రు సిక్తం కావడం కావడం నేనెన్నో సార్లు చూసాను. ఇప్పుడు నా మిత్రుల్లో సోమయ్యగారట్లా. ఆయనకి సున్నితమైంది ఏది చదివినా, విన్నా కళ్ళమ్మట నీళ్లొచ్చేస్తాయి. చలంగారూ, సోమయ్యగారూ, ఆ గిరిజన మహిళా ఒక్కలాంటివాళ్ళే. సున్నితహృదయులు. వాళ్ళకి కన్నీళ్ళు రావడం సహజం. నాకెందుకని కన్నీళ్ళొస్తున్నాయి?

అలాగని అన్ని పుస్తకాలూ కన్నీళ్ళు తెప్పించవు. చాలామంది ప్రసిద్ధకథకులు, కవులు రాసిన రచనలు చదివితే బాగుందనిపిస్తుంది. వాళ్ళ శైలికో, శిల్పానికో ముగ్ధుణ్ణి కాకుండా ఉండలేను. నా సమకాలిక రచయితల రచనలు కూడా చాలావాటిని చదివినప్పుడు నా ప్రశంసని నేనెప్పుడూ దాచుకోలేదు. కాని కన్నీళ్ళు?

'హృదయం గడ్డకట్టి ఎండిపోయినప్పుడు నువ్వొచ్చి నన్ను కరుణావర్షంతో తడిపెయ్యి' అంటాడు టాగోర్. ఏ రచనైనా నాకు కన్నీళ్ళు తెప్పించినప్పుడు అది భగవంతుడి కరుణా వర్షంగానే భావిస్తాను నేను. ఆ రచన నాకు భగవత్సమానమవుతుంది.

కాబట్టి, ఇప్పుడు, ఈ దిమ్మరి కూడా.

జయతి చెప్తున్నారు అవాళ: 'నేనిప్పటిదాకా రాసిన పుస్తకాల్లో ఈ పుస్తకమే నాకెంతో ఇష్టమైంది' అని. అవును. ఇది ముందటిపుస్తకాల్లాంటిది కాదు. 'అడవినుండి అడవికి' తో మొదలై 'మనం కలుసుకున్న సమయాలు' దాకా ఆమెలో ఒక తపస్వి, ఒక సౌందర్య ఆరాధకురాలు, ఒక ప్రకృతి ప్రేమికురాలు కనిపిస్తారు. అందుకనే నేనొకప్పుడు ఆమెని spiritual ecologist అని అన్నాను. కాని ఈ పుస్తకం వేరు. ఇందులో విరాగి కాదు, రాగమయి కనిపిస్తుంది. ఒక ప్రేమసముద్రాన్ని గుండెలో మోసుకుంటూ తిరుగుతున్న ప్రేమికురాలు కనిపిస్తుంది. ఒక తల్లి కనిపిస్తుంది, ఒక చెల్లి, ఒక అక్క, ఒక క్లాస్‌మేట్, ఒక సహచరి, ఒక క్షమామూర్తి, చివరికి, 'నగ్నపాదాలు' అనే రచనలో ఆమె కోపం కూడా కనిపిస్తుంది. ఎద్దేవా, హేళన కూడా కనిపిస్తాయి. ఇప్పటిదాకా ఈ streak ఆమెలో నేను చూడలేదు. కాని దేవాలయాన్నే అంగడిగా మార్చాక ఏసుక్రీస్తు లాంటివాడే కోపోద్రిక్తుడు కాకుండా ఉండలేకపోయాడు. అడవికి తూట్లుతూట్లుగా గాయాలు చేస్తున్న మనుషుల్ని చూసినప్పుడు జయతికి ఆగ్రహం కలగకపోతే ఆశ్చర్యపోవాలి మనం.

లేదు, ఇది మామూలు రచన కాదు. తెలుగులో ఇటువంటి పుస్తకం నేను చూడటం ఇదే మొదటిసారి. ఈ పుస్తకంలో ఆమె మూర్తీభవించిన అనురాగంగానూ, ఆగ్రహంగానూ కనిపించింది. ఆమెకి కోపం తెప్పించకుండా ఉన్నంతకాలమే ఈ లోకంలో వానలు పడతాయనిపించింది ఈ పుస్తకం పూర్తి చేసేటప్పటికి.

'ఎందుకని ఆమె ఎక్కడా నాలుగురోజుల కంటే ఎక్కువ ఉండలేకపోతున్నారు' అని అడిగిందొక మిత్రురాలు నన్ను. 'ఆమె దయామయి కాబట్టి కనీసం నాలుగురోజులేనా అక్కడ ఉండగలుగుతోంది, ఇంకా మన మధ్య జీవించగలుగుతోంది. లేకపోతే, నిజమైన మనుషులు బతగ్గలిగే ప్రపంచమేనా ఇది?' అని అన్నాను నా మిత్రురాలితో.

త్రిపురగారి 'భగవంతం కోసం' కథ చదివినప్పుడు, అప్పుడే నేను ఇంటర్మీడియేటు పూర్తిచేసిన రోజులు, ఆ కథ నన్ను నిలువెల్లా కదిలించేసింది. కాని త్రిపుర నిజంగా భగవంతుడికోసం వెతుక్కుని ఉంటే భగవంతుడు కనిపించి ఉండేవాడని, ఇదుగో, ఇందులో 'పుష్ పుల్ పాసెంజరు రైలు' చదివితే తెలుస్తుంది.

త్రిపుర తెలుగువాళ్ళకి మొదటిసారి జెన్ అనే మాటని పరిచయం చేసిన రచయిత. కాని ఒక జెన్ సాధువు ఎలా ఉంటాడో జయతిని చూసాకనే నాకు తెలిసింది. ఎందుకంటే మనకి భగవంతుడు కనిపిస్తే మనం ఆయనకేమివ్వాలో కూడా జయతికి తెలుసు.

ఇందులో ఆమె జీవితం ఉంది, ఇంతదాకా నడిచిన ప్రయాణం ఉంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఆమె చాలా చోట్లనే సంచరించింది. కనీసం నాలుగైదు రాష్ట్రాల్లో జీవికకోసం ఏదో ఒక ఉద్యోగం చేయడానికి ప్రయత్నించింది. కాని ఒక్కో ఏడూ గడుస్తున్నకొద్దీ ఆమె ఒక్కో బరువూ దించుకుంటో తనని తాను రిక్తం చేసుకుంటో ఉంది. కాని కాలం ఆమెకి కొత్త బంధాలు కూడా అందిస్తూ వచ్చింది. మొదట లోహి, తర్వాత వైటీ. ఆ వైటీకోసమే ఆమె కనీసం మూడు తావుల్ని వదిలిపెట్టేసింది. ఇప్పుడు లూసీ. ఇట్లానే ఒకప్పుడు రమణమహర్షి దగ్గరికి ఎక్కణ్ణుంచో ఒక ఆవూ, ఒక నెమలీ వచ్చేయని విన్నాను.

మొన్న నలుగురం కూచుని మాట్లాడుకుంటున్నప్పుడు దుశ్శర్ల సత్యనారాయణ గారు చెప్తున్నారు: 'We are not nature lovers అని అన్నాడు లోహీగారు. ఎందుకని అడిగాను. ఎందుకంటే we are nature అని చెప్పాడాయన' అని.

అవును. ఇప్పుడు వాళ్ళు నలుగురూ ఒక కుటుంబం. ఒక ప్రకృతి కుటుంబం. ఆ మూగజీవాల్ని వాళ్లు ప్రేమించినట్టుగా మనమూ ప్రేమించగలిగితే మనం కూడా ఆ కుటుంబంలో భాగం కాగలుగుతాం. మా చెల్లెలు సంధ్య హైదరాబాద్ నుంచి బస్సు, లారీ, అన్నీ ఎక్కి సాయంకాలానికి అక్కడ చేరుకుంది. ఆమె భుజాన పెద్ద బాగు. అక్కడ ఉండడానికి సిద్ధమై వచ్చిందేమో అనుకున్నాను. తీరా చూస్తే ఆ సంచీలోంచి నాలుగు ప్యాకెట్ల డాగ్ ఫుడ్డు బయటకు తీసి పెట్టింది. 'చూస్తున్నావా! అదీ ఆ కుటుంబంలో భాగమయ్యే తీరు' అని నాకు నేను చెప్పుకున్నాను.

దిమ్మరిలో ఎన్నో వాక్యాలున్నాయి. అవన్నీ మీతో పంచుకుందామని ఎక్కడిక్కడ గుర్తులుపెట్టుకున్నాను. కాని, ఆ పుస్తకం ఎవరికి వారే చదువుకోవలసిన పుస్తకం. కనీసం ఆ పుస్తకం చదువుతున్న కొద్దిసేపైనా మన చాంచల్యాలూ, చిత్తభ్రమలూ మననుంచి దూరంగా జరుగుతాయి.

5-9-2023

# కాలానికి ఊపిరిపొయ్యాలి

**సంవత్సరంలో** చివరిరోజు. సాయంకాలం నగరం మీద పరుచుకున్న సంజకాంతిలో మంచు తెలుపు కలిసి పలచని తెర కప్పుతున్నట్టుగా ఉంది. నగరాకాశం పూచిన పూవుల్లాగా పతంగులు ఎగురుతున్నాయి. ఇవి వాడిపోని పూలు, ఏ కొమ్మమీదా వాలడానికి ఇష్టపడని పిట్టలు. వాటి దారాల కొసలు పట్టుకున్న పిల్లలకి సంతోషం తప్ప మరేమీ తెలియని తరుణం ఇది. వాళ్ళ ఆనందమే ఒక నగరానికి ఆనందం.

రేపణ్ణుంచి కొత్త సంవత్సరం మొదలుకాబోతున్నది. ఎక్కడో ఎవరో రాస్తున్నారు, 'ఇది మా కొత్త సంవత్సరం కాదు, ఉగాదితోటే మా కొత్త సంవత్సరం మొదలవుతుంది' అని. నిజమా? నాకైతే ప్రతి రోజూ కొత్త సంవత్సరమే. గిరిజన ప్రాంతాల్లో పుట్టి పెరిగినవాణ్ణి. వాళ్ళతోటే జీవితం అత్యధికభాగం గడిపినవాణ్ణి. వాళ్ళలానే మారే ప్రతి ఋతువూ కొత్త సంవత్సరానికి తలుపు తెరుస్తుందనే నమ్ముతాను. చాంద్రమాన, సౌరమానాలే కాదు, నా హృదయమానంతో కూడా కాలాన్ని లెక్కపెట్టుకుంటూనే ఉంటాను.

నిజానికి ప్రతి పగలూ రాత్రికి స్వాగతమిచ్చే ప్రతి సంధ్యవేళా కాలానికి మోకరిల్ల వలసిన సమయమే. ప్రతి ఉషోదయం నూతన సంవత్సరాగమనమే.

శతపథబ్రాహ్మణంలో రాసారని ఎవరో చెప్పగా విన్నాను. కాలానికి కణుపులుంటాయిట. ఉదయాస్తమయాలు, శుక్లకృష్ణపక్షాలు, ఋతువులు, ఉత్తరదక్షిణాయనాలు– కాలం ఒక దశ దాటి మరొక దశలోకి ప్రయాణించే ప్రతి సంధ్యవేళా మనం కాలానికి ఊపిరూదుకోవాలట. కనకనే నాకు ప్రతి ఉదయవేళా, ప్రతి అస్తమయ సంధ్యా ఒక పర్వవేళ. అప్పుడు నేనే పనిచేస్తున్నా, ఒక క్షణం పాటు ఆగి నాలోకి చూపు సారించుకుని, కాలానికి నమస్కరించుకుంటాను.

కాలం తన గుప్పెట్లో ఏమి దాచి ఉంటుంది? రాబోతున్న ప్రతి రోజూ, ప్రతి మాసం, ప్రతి ఋతువు, ప్రతి ఏడాదీ మనకీ, మన వాళ్ళందరికీ మంచిచెయ్యాలని కోరుకుంటాం. ఒక్క న్యూ యియర్ డే అనేమిటి? ప్రతి ఉదయమూ శుభోదయం కావాలనే మనసారా కోరుకుంటాం. పూలతో, పళ్ళతో, గ్రీటింగ్సు కార్డుల్తో, కేకుల్తో, వెలుగుతున్న కొవ్వొత్తుల్తో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతాం. లేదా ఒక దీపం వెలిగించి, ఒక అగరువత్తి వెలిగించి, ఒక స్తోత్రం చదువుకుంటాం. కాలం మనకి ఊపిరిపొయ్యడమే కాదు, కాలానికి కూడా మనం ఊపిరి పొయ్యాలి.

ఈ మాటలు, ఈ శుభాకాంక్షలు మామూలు రోజుల్లో మామూలుగా చెప్పడం కాదు, నా జీవితంలో అతికష్టమైన ఒక పరీక్షాకాలంలో నడుస్తూ కూడా ఈ మాటలు చెప్పగలను. ఆగామికాలం మీకే కాదు, నాక్కూడా శుభకాలమనే నమ్ముతూ ఈ మాటలు రాస్తున్నాను. కాలం నాకొక్కడికే కాదు, మీక్కూడా శుభకాలం కావాలన్న హృదయపూర్వక శుభాకాంక్షతో ఈ మాటలు రాస్తున్నాను.

నాలుగైదు రోజులకిందట, అత్యంత నిరాశామయక్షణాల్లో, రమణుల వాక్యమొకటి నాకు కనిపించింది.

The Grace you are seeking is also the Grace seeking you.

ఎటువంటి వాక్యం! ఈ మాటలే రూమీ కూడా అన్నాడని ఒకప్పుడు నేను మీతో పంచుకున్నాను. 'నువ్వు నీళ్ళ కోసం దప్పికపడినప్పుడు, గుర్తుపెట్టుకో, నీళ్ళు కూడా నీ కోసం దప్పికపడుతుంటాయి' అన్నాడాయన.

కొత్త రోజుకి మనం తలుపులు తెరుస్తున్నపుడు, పూలగుత్తితో స్వాగతం పలుకుతున్నప్పుడు, కొత్తరోజు కూడా పూలమాలల్తో మన ఇంటిగుమ్మం దగ్గర నిలబడి ఉందని మనం గుర్తుపట్టగలం. మన శుభాకాంక్షల్నే కాలం మళ్ళా తన శుభాకాంక్షలుగా మార్చి మన చేతుల్లో పెడుతుందని మర్చిపోకండి.

31-12-2023

# నడవడమే ఒక దైవానుగ్రహం

**నాకు** తెలీకుండానే నా చిన్నతనంలోనూ, నా పూర్వకాలపు జీవితంలోనూ నాకు లభించిన గొప్ప అదృష్టాలు ఒక కొండపల్లెలో పుట్టిపెరగడం, కొంతకాలం ఒక నది ఒడ్డునా, మరి కొంతకాలంపాటు అడవుల్లోనూ ఉద్యోగాలు చెయ్యడం.

మా ఊళ్ళో మా జీవితం ఏ రోజూ మా ఇంటికి మటుకే పరిమితమైంది కాదు. పట్టుమని వంద ఇళ్ళు కూడా లేని ఆ చిన్న గ్రామం మొత్తం ఒక ఇల్లులాగా ఉండేది. ప్రతి ఒక్క ఇల్లూ ఆ ఇంట్లో గదుల్లాగా ఉండేవి. పొద్దుణ్ణుంచి రాత్రి దాకా ఒక గదిలోంచి మరో గదిలోకి వెళ్ళివచ్చినట్టు ఆ ఇళ్ళన్నీ చుట్టబెడుతూ ఉండేవాళ్ళం.

ఇక ఊరికి ఆ చివర ఏరూ, మరో చివర చాపరాయిగా పిలిచే కొండవాలూ, ఊరి లోతట్టులో లొద్దుగా పిలుచుకునే అడివీ మమ్మల్నెప్పుడూ పిలుస్తూ ఉండేవి. మా ఊరునించి లోపలకి మరీ మైలు దూరం కూడా లేని వణకరాయి గ్రామం దాకా, మా ఊరు దాటి, ఏరు దాటి జాగరాలమ్మ గుడిమీంచి కాకరపాడు వెళ్ళే మలుపు దాటితే కనిపించే టేకు ప్లాంటేషను దాకా ఒకసారేనా చుట్టి వచ్చేవాళ్ళం. ఇక మా ఊరిమీంచి అడ్డంగా పొలాలమ్మట, అడవి దారిన నడుచుకుంటూ పోతే వచ్చే తాళ్లపాలెం గ్రామం మాకొక స్వప్నసీమ.

అక్కడ కొన్నాళ్ళ పాటు మాకో రెండెకరాల పొలం ఉండేది. తర్వాత రోజుల్లో మా నాన్నగారు ఏజెన్సీ లాండు ట్రాన్స్ఫరు రెగ్యులేషన్సు అమలు చెయ్యడంకోసం గిరిజనేతరులతో పోరాటం మొదలుపెట్టాక అన్నిటికన్నా ముందు చేసిన పని ఆ రెండెకరాలూ ఆ ఊళ్ళో గిరిజనుడికి అప్పగించెయ్యడం. ఏజెన్సీ చట్టాల ప్రకారం ఆ ప్రాంతంలో భూమి అంతటికీ గిరిజనుడే మొదటి హక్కుదారు అనేది ఒక ప్రాథమికసూత్రం. అలా ఆ భూమి అప్పగించడానికన్నా ముందు, అంటే 1975-76 కన్నా ముందు, నా మరీ పసితనపు

జ్ఞాపకాల్లో, ఆ చిన్న పొలంలో పండిన వరిచేను కోతలప్పుడు మా నాన్నగారు మమ్మల్ని అక్కడకు తీసుకువెళ్ళిన రోజులు నా మదిలో ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. బహుశా అప్పుడు నాకు పదేళ్ల లోపే ఉండి ఉండవచ్చు. మా ఊరినుంచి తాళ్ళపాలేనికి బహుశా నాలుగైదు మైళ్ళ దూరం అయి ఉండవచ్చు. కాని ఆ ఊరు నడిచే వెళ్ళామనీ, నడిచే వచ్చామనీ నాకు గుర్తుంది. ఆ దారి పొడుగునా ప్రతి ఒంపూ, ప్రతి మలుపూ, ప్రతి గట్టూ నాకు ఇప్పటికీ గుర్తు. అలాగే ఎప్పుడేనా మా ఊరినుంచి రాజవొమ్మంగి నడిచివెళ్ళినా, లేదా నడిచి వచ్చినా అది కూడా అపురూపంగానే ఉండేది నాకు.

ఒక మనిషి చెయ్యగల పనులన్నిటిలోనూ అడవిదారుల్లో నడుచుకుంటూ పోవడాన్ని మించి అద్భుతమైన సంతోషాన్నివ్వగల పనులు ఆట్టే లేవని చెప్పగలను. నేను రాజమండ్రిలో పనిచేస్తున్న కాలంలో కూడా ఎప్పుడు వీలు దొరికినా మా ఊరు వెళ్ళిపోతూ ఉండేవాణ్ణి. కాని నిజంగా అడవిదారుల నడక ఎలా ఉంటుందో నేను గిరిజనసంక్షేమశాఖలో చేరాకనే గ్రహించాను. నా ట్రయినింగులోనూ, నా మొదటి పోస్టింగులోనూ కూడా పార్వతీపురం అడవుల్లో నేను తిరిగినట్టు తిరిగినవాళ్ళని వేళ్ళమీద లెక్కపెట్టొచ్చనుకుంటాను. అప్పట్లో మా ఐటిడిఎ కింద ఉన్న ముఖ్యమైన ఎనిమిది మండలాల్లోనూ ప్రతి మారుమూల కొండకీ పోయి వచ్చేవాణ్ణి. ఆ రోజుల్లో గిరిజనాభివృద్ధి అంటే కొండలెక్కడమే. అంతదాకా ఏ అధికారీ వెళ్ళి చూడలేదని చెప్పుకునే ఊళ్ళు పోయి చూసి రావడమే గొప్ప ఘనకార్యంగా ఉండేది.

గుమ్మలక్ష్మీపురం మండలంలో గొయిపాక, బీరుపాడు, బబ్బిడి, కురుపాం మండలంలో జరడ, టొంపలపాడు, పొడి, సొబ్బ, జియ్యమ్మవలస మండలంలో కొండ చిలకం, తామరఖండి జమ్ము, పెదతోలుమండ, కొమరాడ మండలంలో నయా, జాకూరు, ఎండభద్ర, సాలూరు, మక్కువ మండలాల్లో చోర, కొదమ, కొటియా, సామంత భద్ర, మూలతాడివలస, పాచిపెంట మండలంలో బడ్నాయికవలస, సరాయివలస, ఏటగాని వలస, మిలియాకంచూరు, మోదుగ– మూడున్నర దశాబ్దాల తర్వాత కూడా ఆ కొండలూ, ఆ గ్రామాలూ ఇంకా నా కళ్ళముందు కనిపిస్తూనే ఉన్నాయి. ఆ అడవిగాలీ, ఆ ఎండుటాకులూ, ఆ కుంభవృష్టులూ ఇంకా నా చుట్టూ హోరెత్తుతూనే ఉన్నాయి.

ఆ తర్వాత కూడా మరెన్నో కొండప్రాంతాల్లో పనిచేసానుగాని, పార్వతీపురం అడవుల్లో తిరిగినట్టు ఎక్కడా తిరగలేదు. శ్రీశైలంలో పనిచేస్తున్నప్పుడు యెర్రగొండపాలెం మండలం పాలుట్ల, పన్నలబయలు, గుట్టలచేను గ్రామాలకి ఒక్కసారి మాత్రమే నడిచి వెళ్లివచ్చినట్టు గుర్తు. తక్కినసార్లు ఐటిడిఎ డ్రైవర్లు ఏదో ఒక రకంగా ఫోర్‌వీలుతో పైకి ఎక్కించి

దింపేవారు. పాడేరు, ఉట్నూరు అడవుల్లో కూడా జీపులు పోలేని దారులూ, గ్రామాలూ ఉండేవి కావు. కనీసం నా ఉద్యోగానికి సంబంధించినంతవరకూ.

ఇప్పుడు ఇన్నేళ్ళ తరువాత, ఈ పుష్యమాసపు అపరాహ్ణాన, హైదరాబాదులో ఈ అద్దె ఇంట్లో మేడమీద కూచొని ఈ వాక్యాలు టైపు చేస్తుంటే, ఆ నా గడిచిపోయిన జీవితపు ఆ అడవులూ, ఆ గ్రామాలూ, ఆ దారులూ, ఆ కొండలూ ఒక కలలాగా తోస్తున్నాయి. సంస్కృతంలో ఒక సుభాషితం ఉంది. 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి' అని. మనుషులు తాము చేసుకున్న పుణ్యం క్షీణించాక మర్త్యలోకంలోకి వచ్చిపడతారని దానికి అర్థం. నేనెంత భాగ్యం చేసుకుంటే ఆ అడవిదారుల్లో, ఆ కొండవాలుల్లో ప్రయాణించేనో తెలుసుకునేలోపే ఆ జీవితానికి మళ్లీ చేరలేనంత దూరంగా వచ్చేసాను.

అలాంటి మరొక జీవితం రాజమండ్రిలో గోదావరి ఒడ్డున గడిపిన కాలం. మామూలుగా ఏ నది ఒడ్డున ఉన్న ఏ పట్టణంలో జీవించినా, ఒక్కరోజు కూడా ఆ నది ఒడ్డుకు పోయి కూచోకపోయినా, అతడు ఆ నది ఒడ్డున జీవించాడు అని చెప్పుకుంటాం. కాని రాజమండ్రిలో నా జీవితం అలా కాదు. నేను నిజంగానే గోదావరి గట్టుమీదనే జీవించాను. అటు వేణుగోపాలస్వామీ, ఇటూ ఉమామార్కండేయస్వామీ కొలువు తీరిన చోట కొవ్వూరు లాంచీలరేవు దగ్గర గోదావరిగట్టుదగ్గరే అయిదేళ్ళపాటు నా సాయంకాలాలు గడిచాయి. పక్కనే సదనంలో మా చెల్లెళ్ళిద్దరు చదువుకుంటూ ఉండేవారు. సదనానికి పక్కనే సమాచారం ఆఫీసు. ఆ మేడమీద శరభయ్యగారు ఉండేవారు. అక్కడ ఆ గట్టుమీద మిత్రులంతా కలుసుకునేవాళ్లం. సాయంకాలం అయిదింటికో, ఆరింటికో అక్కడకి చేరుకున్న వాళ్ళం చాలాసార్లు రాత్రి పదింటిదాకా, పదకొండుదాకా, ఒక్కోసారి తెల్లవారేదాకా అక్కడే కబుర్లు చెప్పుకుంటూ ఉండిపోయేవాళ్లం. కవిత్వం, కవిత్వం, కవిత్వం తప్ప మరో ప్రస్తావన ఉండేది కాదు. మళ్లా అట్లా నది ఒడ్డున సాయంకాలాలు గడిపిన కాలం నా జీవితంలో మరొకటిలేదు. రెండు మూడేళ్ళ కిందట విజయవాడలో ఉన్నప్పుడు ఫెర్రీ దగ్గరికో, గొల్లపూడి ఘాట్ దగ్గరకో అప్పుడప్పుడు పోయి కూచునేవాణ్ణిగాని, ఆ మిత్రులేరి? ఆ కవితలెక్కడ?

ఈ రోజు నాకు మా నాన్నగారు పదే పదే గుర్తొస్తున్నారు. ఆయన జీవితమంతా నడకలోనే గడిచింది. ఆయన నడిచిన దూరాల్ని ఒకదానికొకటి కలుపుకుంటూ పోతే బహుశా ఈ భూమండలాన్ని ఆయన మూడు సార్లు చుట్టి వచ్చినట్టవుతుందేమో. కాని చివరిరోజుల్లో మా అమ్మ ఆరోగ్యం బాగులేక, ఆయన మాతో పాటు హైదరాబాదులో ఉండవలసి వచ్చినప్పుడు ఎంత కొట్టుమిట్టాడిపోయారని!

అది కూడా కొన్ని నెలలే. ఇక్కణ్ణుంచి వెళ్ళిపోడానికి నాతో ఎంత యుద్ధం చేసారని! వాళ్ళు మళ్ళా ఆ అడవికి వెళ్ళిపోతే వైద్యసదుపాయం దొరకదని నేను ఆయన్ని వెళ్ళనివ్వక పోతే చిన్నపిల్లవాడిలాగా మారాం చేసారు! చివరికి ఆయన సంకల్పం ముందు నేను ఓడిపోక తప్పలేదు. కాని ఒక మనిషి స్వస్థత మందుల్లోనూ, హాస్పటళ్ళలోనూ లేదనీ, అది అతనికి ఏ తావుల్లో సంతోషం చేకూరితే ఆ తావుల్లో తిరగడంలోనే ఉంటుందనీ, ఆయన ఈ లోకాన్ని విడిచిపెట్టాకగానీ నాకు తెలిసి రాలేదు!

తన ఒంటిమీద ఏ సర్జనూ కత్తిగాటు పెట్టకుండా బతకడానికి ఆయనకు బలమిచ్చింది ఆయన నడకేననీ, ఆ కొండగాలిలో, ఆ అడవిదారుల్లో తిరగడమేననీ, ఒకసారి వాటికి దూరంగా జరిగేకనే ఆయన అస్వస్థులయ్యారనీ ఇప్పుడు చెప్పగలను. తిరిగి మమ్మల్నందరినీ పక్కకు నెట్టి మా ఊరికి వెళ్లిపోయాక ఆయనలో జీవితం ఒక్కసారి గుప్పున వెలిగింది. ఆ మరుక్షణమే ఆరిపోయి ఉండవచ్చుగాక, కాని ఆ శ్వాస ఆ కొండగాలిలో కలిసిపోయిందనీ, ఇక ఆయనకి మళ్ళా ఈ మర్త్యలోకానికి తిరిగి రావలసిన పనిలేదనీ తెలియడమే నావరకూ నాకొక ఈశావాస్య ఉపనిషత్తు.

ఎందుకిదంతా రాస్తున్నాను? ఈ మధ్య ఒక యువమిత్రుడు తన పర్యటనల గురించిన వ్యాసాలు పంపించి నన్ను చదివి చెప్పమని అడిగాడు. అవన్నీ అతడు అడవిబాటలమ్మట, కొండదారులమ్మట, వాగులమ్మట, వంకలమ్మట చేసిన ప్రయాణాలు, చేపట్టిన నడకలు. అవి చదువుతుంటే ఒకప్పుడు నేనూ ఇట్లానే నడిచే భాగ్యం పొందాను కదా అని గుర్తొచ్చింది.

ఆ వ్యాసాలు చదివాక అతడికి నా అభిప్రాయం రాస్తో హెన్రీ డేవిడ్ థోరో రాసిన ఒక వాక్యం గుర్తుచేసాను. తన సుప్రసిద్ధ వ్యాసం Walking (1862) లో థోరో రాసుకున్నాడు: It requires a direct dispensation from Heaven to become a walker అని. నిజమే. ఎంతో దైవానుగ్రహం ఉంటే తప్ప ఒక మనిషి రోజూ తనకి నచ్చే చోటకి నడుచుకుంటూపోయి రాలేడు.

ఏ కొన్ని నెలలో తప్ప ఆ దైవానుగ్రహం ఆయనకు జీవితమంతా ఉండిందని మా నాన్నగారికి వెంటనే చెప్పాలని చాలా గట్టిగా అనిపిస్తోంది.

1-2-2024

# సాహిత్యపోషకులు

**కిందటేడాది** విశాఖపట్టణంలో ఒక రచయితల వర్కుషాపుకి హాజరయ్యాను. ఆ సందర్భంగా నా 'ఎల్ల లోకము ఒక్క ఇల్లై' పుస్తకం కొన్ని కాపీలు తీసుకుపోయి కొందరు మిత్రులకి ప్రత్యేకంగా పేరుపేరునా అందచేసాను. ఆ మధ్యాహ్నం లంచి విరామంలో ఒకామె నా దగ్గరకొచ్చి ఆ పుస్తకం కాపీ ఒకటుంటే తనకికూడా ఇవ్వగలరా అనడిగారు. ఆమె ఎవరో నాకు అప్పటిదాకా పరిచయం లేదు.

ఆమె తానొక ఉపాధ్యాయిని అని తనని పరిచయం చేసుకుంటూ నా 'కొన్ని కలలు, కొన్ని మెలకువలు' పుస్తకం చదివేననీ, అందుకని ఈ పుస్తకం కూడా చదవాలని ఉందనీ చెప్పారు. కానీ అప్పటికే నేను తీసుకువెళ్ళిన కాపీలు అయిపోయేయనీ, హైదరాబాదు తిరిగివెళ్ళాక ఆమెకి ఒక కాపీ పంపిస్తాననీ అడ్రసు తీసుకున్నాను.

కానీ హైదరాబాదు వచ్చాక ఆ సంగతే మర్చిపోయాను. కొన్నాళ్ళు ఆగేక, ఆమెనే మళ్ళా మొహమాటపడుతూనే గుర్తుచేసేక, చివరికి ఆ పుస్తకం కాపీ ఒకటి ఆమెకి కొరియరు చేసాను.

ఆ తర్వాత ఆరేడు నెలలు గడిచాక ఆమె అమెరికా నుంచి నాకో మెసేజి పెట్టారు. అక్కడ తన పిల్లలు ఉన్నారనీ, వాళ్ళ దగ్గర ఉన్నాననీ, అక్కడొక లైబ్రరీలో నా కథల పుస్తకం ఉందా అని అడిగితే లేదన్నారనీ చెప్తూ, అందుకని తాను ఇండియానుంచి నా కథల పుస్తకం కాపీ ఒకటి తెప్పించి మరీ ఆ లైబ్రరీకి డొనేటు చేసానని చెప్పారు.

మరి కొన్ని వారాల తరువాత తాను అమెరికానుంచి తిరిగివస్తున్నాననీ, నాకేవైనా పుస్తకాలు కావాలంటే తెచ్చిపెడతాననీ చెప్పారు. రెండువందల డాలర్ల దాకా తాను ఆ పుస్తకాలు కానుగ్గా కొని ఇవ్వగలనని కూడా చెప్పారు.

నా పుస్తకాల విష్ లిస్టు చూసుకున్నాను. రెండువందల డాలర్లంటే తక్కువేమీ కాదు. గొప్ప కవిత్వం కనీసం పది పుస్తకాలకు తక్కువ కాకుండా తెప్పించుకోవచ్చు. కానీ ఆమె నుంచి కానుకగా తీసుకోడానికి మనసు అంగీకరించలేదు. ఇప్పట్లో అక్కర్లేదనీ, మరెప్పుడైనా కావాలనిపిస్తే తప్పకుండా అడుగుతాననీ చెప్పి తప్పించుకున్నాను.

కాని ఆమె వదల్లేదు. రెండుమూడు నెలల కిందట మరోసారి మెసేజిపెట్టారు. తనకి తెలిసినవాళ్ళు అమెరికానుంచి వస్తున్నారనీ, ఆ రెండువందల డాలర్ల ఆఫరు అలానే ఉందనీ, ఈసారి మాత్రం నేను తప్పించుకోడం కుదరదనీ చెప్పారామె. ఈ సారి ఆ పుస్తకాలు వద్దనే బదులు, అంత సులువుగా దొరకని పుస్తకాల జాబితా చెప్తే సరిపోతుంది కదా అనుకున్నాను.

ఆమె పొద్దున్న చెప్పి సాయంకాలం లోపు లిస్టు పంపించమని అడిగితే నా విష్ లిస్టు లోంచి అయిదారు పుస్తకాలు, అంత తేలిగ్గా లభ్యం కానివి రాసి పంపించాను (అలా అయితేనైనా ఆమెకి ఆ ఖర్చు తప్పుతుందని). అవి మొత్తం కలిపి వంద డాలర్లు మించకుండా చూసుకున్నాను. (మరో నాలుగు పుస్తకాలు కలపొచ్చు కదా అని మనసు సణుగుతూనే ఉందిగాని, దాని నోరుమూసేసాను)

వారం పదిదినాల కిందట వారి భర్త నాకు ఫోను చేసి తాను ఆ పుస్తకాలు తీసుకుని హైదరాబాదు వచ్చాననీ, ఆ పుస్తకాలు తెచ్చి ఇవ్వడానికి మా ఇంటి అడ్రసు చెప్పమనీ అడిగితే నాకు నోట మాట రాలేదు! ఆ పుస్తకాలు ఆయన స్వయంగా తెచ్చి ఇవ్వక్కర్లేదనీ, పోర్టరు యాపులో బుక్కు చేస్తే మా ఇంటికి నేరుగా వచ్చేస్తాయనీ చెప్పాను. చెప్పిన గంటకల్లా అయిదు పుస్తకాలు మా ఇంట్లో అడుగుపెట్టాయి.

ఆ పుస్తకాలు రాగానే ముందు అట్టలేసేసాను. ఆ తర్వాత వాటిని బల్లమీద పెట్టుకుని పదేపదే చూసుకున్నాను. వాటిల్లో మొదటిది, A Century of Modern Chinese Poetry (2023), యూనివెర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ ప్రెస్ ప్రచురణ. రెండోది, When The Light of the World was Subdued, Our songs Come Through, A Norton Anthology of Native Nations Poetry (2020) జాయ్ హార్జో సంకలనం. మూడోది, నేను చాలా కాలంగా తెప్పించుకుందామనుకుంటున్న పుస్తకం Lark in the Morning, The Verses of the Troubadours (2005). నాలుగోది, Swedish Poetry Nowadays, An Anthology of 6 Poets in the 21st Century (2016). అయిదోది, Bob Dylan (2027) కవిత్వం పైన విమర్శ వ్యాసాల సమగ్ర సంపుటి.

ఆ అయిదు పుస్తకాలచుట్టూ సప్తసముద్రాలూ ఉన్నాయి. చీనానుంచి నేటివు నేషన్సు దాకా ప్రపంచకవులు కోకిలల గుంపులాగా బిలబిల్లాడుతూ మా ఇంట్లో అడుగు పెట్టి నట్టుంది.

వెంటనే చదవడం మొదలుపెట్టాను. ఆబగా ప్రతి ఒక్క పుస్తకం తెరిచి కొన్నేసి పేజీలేనా చదవకుండా ఉండలేకపోయాను. రాబోయే రోజుల్లో ఆ ప్రతి ఒక్క పుస్తకం గురించి ఎక్కడ ఎలానూ మీతో పంచుకోబోతున్నాను. కాని ఇప్పటికైతే ఆ వదాన్యురాలికి శుభాశీస్సులు అందచేయడం అన్నిటికన్నా ముందు చెయ్యవలసిన పని.

అదే ఆశ్చర్యంగా ఉంది. ఆ రోజు నేను విశాఖపట్టణంలో పేరుపేరునా ఎవరెవరికి ఆ పుస్తకాలు స్వయంగా నా చేతుల్తో అందచేసానో వాళ్ళెవరూ ఇప్పటిదాకా కనీసం ఆ పుస్తకం ఒక్క పేజీ అయినా చదివినట్టుగా నాకెప్పుడూ చెప్పలేదు.

కాని ఇదుగో, ఈ ఉపాధ్యాయిని, సాహిత్యలోకంలో ఎవరికీ అంతగా పేరు తెలియని ఈ సాహిత్యప్రేమికురాలు, నేను ఆమెకి ఒక్క పుస్తకం పంపినందుకు, నా కథలపుస్తకం తెప్పించి మరీ అమెరికాలో ఒక గ్రంథాలయానికి దానం చేసారు. నా కోసం పట్టుబట్టి మరీ ఇలా ప్రపంచకవిత్వం తెప్పించి మా ఇంటికి పంపించారు. ఇటువంటి వాళ్ళనే మా మాష్టారు సాహిత్యపోషకులు అనేవారు. అంతేతప్ప నెలతిరగ్గానే కవిగారి ఇంటికి ఒక బియ్యం బస్తా పంపించేవాళ్ళు కాదు అని కూడా అనేవారు ఆయన.

నా చిన్నప్పుడు మా ఊళ్ళల్లో దూరప్రాంతాల నుంచి కళాకారులు వచ్చి ఏదైనా ప్రదర్శనలిచ్చినప్పుడు ఆ ఊళ్ళో పెద్దలు వాళ్ళకేదన్నా తృణమో, పణమో కానుక చేసినప్పుడు, వాళ్ళు ప్రదర్శన ఆపి మరీ, ముందు ఆ దాతల్ని నోరారా దీవించేవారు. నేను కూడా అట్లానే, నా బ్లాగులో రోజూ రాసే రాతలు ఈ పూటకు ఆపి, నోరారా ఆమెని దీవిస్తున్నాను. ఆమెకీ, ఆమె కుటుంబానికీ సరస్వతీదేవి ఆశీస్సులు సదా వర్షించాలని మనఃపూర్వకంగా కోరుకుంటున్నాను.

29-4-2024

# అప్రయోజక జీవితం

**ఈ** మధ్య ఒక మిత్రురాలు నాకిట్లా మెసేజి పెట్టారు: 'సాహిత్యం అంతిమలక్ష్యం ఏమిటి? మనుషుల్లో దాగున్న సున్నితత్వాన్ని మేల్కొలిపి సాటి మనుషుల పట్ల లేదా సమాజం పట్ల దయగా, బాధ్యతగా ఉండేటట్లు చేయడమేగా..మీరెందుకు అన్నీ తెలిసి గిరి గీసుకుని బతుకుతున్నారు?'

ఆమె ఇంకా ఇలా రాసారు: 'మా కుటుంబస్నేహితులు ఒకరికి రిటైరయ్యాక కూడా సర్వీసు పొడిగించారు. సరే.. అలా మీకు ఇష్టం లేదనుకుందాం. కనీసం సమాజం పట్ల, చుట్టూ ఉన్న ప్రపంచంలో జరుగుతున్న వాటిపై స్పందించకపోతే మీ అపారమైన జ్ఞానానికి అర్థం ఏమిటి?'

ఆమె మాటలు నన్ను ఆలోచనకి గురిచేసాయి. నేనేమి చేయాలి? ఏమి చేస్తున్నాను? ఏమి చేయలేకపోతున్నాను? నాకు అర్థం కాలేదు.

'నేనేమి చేయాలో మీ సలహా చెప్పండి' అనడిగాను. 'నిజాయితీగానే మీ సలహా అడుగుతున్నాను' అని కూడా అన్నాను. దానికి ఆమె ఇలా జవాబిచ్చారు:

'మీలాంటి వాళ్ళు ఎందరినో ప్రభావితం చేయగలరు. అందుకే మీ పోస్టులు కేవలం సాహిత్యంపై మాత్రమే కాకుండా, సమాజంలో జరుగుతున్న అన్ని అంశాలపై నిర్మొహమాటంగా రాయండి. పాలకులు, ప్రజలు..ఎవరైనా సరే మారాల్సిన, మార్చుకోవలసిన అంశాలను ఎత్తి చూపండి. ఉ. పాలస్తీనాపై దాడి చేసి పసిపిల్లలను టార్గెటు చేసి చంపడం, మన దేశ, రాష్ట్ర సామాజిక, రాజకీయ పరిస్థితులు..'

అర్థమయింది. నిజమైన స్నేహితురాలు తన మిత్రుడి గురించి బహుశా ఇలానే ఆలోచిస్తుంది. తన మిత్రుడి శక్తిసామర్థ్యాలు జనహితం కోసం మరింత క్రియాశీలకంగా,

మరింత కార్యసాధకంగా పనిచెయ్యాలనీ, అతడు ఒక మూల కూచుని బొమ్మలు గీసుకుంటూ, కవితలు చదువుకుంటూ గడపడానికి మాత్రమే పరిమితం కాకూడదని అనుకుంటుంది. ఆమె హృదయానుభూతి నేరుగా నన్ను తాకింది. ఆ సున్నితమనస్కురాలి పట్ల నాలో చెప్పలేనంత ఆత్మీయత ఉప్పొంగింది.

కానీ, ఆమె రాసినట్టు, లేదా ఆమె నన్ను పనిచెయ్యమని కోరుకుంటున్నట్టు నేను చేయగలనా?

చేయలేనననే అనుకుంటున్నాను. ఎందుకంటే, నా ఉద్యోగవిరమణ తర్వాత నేను యాక్టివు పబ్లిక్కు లైఫు నుంచి పూర్తిగా పక్కకు తప్పుకున్నాను. అలాగని ప్రజలకు దూరంగా జరగాలని మాత్రం అనుకోలేదు. వీలైనంత దగ్గరగా, వారికి మరింత సన్నిహితంగా, వారి కష్టసుఖాల్ని మరింత లోతుగా చూడాలనీ, వారితో మమేకమవ్వాలనే కోరుకున్నాను. కోరుకుంటూనే ఉన్నాను. నేను అనుకున్నట్టుగా ప్రజలమధ్యకు వెళ్ళగలిగే అవకాశాలకు, రకరకాల కారణాల వల్ల, ఇంకా దూరంగానే ఉన్నాను.

కాని నిజంగానే ప్రజల మధ్యకు వెళ్ళినా కూడా నా మిత్రురాలు రాసినట్టు వాళ్ళని చైతన్యపరిచి, ఉత్తేజపరిచి, వాళ్ళని ముందుకో, వెనక్కో నడపాలని మాత్రం నాకెట్టి కోశానా లేదు. అసలు ప్రజలమధ్యకు వెళ్ళేదే వాళ్ళ గురించిన మరింత దగ్గరగా తెలుసుకోవాలనే తప్ప, సామాజికపరివర్తన దిశగా పనిచెయ్యాలని కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే, ప్రజల మధ్యకు వెళ్ళినా కూడా, ఒక గురజాడలాగా, మరింత సత్యసమ్మతమైన సాహిత్యసృజన చెయ్యాలన్న కోరికతోనే తప్ప, వీరేశలింగం లాగా ఒక ఉప్పెనలాగా ఉవ్వెత్తున ఎగిసిపడాలని కాదు.

అసలు నా చుట్టూ ఉన్న సమాజంలో ఉన్న దోషాల్ని ఎత్తిచూపడం మీదా, నా చుట్టూ ఉన్న పరిస్థితుల్ని సంస్కరించడం మీదా నాకు ఆసక్తి దాదాపుగా సన్నగిల్లిపోయింది. ఉద్యోగంలో ఉన్నంతకాలం, నా ఉద్యోగ జీవితపు పరిధిలో నేను చూసిన అన్యాయాల్ని ప్రతిఘటించడం మీదా, నా బాధ్యతల పరిమితుల మధ్యనే వాటిని చక్కదిద్దడం మీదా శక్తివంచన లేకుండా పోరాడేను. నాకు అన్యాయం అని అనిపించినదాని పట్ల ఒక్కరోజు కూడా కళ్ళుమూసుకున్నది లేదు. ఆ పోరాటంలో నాకు ఎవరు సహకరించినా, ఎవరు సహకరించకపోయినా నేను ఆగిందీ లేదు. కాని అదంతా నా ఉద్యోగ జీవితంలో భాగంగా చేసాను. ఒకవేళ నేను ఆ ఉద్యోగాలు చెయ్యకపోయి ఉంటే, ఆ పరిస్థితుల్ని స్వయంగా ఎదుర్కోకపోయి ఉంటే, బహుశా ఆ అన్యాయాల గురించి నాకు తెలిసినా కూడా నేను

పట్టించుకుని ఉండేవాణ్ణి కాను. ఎందుకంటే మొదటినుంచీ నా దృష్టి నన్ను సంస్కరించుకోడం పట్లనే ఉంది తప్ప లోకాన్ని సంస్కరించడం పట్ల లేదు.

నా మిత్రురాలు చెప్పినట్టుగా గాజా మీద నేను ఎందుకు కవిత రాయలేకపోతున్నాను? అలాగని కవితలు రాస్తున్నవాళ్ళ దుఃఖం అసత్యం అనలేను. వాళ్ళ నిజాయితీని, చిత్తశుద్ధినీ, ఆవేదననీ శంకించలేను. అలా రాయవలసిన అవసరం తప్పకుండా ఉంది. అలా ప్రపంచమంతా రాస్తేనన్నా, సామ్రాజ్యవాదదేశాలు ఎంతో కొంత వెనక్కి తగ్గుతాయి. ఈ సంగతి నాకు తెలియకపోలేదు. అయినా కూడా నేను గాజామీద ఒక కవిత రాయలేను. ఎందుకంటే అసలు అలా ఒక కవిత రాసే నైతికమైన హక్కు నాకున్నదా అన్న ప్రశ్న నన్ను వేధించడం మొదలుపెడుతుంది. నా చుట్టుపక్కల ఉన్న జీవితవిషాదంలో రవ్వంత కూడా పాలుపంచుకోకుండా అంతర్జాతీయ విషాదం గురించి రాయడంలో నాకొక చెప్పలేని సౌకర్యం ఉందేమోనన్న అనుమానం నన్ను పైకి కనబడని రంపంతో కోసేయడం మొదలు పెడుతుంది.

ఈ అర్థంలో నా శక్తులు పూర్తిగా నిరుపయోగాలు. ఉద్యోగజీవితంలో నేను కొంత పోరాటం చెయ్యకపోలేదుగాని, అది నేను తీసుకుంటున్న జీతానికి న్యాయం చెయ్యడం కోసం చేసిందే తప్ప, ఒక సామాజిక సంస్కరణలో భాగంగా చేసింది కాదు. ముందు ఇరుగుపొరుగు కష్టసుఖాల్లో భాగం పంచుకోకుండా, నేను వసుధైక కుటుంబం గురించి మాట్లాడటం కన్నా ఆత్మవంచన మరొకటి ఉండబోదు.

ఒకప్పుడు ఏథెన్సులో సోక్రటీసు ఈ సమస్యనే ఎదుర్కొన్నాడు. ఆయన శారీరికంగా చాలా బలిష్టుడు. కొన్నాళ్ళు సైన్యంలో కూడా పనిచేసాడు. మొదట్లో ఆయనకి సమాజం పట్ల చాలా ఆసక్తి ఉండేది. ఆదర్శవంతమైన జీవితం జీవించాలనే కోరిక ఉండేది ఆయనకి. ఆ జీవితం ఎలా ఉంటుందో తెలుసుకోవాలనే తపన తీవ్రంగా ఉండేది. అలాంటి రోజుల్లో ఒక సంఘటన ఆయన జీవితాన్ని మార్చేసింది.

ఆ రోజుల్లో డెల్ఫి అనే చోట ఒక దివ్యవాణి వినిపించేది. ప్రజలు తమ జీవితాల గురించి ఏవైనా నిర్ణయాలు తీసుకోవలసి వచ్చినప్పుడు ఆ దేవాలయానికి వెళ్ళి అక్కడి పూజారిణిని ప్రశ్నలు అడిగేవారు. ఆ పూజారిణి వాళ్లకి ఏదో ఒక జవాబు చెప్పేది. ఆ జవాబుని వాళ్ళు గ్రీకు దేవత అపోలోవాణిగానే భావించేవారు. అలా ప్రశ్నలు అడగడానికి రెండు పద్ధతులు ఉండేవి. ఒక పద్ధతిలో రాతపూర్వకంగా జవాబు కావాలంటే ఒక గొర్రెనో, మేకనో బలివ్వాల్సి ఉండేది. అప్పుడు వాళ్ళు అడిగే ప్రశ్నకి వివరంగా జవాబు

దొరికేది. అలా కాకుండా తమ ప్రశ్నకి 'అవును' అనో లేదా 'కాదు' అనో మాత్రమే జవాబు సరిపోతుందనుకుంటే, అందుకు ఏ బలులూ, నైవేద్యాలూ సమర్పించాల్సిన పని ఉండేది కాదు. మామూలుగా బీదవాళ్ళు దివ్యవాణిని సంప్రదించడానికి రెండో పద్ధతినే ఎంచుకునేవారు. ఒకసారి ఛాయిరేఫోన్ అనే ఒక యువకుడు ఆ పూజారిణి దగ్గరకు వెళ్ళి ఒక ప్రశ్న అడిగాడు.

'సోక్రటీస్ కన్నా వివేకవంతుడెవరైనా ఉన్నారా?'

'లేరు' అంది దివ్యవాణి.

ఆ సంగతి తెలియగానే సోక్రటీస్ దిగ్భ్రాంతి చెందాడు. దేవుడు చెప్పిన మాటకి అర్థమేమిటి? అసలు వివేకమంటే ఏమిటి? తాను వివేకవంతుడా? తనని మించిన వివేకవంతుడు మరొకరు లేరని దివ్యవాణి ఎందుకు చెప్పింది? మరెవరికీ తెలియని, తనకు మాత్రమే తెలిసిన ఆ వివేకం ఏమిటి? ఆ ప్రశ్న సోక్రటీస్‌ని పూర్తిగా అంతర్ముఖుడిగా మార్చేసింది. అతడు ఒక్కసారిగా పౌరజీవితం నుంచి పక్కకు తప్పుకున్నాడు. నిజానికి పెరిక్లీజ్ భావజాలంతో ప్రభావితమైన ఆనాటి ఏథెన్సులో, ఒక యువకుడు, పౌరజీవితం నుంచి పక్కకి తప్పుకోవడమంటే, ఆ పౌరుడు 'అప్రయోజకుడి' గా మారిపోవడమే. ఉత్తమజీవితం కోసం, ఆదర్శవంతమైన జీవితం కోసం వెతుక్కోడం మొదలుపెట్టిన యువకుడు చివరికి ఒక 'అప్రయోజక జీవితం'లోకి ప్రయాణించడమే.

సోక్రటీస్‌కి దాదాపు రెండువేళఏళ్ళ తరువాత, జపాన్‌లో బషో కూడా ఈ మాటలే రాసుకున్నాడు: 'నా కవిత్వం వేసవికాలంలో చలిమంటలాంటిది, శీతాకాలంలో విసనకర్ర లాంటిది' అని. అంటే లౌకికప్రయోజనం దృష్టిలోంచి చూస్తే ఆ కవిత్వం ఎందుకూ పనికిరాకపోగా, పైగా విరుద్ధఫలితాల్ని కూడా ఇస్తుందన్నమాట.

నా మిత్రురాలు నన్నట్లా సూటిగా ప్రశ్నించాక ఒక క్షణం ఆలోచించాను. ఆమె చెప్తున్నది సహేతుకమే గాని నేనెందుకలా ఉండలేకపోతున్నాను అని ఆలోచించాను. నా సృజనశక్తుల్ని, ఆమె ఆశిస్తున్నట్టుగా, సమాజాన్ని ప్రభావితం చెయ్యడానికి ఎందుకు వినియోగించలేకపోతున్నాను అని నా అంతరాత్మని నేను ప్రశ్నించుకున్నాను.

నాకు దొరికిన జవాబు ఒక్కటే. నేను కూడా ఒక ఆదర్శరాజ్యాన్ని కలగన్నాను, ఆదర్శసమాజంకోసం పరితపించాను. కాని ముందు నన్ను నేను సంస్కరించుకోకుండా, నా మనస్సుని ఒక ఆదర్శరాజ్యంగా మార్చుకోకుండా, బయట చెయ్యగలిగింది ఏమీ

లేదన్నదే నా మెలకువ. అందుకని, నేను చెయ్యగలిగిందల్లా, ఎప్పటికప్పుడు ఒక డస్టరు తీసుకుని నల్లబల్ల తుడుచుకున్నట్టుగా, కవిత్వం చదువుకోవడం ద్వారా నా మనసుని నిర్మలం చేసుకోవడం లేదా ఒక నీటిరంగుల బొమ్మ గీసుకోవడం ద్వారా నన్ను నేను పరిశుభ్రం చేసుకోవడం. పౌరసమాజం దృష్ట్యా చూసినప్పుడు నాది పూర్తిగా నిరుపయోగ జీవితం. నా సృజనశక్తులు పూర్తిగా అప్రయోజకాలు.

ఒకప్పుడు టాగోర్‌ని కూడా ఇటువంటి ప్రశ్నలే వేధించినట్టున్నాయి. ఆయన ఒకచోట రాసుకున్నాడు. ఈ ప్రపంచంలో బొగడచెట్టు సాధించగల పరమార్థం ఏముంటుంది? దాని పండ్లు తినడానికి పనికిరావు. ఆ కలప ఇళ్ళు కట్టుకోడానికో, ఫర్నిచరు తయారు చేసుకోడానికో పనికిరాదు. ఆ పూలు కూడా గొప్ప మాలలుగా గుచ్చడానికి పనికొచ్చేంత పెద్ద పూలేమీ కావు. కానీ ఈ ప్రపంచంలో బొగడచెట్టు తాను నిర్వహించే పాత్రని నిరుపమానంగా నిర్వహిస్తూనే ఉంటుంది అని.

నేలన రాలిన ఒక చిన్న బొగడపువ్వుని చేతుల్లోకి తీసుకుని, వాడిపోని దాని సుగంధాన్ని ఒక్కసారి ఆఘ్రాణించినా, బొగడచెట్టే లేకపోతే ఈ సృష్టి ఎంత అసంపూర్ణంగా ఉండి ఉండేదో మనకి చప్పున తెలుస్తుంది. లౌకికప్రయోజనాల్ని బట్టి చూసినప్పుడు ఎందుకూ పనిచెయ్యని ఒక బొగడపువ్వులాంటి వాణ్ణి నేను. కాని బొగడపువ్వు దానికదే ఒక ఆదర్శరాజ్యమనే సంగతి కూడా నాకు తెలియకపోలేదు.

21-5-2024

# మరికొన్ని కలయికలు

**అన్నమాచార్య** ప్రాజెక్టు వారు ఏర్పాటు చేసిన అన్నమయ్య సాహిత్య సభల్లో పాల్గోటానికి తిరుపతి వెళ్ళిన నాకు మరో రెండు సభల్లో పాల్గొనే అవకాశం కూడా వచ్చింది.

అన్నమయ్య సభలకోసం తిరుపతి వస్తున్నానని తెలిసి నన్ను మరికొంతమంది సాహిత్యమిత్రులు కలుసుకోవాలని అనుకుంటున్నారనీ, వారందరికీ వీలుగా ఒక గెట్ టుగెదర్ ఏర్పాటు చేయాలనుకుంటున్నామని ఆముదాల మురళి గారు చెప్పారు. నన్ను ఆ గోష్ఠికి రమ్మని ఆహ్వానించేరు.

28 వ తేదీ సాయంకాలం శ్రీ వేంకటేశ్వర ఎంప్లాయిస్ ట్రైనింగ్ అకాడెమీ (శ్వేత) ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గోష్ఠికి అకాడెమీ డైరక్టర్ భూమని సుబ్రహ్మణ్యం రెడ్డి గారు అధ్యక్షత వహించారు. ఆ గోష్ఠిలో కవులు, రచయితల్తో పాటు తిరుపతిలోని ఎన్నో పరిశోధన సంస్థలకు, సాహిత్య సంస్థలకు ప్రాతినిధ్యం వహించే పండితులు, పరిశోధకులు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గోష్ఠి నిర్వహించిన ఆముదాల మురళిగారు శ్రీ తరిగొండ వేంగమాంబ ప్రాజెక్టులోనూ, సారంగపాణి ప్రాజెక్టులోనూ పరిశోధకులుగా పనిచేస్తున్నారు.

వారితో పాటు శ్రీవేంకటేశ్వర మూజియం డైరక్టరు నాగోలు కృష్ణారెడ్డిగారు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు సూర్యదేవర హరికృష్ణగారు, ఓరియెంటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌కి చెందిన రాజశేఖర్ గారు, వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠానికి చెందిన కలువగుంట రామ్మూర్తిగార్లతో పాటు వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, మహిళా విశ్వవిద్యాలయానికి చెందిన తెలుగు భాష ఆచార్యులు, పరిశోధకులు కూడా ఆ గోష్ఠిలో పాల్గొన్నారు. శివుని రాజేశ్వరిగారు, స్రవంతి ఐతరాజుగారు, శారదగారు వంటి విదుషీమణుల్తో పాటు సాహిత్య అకాదెమీ పురస్కార సన్మానితుడు, మిత్రుడు నరేంద్ర కూడా ఆ సభలో ఉన్నారు. నా

చిరకాలమిత్రుడు, ప్రస్తుతం ఎస్.వి.బి.సి ఛానెల్లో పనిచేస్తున్న రచయిత, యాత్రా చరిత్రకారుడు బి.వి.రమణ కూడా ఆ సభకు హాజరు కావడం నిండుదనాన్ని తెచ్చింది.

గోష్ఠి మొదలుపెడుతూ మురళిగారు నా గురించి మాట్లాడిన నాలుగు మాటలూ నన్ను ఆశ్చర్యపరిచాయి. ప్రస్తుత సాహిత్య ప్రపంచంలో ఏదో ఒక్క సాహిత్యానికి మాత్రమే పరిమితం కాకుండా ప్రతి ఒక్క సాహిత్య సంప్రదాయానికీ, కావ్యవాక్కుకీ నేను అభిమానినని ఆయన చెప్పడం నన్ను చాలా సంతోషపరిచింది. నువ్వు నమ్మిన దారిన నీ వంతు కృషి నువ్వు చేసుకుంటూపోతూ ఉండాలేగాని నిన్ను అర్థం చేసుకోగలిగే సహృదయులు ఎవరో ఒకరు నిన్ను చేరగలరని నాకు మరోసారి నమ్మకం కలిగింది.

ఆ రోజు అక్కడకు వచ్చిన చాలామంది పండితుల్నీ, పరిశోధకుల్నీ నేను కలుసుకోవడం అదే మొదటిసారిగానీ, వారు నా రచనలు చదివామని చెప్తుంటే నా మనసెంతో పులకించిపోయింది. ఒకరు మార్కస్ అరీలియస్ 'మెడిటేషన్స్' పైన నేను రాసిన 'నీ శిల్పివి నువ్వే' పుస్తకం గురించీ, డా.కాళ్ళకూరి శైలజ గారి 'డావో' పుస్తకానికి నేను రాసిన ముందుమాట గురించీ ప్రస్తావించారు. మరొకరు కథాప్రక్రియ గురించి నేను రాసిన వ్యాసాలు తమకి తరగతిబోధనలో ఎంతో ఉపకరించాయని చెప్పారు. మరొకరు 'సత్యాన్వేషణ' గురించీ, ఇంకొకరు 'ఒక విజేత ఆత్మకథ' గురించీ మాట్లాడేరు. చాలు, ఒక రచయితగా నా కృషికి ఇంతకన్నా నేరు కోవలసింది మరేమీ లేదనుకున్నాను

మనకు వారసత్వంగా లభించిన తెలుగుభాషా, సాహిత్యాల్ని కాపాడుకోవడం ఎలా అన్నదానిగురించే ఆ గోష్ఠిలో ప్రధానంగా చర్చ జరిగింది. భూమన సుబ్రహ్మణ్యం రెడ్డి గారు వెంగమాంబ, సారంగపాణి ప్రాజెక్టుల ద్వారా చేపడుతున్న పనుల గురించి విన్నాక కలిగిన ఉద్వేగంలోంచే నేను చాలాసేపు మాట్లాడేను. ముఖ్యంగా తెలుగు కవులు జీవించిన స్థలాల గురించీ, నడయాడిన తావుల గురించీ, పలికినపద్యాలు, పాటల గురించి యువతరానికి తెలియచెప్పడానికి ఎటువంటి కార్యక్రమాలు చేపట్టగలమో అన్నదాని చుట్టూతానే చర్చ జరిగింది. ఉదాహరణకి మహారాష్ట్రలో ప్రతి ఏటా వార్కరి జరిగినట్టే, జ్ఞానేశ్వర్, నామదేవ్, తుకారాంల అభంగాలు పాడుకుంటూ గ్రామీణులు పండరియాత్ర చేసినట్లే, అన్నమయ్య తిరుగాడిన ముఖ్యమైన స్థలాలనుండి ఆయన కీర్తనలు పాడుకుంటూ ఒక సంకీర్తనా యాత్ర జరపవచ్చుకదా అని అనుకున్నాం.

అలాగే ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డిగారు తిరుపతి గంగమ్మ జాతర గురించీ, తిరుపతి చుట్టూ ఉన్న ఐతిహ్యాల గురించీ రాసిన రెండు పుస్తకాలు నాకు ఇచ్చినప్పుడు

స్థానిక చరిత్రకారుల సదస్సు ఒకటి ఏర్పాటు చేస్తే బాగుంటుందని కూడా అనుకున్నాము. ఎందుకంటే నేను నా పర్యటనలో భాగంగా చాలా ప్రదేశాల్లో స్థానిక చరిత్రకారుల్ని చూస్తున్నాను. ఒంగోలులో జ్యోతి చంద్రమౌళి గారు అటువంటి ఒక స్థానిక చరిత్రకారుడు. దాట్ల దేవదానం రాజుగారు యానాం చరిత్ర మీద ఒక పుస్తకం వెలువరించారు. తూర్పుగోదావరి జిల్లా కైఫియత్తుల మీద బొల్లోజు బాబా ఒక పుస్తకం రాశారు. చిత్తూరు జిల్లాలో కీలపట్లకు వెళ్ళినప్పుడు కీలపట్ల కోనేటి రాయుడి పైన ఒక పుస్తకం చూశాను. ఇటువంటి స్థానికచరిత్రలు ప్రతి ఒక్క ప్రాంతంలోనూ ఎన్నో ఉండి ఉండవచ్చు. కానీ వాటి గురించి బయట జిల్లాల వారికి తెలియదు. కాబట్టి అటువంటి స్థానిక చరిత్రకారుల సదస్సు ఒకటి జరిగితే స్థానిక చరిత్రలు ఎన్నో బయటకు వచ్చే అవకాశం ఉంటుంది.

ఆ మర్నాడు కూడా తమ ఉద్యోగుల్ని ఉద్దేశించి మాట్లాడమని సుబ్రహ్మణ్యం రెడ్డిగారు ఒక తరగతి ఏర్పాటు చేసారు. ఆయన నా పట్ల చూపించిన ప్రేమ, తన సంస్థ పట్ల ఆయనకున్న అంకితభావం నన్ను ముగ్ధుణ్ణి చేసాయి. బుధవారం మధ్యాహ్నం దాదాపు అరవై డెబ్భై మంది ఉద్యోగులు, అర్చకులు ఉన్న సమావేశంలో వారిని ఉద్దేశిస్తూ, వారు తమ వృత్తి జీవితాన్ని మరింత స్ఫూర్తివంతంగా నడుపుకోడానికి అవసరమైన సూచనలు చేస్తూ ఒక ప్రసంగం చేసాను. నేను ఉద్యోగ విరమణ చేసి రెండేళ్ళు కావొస్తున్నది. ఈ రెండేళ్ళలోనూ ఒక రిసోర్సుపర్సనుగా నన్నెవరూ పిలవకపోయినా, భగవంతుడు తన సిబ్బందిని చైతన్యవంతుల్ని చేయడానికి నా సేవలు వాడుకోవడం నాకు చాలా సంతోషంగా అనిపించింది.

ఆ సమావేశం అయిన తరువాత, శ్వేత భవనంలో పై అంతస్థులో ఉన్న శ్రీ వేంకటేశ్వర సెంట్రలు లైబ్రరీ అండ్ రీసెర్చి ఇన్స్టిట్యూటు సందర్శించాను. దాదాపు లక్ష పుస్తకాలతో ఏర్పాటు చేసిన ఆ గ్రంథాలయం తిరుమల-తిరుపతి దేవస్థానాల సముదాయంలో మరొక విలువైన దేవాలయంగా భాసించింది. భారతీయ తత్త్వశాస్త్రానికీ, దర్శనాలకూ, ఆధ్యాత్మికతకూ సంబంధించిన విజ్ఞాననిలయంగా ఆ గ్రంథాలయాన్ని అభివర్ణించవచ్చు.

వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో లైబ్రరీ సైన్సు ప్రొఫెసరుగా పనిచేసిన ఊటుకూరు పుల్లారెడ్డిగారు పదవీవిరమణ తర్వాత ఈ గ్రంథాలయ బాధ్యతలు చూస్తున్నారు. శ్వేత డైరక్టరు భూమన సుబ్రహ్మణ్యంరెడ్డిగారే సంచాలకులుగా ఉన్న ఈ గ్రంథాలయంలో మొత్తం పదముగ్గురు సిబ్బంది ఉన్నారు. లక్ష గ్రంథాల్లో దాదాపు అరవైవేల గ్రంథాల దాకా డిజిటైజేషను పూర్తయ్యింది.

1993 లో ప్రారంభించిన ఈ లైబ్రరీలో టిటిడి ప్రచురణలన్నిటితో పాటు, టిటిడి ఆర్థిక సహాయం అందించిన ప్రచురణల ప్రతులు కూడా భద్రపరిచారు. కింద అంతస్థులో విశాలమైన రీడింగ్ రూము, పత్రికలు ఉన్నాయి. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు రోజుకి అరవైమంది దాకా లైబ్రరీకి వస్తుంటారని అసిస్టెంట్ లైబ్రేరియన్ రాజు నాతో అన్నారు.

నేను ఆ పుస్తకాలు చూస్తూ ఉండగా, ఆముదాల మురళిగారు ఒక సంస్కృత గ్రంథాన్ని తీసుకొచ్చి నాకు చూపిస్తూ 'ఖండనఖండఖాద్యం, చూడండి సార్' అని అన్నారు. ఆ గ్రంథం పన్నెండోశతాబ్దికి చెందిన శ్రీహర్షుడనే వేదాంతి రాసిన పుస్తకం. ఆయన తన కాలం నాటి న్యాయదర్శనాన్ని ఖండిస్తూ ఆ పుస్తకం రాసాక, న్యాయదర్శనం తన రూపు మార్చుకుని నవ్యన్యాయంగా మారక తప్పలేదు. ఒకప్పటి భారతీయ దర్శనాల్లోని సంవాదాలకూ, పాండిత్యస్ఫూర్తికీ, దార్శనికస్పష్టతకూ ఆ గ్రంథం ఒక ఉదాహరణ.

నేను ఆ పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకుని మళ్ళా ఒక్కసారి ఆ గ్రంథాలయం మొత్తం కలయచూసాను. అక్కడ ఏ అలమారులో చూసినా అటువంటి పుస్తకాలు కొల్లలుగా ఉన్నాయి. అక్కడ కేవలం రామాయణాలే ఆరు రాకులకు సరిపడా ఉన్నాయి. వేదాలు, వేదాంతం, దర్శనాలు, వ్యాఖ్యానాలు- ఆ భాండాగారాన్ని ఉపయోగించుకునే వారేరీ? కనీసం రోజూ ఆ గ్రంథాలయంలో గడపడం కోసమేనా నాకు ఆ క్షణాన నా నివాసం తిరుపతికి మార్చేసుకోవాలనిపించింది.

ఆ సాయంకాలం నన్ను గెస్టుహవుసులో డా.కృష్ణారెడ్డిగారు, బి.వి.రమణగారు కలుసుకున్నారు. కృష్ణారెడ్డిగారు సంస్కృతం, తెలుగు, పురావస్తు శాస్త్రాల్లో పండితులు. తెలుగుశాసనాలమీదా, శాసనాల్ని ఆధారం చేసుకుని చరిత్రను నిర్మించడం మీదా ప్రామాణికమైన విద్వత్తు ఉన్న వ్యక్తి. టిటిడి ఇప్పుడు తన మ్యూజియం నవీకరణ ప్రాజెక్టు బాధ్యతల్ని ఆయనకి అప్పగించింది. అటువంటి పండితుడు నన్ను వెతుక్కుంటూ వచ్చి నాకు తన పుస్తకాలు ఇవ్వడం నా సుకృతం అనిపించింది.

బి.వి.రమణ నేను పాడేరులో పని చేస్తున్న రోజులనుంచీ నా మిత్రుడు. ఇతిహాసపు చీకటి కోణం మరుగున పడి కనిపించని కథలు తెలిసినవాడు. ఇప్పుడు తిరుపతి గురించీ, తిరుమలకొండల గురించీ అంత సాధికారికంగా మాట్లాడగల వ్యక్తిని మరొకరిని చూడం. అన్నమయ్య సంచరించిన తావుల్ని ఎన్నో సార్లు తాను స్వయంగా చుట్టబెట్టినవాడు. ఆయన కూడా తన రచనల్ని తీసుకొచ్చి అందించడం నాకు భగవత్ప్రసాదమే అనిపించింది.

ఈ సారి నాకు దొరికిన మరొక కానుక నూకా రాంప్రసాద్‌రెడ్డి. ఆయన నాకు చాలాకాలంగా తెలిసి ఉన్నా కూడా ఇంతసేపు గడిపే అవకాశం ఇప్పుడే దొరికింది. ఆయన రాయలసీమకు దొరికిన ఒక విలువైన వజ్రం. ఎన్నెన్నో విషయాలు ఆయన చెప్తూనే ఉన్నారు. తాను నాతోపాటు రైల్వేస్టేషనుకు వచ్చి నాకు వీడ్కోలు పలికారు. ఆయన నన్ను రైలెక్కించి రైలు కదిలేదాకా అక్కడే నిలబడ్డ దృశ్యమే నా కళ్ళముందు నిలబడిపోయింది. 'సార్, అన్నమయ్య గురించి ఒక పుస్తకం రాయండి, మా పెన్నేటి పబ్లికేషన్సు తరఫున ప్రచురిస్తాం' అని ఆయన చెప్పిన మాట నా మనసులో బలంగానే నాటుకుంది. బహుశా ఆ కారణం చేతనేనా అన్నమయ్య తిరుగాడిన తావుల్లో రానున్న రోజుల్లో నేను కూడా తిరుగాడాలన్న తపన మొదలయ్యింది.

2-6-2024

# ఆకాశాన్ని కానుక చేసే ఋతువు

**నా** ఉద్యోగ జీవితంలో భాగంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో పర్యటించేటప్పుడు, ఆ గ్రామాల్లో బోరువెలు ఉంటే, ఆ బోరుపంపు ఆడించి చూస్తే అందులోంచి నీళ్ళొస్తే, అక్కడ ప్రభుత్వం ఉనికిలో ఉంది అని చెప్పుకునేవాణ్ణి. ఇవాళ పొద్దున్న మృగశిర కార్తె మొదలవగానే ఆకాశం మీద నలుపు నీడ తిరిగిన పలచని బూడిదరంగు మేఘాలు ప్రవాహం లాగా పయనిస్తూ కనిపించినప్పుడు, ఫర్వాలేదు, కాలమింకా గతి తప్పలేదను కున్నాను. ప్రపంచవ్యాప్తంగా దేశాలూ, నగరాలూ, నాగరికతా ఆకాశంలోకీ, నదుల్లోకీ, సముద్రాల్లోకీ, భూగర్భంలోకీ ఎంతలేసి కాలుష్యాల్ని వదుల్తున్నా కూడా, మహాసముద్రాలు వేడెక్కి ఆ తాపాన్ని తట్టుకోలేక వేడినిట్టూర్పులు వదులుతున్నా కూడా, ఇంకా ఋతుపవన మేఘాలు ఈ నగరాకాశం మీద వేళ తప్పకుండా ప్రయాణించడం చూస్తూ ఉంటే ఇంకా దేవుడి ఉనికిని మనిషి పూర్తిగా రద్దుచేయలేకపోయాడనే అనిపిస్తున్నది.

ఆహా! ఇంకా చాతకం బతికే ఉన్నది, నిప్పులు కక్కిన వేసవి మొత్తం ఆ ఉగ్ర మధ్యాహ్నాల్ని అదెట్లా సహించిందోగాని, ఒక్క వానచినుకుకోసం, ఒక్క తేమగాలి తుంపర కోసం అదెట్లా ప్రాణాలు గొంతులో కుక్కుకుని ఇన్నాళ్ళూ గడిపిందోగాని, వానకోయిలకీ, కారుమబ్బుకీ ఉన్న ఈ అనుబంధం ఇన్ని యుగాలైనా ఇంకా చెక్కుచెదరకుండా ఉండటం నాకు ధైర్యానిస్తున్నది.

నలిగిపోయాను నేను కూడా, లుంగలు చుట్టుకుపోయాను, నాలోనేనే రగిలిపోయాను, మాడిపోయాను, ఎండ చూస్తే చాలు, భయం పుట్టేది, ఎక్కడో బతుకు మీద లేశమాత్రం కూడా మిగలకుండా ప్రేమ శోషించిపోతుందా అనిపించేది. తెలుస్తున్నది, నేను కూడా ఈ వానపిట్టలాగా ఆకాశం మీద ఒక మబ్బు కదలాడే రోజు కోసం కొట్టుమిట్టాడేనని. కానీ నేనా పిట్టకెన్నటికీ సాటిరాను. అది కేవలం ఎదురుచూడటం మాత్రమే కాదు,

ఋతుపవనం వస్తున్నదని పసిగట్టగానే ప్రపంచమంతా వినేటట్టుగా ప్రకటించడం మొదలు పెట్టింది. ప్రతి కొమ్మనీ, ప్రతి రెమ్మనీ, ప్రతి గూడునీ, ప్రతి పల్లెనీ తట్టిలేపుతో పరుగులు పెడుతున్నది. ఏదీ! వర్షాగమనాన్ని నేను కూడా అలా గానం చెయ్యగలిగినప్పుడు, ఏ ఒక్కరినీ స్థిమితంగా ఉండనివ్వనట్టుగా ఒకటే తొందరపెడుతో వానరాకడని చాటింపు వెయ్యగలిగినప్పుడు, అప్పుడు మాత్రమే నేను కూడా ఒక చాతకసమానుణ్ణి కాగలిగానని చెప్పుకోగలుగుతాను.

ఈ దేశంలో అనాదినుంచీ ఎందరో కవులు, గాయకులు, చిత్రకారులు ఋతుపవన ప్రవేశాన్ని పండగ చేసుకుంటో వచ్చారు. వాళ్ళకి చాతకం ఒక ఆదర్శం, పురి విప్పిన నెమలి ఒక ఆదర్శం, వానలు రాబోతున్నాయని ముందే పసిగట్టి తమ తమ చిన్న చిన్న వీపుల మీద ఆహారపదార్థాలు మోసుకుంటో సురక్షితక్షేత్రాలకి బారులు కట్టే చీమలదండు ఆదర్శం, చిరుకప్పలు ఆదర్శం, పొలాల్లో వైడూర్యాల వాన కురిసినట్టు ప్రత్యక్షమయ్యే ఇంద్రగోప సమూహం ఆదర్శం. ఆ స్ఫూర్తితో వాళ్ళు పాటలు కట్టారు, పద్యాలు రాసారు, కథలు చెప్పారు, కావ్యాలు నిర్మించేరు.

అలాంటి రచనల్ని కొన్నింటిని ఏరి జూహీ సిన్హా అనే ఆమె When Peacocks Dance (2013) అని ఒక పుస్తకంగా వెలువరించిందని తెలిసి కిందటేడాదే తెప్పించుకున్నాను. ఈసారి ఆకాశంలో తొలిమబ్బులు కనిపించగానే ముందు ఆ పుస్తకమే తీసాను. పెళ్ళిపందిట్లో సన్నాయిమేళంలాగా ఆ పుస్తకంలో ఎందరో కవులు, ఎన్నో కవితలు.

జూహీ సిన్హా తన సంకలనంలో భారతీయ సాహిత్యంలోంచి ఏరి తెచ్చిన రచనల్ని, దక్షిణం, పశ్చిమం, ఉత్తరం, తూర్పు దిక్కుల కింద విభజించి మరీ సంకలనం చేసింది. సంకలనానికి నాందీవాక్యంలా ఋగ్వేదం అయిదవ మండలంలోని వరుణసూక్తాన్ని పొందుపరిచింది. ఇక ఆ తర్వాత పుటల్లో రామాయణంలో వర్షర్తు వర్ణన, మేఘదూతం, టాగోర్ గీతాలు, కులీ కుతుబ్ షా గజల్‌తో పాటు సుగతకుమారి, బుద్ధదేవబోస్, మమంగ్ దాయ్ లాంటి ఆధునికకవుల కవితలూ, పాలగుమ్మి పద్మరాజు 'గాలివాన'తో పాటు మనోజ్ దాస్, రస్కిన్ బాండ్, కుష్వంత్ సింగ్ వంటి వారి రచనలు కూడా ఉన్నాయి.

వాటితో పాటు హిందూస్తానీ సంగీతంలో వర్షర్తువుని గుర్తుచేసే మేఘమలహర్, కజరి లాంటి రాగాల గురించీ బేగం అక్తర్, గౌహర్ జాన్ లాంటి గాయికల గురించి కూడా తలపోతలున్నాయి.

మరో విశేషం, పందొమ్మిది, ఇరవయ్యవ శతాబ్దాల్లో భారతీయ ఋతుపవనం గురించి బ్రిటిషు ఉద్యోగులు, పర్యాటకులు రాసుకున్న డైరీల్లోంచీ, యాత్రాకథనాల నుంచీ కూడా కొన్ని భాగాలు ఈ సంకలనంలో చోటు చేసుకోవడం.

కాని సాధారణంగా ఏ సంకలనకర్తకీ రాని ఆలోచన ఈ సంపాదకురాలికి వచ్చింది. భారతీయ ఆకాశం మీద ఋతుపవన సంతోషాన్ని ప్రతిబింబించే ఈ సంకలనంలో ఆమె కేవలం కొన్ని సాహిత్యరచనలు పొందుపరచడంతో ఆగిపోలేదు. వానాకాలం రాగానే భారతదేశమంతటా మనుషులు ఇష్టపడే కొన్ని వంటలగురించీ, పిండివంటల గురించీ కూడా రాసింది. అవెలా చేసుకోవాలో ఆ రెసిపీసు కూడ ఇచ్చింది. వాటితో పాటు వానాకాలంలో వచ్చే పండగలు– ఓనం, రథయాత్ర, గణేశ్ చతుర్థి, తీజ్ లాంటి సంబరాల గురించి కూడా రాసింది. మాన్సూను మొదలయ్యేవేళల్లో చిరుజల్లులు పడుతున్నప్పుడు ఒక వారాంతం గడపడానికి మనం పోదగ్గ కొన్ని ప్రదేశాలు, ఉదయపూర్, మాండు లాంటి వాటిని కూడా ప్రస్తావించింది.

నాకు మరీ సంతోషాన్నిచ్చే అంశం, పట్టుమని రెండువందల పేజీలకు మించిలేని ఈ సంకలనంలో వేదాలు, రామాయణం, కాళిదాసు, టాగోర్‌లతో పాటు ఒక భిల్లు గీతానికి కూడా చోటు దక్కడం.

ఇదిగో, ఇక్కడ కిటికీ పక్కన కూచుని ఈ వాక్యాలు టైపు చేస్తుంటే నాకూ లోకానికీ అడ్డంగా ఉన్న పరదాని కోయిల ఊరికే పక్కకు లాగేస్తున్నది. ఉండీ ఉండీ వినిపించే ఆ కోకిల కూత నన్ను చెప్పలేనంత అస్థిమితానికి గురిచేస్తున్నది. నేను ఉండవలసింది ఇలా ఈ ఇంట్లో, ఈ గదిలో, ఇలా ఒక బందీగా కాదనీ, ఋతుపవన మేఘాల వెంబడి భారతీయాకాశం కింద హిమాలయాల దాకా పయనిస్తోపోతుండాలనీ పదే పదే గీపెడుతున్నది.

పొద్దున్న అక్క బదరీవనం నుంచి ఒక వాయిసు మెసేజి పంపించింది: 'తెల్లవారు జామున ఈ హిమాలయ సానువుల్లో ప్రయాణిస్తున్నంతసేపూ నాకు నువ్వే గుర్తొస్తున్నావు. ఇక్కడ నరుడూ, నారాయణుడూ ఇంకా తపస్సు చేస్తున్నట్టే ఉంది. ఆ కొండలు, ఆ గంగ, ఆ మేఘాలు, మేము ముందుకు పోతున్నకొద్దీ ఆకాశానికి మరింత దగ్గరగా పోతున్నాం' అని.

అదృష్టవంతురాలు. అలాగని నేను దురదృష్టవంతుణ్ణని అనుకోలేను. ఇదుగో, ఈ పుస్తకాన్ని మరోసారి చేతుల్లోకి తీసుకోగలను. ఆ పుస్తకం వెనకనే ఓణం పండగ నాటి

రంగురంగుల నావలూ, రథయాత్రనాటి జనసందోహం, వినాయకనిమజ్జనం ఊరేగింపులు, మేఘాల్ని కూడా కరిగించగల హిందూస్తానీ రాగాలూ నన్ను చుట్టుముడుతున్నాయి. ఒకప్పుడు నేను రాసుకున్న కవితలోని ఈ వాక్యాలు పదే పదే గుర్తొస్తున్నాయి:

ఈ విచిత్రమైన ఋతువు ప్రతి ఒక్కరికీ ఒక
పిలుపు పట్టుకొస్తుంది. తూనీగలకు పచ్చిక,
రైతుకి పొలం, పిల్లలకి బడి, ఒక్క కవిని మాత్రమే
సోమరిగా కూచోబెట్టి ఆకాశాన్ని కానుక చేస్తుంది.

8-6-2024

# నరకాగ్నికి సెలవు

**పూలని** చూస్తూ మాత్రమే మనమీ నరకాన్ని దాటగలుగుతున్నాం అంటాడు ఇస్సా. అతడు నిజంగా నరకాన్ని చూసాడు. డాంటే కూడా నరకాన్ని చూసాడు. కాని ఇన్ఫెర్నో ముప్పైనాలుగు సర్గల్లోనూ కూడా ఎక్కడా ఒక్క పువ్వు కూడా కనబడ్డట్టు నాకు జ్ఞాపకం లేదు. డాంటే చూసిన నరకం మరీ బొత్తిగా మనం రోజూ జీవిస్తున్న జీవితంలానే కనిపిస్తుంది. ఆ నరకంలో నరకయాతన పడుతున్నవాళ్ళంతా రోజూ మనం చూసేవాళ్ళలానే కనిపిస్తారు. వాళ్ళల్లో చాలామందిని మనం పోల్చుకోగలం కూడా. కానీ వాల్మీకి సంగతి వేరు. ఆయన కావ్యనాయకుడికి అయోధ్య అయినా, అడవి అయినా ఒకటే, అక్కడ పూలుంటే చాలు. ఇంకా అయోధ్యకన్నా అడవిపట్లనే ఎక్కువ ప్రీతి అతడికి, ఎందుకంటే అక్కడ కొండలుంటాయి, చెట్లుంటాయి, విరబూసిన పూలుంటాయి కాబట్టి.

విరబూసిన ఒక పూల చెట్టు కనబడగానే ఈ రోజు నరకాగ్నులకి సెలవు ప్రకటించారని సంతోషపడిపోతాడు ఇస్సా. నేనూ ఒక నరకాన్ని చూస్తున్నాను. ఒక నరకంగుండా నడుస్తున్నాను. కానీ పొద్దున్నే మేడమీద నిండుగా విప్పారిన శంఖుపూల తీగని చూడగానే నా మర్త్యశరీరం అక్కడికక్కడే కూలిపోయి నాలోంచి ఒక గంధర్వుడు బయటికొస్తాడు. ఆ నీలంరంగు పూలొక భాషలో మాట్లాడతాయి. అది విద్యాధరులు మాత్రమే అర్థం చేసుకోగల భాష.

ఏళ్ళకిందట నేనొక కథలో ఒక పాత్ర మనఃస్థితి గురించి రాస్తూ అతడు తాను భూమ్మీద విద్యాధరుడు కావడం కన్నా ఆకాశంలో విద్యాధరుడై ఉంటే బాగుణ్ణని అనుకున్నాడని రాసాను. కాని ఇప్పుడు నేను భూమ్మీద విద్యాధరుణ్ణి కాగగినందుకు నిజంగా సంతోషిస్తున్నాను. ఎందుకంటే నేను చదివిన కవిత్వాలూ, పుస్తకాలూ నాకు ప్రేమవిద్య నేర్పాయి. వికసించిన శంఖుపూల తీగని చూడగానే నా నరకాన్ని పక్కకు నెట్టేసుకోగల శక్తి నేను విద్యాధరుణ్ణి కాగలినందువల్లనే సాధ్యపడింది.

ఇంతకీ ఆ నీలం రంగుపూల తీగని అపరాజిత అని పిలుస్తారట. ఆ పూల తీగ తాను అపరాజితగా వికసించడమే కాదు, నన్ను కూడా అపరాజితుణ్ణి చేస్తున్నది.

నరకంలో ఉండే నరకం ఏమిటంటే అది నువ్వొక్కడివే పడవలసి ఉంటుంది. యుధిష్ఠిరుడు స్వర్గానికి వెళ్ళవలసివచ్చినప్పుడు తన వాళ్ళందరూ మధ్యలో జారిపోయినా కనీసం ఒక కుక్క ఆయనకి తోడుగా నిలబడింది. నరకం ఎందుకు నరకమంటే అక్కడ నీకు తోడుగా నిలబడేవారెవరూ ఉండరు. నరకానికి వచ్చేటప్పటికి ఎవరి నరకం వారిదే. నీ మిత్రులు, బంధువులు, శ్రేయోభిలాషులు, జీవితకాలం పాటు నిన్ను విడిచిపెట్టనని వాగ్దానం చేసినవాళ్ళు ప్రతి ఒక్కరూ కూడా మహా అయితే ఒక వాట్సపు మెసేజి పెట్టగలరు. కాని నరకంలోని నరకం ఏమిటంటే అక్కడ అన్ని కనెక్టివిటీలూ మూగబోతాయి.

డాంటేకి ఈ విషయం తెలుసు. కాబట్టే, నరకంలో అడుగుపెట్టేవాళ్ళు అన్నిటికన్నా ముందు ఆశలు వదిలిపెట్టుకుని మరీ అడుగుపెట్టాలని ఆ నరకద్వారం మీద రాసి ఉందని చెప్తాడు.

కాని జీవితం నాకు నేర్పిన గొప్ప విషయం, నువ్వు నరకానికి చేరువయ్యే కొద్దీ, మనుషులు నీకు దూరమవుతూ ఉండవచ్చేమోగాని, అనుగ్రహం మాత్రం నిన్ను వదిలిపెట్టదని. ఇంకా చెప్పాలంటే, నరకం వల్ల మాత్రమే నువ్వు అనుగ్రహాన్ని గుర్తుపట్ట గలుగుతావు. నువ్వెంత నరకం చూస్తూ ఉంటే, అంత దగ్గరగా అనుగ్రహాన్ని పోల్చుకోగలుగు తుంటావు. అందుకనే డాంటే నరకంలో ఇలా అడుగుపెట్టాడో లేదో అలా వర్జిలు ప్రత్యక్షమయ్యాడు. తనని డాంటేకి తోడుగా ఉండమనీ, దగ్గరుండి మరీ నరకం దాటించమనీ బియాత్రిసు చెప్పిందని చెప్తాడు.

I am Beatrice who send thee.. Love moved me, that makes me speak

అని అన్నదట ఆమె వర్జిలుతో.

Love moved me.

ఆ ఒక్క వాక్యం వినడానికేనా ఒక జీవితకాలం నరకంలో గడపవచ్చు. నువ్వు నరకంలో అడుగుపెట్టావని తెలియగానే ఒక దేవత హృదయం కరిగి, ఆమెకు ప్రేమ కలిగి, ఒక దూతని నీ దగ్గరకు పంపిస్తే, అలా ఒక ప్రేమ వాక్యం వినబడుతుందని తెలిస్తే, నేను ప్రతి రోజూ నరకంలో గడపడానికి సిద్ధపడగలను.

నువ్వు మామూలు జీవితం జీవిస్తున్నంతసేపూ నీకు అనుగ్రహమంటే ఏమిటో తెలియడం కష్టం. ఇంకా తెల్లవారకుండానే కమ్మరి కొలిమిలో తిత్తులూదినట్టుగా కోకిల నీ ప్రభాతాల్లోకి ప్రాణం పోస్తూ ఉండటంలోని మహిమ ఏమిటో నీకు తెలియాలంటే, నువ్వెంత నరకం చూసిఉండాలి.

తెల్లవారి మేడమీదకు వెళ్ళగానే రాత్రంతా నీకోసం కూడబలుక్కుని మరీ ఆ మందారాలు, ఆ దేవకాంచనాలు, ఆ ఈజిప్షియను క్లస్టర్లు విరబూసాయని నువ్వు గుర్తు పట్టాలంటే ఎన్ని అనవసర పరిచయాల్ని నువ్వు పక్కన పెట్టేయగలిగి ఉండాలి.

అవును. నరకాన్ని కూడా ధిక్కరించగలవి పువ్వులు మాత్రమే. వాటికి తెలుసు, జీవించేది ఒక్కరోజు మాత్రమే. వాటికి మృత్యుభయం లేదు. రేపెలా గడుస్తుందన్న చింతలేదు. ఈ సాయంకాలానికి వాడి నేలరాలిపోతామన్న దిగులు లేదు. వాటికి తెలిసింది ఒక్కటే, ఆ క్షణం, తాము విప్పారుతాయే, ఆ క్షణం, తమ సమస్త అస్తిత్వంతో, ఆనందంతో, లోపల్నుంచీ ఉబికి వచ్చే ధగధగతో, పూర్తిగా, పరవశంతో, అజేయమైన ఆత్మబలంతో, తాము తాముగా పూర్తిగా విప్పారడం. అలా విప్పారిన క్షణం అవి భూమ్మీద స్వర్గాన్ని వికసింపచేస్తాయి. ఆ తర్వాత అవి ఉంటే ఏమిటి? రాలిపోతే ఏమిటి? కనీసం ఆ క్షణం, ఆ ఒక్క క్షణం, నరకలోకం తలుపులు మూసుకుపోతాయి.

అవును, ఇదే గ్రహిస్తున్నాను. రోదించినంతసేపు రోదించాక, కన్నీళ్ళన్నీ ఇంకిపోయే టంతగా హృదయం కరిగి ప్రవహించిపోయేక, భయంతో, నిస్సహాయంగా కుంగిపోయి నంతసేపు కుంగిపోయేక, అప్పుడు, అప్పుడు గ్రహించేను, అమృతం ఊటలూరే తావు ఎక్కడుందో.

పూలు. పూలకేసి చూడు.

'ఒక్క పువ్వు రంగు చూస్తూ శతాబ్దాలు బతగ్గలను' అన్నాడు శేషేంద్ర. అవును, ఆయన కూడా నరకాన్ని చూసాడు. నరకయాతన పడ్డాడు. కాని ఒక్క పువ్వు చాలు నిన్ను పధ్నాలుగు నరకాలనుంచీ బయటపడెయ్యగలదని గ్రహించాడు.

చూడు, జూను నెల పొడుగునా తురాయి చెట్ల మిలమిల చూడు. వైశాఖమాసపు తురాయి చెట్లు కావివి. అప్పుడు ఆ చెట్లు జ్వాలాసమానంగా ఉంటాయి. ఒక్క ఆకు కూడా కనిపించని కాలం అది. కాని ఇదుగో ఈ జ్యేష్టమాసపు తురాయిచెట్లు చూడు. కొన్ని పూలు రాలిపోయి ఉంటాయి. మరొకొన్ని వానలు పడుతూనే రాలిపోడానికి మరికొన్ని

పూలు సిద్ధంగా ఉంటాయి. ఇంతకు ముందు కనిపించని ఆకుపచ్చని నీడలు ఇప్పుడు ఆ పూల గుబుర్ల చుట్టూ కనిపించడం మొదలుపెడతాయి. దీపాలు ఆరిపోయేముందు ధగధగలాడినట్టు తళుకులీనుతుండే తురాయిపూలకి ఆకుపచ్చని చిమ్నీలు అమర్చినట్టుంటాయి. ఆ ఆకుపచ్చని నీడల్లో ఆ ఎర్రని వెలుగు పడి ఆ ఎర్రటి వెలుగు మీద ఆ ఆకుపచ్చని కాంతి మళ్లా ప్రతిఫలిస్తో ఆకుపచ్చని తెరల వెనక దీపాలు వెలిగించినట్లు ఉండే బాటనొకటి నివ్వండి నాకు, ఎటువంటి నరకాన్నైనా నేను సునాయాసంగా దాటేస్తాను.

ఇంతకీ నరకమంటే ఏమిటి?

తనని పోయి నరకంలో నడుస్తున్న డాంటేకి తోడుగా నిలబడమని వర్జిలుతో బియాట్రిసు అన్నప్పుడు ఆయన అమాయకంగా ఆమెనొక ప్రశ్న అడిగాడు. 'అమ్మా, నన్ను వెళ్ళమంటున్నావు, నువ్వే వెళ్ళి ఉండవచ్చు కదా, అతడికి తోడుగా నిలబడి ఉండవచ్చు కదా' అని.

అందుకు బియాట్రిసు అంది కదా: 'ఆ నరకలోకంలోని బాధలు నన్ను బాధించలేవు. ఎందుకంటే those things alone are to be feared that have the power of hurting అని.

ఇంకా ఇలా అంది:

> I am made such by God, in his grace, that your misery does not touch me, nor the flame of this burning assail me.

కాని, ఆమెని, స్వర్గంలో ఉండే మరొక దేవత, లూసియా ఆమె పేరు, ఆమె పంపించిందట, పోయి డాంటేకి స్వస్థత చేకూర్చు అని. లూసియాని enemy of all cruelty అని వర్ణిస్తుంది బియాట్రిసు.

నరకమంటే బాధపడటం, బాధపెట్టడం. నిజమైన అనుగ్రహానికి నరకం తెలీదు. కాబట్టి ఆ అనుగ్రహసన్నిధిలో అన్నిరకాల క్రూరత్వాలూ అణగిపోక తప్పదు.

అవును, అనుగ్రహమంటూ ఒకటుందని నీకు తెలియడమే నిజమైన అనుగ్రహం. అనుగ్రహం మరేమీ చెయ్యదు. పువ్వుల్లాగా అది నిండుగా వికసించి ఉంటుంది. మౌనంగా నిన్ను పరికిస్తుంది. అది నీతో ఏమీ మాట్లాడదు. నువ్వేమీ విన్నవించుకోనక్కరేకుండానే అది నిన్ను పరిపూర్ణంగా దీవిస్తుంది.

ఇది కూడా గ్రహించాన్నేను, నరకం నీకు కలిగిన కష్టంలో లేదు, ఆ కష్టం చుట్టూ నువ్వు పెంచిపోషించుకునే, guilt, regret, blaming ల్లో ఉంటుందని. నీకు కష్టం కలుగుతూనే నువ్వొక నరకాన్ని నిర్మించుకోవడం మొదలుపెడతావు. నువ్వు ఏ పని చేస్తే, లేదా ఏమి చెయ్యకుండా ఉండి ఉంటే, ఈ కష్టం తప్పి ఉండేదా అని ఆలోచిస్తావు, పశ్చాత్తాపపడతావు, నీమీద నువ్వు అభియోగ పత్రాలు తయారు చేసుకుంటావు, నీ జీవితంలో నీకు తారసపడ్డ ప్రతి ఒక్కరినీ అపరాధపరిశోధనకి లోను చేస్తావు, ఎప్పటికప్పుడు ఆరోపణ పత్రాలు తయారు చేస్తో, చింపేస్తో, మళ్ళా తయారు చేస్తో-నరకమంటే అదే, మరెక్కడో లేదు.

సరిగ్గా అప్పుడే నీకు తెలీకుండానే ఏ పైలోకాల్లోనో, ఒక బియాట్రిసు, ఒక రేచలు, ఒక లూసియాలు నీ గురించే తలుచుకుంటూ ఉంటారు. ముగురమ్మలు. బియాట్రిస్‌ది దివ్యప్రేమ, లూసీ దయామయి, రేచలు ధ్యానమూర్తి.

'వెళ్ళు, వెళ్ళి, అతణ్ణి ఆ నరకలోకపు తోవలనుంచి బయట పడెయ్యి' అని చెప్తూ, కన్నీళ్ళు ఉబికి వస్తున్న తన ప్రకాశమాన నేత్రాల్ని ఆమె పక్కకు తిప్పుకుందని చెప్తాడు వర్జిల్. డాంటే నరకంలో పూల గురించి ప్రస్తావించలేదేమో అన్నాను కదా, పొరపాటు, రెండో సర్గలోనే, బియాట్రిసు తనతో అలా మాట్లాడగానే, తనలో కలిగిన అనుభూతిని వర్జిలు ఇలా వర్ణిస్తున్నాడు:

> As flowerets, by the nightly chillness blended down and closed, erect themselves all open on their stems when the Sun whitens them; thus I did..

రాత్రంతా చలిలో ముడుచుకుపోయిన కుసుమకళికలు ప్రభాత సూర్యకాంతికి తిరిగి లేచి నిటారుగా నిలబడ్డట్టుగా, so much good daring ran into my heart అని చెప్తున్నాడు వర్జిలు. అంతేకాదు, I began as one set free. తాను విముక్తుడయ్యాడట.

నరకానికి నా కృతజ్ఞతలు. నరకం నాకు తారసపడి ఉండకపోతే నాకొక డాంటేతో పని పడి ఉండేది కాదు, ఒక వర్జిలు అవసరమయ్యేవాడు కాదు, ఒక బియాట్రిసు సందేశం నన్ను చేరవచ్చి ఉండేది కాదు. అశోకవనంలో నేనిట్లా శోకిస్తూ ఉండకపోయి ఉంటే, ఒక రామదూత నాకోసం సముద్రాలు ఈది వస్తుండే వాడే కాడు.

పూసిన ప్రతి పువ్వూ ఒక బియాట్రిసు. ఈ నరకాగ్ని ఆ పూలనేమీ చెయ్యలేదు. పువ్వు పూసినంతమేరా నరకానికి సెలవు ప్రకటించినట్టే.

'పువ్వులు చూడండి, అవి వడకవు, నలుగులాట పడవు. కాని అవెలా వికసిస్తున్నాయో చూడండి. తన సమస్త వైభవంతో కూడిన సొలోమోను కూడా వాటికి సాటిరాలేదని నిశ్చయంగా చెప్పగలను చూడండి' అని అంటున్నాడు దైవకుమారుడు.

సమస్త శోకాన్నీ పక్కన పెట్టి ఒక పువ్వు ఎదట తదేకలగ్నంగా నిలబడగలిగినప్పుడు ప్రతి ఒక్క మానవుడూ దైవకుమారుడే. మరణించినా పైకి లేవగలిగినవాడే.

22-6-2024

# ఒక్క పాఠకుడు చాలడా!

**మొన్న** సాయంకాలం మా ఇంటికి జీడిగుంట విజయసారథిగారు వచ్చారు. ఆయన నాకు పరిచయమై ఇప్పటికి రెండేళ్ళు కావొస్తున్నది. కాబట్టీ ఈ మా సమావేశం ద్వితీయ వార్షికోత్సవం అని చెప్పవచ్చు.

రెండేళ్ళ కిందట మొదటిసారి ఆయన్నుంచి ఫోను. అప్పుడు జయతి 'మనం కలుసుకున్న సమయాలు' పుస్తకం ఆమె కుటీరంలో ఆవిష్కరణ పెట్టుకున్నారు. విజయసారధి తాను అమెరికానుంచి వస్తున్నాననీ, ఆ ఊరు వెళ్ళాలనీ, వాళ్ళని కలుసుకోవాలనీ ఉందనీ, అక్కడికి ఎలా వెళ్ళాలో చెప్పగలరా అనీ అడిగేరు. నాకు ఆశ్చర్యమనిపించింది. సంతోషంగా కూడా అనిపించింది. జయతిలాంటి వాళ్ళని వెతుక్కుంటూ ప్రపంచం నలుమూలలనుంచీ మనుషులు రావడంలో ఆశ్చర్యంలేదనిపించింది.

ఆ రోజుల్లోనే కాకినాడలో 'క్రియ' పిల్లలపండగ కూడా జరుగుతోంది. ఆ బృందం కూడా ఆ పుస్తకావిష్కరణకి వెళ్ళాలని అనుకుంటున్నారని విన్నాను. కాబట్టి జగన్నాథరావు గారిని సంప్రదించమని విజయసారథిగారికి చెప్పాను. తీరా నేను కాకినాడ వెళ్ళేటప్పటికి ఆయన అప్పటికే ఆ పిల్లలపండగలో తాను కూడా ఒక భాగంగా కనబడ్డారు.

జయతి పుస్తకం ఆవిష్కరించినప్పుడే నా పుస్తకం 'నీ శిల్పివి నువ్వే' కూడా ఆవిష్కరించేం. మార్కసు అరీలియసు 'మెడిటేషన్సు' మీద నేను రాసుకున్న మెడిటేషన్సు అవి. పుస్తకం ఎలానూ ఇ-బుక్కు నా బ్లాగులో పెడుతున్నాను కాబట్టి ఆవిష్కరణ కోసమని ఆరుకాపీలే ప్రింటు చేయించాను. ఆ ఆరుకాపీల్లో ఒకటేనా తనకి ఇవ్వాలని విజయసారథి గారు అక్కడక్కడే తచ్చాడుతున్నారు. చిన్నప్పుడు పిల్లలు చాక్లెట్లకోసం తచ్చాడినట్టు. పుస్తకాల మీద ఆ రోజు ఆయన చూపించిన ఆ ఇష్టం నన్ను ముగ్ధుణ్ణి చేసిందని నేను ఆయనకు చెప్పలేదు. జయతిని ఒక పుస్తకమైతే అడిగి ఆయన చేతుల్లో పెట్టాను.

ఆ తర్వాత ఒకటి రెండు సార్లు మళ్ళా హైదరాబాదులో కలుసుకున్నాంగానీ, ఈ సారి కలయిక మరింత విశేషంగా అనిపించింది, కనీసం నా వరకూ.

వాల్ట్ విట్మను రాసిన Song of Myself ని నేను 'ఆత్మోత్సవ గీతం' పేరిట తెలుగులోకి అనువదించి, దాన్ని ఒక పుస్తక రూపంలో రెండుమూడు నెలలకిందట నా బ్లాగులో పెట్టాను. ఆ గీతం మొత్తం చదివామని గానీ, లేదా కొంతేనా చదివామని గానీ నాతో ఎవరూ చెప్పలేదు. నా యవ్వనదినాల్లో నాకెవరేనా ఆ గీతాన్నిలా తెలుగులోకి అనువదించారని తెలిస్తే, వాళ్ళెక్కడున్నా, నడుచుకునేనా వాళ్ళ దగ్గరికి వెళ్ళిపోయి ఉండేవాణ్ణి.

కాని నిన్న విజయసారథిగారు మా ఇంట్లో అడుగుపెడుతూనే అన్నిటికన్నా ముందు Walt Whitman Poetry Collection అనే పుస్తకం నా చేతుల్లో పెట్టారు. CSA Publishing అనేవాళ్ళు మొన్న అక్టోబరు నాలుగో తేదీన విడుదల చేసిన పుస్తకం అది!

'మీ ఆత్మోత్సవ గీతం చదివాక నాకు వాల్ట్ విట్మను మీద గొప్ప ఇష్టం పుట్టుకొచ్చింది. ఆయన పుస్తకాలు మొత్తం చదివేసాను. అంతేనా! ఆయన వల్లా, మీరు రాసిన పరిచయ వ్యాసం వల్లా మరో పదిపదిహేను పుస్తకాలేనా కొత్తగా పరిచయం అయ్యాయి. అవి కూడా చదివేసాను' అన్నారాయన.

ఆశ్చర్యపోకుండా ఎలా ఉంటాను?

అమెరికా ఒక అభివృద్ధి చెందిన దేశం కాబట్టి అమెరికాలో ఉంటున్న మిత్రులు అక్కడి సాహిత్యం గురించీ, మూజియాల గురించీ, గ్రంథాలయాల గురించీ, గ్యాలరీల గురించి, అరణ్యాల గురించీ, నదుల గురించీ, సంగీత సమారోహాల గురించీ రాస్తే బాగుణ్ణని ఎదురుచూస్తాను. ఇక్కణ్ణుంచి ఎవరేనా కవులు, రచయితలు అమెరికా వెళ్తే ఒక వివేకానందుడిలాగా వారు గొప్ప వెలుగుని ఆ దేశవాసులకి పరిచయం చేస్తారనే ఒక అమాయకమైన ఊహ, ఒక కల నన్నెప్పటికీ వీడవు.

ఆ కలలు నెరవేరేదెన్నడో కదా అని అలా ఎదురుచూస్తూనే ఉండగా, అమెరికాలో ఉంటున్న మిత్రులొకరు, నేనొక అమెరికను మహాకవి మీద రాసిన పుస్తకం చదివాననీ, ఆ పుస్తకం వల్ల తనకు మరికొన్ని పుస్తకాలు పరిచయమయ్యాయనీ చెప్తూ నా కోసం ప్రత్యేకంగా ఒక పుస్తకం తేగానే, నాకు అమెరికామీదా, ఇండియా మీదా కూడా మళ్ళా గొప్ప ఆశ చిగురించింది.

'గత ఆరునెలలుగా నేను ఫేసుబుక్కు లాంటి సోషల్ మీడియా పక్కన పెట్టి పుస్తకాలు చదువుతూనే ఉన్నాను. ఎన్ని పుస్తకాలు. మీరీ పుస్తకం చూసారా?'

అని ఆయన Used and Rare, Travels in the Book World (1997) అనే పుస్తకం ఒకటి చూపించారు.

'ఇది మీకోసమే తెచ్చాను. Lawrence and Nancy Goldstone అనే దంపతులు రాసిన ఈ పుస్తకం లాంటి పుస్తకం తెలుగులో కూడా వస్తే బాగుంటుందనిపించింది. అది రాస్తే మీలాంటి వాళ్ళే రాయాలి. అందుకే ఇదుగో మీకు కానుకగా ఈ పుస్తకం' అని ఆ పుస్తకం కూడా నా చేతుల్లో పెట్టారు.

భాగ్యమంటే ఇది! ఒక పుస్తకం రాస్తే రెండు పుస్తకాలు కానుకగా రావడం. కాని అక్కడితో ఆగలేదు.

'మీరు Days at the Morisaki Bookshop చదివారా?'

ఆ ప్రశ్నకు నా దగ్గర జవాబులేదు. ఆయన చూసిన, చదివిన పుస్తక ప్రపంచం ముందు నాది చాలా చిన్న ప్రపంచమని నిమిషాల్లోనే అర్థమైపోయింది. కానీ ఆ పుస్తకం గురించి ఆయన చెప్తున్న మాటలు వింటున్నాక కూడా ఆ పుస్తకం చదవాలని అనుకోకుండా ఎలా ఉండను? ఆయన ఎదటనే ఆమెజాను యాపు తెరిచి వెంటనే బుక్కు చేసాను. ఇదుగో, ఈ మాటలు రాస్తుండేటప్పటికి ఆ పుస్తకం కూడా నా టేబుల్ మీదకు వచ్చి చేరింది.

మూడు పుస్తకాలు!

'పుస్తకాల గురించి మాట్లాడుకోడానికీ, ఒకరికొకరం పరిచయం చేసుకోడానికీ ఏదన్నా ఏర్పాటు ఉంటే బాగుంటుంది కదా! వారం వారం జూముమీటింగులో మరొకటో' అని అంటున్నారు విజయసారథిగారు.

నలభయ్యేళ్ళ కిందట ఒక సాయంకాలం గౌతమీ గ్రంథాలయంలో కూచుని ముగ్గురు మిత్రులం ఈ మాటలే మాట్లాడుకున్నాం. అప్పుడు నెత్తురు వేడిగా ఉండే రోజులు కాబట్టి వెంటనే 'రాజమండ్రి రీడర్స్ క్లబ్' ప్రారంభించేసాం కూడా!

కాని ఇప్పుడు విజయసారథి మాటలు విన్నప్పుడు నేను నిట్టూర్చడం మినహా మరేమీ చెయ్యలేకపోయాను. 1984 తో పోలిస్తే 2024 లో ప్రపంచం ఎంత సుసంపన్నంగా

ఉంది! ఒక్క బటన్ నొక్కితే కొన్ని వేల పుస్తకాలు ప్రత్యక్షమయ్యే కాలం ఇది. కాని 1984 నుంచి 2024 కి వచ్చేటప్పటికి నాకు తెలీకుండానే నా చుట్టూ ఎంత నెగటివు ఎనర్జీ గూడుకట్టుకుంది!

కాని ఎంతపాటి పొగమంచునేనా ఒక్క సూర్యకిరణం క్షణంలో మటుమాయం చెయ్యగలిగినట్టు, ఒక్క పాఠకుడు, నిజమైన పాఠకుడు, నువ్వొక పుస్తకం డిజిటలు కాపీ షేర్ చేస్తే అది చదివి వందపుస్తకాల గురించి నీతో మాట్లాడటానికి నీ ఇల్లు వెతుక్కుంటూ వచ్చేడంటే అది చాలదా, పూర్వమహాకవులంతా మళ్ళా మేల్కోడానికి!

19-11-2024

## ఆబాలగోపాలతరంగం

**బస్సు** అరగంట ముందే చేరుకుంది అనంతపురం. రాధేయగారికి ఫోను చేస్తే ఆయన ఉన్నపళాన వాళ్ళ అన్నగారి అబ్బాయి కారు తీసుకుని బస్టాండుకి వచ్చేసారు. మేం హొటలుకి చేరుకునేటప్పటికల్లా అంకే శ్రీనివాస్ కూడా అక్కడికి చేరుకున్నాడు. అతనితో పాటు వాళ్ళబ్బాయి కావ్యవిలాసి కూడా. అయిదో తరగతి పిల్లవాడు. మార్నింగు క్రికెట్టు ప్రాక్టీసుకి బయల్దేరాడు. వీపు వెనక అమ్ములపొదిలాగా క్రికెట్టు సరంజామా. చేతిలో యోగామాటూనూ.

ఇంకా ఆరుగంటలు కూడా కాని ఆ చలికాలపు తెల్లవారుజామున మేడమెట్లు ఎక్కి రూము దగ్గర అడుగుపెట్టేటప్పటికే ఆ కారిడారులో పచార్లు చేస్తూ మానస! 'మీరు వస్తారని ఎదురుచూస్తున్నాను' అంది. నాకిచ్చిన గది తలుపులు తెరుస్తూనే గలగల్లాడుతున్న కబుర్లతో అంకె శ్రీనివాస్ ఆ గదిలో నిశ్శబ్దాన్ని తరిమేసాడు.

'ఒక కప్పు కాఫీ దొరుకుతుందా' అనడిగాను.

'కింద రోడ్డుకవతల ఒక రెస్టరెంటు ఉంది. నిన్న రాత్రి చూసాం' అంది మానస. వెంటనే బయల్దేరాం. రూములో దిగీదిగకుండానే సాహిత్యమిత్రులతో తెల్లవారు జామున అలా ఒక టీ స్టాలు వెతుక్కుంటూ వెళ్ళి ఎన్నాళ్ళయిందని. ఎన్నాళ్ళు కాదు. ఎన్నేళ్ళయిందని!

మేము రెస్టరెంటులో అడుగుపెట్టేటప్పటికి ఇంకా తుడుస్తూ ఉన్నారు.

'అగరవత్తులు వెలిగించినట్టు లేదు' అంది మానస, 'కోకిల ప్రవేశించే కాలం'లో నా కవిత గుర్తుచేసుకుంటూ.

ప్రొప్రయిటరు తడితువాలొకటి నడుముకు చుట్టుకుని
హాల్లో దేవుడి పటానికి పూలమాల మారుస్తుంటాడు

ఒకటి రెండు అగరవత్తులు వెలిగించి ఉంటాడు
దేవాలయంలో ప్రాతఃకాల నిశ్శబ్దం కోసం
తెరవేసినట్టుగా, కొంత ప్రతీక్ష, కొంత నిశ్శబ్దం..

ఇంతలో అకస్మాత్తుగా ప్రత్యక్షమయ్యారు నందకిశోరు, నవీన్ కుమారులు. ఆ ఇద్దరూ చేరడంతో బృందం సంపూర్ణమయ్యింది. నవీన్‌ని ఇదే మొదటిసారి చూడటం. అతణ్ణి చూడగానే ఒక చైనా నవల గుర్తొచ్చింది. మావో-డున్ అనే ఒక రియలిస్టు రచయిత రాసిన చిన్న నవల. 'వసంత కాలపు పట్టుపురుగులు'. నేను దాన్ని తెలుగు చేశాను కూడా. ఆ కథ మొత్తం పట్టుపరిశ్రమ చుట్టూతానే తిరుగుతుంటుంది.

శ్రీనివాస్ కొడుకు కావ్యవిలాసికి పద్యాలు కంఠతా వచ్చని అడిగితే ఏవీ వినిపించమన్నాం. ఒకటి రెండు పోతన పద్యాల తర్వాత

భూతాన్ని
యజ్ఞోపవీతాన్ని
వైప్లవ్యగీతాన్ని

అంటో మొదలుపెట్టాడు. ఇప్పుడు ఏ యువతీ యువకుల నోటంటా మహాప్రస్థాన గీతాలు వినబడని కాలంలో మళ్ళా ఈ చిన్నబిడ్డ ఆ కవిత్వాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకొస్తున్నాడనిపించింది.

'ఇప్పుడు చెప్పండి, మీరు రాజమండ్రి రోజుల తర్వాత అన్నేళ్ళ పాటు కవిత్వం రాయకుండా ఎలా ఉండగలిగారు?' అనడిగింది మానస.

ఆ ఒక్క ప్రశ్న ఒక తేనెతుట్టెని కదిపినట్టయింది. ఎక్కడెక్కడి జ్ఞాపకాలూ, ఎక్కడెక్కడి మిత్రులూ, ఎప్పటెప్పటి కవిత్వాలూ గుర్తొచ్చాయి. 'మహాసంకల్పం' నుండి ట్రాన్స్ ట్రోమర్ దాకా. బైరాగి నుంచి కవితాప్రసాద్ దాకా.

సాహిత్యం గురించీ, కవిత్వం గురించీ రాస్తూ ఎన్సైక్లోపీడియా బ్రిటానికా ఇలాంటి టీషాపుల్లోనూ, రెస్టరెంట్లలోనే ఆధునిక కవిత్వం పుట్టిపెరిగిందని రాసినట్టు గుర్తు. ఎన్నేళ్ళ తరువాత మళ్ళా ఒక సుప్రభాతవేళ సాహిత్యమిత్రులమధ్య ఒక రెస్టరెంటులో గడిపాను! ఒకప్పుడు సమాచారం సుబ్రహ్మణ్యం పెళ్ళికి మండపేట వెళ్ళినప్పుడు చేసిన అల్లరంతా గుర్తొచ్చింది. రాత్రంతా కబుర్లు చెప్పుకున్నాక, తెల్లవారి అలసిపోయాక, ఆ అలసట

తీర్చుకోడానికి మళ్ళా కబుర్లు చెప్పుకున్న ఆ రోజులు గోదావరినుంచి అనంతపురానికి తరలివచ్చాయనిపించింది.

ఏడున్నర. మళ్ళీ ఎనిమిదిన్నరకి కలుద్దాం అనుకున్నాం.

తీరా తొమ్మిదింటికి బ్రేక్ ఫాస్టు కి మళ్ళా హొటల్లో అడుగుపెట్టేటప్పటికి మానసకి బదులు ఆమె సహచరుడు అనిల్, వాళ్ల ప్రహ్లాదుడూ నాకు తోడుగా ఉన్నారు. మాకు తోడుగా శ్రీనివాసు. మేం దోసెలు తింటూ ఉండగా సోమశేఖరు ప్రత్యక్షమయ్యాడు. అప్పుడే రైలు దిగి నేరుగా హొటలుకి వచ్చాడు. ప్రహ్లాద్ దోసె అంచుల్నించీ తింటుంటే నాకు ఆర్ట్ ఆఫ్ వార్ గుర్తొచ్చింది. ఆ ప్రాచీన చీనా యుద్ధతంత్ర గ్రంథం అంచుల్నుంచి కేంద్రం మీదకు దండెత్తాలని చెప్తుందని గుర్తొచ్చింది. మళ్ళా కొంత సేపు ఆర్ట్ ఆఫ్ వార్ చుట్టూ కబుర్లు నడిచాయి.

తొమ్మిదిన్నరకల్లా మమ్మల్ని మీటింగుహాలు దగ్గర ఉండాలని ఆదేశించారుగాని, మేము అక్కడికి చేరుకునేటప్పటికి పది దాటింది. కాని అప్పటికే అనంతపురం దాదాపుగా అక్కడికి చేరుకుంది. ప్రగతిగారు, రాజారాం గారు, శాంతినారాయణగారు లాంటి మిత్రుల్తో అనంతపురంతో పాటు కర్నూలు నుంచి లక్ష్మి కందిమళ్ళ కూడా అక్కడికి చేరుకున్నారు.

ప్రతి ఏటా ఉత్తమ వచనకవిత్వానికి ఇచ్చే ఉమ్మడిశెట్టి పురస్కారానికి ఈ ఏడాది మరో రెండు పురస్కారాలు అదనంగా చేరాయి. ఒకటి ఉమ్మడిశెట్టి సతీష్ కుమారు పేరుమీద ఈ ఏడాది నుంచీ ఒక జాతీయ యువ పురస్కారం. మరొకటి ఉమ్మడిశెట్టి ప్రత్యేక పురస్కారం. ఈ ఏడాది కవిత్వపురస్కారం విశాఖపట్టణంలో ఆకాశవాణిలో పనిచేస్తున్న బండి సత్యనారాయణగారి 'ఒంటికాలి పరుగు' సంపుటానికి లభించింది. యువపురస్కారం మానస చామర్తి కవిత్వం 'పరవశ' కి లభించింది. ప్రత్యేకపురస్కారం కందిమళ్ళ లక్ష్మిగారు అందుకున్నారు.

సతీశ్ కుమార్ రాధేయగారి కొడుకు. బుద్ధిమంతుడైన పిల్లవాడు. తన తల్లి వదిలిపెట్టి వెళ్ళిపోయిన తండ్రిని అతడు కూడా వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. సాకేతరాముడిలాంటి ఆ పిల్లవాడి వియోగాన్ని తట్టుకోలేక ఆ తండ్రి రాసిన ఒక కన్నీటిపాట 'అజేయుడు' సంపుటాన్ని ఆవిష్కరించడం కోసం నన్ను అనంతపురం పిలిచారు. నేను ఆ పుస్తకానికి ఒక ముందుమాట కూడా రాసాను. కాబట్టి ఆ రోజు ఆ సమావేశం ఒక కంట కన్నీరు, ఒక కంట పన్నీరుగా నడిచింది. సత్యనారాయణగారి కవిత్వం మీద పెళ్ళూరి సునీల్, మానస కవిత్వం మీద డా.సుంకర గోపాల్, రాధేయగారి కావ్యం పైన అంకె శ్రీనివాస్ మాట్లాడారు.

ముగ్గురూ అద్భుతమైన వక్తలు. సతీష్‌కుమారు ముఖశిల్పాన్ని ఆమ్రపాలి గారు ఫైబరుతో రూపొందించారు. ఆ శిల్పాన్ని ఆరోజు రాధేయ గారే కన్నీటితో ఆవిష్కరించారు.

సభని డా.ఎం.ప్రగతిగారు సమర్థవంతంగా నిర్వహించారు. ఆమె హిందూపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాలు. కవి, కథకురాలు. కాని ఆమె బోధిస్తున్నది రసాయనశాస్త్రమనీ, అందులో చాలా లోతైన విషయం మీద డాక్టొరలు పరిశోధన చేసారనీ తెలిసినప్పుడు చాలా ఆశ్చర్యం కలిగింది. Investigations on DNA Binding and Cleavage Activity of Mono and Di nuclear Transition Metal Complexes ఇదీ ఆమె ఎంచుకున్న విషయం! ఆశ్చర్యం కలిగింది. ఇలాంటి విషయం ఏదైనా పెద్ద పెద్ద విశ్వవిద్యాలయాల్లో పరిశోధన చేసే విషయం కదా, మీరెట్లా ఎంచుకున్నారని అడిగితే, వాళ్ళ ప్రొ. కె.హుసేన్‌రెడ్డిగారు కారణమని చెప్పారు. అంతేకాదు, తన పి.హెచ్.డి అనుభవాన్ని 'ప్రతి ఫెయిల్యూర్‌లో ఓ గెలిచే దారి!' (2014) పేరిట గ్రంథస్థం చేసారు కూడా.

ఆ పుస్తకం చదివేక అర్థమయింది, ఒక స్కూలు అసిస్టెంటుగా కెరీరు మొదలుపెట్టిన వ్యక్తి ఒక అంతర్జాతీయ స్థాయి పరిశోధకురాలు ఎలా కాగలిగిందో. ఆ చిన్న పుస్తకం ఒక జయగాథ. ఉపాధ్యాయులకీ, సైంటిస్టులకే కాదు, పెళ్ళి పిల్లలు పుట్టాక, జీవితంలో ఇంక చేయవలసిందేమీ లేదని ప్రయాణం ఆపేసే ఎందరో గృహిణులకు కూడా!

సాధారణంగా సాహిత్యప్రపంచంలో ప్రింటుమీడియా ద్వారా లబ్ధప్రతిష్ఠులు మాత్రమే పరిచయమవుతారు. ఇప్పుడు సోషల్ మీడియా వచ్చాక ఎక్కడెక్కడి ప్రతిభావంతులూ పరిచయమవుతున్నారు. కాని ఇదుగో ఇలా చిన్నపట్టణాలకూ, సెమీ అర్బను ప్రాంతాలకూ వెళ్ళినప్పుడు మరెందరో ఉత్సాహవంతులైన యువతీయువకులు పరిచయమవుతుంటారు. వారి శక్తిసామర్థ్యాలు ఎటువంటివో వారికే తెలియనట్టుగా కనిపిస్తారు.

ఈ సారి మీటింగులో కూడా కొందరు అలాంటివారు కనిపించారు. లక్ష్మీ కందిమళ్ళ ఫేసుబుక్కు ద్వారా పరిచయం. ఆమె కవిత్వం ఇంతకుముందు రెండు సంపుటాలిచ్చారు. ఇప్పుడు మళ్ళా మరో రెండు సంపుటాలు 'మిళితం', 'ఒక వాక్యం రాలింది' ఇచ్చారు. ఈ పుస్తకాలన్నిటిమీదా నేనొక వ్యాసం ఆమెకి బాకీ.

ఆదోని నుంచి వచ్చిన స్వయంప్రభ 'వెన్నెల కురవని రాత్రి' (2024) నా చేతుల్లో పెట్టారు. రాధేయగారి శిష్యురాలు, సభకి స్వాగతవచనాలు పలికిన వీణాబాయి విమెను ప్రొటెక్షను ఫోర్సులో పనిచేస్తున్నారు. కాని ఆమె కంప్యూటరు సైన్సులో గ్రాడ్యుయేటు.

మాథమెటిక్సులో పోస్టు గ్రాడ్యుయేటు. 'మీ భవిష్యత్తు హిందూపురం గ్రామసచివాలయాల్లో లేదని ఖచ్చితంగా చెప్పగలను' అని అన్నాను ఆమెతో. 'సాఫ్ట్‌వేరులో ప్రయాణం మొదలు పెట్టండి. మీ భవిషత్తు నా కళ్ళకి కనిపిస్తోంది' అని కూడా అన్నాను.

మోడలు స్కూల్లో ఇంగ్లిషు ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న అరుణ రాధేయగారి కవిత్వం మీద మాట్లాడేరు. భోజనవిరామంలో నా దగ్గరికొచ్చి 'మీరు అన్ని పుస్తకాలు ఎలా చదివేరు' అనడిగారు. నేనన్నాను కదా 'మీ కన్నా వయసులో పెద్దవాణ్ణి. నేను చదివి ఉండడంలో ఆశ్చర్యం లేదు. కాని ఎక్కడో మారుమూల పల్లెటూళ్ళో పనిచేస్తూ మీరు బెన్ జాన్సన్ కవిత్వం గురించి మాట్లాడారే, నేనింకా ఆ ఆశ్చర్యం నుంచి తేరుకోనేలేదు' అని.

ప్రగతి గారు 'ముంగారు మొలకలు' అని అనంతపురం జిల్లా మహిళా కథకుల సంకలనం ఒక కాపీ ఇచ్చారు. పాతికమంది కథకులున్నారందులో. ఇలా అనంతపురం వస్తే తప్ప ఇలాంటి పుస్తకాలు వెలువడ్డాయని తెలీదు కదా అని అనుకున్నాను.

పొద్దున్న అంకే శ్రీనివాస్ కొడుకు పరిచయమైతే, ఇప్పుడాయన కూతురు పరిచయమైంది. ఏడో తరగతి చదువుతున్న చిన్నారి. 'మీ తమ్ముడు పొద్దున్న శ్రీశ్రీని వినిపించాడు' అని చెప్తే, తానుకూడా

పగళ్లన్నీ పగిలిపోయీ
నిశీథాలూ విశీర్ణిల్లీ
మహాప్రళయం
జగం నిండా ప్రగలిభిస్తుంది

అంటో మళ్లీ శ్రీశ్రీని ఎత్తుకుంది.

శ్రీనివాస్ కొడుకు కవితావిలాసి అయితే, ఈమె వాక్యవిన్యాస. తల్లిదండ్రులిద్దరూ తెలుగు ఉపాధ్యాయులు. ఎవరన్నారు తెలుగు ప్రమాదంలో పడిందని? ఇటువంటి కుటుంబాలున్నంతకాలం తెలుగుకి ప్రమోదమే!

నా తిరుగుప్రయాణం రాత్రి బస్సుకి కాబట్టి, ఎలానూ ఇంత దూరం వచ్చాను ఎక్కడికేనా వెళ్దామా అనుకున్నాను. పెన్నా అహోబిలం నేనింతకుముందే చూసాను. కటారుపల్లె, కదిరి, పుట్టపర్తి, లేపాక్షి కూడా చూసేసిన జాబితాలో ఉన్న పేర్లే. ఇక రెండు స్థలాలు మిగిలేయి. ఒకటి పెనుగొండ, మరొకటి తాడిపత్రి.

చనిన నాళుల తెనుగు కత్తులు
సానబెట్టిన బండ ఈ పెనుగొండ కొండ!

ఆంధ్ర కన్నడ రాజ్యలక్ష్ముల
అరితినీలపు దండ ఈ పెనుగొండ కొండ!

రాళ్ళపల్లి గీతం మనసులో మెదుల్తూనే ఉందిగాని, ఈసారికి తాడిపత్రి చూడాలనుకున్నాను. అనుకోవడమే తరవాయి, అంకె శ్రీనివాస్ ఆఘమేఘాల మీద ఏర్పాట్లు చేసేసాడు. మేము తాడిపత్రి వెళ్తున్నామని తెలిసి పెళ్ళూరి సునీల్, దోర్నాదుల సిద్ధార్థ తాము కూడా మాతో బయల్దేరారు. దారి పొడుగునా శ్రీనివాస్ అనంతపురం చరిత్ర చెప్తూనే ఉన్నాడు. ప్రతి ఊరూ, ప్రతి కొండా, ప్రతి చెరువూ, ప్రతి పల్లె– అతడికి అనంతపురం అరచేతిలో ఉసిరికాయ.

మేమొక కారులో, మానస కుటుంబం, నందూ, నవీనూ మరో కారులో. మేము తాడిపత్రి చేరుకునేటప్పటికి సాయంసంధ్య ఒక పసిడిపిట్టలాగా అక్కడ వాలి ఉంది. ఎప్పుడో దాదాపు నలభై ఏళ్ళ కిందట విన్నాను తాడిపత్రి చింతల వెంకటరమణ దేవాలయం గురించి. ఇన్నాళ్ళకు ఆ ప్రాంగణంలో అడుగుపెట్టగలిగాను. దేవాలయం ఒక వైపు మరమ్మత్తుల్లో ఉందిగాని, ఆ ప్రాచీనత, ఆ శిల్పసౌష్టవం, ఆ గాంభీర్యం తొలిచూపులోనే కళ్ళకుకట్టాయి.

ఇంకా గుడితలుపులు తియ్యలేదుగాని, ఒక పక్కన మంటపంలో విష్ణు సహస్రనామ పారాయణ జరుగుతున్నది. ఈలోపు ఒక ప్రదక్షిణ చేసి వచ్చాం. ప్రధాన దేవాలయం గోడలమీద మూడు వరసల్లో భారత, భాగవత, రామాయణాలు శిల్పాల్లో చెక్కి ఉన్నాయి. విజయనగర శైలి శిల్పం. దానికి లేపాక్షి తరహా అలంకరణ తోడయ్యింది. తలుపులు తెరిచాక, అమ్మవారినీ, స్వామినీ దర్శించుకున్నాక, తులసిమాలల సురభిళంతో ధనుర్మాసం మమ్మల్ని పలకరించాక, అప్పుడు కూచున్నాం, నందూ, నవీనుల గానం వినడానికి.

ఆ సమయాన ఆ పిల్లలిద్దరూ ఏ పాటలు పాడినా వినడానికి సిద్ధంగానే ఉన్నాంగాని, వారు మేమప్పటిదాకా విని ఉండని అన్నమయ్య కీర్తనల్తో మా గుండెని గుడిగా మార్చేసారు. ఎత్తుకోవడమే, మొదటి కీర్తన, 'కొమ్మలాలా, ఎంతవాడే గోవిందరాజూ..'. ఆ కీర్తన కోసం మళ్ళా వెతుక్కునే పనిలేకుండా అన్నమయ్య జీవితకాల భక్తుడు నూకా రామప్రసాద రెడ్డి ఆ పాట నాకు పంపించారు. చూడండి:

కొమ్మలాలా ఎంతవాడే గోవిందరాజు
కుమ్మరించీ రాజసమే గోవిందరాజు

ఉలిపచ్చి నవ్వులతో ఒత్తిగిలి పవళించి
కొలువు సేయించుకొనీ గోవిందరాజు
జలజాక్షులిద్దరును సరిపాదాలొత్తగాను
కొలదిమీర మెచ్చేనీ గోవిందరాజు

అదె నాభికమలాన అజుని పుట్టించి తాను
కొదలేక వున్నవాడు గోవిందరాజు
చెదరక తనవద్ద సేవసేసే సతులకు
గుదిగుచ్చీ వలపులు గోవిందరాజు

ఒప్పుగా వామకరము ఒగిచాచి వలకేల
కొప్పు కడునెత్తినాడు గోవిందరాజు
ఇప్పుడు శ్రీవేంకటాద్రి నిరవై శంఖుచక్రాల
కుప్పె కటారము పట్టె గోవిందరాజు.

అక్కడితో ఆగారా ఆ సంకీర్తకులు! మరో కీర్తన ఎత్తుకున్నారు. ఇది కూడా నేనింత దాకా విని ఉండనిదే. ఈ పాట మిత్రులు మడిపల్లి రాజకుమార్ వెతికిపట్టి పంచుకున్నారు. చూడండి:

మొల్లలేలె నాకు తన్నే ముడుచు కొమ్మనవే నే
జెల్ల పూవు కొప్పుతావి చెంచుదాననే

పట్టుచీరేటికే నాకు పారుటాకులే చాలు
దట్టిగట్టుకొమ్మనవే తన మొలనూ
పట్టెమంచమేలే నాకు పవ్వళించు మనవే
చెట్టు కింద పొరలాడే చెంచుదాననే

సంది దండలేలే నాకు సంకుకడియమే చాలు
యిందవే యెవ్వతికైన ఇమ్మనవే
గందమేలె నాకూ చక్కని తనకే కాకా నే
చిందు వందు చెమటమై చెంచుదాననే

కుచ్చుముత్యాలేలే నాకూ గురువిందలే చాలు
కుచ్చి తనమెడ గట్టికొమ్మనవే
కచ్చుపెట్టి కూడె వేంకటగిరీంద్రుడూ ననూ
ఛీఛీ నే నడవిలో చెంచుదాననే

'కుచ్చుముత్యాలేలే నాకూ గురువిందలే చాలు అట!' అన్నమయ్య ఒక చెంచులక్ష్మిగా మారిపోయి మరీ పలికిన పలుకులవి! వింటున్నంతసేపూ ఆ పాట మనసుని కరిగించి వేస్తూనే ఉన్నది.

ఆ పిల్లలిద్దరూ పాట పాడుతుండగా పక్కన మరో బాలిక మానస, ఆమె ప్రహ్లాదుడు మరో బాలుడు. ఆ కొన్ని క్షణాలూ ఆ ప్రాంగణం ఆబాలగోపాలతరంగంగా మారిపోయింది.

అక్కణ్ణుంచి బుగ్గరామలింగేశ్వర స్వామి దేవాలయానికి వెళ్ళాం. పెన్నా నది ఒడ్డున ఉంది ఆ గుడి అని చెప్పవచ్చుగానీ, 'చూడండి, ఈ గుడి పెన్నానదిలోనే ఉంది, ఇదుగో, ఈ కట్టడాలు సాక్ష్యం' అని చూపిస్తున్నాడు శ్రీనివాసు. అతడు తెలుగు ఉపాధ్యాయుడా, అర్కియాలజిస్టా, చరిత్రకారుడా- తేల్చుకోలేకపోయాను. ఒకప్పుడు మా హీరాలాలు మాష్టారిలో చూసాను, ఇటువంటి సర్వతోముఖప్రతిభని.

ఆ ప్రదోషవేళ శివపార్వతుల సందర్శనం తర్వాత, నదీదర్శనం తర్వాత మళ్ళా ఆ మంటపంలో ఆ సంకీర్తకులు ఇప్పుడు శివసంకీర్తన మొదలుపెట్టారు. ఒకప్పుడు సంబంధరు, అప్పరు గురించి చెప్పేవారు, వారు ఎటువైపు నిలబడి కీర్తనలు పాడుతుంటే, మొత్తం దేవాలయం అటువైపు తిరిగేది అని. ఆ మాటలో అతిశయోక్తిలేదని ఆ సాయంకాలం నాకు అర్థమయింది.

అనుకున్నదానికన్నా మేము ఆ రెండు దేవాలయాల్లోనూ ఎక్కువసేపే గడపడంతో, ముందు అనుకున్నట్లుగా అనంతపురం పొలిమేరల్లో ఉన్న ముసలమ్మ చెరువు దగ్గర ఆగలేకపోయాం. కట్టమంచి 'ముసలమ్మ మరణం' కావ్యానికి ఇతివృత్తం సమకూర్చిన ఆ చెరువుని చూడటానికేనా అనంతపురం మరోసారి రావాలని అనుకున్నాను.

మేము తిరిగి రాధేయగారి ఇంట్లో అల్పాహారం చేసి వారి దగ్గర సెలవు తీసుకుని హొటలుకి వచ్చేటప్పటికి బాషా గారు, డా. నారాయణరెడ్డిగారు అనే ఇద్దరు మిత్రులు నా కోసం ఎదురుచూస్తున్నారు. డా. నారాయణ రెడ్డి జిల్లా వైద్యాధికారిగా పనిచేసి రిటైర్ అయ్యారట. మార్కసు అరీలియసు మెడిటేషన్సు మీద నేను రాసిన పుస్తకం 'నీ శిల్పివి

నువ్వే' (2022) చదివి ఆయన నన్ను చూడాలని వచ్చారు. గోపీకృష్ణ అనే ఒక కాశ్మీరు యోగి రాసిన The Way to Self-Knowledge అనే ఒక కావ్యం తీసుకొచ్చారు. దాన్ని నేను అనువాదం చేస్తే చూడాలని ఉందన్నారు. ఏమి ఆశ్చర్యం! మొన్ననే అవధూత గీత పూర్తి చేసాను. ఇప్పుడు మరొక యోగీశ్వరుడు నన్ను అనుగ్రహిస్తూ ఉన్నాడన్నమాట!

బస్సు టైమయింది. బయల్దేరబోతూ ఉండగా కొత్తపల్లి సురేశు, చేగువేరా హరి వచ్చారు కలుసుకోడానికి. రెండు నిమిషాలు వాళ్ళతో మాట్లాడి సెలవుతీసుకోబోయానుగాని వాళ్ళు తాము కూడా నాతో పాటు బస్టాండుకి వస్తామన్నారు. నాతో పాటు శ్రీనివాస్ ఉన్నాడు, బాగా పొద్దుపోయింది, వాళ్ళని ఇంటికి వెళ్ళిపొమ్మన్నానుగాని, వాళ్ళు నా మాట వినలేదు.

తీరా బస్టాండుకి వెళ్ళాక అర్థమయింది, ఆ ఇద్దరినీ దేవుడే నా కోసం పంపించాడని! నేను ఎక్కవలసిన బస్సు మదనపల్లి నుంచి బయల్దేరి మధ్యలో యాక్సిడెంటుకి గురయ్యింది. ఆ టిక్కెట్టుమీద నన్ను మరో బస్సు ఎక్కించమనడిగితే ఆ బస్సుస్టేషనులో ఎవరూ స్పందించరే! కాని చేగువేరా హరి నిజంగా చేగువేరా! అతడు ఆ రాత్రి మొత్తం ఆర్టీసి యాజమాన్యాన్ని లైన్లోకి తీసుకొచ్చాడు. ఆఘమేఘాలమీద నాకు మరో బస్సులో సౌకర్యవంతంగా సీటు కుదిర్చాకగానీ అక్కణ్ణుంచి సెలవుతీసుకోలేదు!

బస్సు బయల్దేరాక అలసటగా కళ్ళు మూసుకున్నాను. పొద్దుణ్ణుంచీ క్షణమేనా విరామం లేదు. ఇంతలో ఎక్కణ్ణుంచో తొలి మామిడిపూత మీంచి నునువెచ్చనిగాలి మత్తుగా తాకింది. అలసట ఎగిరిపోయింది. పొద్దుణ్ణుంచీ ఎందరు మిత్రులు, ఎన్ని కరచాలనాలు, ఎన్ని హృదయస్పందనాలు! ఎన్ని పాటలు, ఎన్ని పద్యాలు! పిల్లలనుంచి పెద్దలదాకా సమావేశమందిరాలనుండి దేవాలయ ప్రాంగణాలదాకా, ఆబాలగోపాలం–


సర్వమును జేర నొక్క అపూర్వభావ
ముదయమయ్యె కుమార, నా హృదయమందు
మొగముగంటి, కనులగంటి, మొగిలుగంటి
పాట వినుచుంటి..

31-12-2024

వాడ్రేవు చినవీరభద్రుడు

# ఇంకొంచెం సూర్యకాంతి

బతుకును వెలిగించిన క్షణాలు



'నా జీవితవృక్షాన్ని బతికించుకోడానికి ఆకాశం నుంచి జీవజలాలు పీల్చుకుంటూ ఉంటాను. మనసుని చెప్పలేని నిరాశ ఆవహించినప్పుడు రకరకాల వెలుగుల్ని గుర్తు తెచ్చుకుంటాను. మరీ ముఖ్యంగా శరత్కాల ప్రభాతాలు చూడండి. శరత్కాలమనగానే అందరూ వెన్నెల్ని తలుచుకుంటారు. కాని ఈ ప్రభాతాలు ఎంత దివ్యంగా ఉంటాయో నాకు తెలుసు. బూజు దులిపి శుభ్రం చేసిన కిటికీల్లోంచి సూర్యకాంతి మరింత ప్రకాశవంతంగా పడ్డట్టుగా, వర్షాలు శుభ్రం చేసి వెళ్ళిపోయిన దిగంతాల్లోంచి పొద్దున్నే మనమీద పరుచుకునే ప్రభాత సూర్యరశ్మి ఎంత ప్రాణప్రదాయకంగా ఉంటుందో. రోజూ ఆ సూర్య కాంతి మరికొంచెం మూటగట్టు కుంటాను. తోటల్లో యాపిలు చెట్లూ, నారింజచెట్లూ ఈ సూర్యకాంతిని పండ్లుగా మూట గట్టుకున్నట్టు నేను ఈ ప్రభాతకాంతిని నా పోస్టుల్లో మూటగట్టి మీతో పంచుకుంటాను' అంటో సూర్యకాంతి తన జీవితాన్ని వెలిగించిన క్షణాల్ని వాడ్రేవు చినవీరభద్రుడు ఇలా పుస్తకరూపంలో అందిస్తున్నారు.